సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 331

సోమవారం 14-8-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



హాకీ జట్టుకు మూడో ర్యాంకు

ర్యాంకింగ్స్ విడుదల చేసిన అంతర్జాతీయ హాకీ సమాఖ్య
- 12లో



ఖరీదైనా.. రెండు గజాలు

నచ్చిన ప్రాపర్టీ తక్కువ ధరకే.. ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌కు ఆదరణ
- 13లో



మహారాష్ట్ర ఆస్పత్రిలో ఘోరం

థానే జిల్లా కాల్వా పట్టణంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆస్పత్రిలో 24 గంటల వ్యవధిలో 18 మంది రోగులు మృతిచెందారు.
వివరాలు 6లో ▸




యాంటీబయోటిక్స్ కూడా..

వాయు కాలుష్యం వల్ల యాంటీబయోటిక్స్ పని చేయడం లేదని.. ఈ కేసుల సంఖ్య పెరుగుతోందని ఓ అధ్యయనంలో తేలింది.
వివరాలు 6లో ▸



93కు చేరిన హవాయి మరణాలు

అమెరికాలోని హవాయిలో సంభవించిన భీకర కార్చిచ్చు వల్ల మౌయి దీవిలో మృతి చెందిన వారి సంఖ్య 93కు చేరింది.
వివరాలు 6లో ▸



ఆ మూడు బిల్లులపై చర్చ జరగాలి

వలసపాలన నాటి నేర చట్టాల స్థానంలో కేంద్రం ప్రతిపాదించిన 3 బిల్లులపై విస్తృత చర్చ జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.
వివరాలు 6లో ▸

బడికొస్తున్న 'మేధావి'!

పాఠశాల విద్యలో 'ఏఐ' టెక్నాలజీతో పక్కాగా వివరాలు

స్కూళ్లలో 68 నుంచి 99.44 శాతానికి పెరిగిన హాజరు

- విద్యార్థి హాజరు నుంచి అమ్మఒడి దాకా రోజూ లెక్కలు
- 26 జిల్లాల్లో 58,465 పాఠశాలల మ్యాపింగ్
- 70,70,143 మంది విద్యార్థులు, 3 లక్షల మంది టీచర్లకు రికార్డులు.. రోజూ ఉదయం 10.30కే ఆన్‌లైన్‌లో హాజరు పూర్తి
- మధ్యాహ్నం 12 గంటలకల్లా రాష్ట్రస్థాయిలో అప్‌డేట్
- ఒక్కో జిల్లాకు ఇద్దరు చొప్పున ప్రత్యేకంగా పర్యవేక్షణ
- విద్యార్థి ఒక్కరోజు బడికి రాకున్నా తల్లిదండ్రులకు మెస్సేజ్
- మూడు రోజులు గైర్హాజరైతే వలంటీర్, సంక్షేమ కార్యదర్శికి వివరాలు
- కారణాలు తెలుసుకోవాలని ఎంఈవో, డీఈవోలకు సమాచారం
- ఒక్క క్లిక్‌తో స్కూళ్లపై సంపూర్ణ పర్యవేక్షణ



అనకాపల్లి జిల్లా నాతవరం ప్రభుత్వ స్కూల్లో సెల్‌ఫోన్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్న టీచర్

నానాజీ అంకంరెడ్డి, సాక్షి ప్రతినిధి: వెంకటేష్ గతంలో పది రోజుల పాటు పాఠశాలకు రాకపోయినా ప్రధానోపాధ్యాయుడికే సమాచారం లేని పరిస్థితి! వందల మంది విద్యార్థుల్లో ఎవరు సక్రమంగా వస్తున్నారో.. ఎంతమంది డుమ్మా కొట్టారో తెలుసుకోవాలంటే అటెండెన్స్ రిజిస్టర్లు తిరగేయాల్సిందే! ఆ వివరాలన్నీ సేకరించి హెచ్ఎం దృష్టికి వెళ్లేసరికి రోజులు గడిచిపోయేవి! ఇప్పుడు ఓ విద్యార్థి పాఠశాలకు రాకుంటే హెచ్ఎంకే కాదు.. ఏకంగా విజయవాడలోని విద్యాశాఖ కమిషనర్‌కు కూడా నిమిషాల్లో తెలిసిపోతోంది. ఒక్క రోజు బడికి గైర్హాజరైనా తల్లిదండ్రులకు సమాచారం అందుతోంది. ఉపాధ్యాయులు సమయానికి రాకున్నా, విద్యార్థులకు తాగునీరు అందకపోయినా, మరుగుదొడ్ల తలుపు విరిగిపోయినా ఉన్నతాధికారులు తక్షణమే గుర్తిస్తున్నారు. తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఇదంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) టెక్నాలజీ సాయంతో పాఠశాల విద్యాశాఖ సాధించిన విజయం.

నూరు శాతం ఫలితాలు..

ప్రతి విద్యార్థీ క్రమశిక్షణ పాటిస్తూ రోజూ బడికి వెళ్లి చక్కగా చదువుకునేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోంది. పుస్తకాల నుంచి

మిగతా 2వ పేజీలో ▶



ఆదివారం అహ్మదాబాద్‌లో తిరంగా యాత్రలో పాల్గొన్న స్థానికులు

సామాన్యులే అతిథులు



స్వాతంత్ర్య దిన వేడుకలకు 18 వేల మందికి ఆహ్వానం

రైతులు, కార్మికులు, టీచర్లు, నర్సులు, సర్పంచ్‌లే అతిథులు

స్వాతంత్ర్య దిన వేడుకలకు ఏర్పాట్లు.. ఇంటింటా జెండా ఎగరాలి

సామాజిక మాధ్యమాల్లో డీపీ మార్చండి: ప్రధాని మోదీ పిలుపు

6లో


సరిహద్దుల్లో హెరాన్ మార్క్–2 డ్రోన్లు



స్వాతంత్ర్య దిన వేడుకల నేపథ్యంలో చైనా, పాక్ సరిహద్దుల్లో భద్రతను భారత రక్షణ శాఖ మరింత పటిష్టం చేస్తోంది. ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేసిన అత్యంత శక్తిమంతమైన హెరాన్ మార్క్–2 సాయుధ డ్రోన్లను సరిహద్దు స్థావరాల్లో మోహరించింది. ఆయుధ సంపత్తిని గంటల తరబడి తీసుకెళ్లే సామర్థ్యం, సుదూర ప్రాంతాల్లో ఏం జరుగుతోందో పసికట్టే టెక్నాలజీ వీటి సొంతమని రక్షణ శాఖ అధికారులు తెలిపారు.

6లో


ఫ్యాక్ట్ చెక్



'కోత'లపై చీకటి రాతలు

- రాష్ట్రంలో రోజుకు 226.488 మిలియన్ యూనిట్ల డిమాండ్
- గతేడాది కంటే 12.91 శాతం అధికంగా విద్యుత్ వినియోగం
- కృష్ణా నది బేసిన్‌లో ప్రారంభం కాని జల విద్యుదుత్పత్తి
- వాతావరణ పరిస్థితుల ప్రభావంతో తగ్గిన పవన విద్యుత్
- రూ.46.803 కోట్లతో 46.802 మిలియన్ యూనిట్లు కొనుగోలు
- ఫలితంగా కేవలం 1.35 మిలియన్ యూనిట్లు మాత్రమే లోటు
- పరిశ్రమలకు తగ్గించి గృహ, వ్యవసాయానికి పూర్తి సరఫరా
- ఇవన్నీ దాచిపెట్టి 'ఈనాడు' విష ప్రచారం

2లో



నీళ్లపై రామోజీ విషం

- పట్టిసీమ కోసం చంద్రబాబు జేబులో డబ్బులు వాడారా?
- జీవనాడిని నిర్వీర్యం చేసి కమీషన్ల కోసం పట్టిసీమ, పురుషోత్తపట్నం
- 2019, 2020, 2021, 2022లో పరవళ్లు తొక్కిన కృష్ణమ్మ
- అయినా సరే పట్టిసీమ ద్వారా ప్రకాశం బ్యారేజీకి తరలించి పారబోయాలా?
- ప్రభుత్వం ముందుచూపుతోనే పులిచింతలలో మూసీ వరద నిల్వ

2లో

ఇదండీ సంగతి



ఇలానే నడిపిద్దాం సార్! ప్రధాని పదవి ఎవరికీ అచ్చిరావడం లేదు.. అందరూ జైలుకే వెళ్తున్నారు!

తిరుమల కాలినడక.. ఘాట్ మార్గాల్లో జాగ్రత్తలు

సాయంత్రం 6 గంటలకు నడక దారి మూసివేత

- ఘాట్ రోడ్డులో సాయంత్రం నుంచి ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదు
- మధ్యాహ్నం 2 గంటల తరువాత చిన్న పిల్లలతో వచ్చే తల్లిదండ్రులకు అనుమతి నిరాకరణ
- చిన్నారిపై చిరుత దాడి నేపథ్యంలో టీటీడీ కీలక నిర్ణయాలు

తిరుమల: ఆరేళ్ల చిన్నారి లక్షితపై చిరుత దాడి నేపథ్యంలో టీటీడీ కీలక నిర్ణయాలు తీసుకుంది. కాలినడక.. ఘాట్ మార్గాల్లో జాగ్రత్తలు చేపట్టింది. సాయంత్రం 6 గంటలకు నడక దారిలో భక్తులను అనుమతించకూడదని నిర్ణయించింది. అదే విధంగా ఘాట్ రోడ్డులో సాయంత్రం నుంచి ద్విచక్ర వాహనాలను అనుమతించరు. మధ్యాహ్నం 2 గంటల తరువాత చిన్న పిల్లలతో వచ్చే తల్లిదండ్రులను నడక దారిలో అనుమతించరు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, కలెక్టర్ వెంకట రమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆదివారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. కాలినడక మార్గాలు, ఘాట్ రోడ్‌లో యాత్రికుల భద్రత దృష్ట్యా తీసుకోవాల్సిన

మిగతా 3వ పేజీలో ▶



నడక మార్గంలో రక్షణ కోసం చిన్నారులకు ట్యాగ్‌లు వేస్తున్న పోలీసులు

చిన్నారుల రక్షణకు ట్యాగ్‌లు

అలిపిరి నుంచి తిరుమల నడక దారిలోని అటవీ ప్రాంతంలో చిరుతల సంచారం పెరగడం, దాడుల నేపథ్యంలో పోలీసులు ముందస్తు రక్షణ చర్యలను చేపట్టారు. ఆదివారం నుంచి అలిపిరి నడక మార్గంలోని ఏడో మైలు వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు ట్యాగ్‌లు వేస్తున్నారు. ట్యాగ్‌లు వేయడం వల్ల తల్లిదండ్రుల నుంచి పిల్లలు తప్పిపోయినా సులభంగా కనిపెట్టేందుకు వీలవుతుంది. ట్యాగ్‌పై చిన్నారి పేరు, తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నంబర్, పోలీస్ టోల్ ఫ్రీ నంబర్ నమోదు చేసి ఉంటాయి.



రేపటి నుంచి

పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులు

- ఇంటిపన్ను సహా ఏ చెల్లింపులైనా ఆన్‌లైన్ విధానమే
- మూడువేలలోపు జనాభా ఉండే 10,003 గ్రామాల్లో మొబైల్ క్యూఆర్ కోడ్ పద్ధతి
- ఆపై జనాభా ఉండే గ్రామాల్లో కార్డులతో చెల్లించేందుకు పీవోఎస్ మిషన్లు
- ఇందుకు పంచాయతీల వారీగా బ్యాంకు అకౌంట్లు

2లో

పవన్‌వి అర్థం లేని మాటలు

- విశాఖలోని రుషికొండ వద్ద కట్టడాలు అధికారికమే
- ప్రభుత్వ స్థలాల్లోని ప్రభుత్వ కట్టడాలే అవి
- రామోజీ ఫిల్మ్‌సిటీ, మీ అన్న చిరంజీవి ఇల్లు కొండ మీద కట్టలేదా?
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- అక్కడ ప్రభుత్వ భవనాలు కడుతుంటే పవన్, బాబుల బాధేంటి?: రోజా
- పవన్‌కు 'గీతం' ఆక్రమణలు కనిపించవా?: వరుదు కళ్యాణి

10లో



యంత్ర'సాయం'లో మేటి

- ఏడు రాష్ట్రాలకు సేవలందిస్తున్న గార్లదిన్నె ట్రాక్టర్ నగర్
- వ్యవసాయ యంత్ర పరికరాల పరీక్ష, నాణ్యత ప్రమాణాల నిర్ధారణలో కీలక సంస్థ
- రైతులు, యువత, విద్యార్థుల శిక్షణల్లోనూ కీలకపాత్ర



సాక్షి, అనంతపురం డెస్క్: ఆధునిక పద్ధతులను అవలంభించినప్పుడే ఏ రంగంలోనైనా ప్రగతి సాధ్యమవుతుంది. ఇందుకు వ్యవసాయ రంగమూ మినహాయింపు కాదు. పెరిగిన పెట్టుబడులు, కూలి ఖర్చుల కారణంగా సంప్రదాయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం రైతులకు భారంగా మారింది. ఆధునిక పద్ధతులు అవలంభిస్తున్న రైతులు మాత్రమే ఎంతోకొంత లాభపడుతున్నారు. ఇందులో వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగం ఒకటి. ప్రస్తుతం వివిధ రకాల యంత్ర పరికరాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ట్రాక్టర్ మొదలు పంట కోత యంత్రాలు, స్ప్రేయర్లు, భూమిని దున్నే, చదును చేసే యంత్ర పరికరాలను రైతులు వినియోగిస్తున్నారు. ఇవి అందుబాటులోకి రావడం వెనుక వివిధ సంస్థల దశాబ్దాల కృషి ఉంది. అలాంటి సంస్థల్లో దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్) అత్యంత కీలకమైనది.

ఏడు రాష్ట్రాలకు ఏకైక సంస్థ

వ్యవసాయ యంత్రాలను పరీక్షించడంతో పాటు వినియోగం, మెరుగుదలపై యువత, విద్యార్థులు, రైతులకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 1983 సంవత్సరంలో గార్లదిన్నె మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ట్రాక్టర్ నగర్ ఏర్పాటు చేసింది. భారతదేశ వ్యాప్తంగా ఉన్న నాలుగు శిక్షణ కేంద్రాల్లో ట్రాక్టర్‌నగర్ ఒకటి. దేశంలో బుదిని (మధ్యప్రదేశ్), హిస్సార్ (హర్యానా), విశ్వనాథచారియాలి (అస్సాం), ట్రాక్టర్ నగర్ గార్లదిన్నె వ్యవసాయ యంత్రాలపై శిక్షణ–పరీక్షణ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదిచ్చేరి, ఒడిశా రాష్ట్రాలకు సేవలందించేందుకు ట్రాక్టర్ నగర్‌లో సంస్థను నెలకొల్పారు. కేంద్ర వ్యవసాయ శాఖకు అనుబంధంగా నడుస్తూ, ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులు/సంస్థలు తయారు చేసే వ్యవసాయ యంత్ర పరికరాలను పరీక్షించడంతో పాటు నాణ్యతను ధ్రువీకరిస్తోంది. ఇక్కడ ధ్రువీకరించిన వాటికి మాత్రమే ప్రభుత్వ సబ్సిడీలు వర్తిస్తుండటంతో దక్షిణ భారతదేశంలో తయారయ్యే ఆధునిక యంత్ర పరికరాలను టెస్టింగ్ నిమిత్తం ఇక్కడికి తెస్తున్నారు. వాటి పనితీరు పరిశీలించి, అవసరమైన మార్పులు కూడా సూచిస్తున్నారు.

శిక్షణ.. ఉపాధి కల్పన

వ్యవసాయ యంత్ర పరికరాల మరమ్మతులు, వినియోగం, సాంకేతిక అంశాలపై శిక్షణ పొందేందుకు వివిధ రాష్ట్రాల రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. వ్యవసాయ పరికరాల ఉత్పత్తిదారులు, విక్రయ సిబ్బంది, మహిళా రైతులకు సైతం శిక్షణ ఇస్తున్నారు. వారం మొదలు ఆరు వారాల వరకూ యూజర్ లెవల్ కోర్సులు, రెండు వారాల నుంచి ఆరు వారాల వరకూ టెక్నికల్ కోర్సులు ఇక్కడ నిర్వహిస్తున్నారు. కనీస విద్యార్హత ఎనిమిదో తరగతిగా నిర్దేశించారు. శిక్షణ పొందే వారికి ఉపకార వేతనాలు ఇస్తున్నారు. వసతి కూడా ఉచితంగా కల్పిస్తున్నారు.

50 వేల మందికి పైగా శిక్షణ

ట్రాక్టర్ నగర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటిదాకా 50 వేల మందికి పైగా శిక్షణ ఇచ్చారు. వివిధ కంపెనీలు తయారు చేసిన 50 యంత్ర పరికరాలను ధ్రువీకరించారు. ఇటీవల కొత్తగా నిమాటిక్ సీడ్ డ్రిల్, విద్యుత్ వరికోత యంత్రాలు, 6, 8 వరసల్లో వరి నాటే యంత్రాలను పరీక్షించారు. వివిధ రాష్ట్రాల్లోని రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

శిక్షణ చాలా బాగుంది.

జోధ్‌పూర్‌లోని కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ చదువుతున్నా. ఏ–1 సిరీస్ కోర్సులో నెల పాటు శిక్షణ కోసం ఇక్కడికి వచ్చా. విద్యార్థుల కోసం అన్ని మౌలిక వసతులు కల్పించారు. అధునాతనమైన వసతి సౌకర్యం కల్పించారు. శిక్షణలో వ్యవసాయ విజ్ఞాన సమాచారం నేర్చుకున్నా. ఇక్కడి అధికారులు ఎంతో ఓపిగ్గా అన్ని అంశాలను వివరిస్తున్నారు. సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఇక్కడ ఇస్తున్న శిక్షణ చాలా బాగుంది. – అభిషేక్ మోదన్‌వాల్, జోధ్‌పూర్

లగ్నానికి లేదిక విఘ్నం

విరామం అనంతరం ప్రారంభం కానున్న శుభకార్యాల సందడి

- ఈ నెల 19 నుంచి డిసెంబర్ 31 వరకు 53 పెళ్లి ముహూర్తాలు
- వివాహాల నేపథ్యంలో కళకళలాడుతున్న అన్ని రకాల మార్కెట్‌లు
- ఇప్పటికే బుక్కయిన కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు



ఆషాఢ, అధిక శ్రావణం కారణంగా 2 నెలల విరామం అనంతరం ఈ నెల 19 నుంచి శుభకార్యాల సందడి ప్రారంభం కానుంది. తప్పెట్లు, తాళాలు, తలంబ్రాలు, ఏడడుగులు, మూడుముళ్లతో పెళ్లి సంబరాలు అంబరాన్నంటనున్నాయి. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో శుభకార్యాల నిర్వాహణకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ నెల 17న నిజ శ్రావణ మాసం ప్రారంభమవుతుండగా.. 19 నుంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు అంతా శుభకార్యాలు చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే వివాహాలు నిశ్చయించుకున్న కుటుంబాలు పెళ్లి పనుల్లో బిజీ అయ్యాయి.

- వివరాలు 5లో

క్లుప్తంగా...

'నేషనల్ వాటర్ హీరో'కు మరో అరుదైన అవార్డు



తెనాలి: 'నేషనల్ వాటర్ హీరో' అవార్డు గ్రహీత, తెనాలికి చెందిన పొదిలి రాజశేఖరరాజు మరో ప్రతిష్టాత్మక గౌరవాన్ని అందుకున్నారు. చత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో శనివారం జరిగిన 2వ ఎన్విరాన్‌మెంటల్ సోషల్ గవర్నెన్స్ ఇండియా సమ్మిట్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో ఇచ్చే 'ఇండియా రెస్పాన్సిబుల్ లీడర్స్ అవార్డు–2023'ను అందుకున్నారు. ఆయనకు ఇండియా సీఎస్సార్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రోషన్‌కుమార్ ఈ అవార్డును బహూకరించారు. రాజశేఖరరాజు పలు కార్పొరేట్ కంపెనీల్లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) విభాగాధిపతిగా సేవలందిస్తున్నారు. సేవ చేసే అవకాశాన్ని తనకు భగవంతుడు ప్రసాదించాడని, ఉత్తమంగా చేయటం తన బాధ్యతగా భావించానని 'సాక్షి'తో రాజశేఖర్‌రాజు చెప్పారు.

ప్రత్యామ్నాయ వనరుల వినియోగం పెరగాలి

పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి



అవార్డు అందుకుంటున్న పురుషోత్తంరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ విధ్వంసం కారణంగానే వాతావరణంలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, అతి తక్కువ సమయంలో భారీ వర్షాలు, తుపానులు వంటివి సంభవిస్తున్నాయని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి అన్నారు. శిలాజ ఇంధనవనరుల వినియోగాన్ని తగ్గించాలని, ప్రత్యామ్నాయ ఇంధనవనరుల వినియోగం పెరగాలని, అప్పుడే పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చగలమని ఆయన అభిప్రాయపడ్డారు. ఢిల్లీలోని ఇండియా ఇస్లామిక్ కల్చరల్ సెంటర్‌లో ఆదివారం కేపిటల్ ఫౌండేషన్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ డాక్టర్ సీవీ ఆనందబోస్ చేతుల మీదుగా ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్‌ను ప్రదానం చేశారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, అటార్నీ జనరల్ ఆర్.వెంకట రమణి, జస్టిస్ ఏకే పట్నాయక్ అతిథులుగా హాజరయ్యారు.

'దేశ సమగ్రాభివృద్ధిలో పరిశోధనలు కీలకం'



తాడేపల్లిగూడెం: దేశ సమగ్రాభివృద్ధిలో పరి శోధనలు కీలకమని, వాటి ద్వారా సిద్ధించే న వ కల్పనలు ప్రజల జీవితాలను మెరుగు ప రుస్తాయని పద్మశ్రీ అవార్డు గ్రహీత, సైయంట్ కంపెనీ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి తెలిపారు. ఏపీ నిట్ ఐదో స్నాతకోత్సవం ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలోని నిట్ ప్రాంగణంలో జరిగింది. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఏ రంగంలో రాణించినా గురువులను మర్చిపోకూడదన్నారు. బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్‌పర్సన్ డాక్టర్ మృదుల రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక కాలానికి అనుగుణంగా ఆలోచన విధానాన్ని మార్చుకొని ముందడు గు వేస్తూ ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చ న్నారు. ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ప్రమోద్ పడోలే మాట్లాడుతూ జీవితంలో ప్రతి క్షణం విలువైనదన్నారు. అనంతరం 2019–23 బ్యాచ్‌లో ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేసుకున్న 458 మంది బీటెక్ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు.

విశాఖలో 25 ఎకరాల్లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం



పరుగులో పాల్గొన్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్ తదితరులు

విశాఖ స్పోర్ట్స్: రానున్న నాలుగైదు నెలల్లోనే విశాఖలో 25 ఎకరాల్లో మరో అంతర్జాతీయ స్టేడియం నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన చేయనున్నారని వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. అన్ని క్రీడలు ఒకే చోట నిర్వహించుకునేందుకు అనువుగా ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు విశాఖలో తగిన స్థలం కోసం అన్వేషణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16 నుంచి ఏపీఎల్ (ఆంధ్రా ప్రీమియర్ లీగ్) జరగనున్న నేపథ్యంలో ఏసీఏ ఆధ్వర్యంలో విశాఖ బీచ్‌రోడ్‌లో ఆదివారం 3కే రన్ నిర్వహించారు. కాళీమాత ఆలయం చెంత ఈ పరుగును సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 'మన ఏపీఎల్ మన ఆంధ్రా' పేరిట ఏపీఎల్ రెండో సీజన్ బ్రాండింగ్‌లో భాగంగా సీఎం ఆదేశాల మేరకు 3కే రన్ నిర్వహించినట్లు చెప్పారు. ఏపీఎల్‌లో ప్రతిభ చూపిన క్రికెటర్లు ఐపీఎల్‌కు ఆడే అవకాశం ఉందన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ , ఏసీఏ అధ్యక్షుడు శరత్ చంద్రారెడ్డి, మేయర్, కలెక్టర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో మంగళవారం నుంచి నగదు లావాదేవీలు నిలిచిపోనున్నాయి. ఇంటిపన్ను సహా ఏ అవసరానికి పంచాయతీకి డబ్బు చెల్లించాలన్నా.. కేవలం నగదు రహిత విధానంలోనే చెల్లించాలి. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఆగస్టు 15 నుంచి నగదు రహిత లావాదేవీల నిర్వహణను తప్పనిసరి చేస్తూ రాష్ట్రాలకు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలోను ఈ విధానం అమలుకు పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే ప్రత్యేక విధివిధానాలను ఖరారు చేసింది. సాధారణంగా ఆన్‌లైన్ విధానంలో నగదు చెల్లింపులు.. నెట్ బ్యాంకింగ్ విధానంలోగానీ, పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసే పీవోఎస్ మిషన్లలో డెబిట్ కార్డులను ఉపయోగించడం ద్వారాగానీ, ఫోన్‌పే, పేటీఎం



వంటి విధానాల్లో మొబైల్ ఫోన్లతో క్యూఆర్ కోడ్‌లను స్కాన్‌చేయడం ద్వారాగానీ చేయాల్సి ఉంటుంది. అయితే.. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌బ్యాంకింగ్, డెబిట్ కార్డులను ఎక్కువమంది వినియోగించకపోవచ్చన్న అంచనాతో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ పంచాయతీల్లో రెండురకాల విధానాల్లో నగదు రహిత ఆన్‌లైన్ చెల్లింపుల విధానం అమలుకు ఏర్పాట్లు చేసింది. మూడువేలకు తక్కువగా జనాభా ఉండే చిన్న గ్రామాల్లో కేవలం మొబైల్ ఫోన్ల ద్వారా చెల్లింపులకు వీలుగా క్యూఆర్ కోడ్ విధానం, మూడువేలకు పైగా జనాభా ఉండే గ్రామాలకు వివిధ రకాల కార్డుల ద్వారా చెల్లింపులకు వీలుగా పీవోఎస్ మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

నాలుగు బ్యాంకుల్లో పంచాయతీల పేరిట ప్రత్యేక ఖాతాలు

ఆగస్టు 15 నుంచి పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపుల నిర్వహణకు వీలుగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు రాష్ట్రంలోని అన్ని పంచాయతీలకు ప్రత్యేక బ్యాంకు ఖాతాలు తెరిచారు. ఇందుకు నాలుగు ప్రముఖ బ్యాంకులతో పంచాయతీరాజ్ శాఖ ఒప్పందం చేసుకుంది. 11 జిల్లాల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)లో, తొమ్మిది జిల్లాల్లో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో, ఐదు జిల్లాల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో, ఒక జిల్లాలో ఐడీఎఫ్‌సీ బ్యాంకులో పంచాయతీల వారీగా ఖాతాలు తెరిచారు.

- రాష్ట్రంలో మొత్తం 13,325 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో మూడువేలకన్నా తక్కువ జనాభా ఉన్నవి 10,003. ఈ పంచాయతీలకు సంబంధిత బ్యాంకులు మొబైల్ ఫోన్ల చెల్లింపులకు వీలుగా ప్రత్యేక క్యూఆర్ కోడ్‌లను ఇప్పటికే కేటాయించాయి.
- మూడువేలకు పైగా జనాభా ఉన్న 3,322 పంచాయతీల్లో కార్డుల ద్వారా నగదు చెల్లించేందుకు పీవోఎస్ మిషన్లను ఆయా పంచాయతీలకు సంబంధిత బ్యాంకులు ఉచితంగా ఇస్తున్నాయి. ఒక్కో పంచాయతీకి ఒకటి చొప్పున, ఏదైనా పెద్ద పంచాయతీలో ఒకటి కంటే ఎక్కువ గ్రామ సచివాలయాలున్న చోట, అదనంగా ప్రతి గ్రామ సచివాలయానికి ఒకటి చొప్పున మొత్తం 5,032 పీవోఎస్ మిషన్లను అందజేస్తున్నాయి.
- గ్రామ పంచాయతీలకు కేటాయించిన ఎల్‌జీడీ కోడ్ నంబరు ఆధారంగా బ్యాంకులు ఆయా పంచాయతీలకు ఆన్‌లైన్ చెల్లింపుల యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) కోడ్‌లను కేటాయిస్తున్నాయి.
- బ్యాంకులో పంచాయతీ ఖాతాకు జమ అయిన సొమ్మును ఆ పంచాయతీ కార్యదర్శి ట్రెజరీ అకౌంట్‌లో జమచేస్తారు. దీనికి సంబంధించి పంచాయతీరాజ్ శాఖ.. పంచాయతీ కార్యదర్శులకు విధివిధానాలతో ఆదేశాలు జారీచేసింది.


బడికొస్తున్న 'మేధావి'!

▶ మొదటి పేజీ తరువాయి

ఫీజుల దాకా తల్లిదండ్రులపై ఎలాంటి భారం పడకుండా భావి పౌరులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతోంది. ప్రభుత్వ పాఠశాలలను అన్ని సదుపాయాలతో తీర్చిదిద్ది ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇంగ్లిష్ మీడియంలో చదువులతో పాటు టోఫెల్ లాంటి పరీక్షలకు సైతం ఉచితంగా తర్ఫీదునిస్తూ అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా మన విద్యార్థులను సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో కొండకోనల్లోని స్కూళ్లను సైతం పర్యవేక్షించేలా గతేడాది అక్టోబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ప్రత్యేక సాంకేతిక విభాగం ఇప్పుడు దేశంలోనే ఉత్తమ పనితీరుతో ముందంజలో నిలుస్తోంది. రాష్ట్రంలోని 58,465 పాఠశాలల్లో జరిగే అన్ని కార్యకలాపాలు, విద్యార్థుల మంచిచెడులు, ఉపాధ్యాయుల స్థితిగతులు, నాడు–నేడు పనులను 'ఏఐ' టెక్నాలజీతో నిరంతరం ఉన్నతస్థాయిలో పర్యవేక్షించడంతో పాటు తక్కువ వ్యవధిలోనే నూరు శాతం ఫలితాలు సాధించారు.

అత్యుత్తమ కమాండ్ సెంటర్లు మనవే..

నిన్న మొన్నటి దాకా ఇంటి నుంచి కాలు బయటపెట్టిన విద్యార్థి సక్రమంగా స్కూలుకు వెళ్లాడో లేదో అంతు చిక్కని పరిస్థితి. టీచర్ స్కూల్‌కు వచ్చారో లేదో కనీసం ఎంఈవో దృష్టికి కూడా వచ్చేది కాదు. ఇప్పుడు ముందస్తు సమాచారం లేకుండా బడి మానేసినా.. ఉపాధ్యాయుడు సెలవు పెట్టకుండా స్కూలుకు రాకున్నా ఆ విషయం విద్యాశాఖ కమిషనర్‌కు, ప్రధాన కార్యదర్శికి, సంబంధిత మంత్రికి సైతం గంట వ్యవధిలోనే తెలిసిపోతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 70,70,143 మంది విద్యార్థులు, 3,01,677 మంది ప్రభుత్వ టీచర్ల హాజరును కాగితాలతో పని లేకుండా నిత్యం నిశితంగా పరిశీలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల నిర్వహణ వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. విజయవాడ, విశాఖపట్నంలో రెండు కమాండ్ కంట్రోల్ సెంటర్లను (విద్యా సమీక్ష కేంద్రాలు)నెలకొల్పి విద్యార్థుల హాజరు మొదలు గోరుముద్ద, విద్యాకానుక, అమ్మ ఒడి, మనబడి నాడు–నేడు లాంటి సమస్త అంశాలను దీనికి అనుసంధానించారు. ఇలాంటి కమాండ్ కంట్రోల్ సెంటర్లు దేశంలో మూడు (గుజరాత్, ఢిల్లీ, ఏపీ) మాత్రమే ఉండగా అత్యుత్తమ పనితీరుతో పూర్తిగా ఆన్‌లైన్ (పేపర్ లెస్) విధానాన్ని అనుసరిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. గతేడాది అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ సెంటర్ సమర్థంగా సేవలు అందించడంతో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ప్రతి రోజు 99.50 శాతం హాజరు నమోదవుతుండడం విశేషం. ఎంతో విజయవంతమైన మన ఎడ్యుకేషన్ టెక్నాలజీని పక్క రాష్ట్రాలు అమలు చేసేందుకు సిద్ధమవుతున్నాయి.



విద్యార్థుల హాజరును యాప్‌లో నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు



ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పనిచేస్తున్న సిబ్బంది

అటెండెన్స్ యాప్‌లో ఎప్పటికప్పుడు

రాష్ట్రంలో 58,465 పాఠశాలలు (44,372 ప్రభుత్వ, 847 ఎయిడెడ్, 13,189 ప్రైవేట్, 57 కేంద్ర ప్రభుత్వ పరిధిలోవి) ఉండగా వీటిలో 70,70,143 మంది విద్యార్థులు చదువుతున్నారు. అమ్మ ఒడి పథకానికి విద్యార్థుల హాజరును పరిగణలోకి తీసుకుంటూ అన్ని యాజమాన్యాల్లో చదువుతున్న విద్యార్థుల హాజరును రోజూ మొబైల్ యాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. ఉదయం 10.30 గంటలకల్లా విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే గోరుముద్ద, కోడిగుడ్డు, రాగిజావ, చిక్కీ తీసుకునేవారి వివరాలు 'ఏఐ' టెక్నాలజీ అటెండెన్స్ యాప్‌లో నమోదవుతున్నాయి. ఇదే తరహాలో ఉపాధ్యాయుల ఫేషియల్ రికగ్నేషన్ సైతం ఉదయం 9 నుంచి 9.15 గంటల మధ్య స్కూలు పరిధిలోనే ఫొటోతో నమోదు చేయాలి. నెట్ సౌకర్యం లేకున్నా అందుబాటులోకి రాగానే టైమ్‌తో సహా అప్‌డేట్ అయ్యేలా టెక్నాలజీని రూపొందించారు. ''స్కూల్ ఇన్ఫర్మేషన్ మానిటరింగ్ సిస్టం'' (సిమ్స్)లో రికార్డయ్యే వివరాలు ఉదయం 11– 12 గంటల్లోగా విజయవాడ, విశాఖల్లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లకు చేరుతున్నాయి. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, విద్యా సంబంధ గ్రీవెన్స్, పాఠశాల పర్యవేక్షణ, గోరుముద్ద, కన్‌స్టెంట్ రిథమ్(నాడు–నేడు), విద్యాకానుక, బైజూస్, డీబీటీ అంశాలను అనుసంధానించారు. గత సెప్టెంబర్, అక్టోబర్ నాటికి రోజుకు 68 శాతం కంటే తక్కువగా ఉన్న విద్యార్థుల హాజరు ఈ టెక్నాలజీ రాకతో ఇప్పుడు 99.50 శాతానికి పైగా నమోదవుతోంది. నెట్‌వర్క్ సరిగాలేని ఒకటి రెండు జిల్లాల్లోని కొన్ని పాఠశాలలు మినహా మిగిలిన అన్నిచోట్లా నూరు శాతం ఫలితాలు రావడం గమనార్హం.

జిల్లాకు ఇద్దరు చొప్పున పర్యవేక్షణ

కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది మధ్యాహ్నం 12 గంటల నుంచి బడికి గైర్హాజరైన విద్యార్థుల వివరాలను గుర్తించి తల్లిదండ్రుల ఫోన్‌కు మెస్సేజ్‌లు పంపుతున్నారు. ఒక్క రోజు రాకుంటే తల్లిదండ్రులకు సమాచారం ఇస్తుండగా వరుసగా మూడు రోజులు గైర్హాజరైతే విద్యార్థి ఇంటి పరిధిలోని వలంటీర్‌కు, గ్రామ / వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శికి, ఎంఈవో, డీఈఓలకు సమాచారం అందుతోంది. అందుకు కారణాలను తెలుసుకుని ఆ వివరాలను యాప్‌లో నమోదు చేసి సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉంటుంది. ఇందుకోసం జిల్లాకు ఇద్దరు చొప్పున 52 మంది సిబ్బందితోపాటు జోన్‌కు ఒక్కరు చొప్పున నలుగురు పర్యవేక్షకులు విధులు నిర్వర్తిస్తూ ఏ రోజు అంశాలను అదేరోజు పరిష్కరిస్తున్నారు. విజయవాడ సెంటర్ నుంచి టీచర్ల అటెండెన్స్, గోరుముద్ద, బైజూస్, అకడమిక్ అంశాలను పరిశీలిస్తుండగా విశాఖ కేంద్రంగా విద్యార్థుల హాజరు, కన్‌స్టెన్ రిథమ్, జేవీకే, డీబీటీ అంశాలను పర్యవేక్షిస్తున్నారు.

సచివాలయాలతో అనుసంధానం

నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డబుల్ డెస్క్ బెంచీలు, ఫ్యాన్లు, స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ స్క్రీన్లు, టాయిలెట్లు, ఆర్వో తాగునీరు లాంటి వసతులను ప్రభుత్వం కల్పించింది. వీటిని ప్రతి నెలా పరిశీలించేలా గ్రామ / వార్డు సచివాలయాల సిబ్బందిని విద్యాశాఖ పోర్టల్‌తో అనుసంధానించారు. స్థానిక ఆరోగ్య సిబ్బంది వారంలో ఒకసారి విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేయాలి. ఇంజనీరింగ్ అసిస్టెంట్ సైతం నిర్ణీత వ్యవధిలో స్కూల్లో సమస్యలను గుర్తించి ఫొటోతో సహా యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇలా స్కూలు హెచ్‌ఎం నుంచి విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి వరకు అన్ని స్థాయిల్లో పరిశీలిస్తారు. ఈ విధానంలో ఎవరికి వారే బాధ్యులు, వారికి వారే పర్యవేక్షకులు. అన్ని అంశాలు పారదర్శకంగా జరిగేలా టెక్నాలజీ అనుసంధానకర్తగా వ్యవహరిస్తోంది.

> **ఒక్క క్లిక్‌తో పర్యవేక్షణ..**
>
> 
>
> గతంలో పాఠశాలలో ఏం జరుగుతోందో జిల్లా అధికారులకు కూడా తెలిసేది కాదు. ఇక రాష్ట్ర స్థాయికి చేరుకునే ఊసే లేదు. ఇప్పుడు అన్ని అంశాలను టెక్నాలజీ పర్యవేక్షిస్తోంది. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే అధికారులకు సమాచారం ఇస్తోంది. గతేడాది అక్టోబర్‌లో విజయవాడలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశాం. మరో సెంటర్‌ను ఈ ఏడాది జూన్‌లో విశాఖలో అందుబాటులోకి తెచ్చాం. దాదాపు 70 లక్షల మంది విద్యార్థులు, 3 లక్షల మంది ఉపాధ్యాయులు, 58 వేల పాఠశాలలను ఒక్క క్లిక్‌తో పర్యవేక్షించవచ్చు. స్కూళ్ల నిర్వహణ, బోధనలో నూరు శాతం పారదర్శకంగా విజయవంతంగా ఫలితాలను నమోదు చేశాం. అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ ఉండడంతో ఎక్కడా తప్పు జరిగేందుకు ఆస్కారం లేదు. – కాటమనేని భాస్కర్, పాఠశాల మౌలిక వసతుల కమిషనర్

ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సేవలు ప్రశంసనీయం

- ఆ సంస్థను ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు శతకోటి వందనాలు
- ఖతార్ నుంచి సురక్షితంగా ఇంటికి చేరిన తిరుపతికి చెందిన మహిళ



తల్లి కె.చిన్నమ్మతో కుమార్తె బబిత

కడప కార్పొరేషన్: ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్‌ఆర్‌టీఎస్) సేవలు ప్రశంసనీ యమని తిరుపతికి చెందిన కె.చిన్నమ్మ, ఆమె కుమార్తె బబిత తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రుల సమస్యలను పరిష్కరించడానికి ఈ సంస్థను ఏర్పాటు చేసిన వైఎస్ జగన్‌కి శతకోటి వందనాలు అని చెప్పారు. అమెరికాలో ఉంటున్న తన కుమారుడు కె.చక్రవర్తిని చూసేందుకు 6 నెలల క్రితం వెళ్లిన చిన్నమ్మ... ఈ నెల 4న ఇండియాకు తిరుగు ప్రయాణమైంది. ఖతార్‌లోని దోహాలో ఆమె కనెక్టింగ్ విమానం ఎక్కాల్సి ఉండగా, అనారోగ్యానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఖతార్ ఎయిర్‌పోర్టు అధికారులు ఆమె కుమారుడికి సమాచారం అందించారు. చక్రవర్తి కువైట్‌లోని తన స్నేహితుడు విజయ్‌కి సమాచారం ఇవ్వగా... అతను ఇచ్చిన సమాచారంతో వైఎస్సార్‌సీపీ ఖతార్ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ దంపతులు స్పందించి చిన్నమ్మను హమాద్ హాస్పిటల్‌లో చేర్పించారు. ఇండియాలో ఉన్న చిన్నమ్మ ఆమె పెద్ద కుమార్తె కె.బబిత 5న ఖతార్ చేరుకున్నారు. ఏపీఎస్‌ఆర్టీఎస్ తరఫున వారం రోజులు వారికి ఆస్పత్రిలో అవసరమైన సాయం చేశారు. కోలుకున్న చిన్నమ్మతో పాటు ఆమె కుమార్తెను ఈ నెల 11న సురక్షితంగా ఇండియాకు పంపగా, 12న రాత్రి 2 గంటలకు బెంగళూరు చేరుకున్నారు. బబిత మాట్లాడుతూ ఏపీఎస్‌ఆర్‌టీఎస్ సభ్యులు సమన్వయం చేసుకుని తమకు సా యం చేశారని చెప్పారు. ఇందుకు సహకరించిన ఏపీఎస్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, వైఎస్సార్‌సీపీ ఖతార్ కన్వీనర్ శశికిరణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

'కోత'లపై చీకటి రాతలు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో 226.488 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతుంటే దానిలో కేవలం 1.35 మిలియన్ యూనిట్లు లోటు ఏర్పడింది. ఇది సరఫరా చేసిన మొత్తంలో కేవలం 0.6 శాతం మాత్రమే. దీనికే 'చీకటి రాజ్యం' అంటూ తాటికాయంత అక్షరాలతో పచ్చబ్యాచ్‌కు చెందిన క్షుద్రపత్రిక ఓ కథనాన్ని అచ్చేసింది. రామోజీ మోస్తున్న చంద్రబాబు హయాంలో వారంలో రెండ్రోజులు పరిశ్రమలకు 'పవర్‌హాలిడే', గ్రామాల్లో పగలంతా విద్యుత్ కోతలు విధించిన సంగతి ఈనాడు మర్చిపోయినా ప్రజలు మర్చిపోరని రామోజీకి తెలియకపోవడం ఆశ్చర్యకరం. స్థానిక పరిస్థితుల కారణంగా తలెత్తిన విద్యుత్ అంతరాయాలన్నిటినీ విద్యుత్ కోతలుగా చూపించాలనే ప్రయత్నంలో అసలు నిజాలకు రామోజీ పాతరేశారు. కానీ, రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితులను విద్యుత్ సంస్థలు వాస్తవాలతో సహా 'సాక్షి'కి వెల్లడించాయి. ఆ వివరాలు..

ఉత్పత్తి, వాతావరణ ప్రభావం..

ప్రస్తుతం రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ గ్రిడ్ డిమాండ్ దాదాపు గతేడాది ఇదే రోజు జరిగిన 200.595 మిలియన్ యూనిట్లు కంటే 25.893 మిలియన్ యూనిట్లు (12.91 శాతం) పెరిగింది. కానీ, ఈ డిమాండ్‌కు సరిపడా సరఫరాకు వనరులు అందుబాటులో లేవు. ఈ సీజన్‌లో అధికంగా ఉండాల్సిన పవన విద్యుత్ కూడా వాతావరణంలో మార్పులవల్ల అంచనా వేసిన దానిలో కేవలం 30 శాతం కూడా రావడంలేదు. రోజులో వివిధ సమయాల్లో ఒక్కోసారి అంచనాలో కేవలం 10 శాతం కూడా ఉత్పత్తి కావటంలేదు. అలాగే, ఈ ఏడాది కృష్ణా నది బేసిన్‌లో జల విద్యుత్ ఉత్పత్తి ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. ఎగువ రాష్ట్రాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో మన రాష్ట్రంలో ఉన్న జలాశయాలకు ఇంకా నీటి చేరిక మొదలుకాలేదు. దానివల్ల జల విద్యుదుత్పత్తి కూడా జరగడంలేదు. ఏపీ జెన్‌కోలోని కొన్ని థర్మల్ విద్యుత్కేంద్రాలు వార్షిక మరమ్మతుల నిర్వహణ కోసం ఆపారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలోని కుడిగి థర్మల్ విద్యుత్ కేంద్రం కూడా ప్రస్తుతం అందుబాటులో లేదు. హిందుజా థర్మల్ కేంద్రంలో బొగ్గు కొరతవల్ల రెండు 520 మెగావాట్ల జనరేటర్లలో కేవలం ఒకటి మాత్రమే పనిచేస్తోంది.

మార్కెట్‌లో దొరకడంలేదు..

ప్రస్తుత పరిస్థితులను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుని ఏఏ సమయాల్లో విద్యుత్ కొరత ఏర్పడుతుందో ఆయా సమయాల్లో అత్యవసరంగా మార్కెట్ కొనుగోళ్లకు వెళ్లాల్సి వస్తోంది. స్వల్పకాలిక మార్కెట్‌లో కూడా తగినంత విద్యుత్ అందుబాటులో ఉండటంలేదు. ఎంత ధర వెచ్చించినా బహిరంగ మార్కెట్‌లో స్వల్పకాలిక కొనుగోళ్లు చేద్దామన్నా తగినంత విద్యుత్ అందుబాటులో లేదు. మనం పెట్టే బిడ్డింగ్ పరిమాణంలో కేవలం 10–20 శాతం మాత్రమే దొరుకుతుంది. అత్యంత అధిక ధర (సీలింగ్ ధర)కు బిడ్డింగ్ వేయడానికి సిద్ధపడినా కూడా తగినంత విద్యుత్ లభించడం లేదు. అయినప్పటికీ ఎలాగోలా ప్రయత్నించి బహిరంగ మార్కెట్ నుంచి యూనిట్ సగటు రేటు రూ.7.483 చొప్పున రూ.46.803 కోట్లతో 46.802 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను శనివారం కొనుగోలు చేశారు.

నిరంతర చర్యలు..

ఇక విద్యుత్ గ్రిడ్‌ను సమతుల్యం చేసే క్రమంలో విద్యుత్ సరఫరాలో అక్కడక్కడ కొన్ని అవరోధాలు ఏర్పడ్డాయి. ఈ నియంత్రణ చర్యలు చేపట్టకపోతే దేశీయ గ్రిడ్ నుంచి ఓవర్ డ్రాయల్ విపరీతంగా పెరిగిపోయి మొత్తం గ్రిడ్ మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉండడంతో దక్షిణ రీజినల్ లోడ్ డిస్పాచ్ సెంటర్, జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ మార్గదర్శకాలకు అనుగుణంగా శనివారం రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో అనివార్యంగా విద్యుత్ కోతలు విధించాల్సి వచ్చింది. దక్షిణ భారతదేశం మొత్తం అన్ని రాష్ట్రాల్లో ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. కానీ, ఈనాడు, మరికొన్ని పత్రికల్లో రాస్తున్నట్లు మన రాష్ట్రంలో వేలాది గ్రామాల్లో విద్యుత్ కోతలు, చీకటి రాజ్యం పరిస్థితులు లేవు. సామాన్య గృహ విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది, అసౌకర్యం తలెత్తకూడదని ముందుగా పరిశ్రమలు వాడే విద్యుత్‌కు నియంత్రణ విధించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి అధికారులు సూచనలిచ్చారు. మరోవైపు.. నిత్యం విద్యుత్ కొనుగోలుకు డిస్కంలు చర్యలు తీసుకుంటున్నాయి. విద్యుత్ ఎక్స్ఛేంజీల్లోనే కాకుండా వారం ముందస్తు ద్వైపాక్షిక కొనుగోళ్ల ద్వారా కూడా విద్యుత్ కొనడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి.

నీళ్లపై రామోజీ విషం

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రారంభించారు కాబట్టి అందులో ఎంత అవినీతి జరిగినా పట్టించుకోకూడదు!! గత సర్కారు హయాంలో కమీషన్లు కాజేసినా సరే అది నిరాటంకంగా సాగిపోవాల్సిందే!! అవసరం ఉన్నా లేకున్నా అమలై తీరాల్సిందే!! ఇదీ రామోజీ తీరు!! అందుకు తాజా తార్కాణమే 'పట్టిసీమ నాపై పగబట్టిందే..!' శీర్షికతో ఈనాడు ప్రచురించిన కథనం. చంద్రబాబు జేబులో డబ్బులతోనే టీడీపీ నిధులతోనే పట్టిసీమ ఎత్తిపోతలను నిర్మించినట్లుగా చిత్రీకరిస్తూ బురద చల్లేందుకు యత్నించారు. పట్టిసీమ ఎత్తిపోతల్లో బోనస్ రూపంలో రూ.257.55 కోట్లు, కమీషన్ల రూపంలో మరో రూ.200 కోట్లకుపైగా టీడీపీ పెద్దల జేబులోకి వెళ్లిన విషయాన్ని కప్పిపుచ్చేందుకు రామోజీ శతవిధాలా ప్రయత్నించారు. అవసరమైనప్పుడు పట్టిసీమ ఎత్తిపోతలను ప్రభుత్వం ఉపయోగించుకుంటుందిగానీ గోదావరి నీళ్లను ప్రకాశం బ్యారేజీలోకి ఎత్తిపోసి సముద్రంలోకి వదిలేసేందుకు కాదనే విషయాన్ని ఇకనైనా రామోజీ గుర్తిస్తే మంచిది!!

ఈనాడు ఆరోపణ: పట్టిసీమను ఇన్నాళ్లూ పక్కన పెట్టినా ఇప్పుడు అదే దిక్కు అయింది

వాస్తవం: సాధారణంగా కృష్ణా, గోదావరికి ఒకేసారి వరదలు వస్తాయి. గత నాలుగేళ్లగా జూలై నుంచే కృష్ణమ్మ పరవళ్లు తొక్కడంతో కృష్ణా డెల్టాకు సమృద్ధిగా నీటిని విడుదల చేస్తూ ప్రకాశం బ్యారేజ్ నుంచి 2019లో 797, 2020లో 1278, 2021లో 501, 2022లో 1331 టీఎంసీల మిగులు జలాలను సముద్రంలోకి వదిలేశారు. పట్టిసీమను గత నాలుగేళ్లలో పెద్దగా ఉపయోగించుకోవాల్సిన అవసరం లేకపోయింది. కమీషన్ల కోసం చంద్రబాబు రూ.1,621.72 కోట్లు పోసి కట్టిన పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను ప్రకాశం బ్యారేజీలోకి ఎత్తిపోసి సముద్రం పాలు చేయలేదనే రీతిలో రామోజీ అక్కసు వెళ్లగక్కారు.

ఆరోపణ: గోదావరి నీళ్లన్నీ సముద్రం పాలవుతున్నా పట్టిసీమ ద్వారా తరలించకుండా చోద్యం చూశారు

వాస్తవం: పులిచింతలలో నిల్వ చేసిన నీటితో పాటు పట్టిసీమ నుంచి అవసరమైన మేరకు నీటిని ఎత్తిపోస్తూ కృష్ణా డెల్టాకు సమర్థంగా నీళ్లందించేలా ప్రభుత్వం ప్రణాళిక రచించింది. దాని ప్రకారమే నీటిని సరఫరా చేస్తోంది. ఈ సీజన్ ఆరంభంలో పులిచింతలలో 38 టీఎంసీల నిల్వ ఉంది. గోదావరిలో వరద రానంతవరకూ కృష్ణా డెల్టా అవసరాల కోసం పులిచింతల నుంచి 18 టీఎంసీలను ప్రభుత్వం విడుదల చేసింది. పులిచింతలలో నీటి నిల్వలు తగ్గుతున్న క్రమంలో గోదావరికి వరద రావడంతో పట్టిసీమ పంపులను జూలై 21న ప్రారంభించి ప్రకాశం బ్యారేజీ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లందించింది. ప్రభుత్వం దూరదృష్టితో రూపొందించిన ప్రణాళికను అమలు చేయడం వల్లే పులిచింతలలో వినియోగించుకున్న మేరకు 19 టీఎంసీలను తిరిగి నిల్వ చేయగలిగింది. అదే పులిచింతలలో నీటిని ముందుగా కృష్ణా డెల్టాకు విడుదల చేయకుంటే మూసీ నుంచి వచ్చిన వరద సముద్రం పాలయ్యేది. పులిచింతలకు దిగువన మున్నేరు, కట్టలేరు, పాలేరులో వరద తగ్గాక మళ్లీ పట్టిసీమ పంపులను ప్రారంభించి గోదావరి జలాలను ప్రకాశం బ్యారేజ్‌కు తరలిస్తున్నారు. ఇప్పటివరకూ పట్టిసీమ ద్వారా 3.14 టీఎంసీలను కృష్ణా డెల్టాకు ప్రభుత్వం సరఫరా చేసింది. రైతుల ప్రయోజనాల పరిరక్షణే ఈ ప్రభుత్వానికి పరమావధి.

ఆరోపణ: పోలవరాన్ని కుళ్లబొడిచి కోలుకోకుండా చేశారు. పట్టిసీమ మాత్రం ప్రభుత్వాన్ని వదలడం లేదు

వాస్తవం: పోలవరాన్ని కమీషన్ల కోసం సర్వనాశనం చేసింది చంద్రబాబే. కమీషన్ల కోసం ఆయన పోలవరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారని ప్రధాని మోదీనే చెప్పిన విషయం రామోజీకి గుర్తు లేదా? 2014 జూన్ 8 నుంచి 2016 డిసెంబర్ 30 వరకూ రెండున్నరేళ్లు చంద్రబాబు పోలవరంలో తట్టెడు మట్టి కూడా తవ్వకుండా కాలక్షేపం చేశారు. దివంగత వైఎస్సార్ హయాంలో చాలావరకూ పూర్తయిన పోలవరం కుడి కాలువ ద్వారా గోదావరి నీటిని ప్రకాశం బ్యారేజీకి తరలిస్తూ కమీషన్ల కోసం చంద్రబాబు 2015లో పట్టిసీమ ఎత్తిపోతల చేపట్టారు. 21.99 శాతం అధిక ధరలకు (ఏడాదిలోపు పూర్తి చేస్తే 16.99 శాతం బోనస్ ఇచ్చే నిబంధనతో) కాంట్రాక్టర్లకు ఇచ్చేశారు. గడువులోగా అన్ని పనులు పూర్తి కాకున్నా రూ.257.55 కోట్లను బోనస్‌గా ఇచ్చేసి కమీషన్లు వసూలు చేసుకున్నారు. పట్టిసీమ ఎత్తిపోతల్లో భారీ కుంభకోణం జరిగిందని కాగ్ తేల్చి చెప్పడమే అందుకు తార్కాణం. ఈలోగా పోలవరం నిర్మాణ బాధ్యతలు దక్కించుకుని 2018 నాటికే పూర్తి చేస్తామని అసెంబ్లీలో బాబు శపథం చేశారు. జీవనాడిని జాప్యం చేస్తూ రూ.1,930 కోట్ల తో పురుషోత్తపట్నం ఎత్తిపోతలను చేపట్టారు. పర్యావరణ అనుమతి లేకుండా చేపట్టడం వల్ల పురుషోత్తపట్నం ఎత్తిపోతలపై రూ. 24.90 కోట్లను పరిహారంగా చెల్లించాలని ఎన్జీటీ ఆదేశించింది. దీంతో రూ. 1,900 కోట్లు బూడిదలో పోసిన పన్నీరయ్యాయి.

రెవెన్యూలో ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌పై స్పెషల్ డ్రైవ్

- విభాగాల వారీగా సమీక్షలు
- ఫైళ్ల క్లియరెన్స్‌కు ప్రణాళిక



సాక్షి, అమరావతి: రెవెన్యూ శాఖలో ఫైళ్ల క్లియరెన్స్ వేగంగా జరిగేలా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) సాయిప్రసాద్ దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ-ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూడడమే ధ్యేయంగా ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గత పది రోజులుగా సీసీఎల్‌ఏ ప్రధాన కార్యాలయంలో విభాగాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఏ సెక్షన్‌లో ఎన్ని ఈ-ఫైళ్లు ఉన్నాయో లెక్క తీసి వాటిపై రెండు రోజుల క్రితం సీసీఎల్‌ఏ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఫైళ్లు కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు ఏ ఉద్యోగి, ఏ అధికారి లాగిన్‌లో ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనేది వివరించి, వాటికి కారణాలు తెలుసుకున్నారు. చివరికి రెండు నెలల్లో మొత్తం ఫైళ్లను క్లియర్ చేయడానికి ఒక ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు 15 రోజుల్లో పరిష్కరించే ఫైళ్లు, 16 నుంచి 30 రోజుల్లో పరిష్కరించే ఫైళ్లు, 31 నుంచి 60 రోజుల్లో పరిష్కరించే ఫైళ్లు, 60 రోజుల తర్వాత పరిష్కరించే ఫైళ్లను విభజించారు. భూసేకరణ సెక్షన్‌లో 944 ఫైళ్లు పెండింగ్‌లో ఉండగా, వాటిని ఆగస్టు 31వ తేదీ నాటికి క్లియర్ చేయాలని నిర్దేశించారు. అలాగే, అన్ని సెక్షన్ల సహాయ కార్యదర్శులు, అదనపు సహాయ కార్యదర్శులకు తమ విభాగాల్లో ఉన్న ఫైళ్లను ఎప్పటిలోపు క్లియర్ చేయాలో టైమ్ లైన్ పెట్టారు. డిప్యూటీ కలెక్టర్లకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటుచేస్తారు. సీసీఎల్‌ఏ నిర్ణయాలు, ఆదేశాలను నేరుగా తహశీల్దార్లకు చేరేలా చర్యలు తీసుకోనున్నారు. జిల్లా కలెక్టరేట్ల నుంచి వచ్చే ముఖ్యమైన ఈ-ఫైళ్లను వెంటనే క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించడానికి అన్ని విభాగాలు ప్రయత్నించాలని సీసీఎల్‌ఏ ఆదేశించారు.

క్లుప్తంగా...

మళ్లీ చిరుత..

తిరుమల: తిరుమల అలిపిరి నడకమార్గంలోని 2,450వ మెట్టు వద్ద ఆదివారం రాత్రి మళ్లీ చిరుత సంచరిస్తూ భక్తులకు కనిపించింది. ఈ విషయాన్ని సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని శబ్దాలు చేసుకుంటూ చిరుతను అడవిలోకి మళ్లించారు.

లక్షిత మృత్యువాతపై సమగ్ర దర్యాప్తు

తిరుమల ఘటనపై నివేదిక కోరిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్



సాక్షి, అమరావతి: తిరుమల కొండపై శుక్రవారం రాత్రి కాలి నడకన వెళ్తూ చిరుత దాడిలో చిన్నారి లక్షిత మృత్యువాతపడిన ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఏపీ బాలల హక్కుల కమిషన్ ఆదేశించింది. ఘటనపై పూర్తిస్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలని టీటీడీ, అటవీ, పోలీస్, రెవెన్యూ అధికారులను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు ఆదేశించినట్లు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 11న తిరుమల కొండపై నెల్లూరు జిల్లాకు చెందిన ఆరేళ్ల చిన్నారి లక్షిత మృత్యువాత పడటం, జూన్ 22న కర్నూలు జిల్లాకు చెందిన నాలుగేళ్ల కౌశిక్ గాయపడటం బాలల కమిషన్‌ను కలిచివేసిందన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే కురుమలకు న్యాయం

కురుమ, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బుల శ్రీనివాసులు



కర్నూలు (అర్బన్): వైఎస్సార్‌సీపీతోనే కురువ సామాజిక వర్గానికి రాజకీయంగా న్యాయం జరుగుతోందని కురుమ, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బుల శ్రీనివాసులు చెప్పారు. ఆదివారం కర్నూలులోని బీసీ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కురువలను రాజకీయంగా ఏ మాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. సీఎం జగన్ రాష్ట్రంలో రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాన్ని కురువలకు కేటాయించారని, ఒకరికి బీసీ కమిషన్ మెంబర్‌గా, రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్‌గా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. కౌన్సిలర్‌గా ఉన్న శంకరనారాయణను మంత్రిని చేసిన ఘనత కూడా సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళమోహన్ పాల్గొన్నారు.

చిరుత కోసం గాలింపు

తిరుమలలోని అడవంతా జల్లెడ పడుతున్న అధికారులు | మొదటి, 35వ మలుపు వద్ద చిరుత కదలికలు

సాక్షి, తిరుపతి: తిరుమల నడక మార్గంలో ఆరేళ్ల చిన్నారి లక్షితను ఈడ్చుకెళ్లి ప్రాణాలు తీసిన చిరుతను పట్టుకునేందుకు తీవ్ర గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అటవీ, టీటీడీ, పోలీస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి అడవిని జల్లెడ పడుతున్నారు. తిరుమల మొదటి ఘాట్ రోడ్డు, 35వ మలుపు వద్ద చిరుత కదలికలను గుర్తించినట్టు అధికారులు చెబుతున్నారు. వాహనం శబ్దం వినడంతో చిరుత అడవిలోకి పారిపోయినట్టు తెలిసింది. చిరుత దాడి చేసిన అటవీ ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేశారు.

పండ్లు.. కూరగాయల కోసమే!

కాలినడక మార్గంలో వ్యాపారులు పండ్లు, కూరగాయలు విక్రయిస్తున్నారు. కొందరు భక్తులు నడిచి వెళ్తున్నప్పుడు తినడానికి పండ్లు వెంట తెచ్చుకుంటున్నారు. ఆ పండ్లు, కూరగాయలను కొందరు భక్తులు నడక మార్గంలో కనిపించే దుప్పి, జింకలకు తినిపిస్తుంటారు. భక్తులు ఇచ్చే వాటి కోసం అవి కాలినడక మార్గానికి చేరుకుంటున్నాయి. దీంతో దుప్పి, జింకల కోసం చిరుతలు ఆ ప్రాంతానికి వస్తున్నట్టు అటవీ అధికారులు చెబుతున్నారు. అక్కడికి వచ్చే చిరుతలు దుప్పి, జింకలు దొరకని సమయంలో చిన్నారులపై దాడికి పాల్పడుతున్నాయంటున్నారు. కాగా, చిన్నారి లక్షిత బంతితో ఆడుకుంటుండగా.. గాలి వాటానికి ఆ బంతి దూరంగా పడటంతో దానిని తీసుకునేందుకు మెట్లు దాటి అడవిలోకి వెళ్లిందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే చిరుత అమాంతం లక్షిత గొంతు పట్టుకుని అడవిలోకి లాక్కెళ్లి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్ రావాలి

ఫోరెన్సిక్ నివేదిక వచ్చాకే లక్షిత మరణంపై కారణాలు తెలుస్తాయి. చిరుత కోసం గాలిస్తున్నాం. బోన్లు, కెమెరాలు ఏర్పాటు చేశాం. కాలినడకన వెళ్లే భక్తులు గుంపులు గుంపులుగా వెళ్లడం మంచిది. పండ్లు, కాయగూరలు ఎక్కడంటే అక్కడ పడేయకుండా ఉంటే బాగుంటుంది. **– సతీష్‌రెడ్డి, డీఎఫ్‌ఓ, తిరుపతి**

ఆపదను తప్పించే 'ఆలోచన'

తిరుమల అలిపిరి నడక మార్గంలో ఓ భక్తుడు ఆదివారం అందరినీ ఆకట్టుకున్నాడు. నడక మార్గంలో వన్య ప్రాణులు సంచరిస్తోన్న నేపథ్యంలో విజయవాడకు చెందిన ఓ భక్తుడు తన కుమారుడి చేతికి రబ్బర్ ఎలాస్టిక్ తాడు తగిలించి..ఆ తాడును ఆయన చేతికి ఇలా కట్టుకున్నాడు. దీనిపై ఆ భక్తుడిని ప్రశ్నించగా తమ జాగ్రత్త కోసమే తాడు కట్టినట్లు చెప్పాడు. **- తిరుమల**



తిరుమల కాలినడక..
ఘాట్ మార్గాల్లో జాగ్రత్తలు

▶ మొదటి పేజీ తరువాయి

చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలిపిరి మార్గంలో ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే 15 సంవత్సరాలలోపు చిన్నారులను తల్లిదండ్రులు, బంధువులతో అనుమతిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పెద్దలకు మాత్రమే అలిపిరి కాలినడక మార్గంలో అనుమతిస్తారు. శ్రీవారి మెట్టు వైపు కాలినడక మార్గంలో మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే 15 సంవత్సరాలలోపు చిన్నారులను తల్లిదండ్రులు, బంధువులతో అనుమతిస్తారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెద్దలను మాత్రమే ఈ మార్గంలో అనుమతిస్తారు. శనివారం నుంచి రెండు ఘాట్ రోడ్లలో సాయంత్రం 6 గంటల తరువాత ద్విచక్ర వాహనాల రాకపోకలను నిలిపివేసిన విషయం తెలిసిందే.

ఐదు ప్రాంతాల్లో చిరుత సంచారం

నడక మార్గం, ఘాట్ రోడ్లలో ఐదు ప్రాంతాల్లో చిరుత సంచారం జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఇక్కడ చిరుతలు పెరిగినట్టు అటవీ అధికారులకు సమాచారం అందుతోంది. శనివారం కూడా నడక మార్గం, ఘాట్ రోడ్లలోని చిరుతల సంచారం గుర్తించారు. అలిపిరి నుంచి గాలిగోపురం వరకు మూడు ప్రాంతాలు, గాలి గోపురం నుంచి ఏడో మైలు వద్ద చిరుత సంచారాన్ని గుర్తించారు. రెండో ఘాట్ రోడ్డులోని 38వ మలుపు వద్ద చిరుత తిరుగుతున్నట్టు గుర్తించారు. దీంతో భక్తులను అప్రమత్తం చేశారు.

వడ్డెర్లపై దాడి ఘటనలో టీడీపీ వైఖరి సిగ్గుచేటు

- ఈ దాడిని వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం సరికాదు
- రాష్ట్ర వడ్డెర సంఘం గౌరవాధ్యక్షుడు వడ్డె రమణ



రాజంపేట: శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం వెంకటరమణపల్లెలో వడ్డెర్లపై జరిగిన దాడిని రాజకీయలబ్ధికి వాడుకోవాలని టీడీపీ పాకులాడుతోందని రాష్ట్ర వడ్డెర సంఘం గౌరవాధ్యక్షుడు వడ్డె రమణ విమర్శించారు. అటువంటి ప్రయత్నాన్ని రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర్లు తిప్పికొడతారని చెప్పారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వడ్డెర్లపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీన్ని ఒక వర్గంపై దాడిగా కాకుండా మానవజాతి మీద జరిగిన దాడిగా పరిగణించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. వెంకటరమణపల్లెలో స్థలవివాదం నేపథ్యంలో జరిగిన సంఘటనను రాజకీయలబ్ధికి వాడుకునేందుకు పరామర్శపేరిట పచ్చనేతలు వెళుతున్నారని విమర్శించారు. టీడీపీ నేత పల్లె రఘునాథరెడ్డి గాయపడిన వారిని పరామర్శించి వారిని ఆదుకునేందుకు దోహదపడాల్సిందిపోయి, స్వార్థరాజకీయానికి తెరతీశారని ధ్వజమెత్తారు. ఈ ఘటనను వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం సిగ్గుచేటన్నారు. టీడీపీ హైడ్రామాను వడ్డెర్లు నమ్మబోరని ఆయన చెప్పారు.

వేటాడి.. వెంటాడి..

- గతేడాది బాలిక అపహరణ కేసులో ఏఎస్పీ సుప్రజ చొరవ
- 80 మంది నిందితుల అరెస్ట్
- బెస్ట్ ఇన్వెస్టిగేషన్ అవార్డుకు ఎంపిక



పట్నంబజారు(గుంటూరుఈస్ట్): పన్నెండేళ్ల బాలికకు తీరని అన్యాయం.. కొంతమంది మోసగాళ్ల చేతికి చిక్కి వ్యభిచార కూపంలో మగ్గిపోయింది.. ఆఖరుకు ఎలాగో తప్పించుకుని ఒక మహిళా అధికారి వద్దకు చేరుకుంది. బాలిక పట్ల మృగాళ్లు వ్యవహరించిన తీరు.. పలువురు మహిళలు చేయించిన అఘాయిత్యాలను చూసిన ఆ అధికారి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఎలాగైనా సరే నిందితులకు శిక్షలు పడేదాక విశ్రమించకూడదని నిర్ణయం తీసుకున్నారు. కేసు విచారణలో చూపిన ప్రతిభకు గాను గుంటూరు జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ కొర్లకుంట సుప్రజకు కేంద్ర ప్రభుత్వం 'సెంట్రల్ హోం మినిస్టర్ బెస్ట్ ఇన్వెస్టిగేషన్' అవార్డును ప్రకటించింది. గుంటూరు జిల్లా మేడికొండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాది 12 ఏళ్ల బాలికను అపహరించి, వ్యభిచార కూపంలోకి దించిన కేసు విచారణ బాధ్యతలను అప్పటి వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీగా ఉన్న ప్రస్తుత ఏఎస్పీ కె.సుప్రజకు అప్పగించారు. అన్నీ తానై ఏపీ, తెలంగాణ, రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో స్వయంగా విచారణ జరిపారు. తన నాలుగు నెలల పసిబిడ్డను తీసుకుని.. ఆఖరుకు ఆమె ప్రయాణిస్తున్న వాహనంలోనే ఆ చిన్నారికి ఊయల కట్టి వెళ్లిన పరిస్థితులున్నాయి. కేసులో వ్యభిచారం చేయించిన నిర్వాహకులు, వ్యభిచారానికి పాల్పడిన 80 మంది నిందితులను అరెస్ట్ చేశారు. డీఎస్పీ నుంచి ఏఎస్పీగా పదోన్నతి పొందాక సైతం ఈ కేసును పూర్తిస్థాయిలో సుప్రజతోనే విచారణ చేయించాలని కోర్టు ఆదేశించటంతో పాటు, కేసులో భారీ పురోగతి సాధించిన ఆమెను న్యాయస్థానం అభినందించింది. ఈ కేసులో సుమారు 500 పేజీల చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు. మరో బాలికకు ఇలాంటి పరిస్థితి రాకూడదన్న పట్టుదలతో ఉన్నతాధికారుల సహకారంతో విచారణ చేసినట్టు ఏఎస్పీ సుప్రజ చెప్పారు.

అప్పటివరకు పాత వాటాలే

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కృష్ణా జలాల పంపిణీపై తేల్చిచెప్పిన జల్ శక్తి శాఖ, కృష్ణా బోర్డు
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి వచ్చే వరకూ పాత పద్ధతే
- 2న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలపై సుప్రీం కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో ప్రస్తావన

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు పాత వాటాల ప్రకారమే నీటిని పంపిణీ చేస్తామని కేంద్ర జల్‌శక్తి శాఖ, కృష్ణాబోర్డు తేల్చి చెప్పాయి. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి వచ్చే వరకు ఉమ్మడి రాష్ట్రానికి బచావత్ కేటాయించిన కృష్ణా జలాల్లో 66 శాతం ఏపీకి, 34 శాతం తెలంగాణకు పంపిణీ చేస్తామని స్పష్టం చేసింది. చిన్న నీటివనరుల విభాగంలో వినియోగించిన జలాలు, ప్రకాశం డెల్టాకు మళ్లించే గోదావరి జలాలను పంపిణీ నుంచి మినహాయించినట్టు పునరుద్ఘాటించింది. ఈ మేరకు ఈ నెల 2న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలపై సుప్రీంకోర్టులో కేంద్ర జల్‌శక్తి శాఖ, కృష్ణాబోర్డు సంయుక్తంగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో స్పష్టం చేశాయి. కృష్ణా జలాలను ప్రస్తుత నీటి సంవత్సరంలోనూ పాత పద్ధతిలోనే వినియోగించుకోవడానికి మే 10న నిర్వహించిన కృష్ణా బోర్డు 17వ సర్వసభ్య సమావేశంలో రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. కానీ.. ఆ తర్వాత తెలంగాణ అడ్డం తిరిగింది. కృష్ణా జలాల్లో సగం వాటా ఇవ్వాల్సిందేనని పట్టుబట్టింది. దీన్ని కేంద్ర జల్ శక్తి శాఖ దృష్టికి కృష్ణా బోర్డు తీసుకెళ్లింది.

అర్ధ భాగం డిమాండ్ అసంబద్ధమే..

కృష్ణా జలాల పంపిణీకి 1969లో జస్టిస్ బచావత్ అధ్యక్షతన కేంద్రం ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్.. 75 శాతం లభ్యత ఆధారంగా 2,130 టీఎంసీల లభ్యత ఉంటుందని అంచనా వేసింది. మహారాష్ట్రకు 585 టీఎంసీలు, కర్ణాటకకు 734, ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు పంపిణీ చేస్తూ 1976 మే 27న బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చిందనే అంశాన్ని సుప్రీం కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో కేంద్ర జల్ శక్తి శాఖ, కృష్ణాబోర్డు గుర్తుచేశాయి. ఉమ్మడి రాష్ట్రానికి చేసిన కేటాయింపుల్లో 1976కు ముందే పూర్తయిన ప్రాజెక్టులకు 749.16, ప్రతిపాదన దశలో ఉన్న జూరాలకు 17.84, శ్రీశైలం ఆవిరి నష్టాలకు 33 టీఎంసీల వాటా ఇచ్చిందని, పునరుత్పత్తి కింద 11 టీఎంసీలు కేటాయించిందని పేర్కొన్నాయి. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించుకున్న నీటిని పరిగణనలోకి తీసుకుని.. ఆంధ్రప్రదేశ్‌కు 512.04 టీఎంసీలు, తెలంగాణకు 298.96 టీఎంసీలను తాత్కాలిక ప్రాతిపదికన పంపిణీ చేసుకోవడానికి అంగీకరిస్తూ 2015 జూన్ 18–19న కేంద్ర జల్ శక్తిశాఖ సమక్షంలో రెండు రాష్ట్రాలు ఒప్పందం చేసుకున్నాయనే అంశాన్ని ఎత్తిచూపాయి. ఆ తర్వాత 2016–17లోనూ అదే పద్ధతిలో నీటిని పంపిణీ చేసుకున్నాయి. ఆ తర్వాత చిన్న వనరుల విభాగం, మళ్లించిన గోదావరి జలాలను మినహాయించి.. మిగతా నీటిలో ఏపీ 66 శాతం, తెలంగాణ 33 శాతం చొప్పున పంచుకుంటున్నాయనే అంశాన్ని పేర్కొంది. రెండు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాలను పంపిణీ చేయడానికి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ చేస్తోందని.. ఆ ట్రిబ్యునల్ అవార్డు వస్తేనే నీటి లెక్కలు తేలతాయని అఫిడవిట్‌లో కేంద్ర జల్ శక్తి శాఖ, కృష్ణా బోర్డు స్పష్టం చేశాయి. అంతర్ రాష్ట్ర నదీ వివాదాల చట్టం 1956 ప్రకారం బచావత్ ట్రిబ్యునల్ అవార్డు సుప్రీంకోర్టు డిక్రీతో సమానమని.. దాన్ని పునఃసమీక్షించే అధికారం ఎవరికీ లేదని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్నారు. స్పష్టం చేస్తున్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఏపీకి నీటిని పునఃపంపిణీ చేసే సమయంలో బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపుల జోలికి వెళ్లలేదని గుర్తుచేస్తున్నారు.

● తెలంగాణ

ట్రాక్టర్ తిరగబడి రైతు మృతి

కొండమల్లేపల్లి: పొలం దున్నుతుండగా ట్రాక్టర్ తిరగబడి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లాలో చోటు చేసుకుంది. కొండమల్లేపల్లి మండలం దోనియాల గ్రామానికి చెందిన గుండాల సత్తయ్య, కొండమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. తమకున్న పది ఎకరాలలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమారుడు శ్రీనివాస్(29) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ పూర్తి చేసి, ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయపనులు చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం శ్రీనివాస్ ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా అది మట్టిలో దిగబడింది. ట్రాక్టర్‌ను బయటికి తీస్తుండగా ఒక్కసారిగా అది తిరగబడి శ్రీనివాస్‌పై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

రండి బాబూ.. రండి..!

- టీడీపీలో చేరినవారికి, చేర్పినవారికి ప్యాకేజీలు
- 'మంగళగిరి'లోకి లోకేశ్ పాదయాత్ర ప్రవేశిస్తున్న సందర్భంగా అధినేత ఆఫర్
- గ్రామాల వారీగా నేతలకు టార్గెట్లు
- లోకేశ్ సమక్షంలో ఇప్పటికే రెండు సార్లు పార్టీలో చేరామంటున్న పలువురు
- మరోసారి పార్టీలో చేరితే డబ్బులు, మద్యం, బిర్యానీ ఇస్తామన్నారు..

మంగళగిరి: రండి బాబూ రండీ.. టీడీపీలో చేరండి.. ప్యాకేజీ పొందండి. పార్టీలో చేర్పేవారికి ఒక ప్యాకేజీ, చేరిన వారికి మరో ప్యాకేజీ.. ప్రస్తుతం మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ఈ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. వందమందిని చేర్పితే ఒక ప్యాకేజీ.. ఇంకా ఎక్కువ మందిని చేర్పితే మరో ప్యాకేజీ ఇచ్చి లోకేశ్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పించాలని టీడీపీ అధినేత ఆదేశాలతో నాయకులు హడలిపోతున్నారు. గత ఎన్నికలకు ముందు అమరావతి రాజధానిగా ప్రకటించగా నాయకులంతా పేదలు, ఎస్సీల భూములను దోచుకుని బాగానే తిన్నారుగా.. ఇప్పుడు ఖర్చు పెట్టాల్సిందే.. అంటూ చంద్రబాబు హుకుం జారీ చేసినట్టు తెలుస్తోంది. సోమవారం రాత్రి నియోజకవర్గంలోకి లోకేశ్ పాదయాత్ర ప్రవేశించనుంది. పాదయాత్ర ప్రవేశించిన రోజే భారీగా చేరికలుండాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మూడు వేల మందికి తక్కువ కాకుండా పార్టీలో చేర్చాలని హుకుం జారీ చేసినట్టు సమాచారం. గతంలో రత్నాలచెరువు ఎస్టీ కాలనీ నుంచి పలువురుకి డబ్బులిచ్చి పార్టీలో చేర్పి ఆర్థికంగా లబ్ధిపొందిన టీడీపీ లీగల్ అడ్వయిజర్‌తోపాటు, గతంలో టీడీపీ కార్యాలయంలో పనిచేసి తొలగింపునకు గురైన మరో కార్యకర్త.. మళ్లీ అవే ప్రయత్నాలు ప్రారంభించారు. మాజీ ఇన్‌చార్జి పోతినేని శ్రీనివాసరావుతో సహా పలువురు నాయకులు చేతులెత్తేయగా.. మరికొందరు నేతలకు టార్గెట్లు విధించడంతో ఇదెక్కడి ఖర్మరా.. అంటూ తలలుపట్టుకుంటున్నారు. యర్రబాలేనికి చెందిన ఇరువర్గాల నాయకులకు ఐదు వందల మందిని చేర్చాలని టార్గెట్ విధించగా, కురగల్లు, నిడమర్రు, బేతపూడి, పెదవడ్లపూడి నాయకులకు అదే విధంగా టార్గెట్లు పెట్టినట్టు తెలిసింది. ఎస్టీ కాలనీకి చెందిన పలువురు మాట్లాడుతూ ఇప్పటికే తాము లోకేశ్‌తో రెండు సార్లు పార్టీ కండువాలు కప్పించుకున్నామని.. ఇందుకుగాను తమకు డబ్బులిచ్చారని, మళ్లీ ఆదివారం ఉదయం టీడీపీ నాయకులు వచ్చి పార్టీలో చేరాలని కోరినట్టు చెప్పారు. కాలనీ నుంచి సుమారు 150 మందికి రూ.వెయ్యి, బిర్యానీ, మద్యం ఆదివారం రాత్రికి పంపుతామన్నారని తెలిపారు. కృష్ణాయపాలెం నుంచి గతంలో ఎస్సీ, ఎస్టీ కేసులు ఎదుర్కొన్న వారిని రైతులుగా చూపి వారినీ పార్టీలో చేర్చుకోవడంతో పాటు, ఎమ్మెల్యే ఆర్కే, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ఎస్సీలతో మాట్లాడించేందుకు శిక్షణ ఇస్తున్నారని స్థానికులు చెప్పడం విశేషం.

బతుకు బాట.. బాధ్యతల మూట!



వేరుశనగలను ఉడకబెడుతున్న మహిళ

కర్నూలు నగర శివారులోని దూపాడుకు చెందిన మల్లీశ్వరి 9వ తరగతి వరకు చదువుకుని మధ్యలోనే చదువు మానేసింది. భర్త పేరు శ్రీహరి. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఇటీవలే వివాహమైంది. అయితే జీవితంలో స్థిరపడేందుకు భర్త చదువుపై దృష్టి సారించగా, ఈమె మాత్రం కుటుంబ పోషణ నిమిత్తం వేరుశనక్కాయలను విక్రయిస్తోంది.

దూపాడుకు చెందిన షారోమి భర్త శ్రీకాంత్ దివ్యాంగుడు. ఇతను బి.కాం కంప్యూటర్స్ పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. అయితే ఇంటి వద్ద ఊరికే ఉండలేక కూలి పనులకు వెళ్తున్నాడు. భర్త మాత్రమే కష్టపడితే ఇల్లు గడవటం కష్టమని భావించి ఈమె కూడా చెనిక్కాయల విక్రయానికి వెళ్తోంది.

అవకాశాలను అందిపుచ్చుకోవడంలోనే కాదు సృష్టించుకోవడంలోనూ మహిళలు ఎప్పుడూ ముందుంటారు. తన కాళ్లపై తాను నిలబడే ప్రయత్నం చేయడమే కాదు.. కుటుంబం కోసం ఎందాకైనా వెళ్లడం వీరికే సాధ్యం. భర్త కష్టపడుతున్నా.. పిల్లలకు బాధ కలిగినా ఆ ప్రాణం విలవిల్లాడుతుంది. ఇంటిని చక్కదిద్దుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తుంది. తన కడుపు కాలుతున్నా ఇంట్లో అందరి కడుపు చల్లగా ఉండాలని కోరుకుంటుంది. కష్టాలను పంటి బిగువన భరిస్తూ.. సంతోషాన్ని కుటుంబ సభ్యులందరికీ పంచుతుంది. తాను కరిగిపోతున్నా వెలుగులు పంచేందుకు తాపత్రయ పడుతుంది. నగరంలో వేరుశనక్కాయలను విక్రయించే మహిళలను చూస్తే వీళ్ల ఆడ..పిల్లలు కాదు ఇంటికి దీపాలనే విషయం ఇట్టే అర్థమవుతుంది. **– సాక్షి, కర్నూలు డెస్క్**



జీవనోపాధిగా చెనిక్కాయల విక్రయం

- ఉదయం 5 గంటలకే దినచర్య మొదలు
- ఇంటిని చక్కదిద్ది నగరంలోకి అడుగు
- చేతిలో 25 కిలోల బరువుతో రోజంతా కాలినడక
- సరుకు పూర్తయ్యే వరకు రోడ్లపైనే..
- పిల్లల చదువుకు అత్యంత ప్రాధాన్యం

ఆధునిక ప్రపంచంలో మహిళలు అవనిలోనే కాదు, ఆకాశంలోనూ సగభాగం కోరుకుంటున్న రోజులివి. ఉద్యోగం చేస్తున్న మహిళలు ఇంటి పనిలో భర్తలు కూడా భాగస్వాములు కావాలని కోరుకోవడం సహజం. నేను ఎందులో తక్కువని బేరీజు వేసుకుంటున్న తరుణంలో ఈ మహిళలు ఇంటి బాగోగులు చూసుకుంటూనే ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. ఉదయాన్నే 5 గంటలకు నిద్ర లేచి తమ దినచర్యను మొదలు పెడుతున్నారు. వేరుశనగ కాయలను ఉడకబెట్టేందుకు సుమారు రెండు మూడు గంటల సమయం పడుతుంది. ఈ పని 6 గంటల నుంచి ప్రారంభిస్తారు. ఒకవైపు ఇవి ఉడుకుతుండగానే.. పిల్లలను పాఠశాలలకు సిద్ధం చేయడం, కుటుంబ సభ్యులకు భోజనాలు సిద్ధం చేయడం చేస్తారు. ఆడపిల్లను బయటకు పంపాలంటే కూడా ఎక్కడ పోకిరీలు ఉంటారో, ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటుందేమోననే భయం కుటుంబ సభ్యుల్లో ఉంటుంది. అయితే ఈ మహిళల ప్రతి అడుగులోనూ ఆత్మస్థైర్యం కనిపిస్తుంది. ఉదయం నుంచి రాత్రి ఇంటికి చేరుకునే వరకు రోడ్ల మీదనే తిరుగుతూ విక్రయాలు త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో కనిపిస్తారు. కుటుంబ బాధ్యతలను భుజానికెత్తుకుంటే మహిళలు ఎలాంటి అవాంతరాలనైనా అధిగమిస్తారనేందుకు ఉదాహరణగా నిలుస్తున్నారు.

రోజంతా కాలి నడకనే..

సెల్‌ఫోన్ రాకతో ప్రపంచం అరచేతిలో ఇమిడిపోతోంది. ఏది కావాలన్నా ఇంటి నుంచే ఆర్డర్ పెట్టి తెప్పించుకోవడం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అడుగు తీసి అడుగు వేయాలన్నా బద్ధకమే. అత్యవసరమై బయటకు వెళ్లాల్సి వస్తే ద్విచక్ర వాహనం, లేదంటే కారు తప్పనిసరి. అలాంటిది ఈ మహిళలు ఉదయం లేచింది మొదలు, రాత్రి తిరిగి ఇంటికి చేరుకునే వరకు కాలి నడకన తిరుగుతూనే ఉంటున్నారు. ఆరోగ్యం పాడవుతుందని తెలిసి ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వెళ్లాల్సి వచ్చినా చాలా మంది నాలుగు అడుగులు వేసి చెమటలు కక్కుతుంటారు. అలాంటిది ఈ మహిళలు ఒక్క చోట నిల్చోకుండా తిరుగుతూనే ఉంటున్నారు.

సరుకు అయిపోయాకే ఇంటికి..

చిన్న పిల్లలను ఇంటి వద్దే వదిలేసి వెళ్తున్న ఈ మహిళలు తిరిగి ఇంటికి చేరుకునే సరికి సాయంకాలం దాటుతుంది. పాలు తాగే పిల్లలు ఎలా ఉన్నారోననే బెంగ ఒక వైపు వేధిస్తున్నా.. ఇంకో వైపు వెంట తీసుకెళ్లిన వేరుశనక్కాయలను ఎలాగైనా అమ్మేయాలనే తపన ఉంటుంది. ఒక్కో రోజు త్వరగానే కాయలు అమ్ముడుపోయినా, కొన్నిసార్లు మిగిలిపోతుంటాయని.. వాటిని పారేయాల్సి వస్తుందని చెబుతున్నారు. పిల్లలు పాఠశాలల నుంచి వచ్చే సమయానికి ఇళ్లు చేరుకోవాలనే ఆత్రుత ఉన్నా విక్రయాల మీదనే తాము ఇళ్లు చేరుకోవడం ఆధారపడి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చదువు విలువ తెలుసుకొని..



కుమార్తెను స్కూల్‌కు పంపుతూ..

కులంలో చదువుకున్న వాళ్లు చాలా తక్కువ. ఇప్పుడిప్పుడే చదువు విలువ తెలుసుకొని తాము కష్టపడినా తమ పిల్లలు విద్యాబుద్ధులు నేర్చుకోవాలని కోరుకుంటున్నారు. ఇందుకోసమే ఈ మహిళలు తమ ఒళ్లు హూనమవుతున్నా చెమటోడ్చి పిల్లల బంగారు భవితకు బాటలు వేస్తున్నారు. ఈ కోవలోనే పిల్లలను పాఠశాలకు సిద్ధం చేసిన తర్వాతే తమ జీవనోపాధికి బయలుదేరుతున్నారు. ఇలా కొందరు ఇప్పటికే డిగ్రీలు పూర్తి చేయగా, మరికొందరు తల్లిదండ్రుల కలను సాకారం చేసే దిశగా ప్రయత్నాల్లో ఉన్నారు. గతంలో ఆడపిల్లలకు చదువు ఎందుకని భావించినా, ఇప్పుడు ఆ విషయంలోనూ మార్పు వచ్చింది. మగపిల్లలతో సమానంగా ఆడ పిల్లలను కూడా చదివిస్తుండటంతో వీరిలోని మార్పును తెలియజేస్తుంది.



ఫొటోలు: డి.హుస్సేన్

ఉపాధి చూపిన వేరుశనగ అమ్మకాలు

సుమారు 30 ఏళ్ల కిందటి మాట. అప్పట్లో ఏ పని చేయాలో తెలియక వీరిలో చాలా మంది ముంబయికి వలస వెళ్లారు. అక్కడ కొద్ది మంది తోచిన పని చేసుకున్నా.. కొందరు వేరుశనక్కాయల విక్రయాన్ని ఉపాధిగా ఎంచుకున్నారు. వీరిలో ఒకరు రామరాజు. ఈయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. పిల్లలు పెద్దవారు అవుతుండటంతో తిరిగి సొంతూరుకు చేరుకున్నారు. ఇక్కడకు వచ్చినా ఏ పని చేయాలో తెలియక ముంబయిలో ఉపాధి చూపిన వేరుశనక్కాయలనే ఇక్కడ కూడా విక్రయించడం మొదలు పెట్టారు. పిల్లలకు కూడా ఇదే జీవనాధారంగా మారింది.

కడుపు నింపని కులవృత్తి

వీరి పూర్వీకులు వీధి నాటకాలు, తోలుబొమ్మలాటతో జీవనం సాగించారు. తదనంతరం తరాలు కూడా అదే బాటలో పయనించినా సినిమాలు, టీవీలు.. ఆ తర్వాత సీరియళ్లు పెరిగిపోవడంతో వీటికి ఆదరణ తగ్గిపోయింది. గతంలో పండగలు, పబ్బాల సమయంలోనూ.. తిరునాళ్లలో అప్పుడప్పుడు పిలిపించినా ఇప్పుడు ఆ ఊసే కరువైందంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నామని, ఒక్కరే కష్టపడితే ఇంటిల్లిపాదీ కూర్చొని తినే పరిస్థితి లేకపోవడంతో ఆడవాళ్లు కూడా రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు.

ఒంటిచేత్తో..

వేరుశనక్కాయలను విక్రయించడం అంటే మాటలు కాదనే విషయం ఈ మహిళల కష్టం చూస్తే అర్థమవుతుంది. ఒక్కొక్కరు రోజూ సుమారు 5 కేజీల వేరుశనక్కాయలను విక్రయానికి తీసుకెళ్తారు. అయితే ఉడకబెట్టినవి కావడంతో వీటి బరువు మరింత పెరుగుతుంది. వీటిని ఓ వెదురు బక్కెట్‌లో వేసుకొని ఒక్క చేత్తో వేసుకొని తిరుగుతూ విక్రయిస్తారు. సుమారు 25 కేజీల బరువును ఒకే చేతితో మార్చు చేసుకుంటూ కాలి నడకనే తిరుగుతుంటారు. అలా తీసుకొచ్చిన వేరుశనక్కాయలు అమ్ముడుపోయే వరకు వీళ్ల కాలి నడకన తిరుగుతూనే ఉండటం కుటుంబం పట్ల ఆ మహిళలకు ఉన్న బాధ్యతకు నిదర్శనం. రోజంతా కష్టపడితే సుమారు రూ.500 వస్తుందని, అన్ని ఖర్చులు పోను రూ.200 నుంచి రూ.250 వరకు మిగులుతుందని చెబుతున్నారు.

ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతంలో..

దూపాడు గ్రామంలో వేరుశనక్కాయలు విక్రయించే మహిళలు సుమారు 30 మందికి పైనే ఉంటారు. మరికొందరు మహిళలు పర్సులు, ఇతరత్రాలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. అయితే ఎవరు ఏ ప్రాంతంలో విక్రయించాలనే విషయమై వీరు ముందుగానే చర్చించుకుంటారు. ఆ ప్రాంతంలో వారు మాత్రమే విక్రయాలు చేపడతారు. మరొకరు ఆ ప్రాంతానికి వెళ్లరు. నిర్ణీత ప్రాంతంలో ఆ మహిళ కాలి నడకన తిరుగుతూనే కనిపించిన వారందరినీ వేరుశనక్కాయలు కొనుక్కునే దిశగా వేడుకోవడం కనిపిస్తుంది.

చిత్రమైన పెళ్లి తంతు



ఈ కుటుంబాలు గతంలో మహారాష్ట్రలో ఉండగా అక్కడ విచిత్రమైన పెళ్లి తంతు జరిగేది. ఆడపిల్ల పుట్టగానే పళ్లెంలో పెట్టి ఎవరింటికైతే కోడలిగా వెళ్లాలి అనుకుంటారో వాళ్లకు ఇచ్చేస్తారు. పాపకు ఆరు నెలల వయస్సు రాగానే మెట్టినింటికి పంపేస్తారు. ఇప్పటికీ ఇలాంటి సంప్రదాయం మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో కొనసాగుతోంది. ఇదే కోవలో వీరి ఇళ్లలోనూ కొందరికి అప్పట్లో పెళ్లిళ్లు జరిగినా, ఆ తర్వాత కలిగే నష్టాలను తెలుసుకొని ఇప్పుడిప్పుడే ఆధునిక ప్రపంచానికి అనుగుణంగా వివాహాలను జరిపిస్తున్నారు. అయితే ఇప్పుడు కూడా కొందరు ఐదు సంవత్సరాల వయస్సులో ఏ అమ్మాయిని, ఏ అబ్బాయితో వివాహం చేయాలనే విషయమై నిశ్చయం చేసుకుంటున్నారు. బంధువుల మధ్య జరిగే ఈ ఒప్పందం ముగిసిన తర్వాత ఆకులు పంచుకోవడం, ఆ తర్వాత టీ తాగడంతో ఒప్పందం చేసుకున్నట్లవుతుంది. పెళ్లి మాత్రం ఇద్దరికీ వివాహ వయస్సు పూర్తయ్యాకే చేస్తున్నారు.



సూర్యుడు మురికిగుంటల్లో కూడా ప్రకాశిస్తాడు.
అయినా కలుషితం కాడు.
– డైయొజినీజ్

సాక్షి

సోమవారం, 14 ఆగస్టు 2023

అరచేతిలో స్వతంత్రం

ఒక్కోసారి చేతిలో ఖాళీ ఉంటుంది. కానీ ఆ ఖాళీకి సార్థకత తెచ్చేలా చేయగలిగిందేమీ తోచదు. అప్పుడు ఆడుకోవడానికి ఆన్‌లైన్ అనేది మంచి గేమ్. అందరినీ వ్యసనపరులను చేసే ఆన్‌లైన్ గేమ్స్ గురించి కాదు; ఆన్‌లైన్‌తోనే ఆడుకోవడం! దీనికి గూగుల్, వికీపీడియా, యూట్యూబ్, ట్విట్టర్ లాంటివన్నీ పనిముట్లు. ఒకదాన్లోంచి ఇంకోదాన్లోకి గెంతుతూ, కొత్త విషయాలకు ద్వారాలు తెరుచుకుంటూ వెళ్లడం సరదాగా ఉంటుంది. మామూలుగా అయితే ఇలాంటి విషయాలను తెలుసుకోవడానికి గ్రంథాలయాలను చుట్టేయాలి. అంత శ్రమ లేకుండా మన అరచేతిలోనే ఆ భాండాగారం ఉంది.

ఎక్కడినుంచి మొదలు పెట్టాలనే సమస్య అయితే ఉంటుంది. ఇది వ్యక్తిగత ఎంపిక. ఉదాహరణకు ప్రపంచ సినిమాను ఇష్టపడే ఏ స్నేహితుడో ఈ పేరును డ్రాప్ చేసివుంటాడని అనుకుందాం: 'హిరోషిమా మాన్ అమూర్'. ఈ ఒక్క హింటు మీదే ఎన్నో విషయాలు పోగేయవచ్చు. హిరోషిమా అంటే అర్థమౌతోంది; తర్వాతి పదాలు? గూగుల్ ఎందుకుంది? మాన్ అంటే ఫ్రెంచ్‌లో 'నా'. అమూర్ అంటే ప్రేమ. రెండో ప్రపంచ యుద్ధపు బీభత్సాన్ని చిత్రించిన సినిమా ఇది. కానీ ఆ బీభత్సం కథాకాలానికి సుదూర గతం. యుద్ధం మనుషుల మనసుల్లో ఎంత లోతైన గాయాలను చేసిందో జ్ఞాపకాల తలపోత ద్వారా చెప్పిన సినిమా. దీర్ఘ కవిత లాంటి సినిమా. పేరు లేని అతడు, ఆమె జరిపే ఏకాంత సంభాషణ. ఇదంతా సినిమా చూస్తే అర్థమౌతుంది. సినిమాకు బయటి సంగతులు?

ప్రపంచ సినిమా గతిని మార్చిన 'న్యూ ఫ్రెంచ్ వేవ్'కు ఈ సినిమా ఒక శక్తిమంతమైన చేర్పు. 1959లో వచ్చింది. ఈ వేవ్‌లో శిఖరంగా చెప్పే 'బ్రెత్‌లెస్' కంటే ఏడాది ముందే విడుదలైందని తెలియడం అదనపు విశేషం. ఇదొక ఫ్రెంచ్–జపనీస్ ఉమ్మడి నిర్మాణం. తగినట్టుగానే 'ఆమె' ఫ్రెంచ్ నటి, 'అతడు' జపనీస్ నటుడు. ఎమాన్యుయెల్ రివా, ఎయిజీ ఒకాడా. వీళ్ల విశేషాలేమిటి? రివా సరిగ్గా తొంభై ఏళ్లు బతికి 2017లో చనిపోయింది. ఆమె కవయిత్రి, ఫొటోగ్రాఫర్. ఇంకా చాంటెయూజ్. అంటే బార్ లేదా స్టేజ్ మీద పాడే నైట్‌క్లబ్ సింగర్. వీటన్నింటికంటే ఆకట్టుకునే విశేషం, ఆమె మరో సుప్రసిద్ధ సినిమా– 'అమూర్'. రెండిట్లోనూ ప్రేమ ఉంది చూశారా? అది విదేశీ భాషా చిత్రం విభాగంలో 2012లో ఆస్కార్ గెలుచుకున్న ఫ్రెంచ్ సినిమా. ఈమెను ఇక్కడ వదిలేసి 'అతడి' దగ్గరికి వెళ్తే– ఓహో! ఈ ఎయిజీ ఒకాడా 1964లో వచ్చిన జపనీస్ కల్ట్ సినిమా 'వుమన్ ఇన్ ద డ్యూన్స్'లో హీరోనట! అందుకేనా ఆ రెండింట్లోనూ ఒకే రకమైన మగటిమి నవ్వు ఉంటుంది! ఇలాంటి నవ్వు బహుశా యూకియో మిషిమా ఇష్టపడతాడు. ఈయనెందుకు వచ్చాడు మధ్యలో? అదే 1960ల్లో ఆయన్ని సాహిత్యంలో నోబెల్ పురస్కారం వరిస్తుందనుకున్నారు. కండలు తీరి మంచి దేహదారుఢ్యంతో ఉండే మిషిమా వేషధారణ, జీవనశైలి ఒక యోధుడిని తలపించేది. జపనీస్ సాహిత్యం 'సుకుమార హృదయ' సంబంధి అనీ, దాన్ని తాను 'మగటిమి' దిశగా లాక్కెళ్తున్నాననీ అనేవాడు.

ఇంతకీ మనం దర్శకుడి గురించి వాకబు చేయనేలేదు. ఆయన పేరును ఫ్రెంచ్ ఉచ్చారణలో అలె రెనీ అనాలట. ఈ రెనీకి సంబంధించిన విశేషాలేమిటి? 1922లో జన్మించాడు. అంటే పోయినేడాదే శతజయంతి ఉత్సవాలు ముగిశాయి. దీనికంటే ముఖ్యమైనది, ప్రపంచ మేటి డాక్యుమెంటరీల్లో ఒకటిగా చెప్పే 'నైట్ అండ్ ఫాగ్'కు దర్శకత్వం వహించడం! 1956లో వచ్చిన ఈ డాక్యుమెంటరీ నాజీ కాన్సంట్రేషన్ క్యాంపుల్లో శవాల గుట్టలుగా మిగిలిన యూదుల దయనీయ గాథను కడుపులో తిప్పేంత దగ్గరగా చూపుతుంది. ఏ హేతువుకూ అందని దుర్మార్గం దాని పరాకాష్ఠకు చేరినప్పుడు మనిషనేవాడు కేవలం శవాల గుట్టల్లో కొన్ని గుర్తుపట్టని ఎముకలుగా మాత్రమే మిగిలిపోయే అత్యున్నత విషాదాన్ని చిత్రిస్తుంది. దర్శకుడిని వదిలేసి, ఆ సినిమాకు రచయితగా ఎవరు చేశారో చూద్దాం. మార్గ్యురైట్ డురాస్. ఈమె ఫ్రెంచ్ రచయిత్రి.

'ఫిడెలిటీ'(పాతివ్రత్య) భావాల పట్ల భిన్నాభిప్రాయాలు ఉన్నావిడ అని తెలియడం ఈమెకు సంబంధించి కొట్టొచ్చినట్టు కనబడే విశేషం. ఈమె కొన్ని సినిమాలకు దర్శకత్వం కూడా వహించారు. ఆ జాబితాలో ఏమైనా ఉండనీ, 'ఇండియన్ సాంగ్' అనే పేరున్న సినిమాకు దర్శకత్వం వహించారని తెలియడం భారతీయ మెదడును ఆకర్షిస్తుంది. ఆమె భావాలకు తగినట్టే భారత్‌లో ఫ్రెంచ్ రాయబారి భార్య తాలూకు వ్యక్తిగత సంబంధాల నేపథ్యంలో సాగుతుంది. గొప్ప సినిమా ఏం కాదని విమర్శకులు చెబుతున్నారు, కానీ దీనికి సీక్వెల్ కూడా వచ్చింది.

ఎటూ ఆటను హిరోషిమాతో మొదలుపెట్టాం కాబట్టి, మళ్లీ అక్కడికే వద్దాం. ఆ మహా విషాదాన్ని గుర్తుచేస్తూ ఇటీవలే 'ఒపెన్‌హైమర్' సినిమా వచ్చింది. అణుబాంబు పితగా అపఖ్యాతి పొందిన రాబర్ట్ ఒపెన్‌హైమర్ నేతృత్వంలో తయారుచేసిన బాంబులనే హిరోషిమా, నాగసాకి నగరాల మీద వరుసగా 1945 ఆగస్ట్ 6, 9 తేదీల్లో వదిలింది అమెరికా. మరింత ఘోర చేదు వాస్తవం ఏమిటంటే, జపాన్‌ను లొంగదీసుకోవడం కోసం అమెరికా ఈ బాంబులు వేయలేదు; అప్పటికే జపాన్ ఓటమి అంచున ఉంది. కేవలం తన అణుపాటవ శక్తిని ప్రపంచానికి చాటడం కోసం ఈ బాంబుల్ని జారవిడిచింది. దీనివల్ల సుమారు మూడున్నర లక్షల మంది క్షణాల్లో బూడిదయ్యారు. లక్షల మంది ఏళ్లకేళ్లు దాని పర్యవసానాలు అనుభవించారు.

మూలమూలల్లోని సమాచారం ఎవరికైనా ఎప్పుడైనా అందుబాటులో ఉండటమే ఈ ఆధునిక కాలంలో నిజమైన స్వతంత్రం. ఆ ఉన్న సమాచారంతో ఏం చేస్తామనేది మన వివేకం!

రాజపుత్రుల చిత్ర విచిత్రాలు

కామెంట్



కరణ్ థాపర్

రాజకోట రహస్యాలు ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తాయి. పూర్వపు చక్రవర్తుల విపరీత మనస్తత్వాలు, విచారకర గుణాలు, దోషాలు, చిన్నపాటి పాపాలు, మహాపరాధాలు, చిలిపి చేష్టలు, సిగ్గుపడవలసిన ప్రవర్తనలు, వారి అపకీర్తుల గురించి ఎప్పుడో దివాన్ జర్‌మనీ దాస్ ఆసక్తికరంగా రాశారు. అందులో ఉన్నవన్నీ, ఒకవేళ అవి నిజమే అయినా, నమ్మశక్యంగా లేనివి! అయితే భారత రాజపుత్రుల లాగానే పాకిస్తాన్ రాజపుత్రులు కూడా ఉండేవారా? వారికీ వీరికీ ఏమాత్రం తేడా లేదని వెల్లడిస్తుంది 'డీథ్రోన్డ్' పుస్తకం. భారత చరిత్ర మీద పరిశోధించిన ఆస్ట్రేలియా రచయిత జాన్ జుబ్రిచికీ రాసిన ఈ పుస్తకం ఎన్నో వింత సంగతులను వెల్లడిస్తుంది.

రాజకోట రహస్యాలు నన్ను అమితంగా సమ్మోహన పరుస్తాయి. పూర్వపు చక్రవర్తుల విపరీత మనస్తత్వాలు, విచారకర గుణాలు, దోషాలు, చిన్నపాటి పాపాలు, మహాపరాధాలు, చిలిపి చేష్టలు, సిగ్గుపడవలసిన ప్రవర్తనలు, వారి అపకీర్తుల పట్ల నాలో ఆసక్తి జనించడానికి కారణమైనవారు మహారాజా దివాన్ జర్‌మనీ దాస్. నేను కౌమార ప్రాయంలో ఉండగా తొలిసారి ఆయన పుస్తకం చదువుతూ వదల్లేకపోయాను. అందులో ఉన్నవన్నీ, ఒకవేళ అవి నిజమే అయినా, నమ్మశక్యంగా లేనివి! ఉదాహరణకు పటియాలా మహారాజులలో ఒకరు తమ రాచ ఠీవికి చిహ్నంగా స్తంభించిన తమ పురుషాంగాన్ని పురవీధులలో ప్రదర్శించుకుంటూ ఊరేగింపుగా ముందుకు సాగిపోయేవారట. ఉక్కపోతల వేసవి రాత్రులలో ఆయన మహారాణులు, ఉంపుడుగత్తెలు అంతఃపుర కొలనులో తేలియాడే భారీ మంచు దిబ్బలపై శృంగార నాట్య విన్యాసాలతో విహరించేవారట. పాకిస్తాన్ వైపున ఉన్న రాజ కుటుంబీకులు కూడా ఇలానే ఉండేవారా, లేకుంటే ఇందుకు భిన్నంగానా అని అప్పుడు నాకొక ఆశ్చర్యంతో కూడిన సందేహం కలిగేది.

అర్ధ శతాబ్దం తర్వాత ఇప్పుడు, ఆనాటి నా ఆశ్చర్యంతో కూడిన సందేహం జాన్ జుబ్రిచికీ పుస్తకం 'డీథ్రోన్డ్'తో నివృత్తి జరిగింది. వారికీ వీరికీ ఏమాత్రం తేడా లేదు. కాబట్టి వారి చిత్ర విచిత్రాలతో ఈ ఉదయం నన్ను మీకు వేడుకను చేయనివ్వండి.

నాల్గవ సాదిఖ్ ముహమ్మద్ ఖాన్... బహావల్‌పూర్ నవాబు. ఆయన తన మూలాలు ముహమ్మద్ ప్రవక్త సంతతిలో ఉన్నాయని చెప్పు కొంటారు. అయితే ఆయన బూట్లు, ప్యాంట్లు, సుతిమెత్తని నూలు గుడ్డతో నేసిన మందపాటి చొక్కాలు ధరించి రాజప్రాసాద క్రికెట్ మైదానంలో కనిపిస్తూ తనకు గల ఆ ప్రత్యేక ఐరోపా క్రీడా వస్త్రధారణ అభిరుచుల పట్ల గర్వభూయిష్టంగా ఉండేవారని జుబ్రిచికీ రాశారు.

''మహా ధన సంపన్నుడై, తెల్లజాతి మగువల పట్ల అమిత మక్కువను కలిగిన ఈ నవాబు (ఆయన భార్యలలో ముగ్గురు యూరోపియన్‌లు) 1882లో అత్యంత గోప్యంగా పర్షియాలో ప్రసిద్ధి చెందిన 'లా మేజన్ క్రిస్టోఫ్లా' గృహ సామగ్రి సంస్థ నుంచి ఖరీదైన కలప మంచాన్ని 290 కిలోల నాణ్యమైన వెండి అలంకరణలతో తన అభీష్టానికి అనుగుణంగా తయారు చేయించుకున్నారు. మంచానికి నలువైపులా మంచంకోళ్ల స్థానంలో సహజమైన జుట్టు; కదలిక కలిగిన కళ్లూ, చేతులూ; ఆ చేతులతో విసనకర్రలు, గుర్రపు తోకలు పట్టుకుని ఉన్న నగ్న స్త్రీల జీవమెత్తు కాంస్య విగ్రహాలు ఉండేవి. ఆ నలుగురు



మీర్ అలీ నవాజ్ ఖాన్



జాన్ జుబ్రిచికీ

నగ్న స్త్రీలు ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ, గ్రీసు దేశాలకు ప్రాతినిధ్యం వహించేవారు. యంత్ర శక్తి కలిగిన ఆ మంచం ... నవాబు ఆదేశాలను అనుసరించి ఆ నగ్న దేహాలలో చలనం తెప్పించేది. ఫ్రెంచి సంగీతకారుడు గునోద్ సృష్టించిన ప్రఖ్యాత సంగీత రూపకం 'ఫౌస్ట్' తన ముప్పై నిముషాల నిడివిని పూర్తి చేస్తుండగా మాగన్నుగా పడుతున్న నిద్రలో నవాబు సరసంగా కన్ను గీటగానే ఆ నగ్న యువతుల హస్తాలలోని విసన కర్రలు మెల్లగా వీచడం మొదలయ్యేది. అందుకు తగిన సాంకేతికత ఆ చెక్క మంచం లోపల ఉండేది'' అని జుబ్రిచికీ వర్ణించారు.

సింధ్‌లోని ఖైర్‌పూర్‌లో ఇద్దరు పాలకులు కూడా జుబ్రిచికీ దృష్టిని ఆకర్షించారు. వారిలో ఒకరు విపరీతమైన ఊబకాయం కలిగిన మీర్ అలీ నవాజ్ ఖాన్. ''అమెరికన్ జర్నలిస్ట్ వెబ్ మిల్లర్ 1930లో సిమ్లాలోని సిసిల్ హోటల్‌లో మీర్ అలీని కలిశారు. మీర్ అలీ భోజనం చేస్తున్న సమయంలో ఆయన నోటికి, చేతికి మధ్య గల ప్రయాణ మార్గంలో పులుసు ఒలికి ఆయన భారీ ఉదరం అంతటా చిందిపడింది'' అని 'డీథ్రోన్డ్'లో మీర్ అలీని గుర్తు చేసుకున్నారు జుబ్రిచికీ.

మీర్ అలీ నవాజ్ ఖాన్ కుమారుడు ఫైజ్ ముహమ్మద్ ఖాన్‌కు స్కిజోఫ్రెనియా గానీ, లేదంటే ఏదైనా చిన్న మనోవైకల్యం గానీ ఉండి ఉండాలి. ''అనుకోకుండా తన తొమ్మిది నెలల కుమారుడిని తుపాకీతో కాల్చినప్పుడు తొలిసారి ఆయన మానసిక స్థితి సందేహాస్పదం అయింది. బులెట్ శిశువు కడుపులోంచి ఊపిరి తిత్తులలోకి దూసుకెళ్లి కుడి భుజం నుంచి బయటికి వచ్చేసింది.'' నమ్మలేని విధంగా బాలుడు బతికి, తండ్రి మరణానంతరం ఆయనకు వారసుడయ్యాడు.

పాకిస్తాన్‌కు వాయవ్య దిశలో ఉంటుంది దిర్. 1947లో ఆ ప్రాంతానికి పాలకుడు నవాబ్ షా జహాన్. రచయిత జుబ్రిచికీ ఆ ప్రాంతాన్ని 'ఒక నిలువనీటి కయ్య' అంటాడు. ''అక్కడ ఆసుపత్రి పడకల కంటే నవాబు వేటకుక్కల కోసం కట్టిన గృహాలే ఎక్కువగా ఉంటాయి. పాఠశాలలను నిర్మించడానికి ఆయన నిరాకరించాడు. చదువు ఎక్కువైతే తన పాలనను అంతం చేస్తుందని ఆయన నమ్మాడు'' అని రాశారు జుబ్రిచికీ.

కలాత్ అనేది పాకిస్తాన్‌లోని ఒక సమస్యాత్మక ప్రాంతం. ఆ ప్రాంతం కథ మన హైదరాబాద్, కశ్మీర్‌లకు పోలిక లేనిదేమీ కాదు. ఆ వివరాలను మీరు గూగుల్‌లో, వికీపీడియాలో వెతికి తెలుసుకోవచ్చు. కలాత్ నవాబు ఖాన్ తన రాష్ట్ర విలీనానికి సంబంధించిన సంప్రతింపుల కోసం పాకిస్తాన్ గవర్నర్ జనరల్ ముహమ్మద్ అలీ జిన్నాను కలిసినప్పుడు ఏం జరిగిందనేది మాత్రం నేను వివరిస్తాను.

కశ్మీర్‌లో మాదిరిగానే 1947 ఆగస్టు తర్వాత కలాత్‌లో స్వాతంత్ర్య సంస్థాపన జరిగింది. ఆశ్చర్యకరంగా, ''కరాచీలో ఒక రాయబారిని నియమించుకోడానికీ, ఆకుపచ్చ రంగు గుడ్డపై ఎరుపు రంగు 'పవిత్ర యుద్ధ' ఖడ్గం ఉన్న బలూచీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేందుకూ కలాత్ ప్రాంతానికి అనుమతి లభించింది.'' కలాత్ విదేశాంగ మంత్రిగా ఐ.సి.ఎస్. అధికారి డగ్లాస్ ఫెల్ నియమితులయ్యారు. ఫెల్ తన జ్ఞాపకాలలో... కలాత్ నవాబు – జిన్నాల మధ్య సమావేశం తిన్నగా సాగకపోవడంపై ఇచ్చిన వివరణను జుబ్రిచికీ పుస్తకంలో చదువుతున్నప్పుడు పొట్ట చెక్కలయ్యేంతగా నేను నవ్వేశాను.

''కలాత్ నవాబు ఖాన్ అనర్గళమైన ఉర్దూలో గంభీరంగా మాట్లాడుతున్నారు. జిన్నా కూడా అంతే అనర్గళంగా, గంభీరంగా ఇంగ్లిషులో మాట్లాడుతున్నారు. జిన్నాను ఒప్పిస్తున్నానని ఖాన్, ఖాన్‌ని ఒప్పిస్తున్నానని జిన్నా అత్యంత ఆత్మవిశ్వాసంతో చర్చల్ని నడిపిస్తున్నారు. అయితే పాకిస్తాన్ విదేశాంగ కార్యదర్శి గమనించినదేమిటంటే ఒకరు మాట్లాడుతున్నది ఒకరికి ఒక్క ముక్కా అర్థం కావడం లేదని...'' అని రాశారు జుబ్రిచికీ. ఆ విదేశాంగ కార్యదర్శి మొహమ్మద్ ఇక్రముల్లా మన మాజీ ఉపరాష్ట్రపతి, భారత ప్రధాన న్యాయమూర్తి మొహమ్మద్ హిదయతుల్లాకు సోదరుడు. ఇక్రముల్లా జోర్డాన్ యువ రాణి సర్వత్ తండ్రి. నిజమైన రాజవంశీకుడైన ఏకైక పాకిస్తానీ, నాకు ప్రియమైన స్నేహితుడు కూడా!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నో డాక్టర్!



నేనొక వైద్యుడిని. నా వ్యక్తిగత ఆరోగ్య లక్ష్యం ఏమిటంటే, ఏ ఒక్క వైద్యుడి దగ్గరికి కూడా వెళ్లకుండా ఉండటం! మీరు కూడా దాన్నే లక్ష్యంగా చేసుకోవడాన్ని ప్రోత్సహిస్తాను.

– బ్రాండన్ పెట్కే, వైద్యుడు

వెనక్కి తిప్పుతున్నారు



కరెన్సీ మొత్తంలో 86 శాతపు నోట్ల 'చలామణీ రద్దు' చేయడం వల్ల ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా ఎన్నో ఏళ్లు వెనక్కి వెళ్లింది. ఇప్పుడు మళ్లీ ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్టుల 'చలామణీ రద్దు' చేయడం వల్ల న్యాయవ్యవస్థ పదేళ్లు వెనక్కి వెళ్తుంది.

– సందీప్ మనుధానే, విద్యావేత్త

కాల మహిమ



కృషితో పనిలేదని చెప్పనుగానీ, విధి మరింత బలమైనది. నేను పార్ట్‌టైమ్ ఎంబీయే చేస్తున్నప్పుడు ఒక్క రూపాయి బస్సు ఛార్జీ మిగల్చడం కోసం ప్రతిరోజూ పది కిలోమీటర్లు ఆకలితో నడిచేవాడిని. ఈమధ్య యూరప్ టూరులో ఒకే రోజు మూడు దేశాల్లో తినేట్టు... బ్రేక్‌ఫాస్ట్ ఇటలీలో, లంచ్ ఆస్ట్రియాలో, డిన్నర్ జర్మనీలో చేసేట్టు షెడ్యూల్ కుదిరింది.

– డి. ముత్తుకృష్ణన్, ఇన్వెస్టర్

భావాలు రుద్దకూడదు



ఆధునిక సమాజాలతో మతాలు సహజీవనం ఎప్పుడు చేయగలుగుతాయంటే – మతాలు పవిత్రమైనవిగా భావించేవాటిని ఎవరైనా అలా చూడకపోతే వారిని భయపెట్టనప్పుడు!

– అలీ మాలిక్, యాక్టివిస్ట్

ఇదే సమయం



న్యాయవ్యవస్థలో వలసవాదాన్ని అంతం చేయడానికి ఇదే సమయం. బ్రిటిష్ చట్టాలను అనుసరించడం, న్యాయసంబంధ ప్రేరణ కోసం హార్వర్డ్ వైపు చూడటం వలసవాద ఆలోచనా ధోరణికి తార్కాణం.

– డేవిడ్ ఫ్రాలే, వేదాచార్యుడు

శ్రమతోనే జయం



గెలవడానికి కఠిన శ్రమ మాత్రమే మార్గమని ప్రతి ఒక్కరూ అంగీకరించే చిట్టచివరి అంశాల్లో క్రీడలు ఒకటి. సమాజంలో అథ్లెట్లు అతి ముఖ్య భాగం అనడానికి ఉన్న ఎన్నో కారణాల్లో ఇదీ ఒకటి.

– మైక్ స్పీజర్, వెంచర్ క్యాపిటలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

గోరుముద్దలు తినిపించవా!

బారెడు పొద్దెక్కింది / లే, ముఖం కడుక్కో, పాలుత్రాగు
నీళ్ళోసుకుని చదువుకో / మంగళ గీతికలా వినబడేది
పొద్దున్నే అమ్మగొంతు!
ఇప్పుడు పొద్దు పొడుస్తుందంటేనే భయం
వార్డెన్ తిట్టే తిట్లని / వీపు ఛళ్ళుమనే శబ్దాలకి
సుప్రభాతాలు దుర్భర ప్రభాతాలౌతున్నాయి
చలికి కాదు, దెబ్బలకి వణుకుతూ / పరుగులు పెడితే, అక్కడంతా
పాచిముఖాల జాతర / చాలీచాలని నీళ్ళతో బాత్రూమ్‌ల యాతన
తరగతి గదిలో తీరు ఇంకో రకం
అర్థంకాని పాఠాలతో తలనెప్పి ఒక ప్రక్క
ఏ పెచ్చు ఎప్పుడు ఊడి / నెత్తిన పడుతుందోనని భయం మరో ప్రక్క
అర్థం అయ్యేలా పాఠం చెప్పలేని సారు
తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు
బెత్తాన్ని ప్రయోగిస్తుంటాడు
అందుకే ఆదివారం కోసం / అంతగా ఎదురుచూస్తాను
అరగంటైనా చాలు / నీ ఒడిలో ఆదమరచి నిద్రపోతాను
తలకి ఇంత నూనె వ్రాసి / తల దువ్వి జడ వేసినప్పుడు
వెంట తెచ్చినవేవో / మురిపెంగా నువ్వు తినిపిస్తున్నప్పుడు
నేను కొత్తగా పుట్టినట్లుంటుందమ్మా!

అమ్మా! ఓ ఆశల విత్తనాన్ని
నువ్వు నాటింది వసతి వాసంలో కాదు
ఇనుపగోడలతో కట్టిన రాక్షస గృహంలో
నా ఆక్రోశాన్ని వెళ్ళబోసుకుంటే
నీకు గుండె కోతను మిగిల్చినదాననౌతాను
అందుకే చెప్పకోలేని / ఈ ఊసులన్నీ నీకడకొంగుకు ముడివేస్తున్నాను
ఇంటికెళ్ళి ఒక్కసారి ముడివిప్పి విను
ఈ పంజరం నుంచి నన్ను విడుదల చేసి చూడు
రివ్వున ఆకాశానికి ఎగురుతాను
మేఘాల పలకపైన నీ ఆశలను అక్షరీకరిస్తాను!
అమ్మా! నీ కలకు
నేను సాకార రూపమై నిలుస్తాను!

– మద్దాళి రఘురామ్ । 9866057777

(ఓ హాస్టల్ బాలిక ఆవేదన. 31 జూలై నాటి 'సాక్షి' సంపాదకీయం స్ఫూర్తితో)

సారాంశం

సరికొండ చలపతి

నడిసంద్రంలో 'నౌక'రీ..!

ఫ్లయింగ్ కిస్

ఇది మనం మాట్లాడుకునే అంశానికి సంబంధించింది కాదు... అయినా ఓసారి! మన సమాజంలో యాభై దాటితే వృద్ధులు, అరవై దాటాక రిటైర్ కావల్సిన వారు అని అంటారు కానీ రాజకీయాలకు మాత్రం ఇదే అనువైన వయస్సు. **యాభైకి దగ్గరవుతున్న యువనేతలు ఫ్లయింగ్ కిస్‌లు కూడా విసరొచ్చు. దానికి తగ్గ హుషారు వయస్సే అది.**

వైన్ గ్లాస్... మిడిల్ ఏజ్ బ్లూస్!

ఇది కూడా మన టాపిక్‌కు కాసింత దూరమే అయినా మిడిల్ ఏజ్ కదా సరదాగా! ఓ 80 ఏళ్ల వృద్ధుడు జనరల్ చెకప్ కోసం డాక్టర్ దగ్గరకు వెళ్లాడు. అతని ఆరోగ్యమూ, సరదా చూసి డాక్టర్ ఆశ్చర్యపోయాడు

ఆ డాక్టర్ నడివయస్సులో ఉన్నాడు. కావల్సినంత బీఎమ్ఐ, ఉన్నంతలో మాంచి బీపీతో అప్పడప్పుడే ఆరోగ్యం అలారం మోగిస్తోంది.

'మీ ఆరోగ్య రహస్యం ఏమిటి....?' – వృద్ధుడిని ఆసక్తిగా డాక్టర్ అడిగాడు.

'నేను సూర్యుడు ఉదయించక ముందే లేచి సైకిల్ తొక్కడానికి బయటకు వెళ్లి, తిరిగి వచ్చి రెండు గ్లాసుల వైన్ తాగుతాను!

బహుశా ఇదే నా 'ఆరోగ్య రహస్యం.'

'సరే, అయితే మీ నాన్నగారు చనిపోయే నాటికి ఆయన వయస్సు ఎంత?'

'నాన్న చనిపోయారని మీకు ఎవరు చెప్పారు?'

'మీకే 80 ఏళ్లు, మీ నాన్న ఇంకా బతికే ఉన్నారా ..ఇంతకీ అతని వయసు ఇప్పుడు ఎంత....?

– ఆశ్చర్యంగా, ఆసక్తిగా డాక్టర్.

'అతనికి 102 సంవత్సరాలు, ఈ ఉదయం నాతో సైకిల్ తొక్కాడు, ఆపై రెండు గ్లాసుల వైన్ తీసుకున్నాడు.'

'దీర్ఘాయువు మీ కుటుంబ జన్యువులలో ఉందని దీని అర్థం. ఇంతకీ మీ తాత చనిపోయినప్పుడు ఆయన వయస్సు ఎంత...?'

'అరే ఇప్పుడు తాతయ్యను ఎందుకు చంపుతున్నారు...?'

'మీకు 80 ఏళ్లు, మీ తాత ఇంకా బతికే ఉన్నారా! అతని వయసు ఎంత...?'... డాక్టర్ అయోమయం. 'అతని వయస్సు 123 సంవత్సరాలు.'

'అతను కూడా ఈ ఉదయం మీతో సైకిల్ తొక్కేసి వైన్ కూడా తీసుకుని ఉంటాడని అనుకుంటున్నా.....?' డాక్టర్ అన్నాడు.

లేదు, 'తాత ఈ ఉదయం వెళ్లలేకపోయాడు! ఎందుకంటే అతను ఈ రోజు పెళ్లి చేసుకుంటున్నాడు... రెండేళ్లుగా ప్రేమలో ఉన్నాడు. ఆమె గర్భవతి కూడా!'

అప్పటి నుంచి డాక్టర్ రోజూ సైకిల్ తొక్కుతూ వైన్ తాగుతున్నాడు.

నడివయస్సును జయించే తాపత్రయం.

***

నడి 'సంద్రం'

ఇది మాత్రం అచ్చంగా మన టాపిక్కే! ఈఎమ్ఐలు, బీఎమ్ఐలు పీక్స్ కొచ్చే ఏజ్ ... అదే మిడిల్ ఏజ్. మిడిల్ క్లాస్ వాళ్లకు ఓ పరీక్షా సమయం. చచ్చీ చెడీ ఏ ముప్పై ఏళ్ల బార్డర్ లోనో పెళ్లైతే.. నలభై, యాభై ఏళ్ల మధ్య వయస్సులో పిల్లల చదువులు ఖర్చు భారీగా ఉంటుంది. ఇంటి ఈఎమ్ఐల నుంచి ఇంకా విముక్తి లభించదు. కారుంటే... దాని లోన్ తీరదు. ఓ పక్క పెరిగిన బీఎమ్ఐతో ఆరోగ్యం అలారం మోగిస్తుంటుంది. ఇంకా చదువు పూర్తవ్వని కొడుకు, పెళ్లికి ఎదిగిన కూతురు... కొలువు మెడపై వేలాడుతున్న కత్తి... పింక్ స్లిప్. వెరసి నడి వయస్సు... నడిసంద్రం. దీనికి తోడు కొలువుల పరిస్థితి మారుతోంది చూడండి...



సీనియారిటీ సీన్ మిస్..

అప్పుడే కాలేజీ పూర్తి చేసి వస్తే.. ఫ్రెషర్స్ ఉద్యోగాలు దొరకడం కష్టం. కాస్త అనుభవముంటే ఫుల్లు డిమాండ్. కొంచెం ప్రాధాన్యత.. అదే ఇంకొంత కాలం గడిచి మధ్య వయసుకు వచ్చేసరికి పరిస్థితి తిరగబడుతోంది. మెల్లగా ప్రాధాన్యత తగ్గిపోతోంది. ఇంకొన్నేళ్లు గడిస్తే ఉద్యోగంలో ఉంచడమా, ఏదో కారణంతో పంపించేయడమా అన్నట్టుగా మారిపోతోంది. ఉద్యోగుల వయసుపై వివక్ష కనిపిస్తోంది.

...కొన్నాళ్లుగా ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ట్రెండ్ ఇది. ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త సాంకేతికతలను, సరికొత్త పనితీరును పాత ఉద్యోగులు సరిగా అందిపుచ్చుకోలేరనే భావనే దీనికి కారణం. ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఈ పరిస్థితి కనిపిస్తోంది.

కంపెనీలకు రెవె'న్యూ'

పేస్కేల్ సంస్థ అధ్యయనం ప్రకారం.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో పనిచేస్తున్నవారిలో మిలీనియల్స్ (1980–96 మధ్య పుట్టినవారు) 68% నుంచి 70% వరకు ఉంటే.. జనరేషన్ జెడ్ (1996–2010 మధ్య పుట్టినవారు) 18% నుంచి 20% వరకు ఉన్నారు.

– అగ్రశ్రేణి కంపెనీలైన ఫేస్‌బుక్, లింక్‌డ్ ఇన్, స్పేస్‌ఎక్స్ సంస్థల్లో ఉద్యోగుల సగటు వయసు కేవలం 29 ఏళ్లే. ఐబీఎం, ఒరాకిల్, హెచ్‌పీ వంటి సంస్థల్లోనూ ఇది 33 ఏళ్లే. అంటే కొత్త జనరేషన్‌కు కంపెనీలు ఇస్తున్న ప్రాధాన్యం ఏమిటో అర్థమవుతుంది.

ఓల్డ్... నాట్ గోల్డ్!

ఉద్యోగులపై 'వయసు వివక్ష' మన దేశంలోనూ పెరుగుతోంది. ఏఐఎం సంస్థ అధ్యయనం ప్రకారం.. మన దేశంలోని చాలావరకు ఐటీ కంపెనీల్లో 50 ఏళ్లు పైబడిన ఉద్యోగుల సంఖ్య వేగంగా తగ్గిపోతోంది.

– ఇన్ఫోసిస్, టీసీఎస్ కంపెనీల్లో సగానికిపైగా ఉద్యోగులు 20 నుంచి 35 ఏళ్ల మధ్యవయసువారే. మరో 40 శాతం మంది 35 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్యవారు. 50 ఏళ్లు దాటినవారి సంఖ్య 10 శాతమే.

– ఐబీఎంలో మాత్రం 20–35 ఏళ్ల మధ్యవారు 45 శాతం, 35–50 ఏళ్ల మధ్యవారు 30 శాతం ఉంటే... 50 ఏళ్లు దాటినవారు 25 శాతం ఉన్నారు.

– ఇక ముందూ ఈ కంపెనీల్లో 'యంగ్ జనరేషన్‌'ను పెంచే పని జరుగుతోంది. ఒక అంచనా ప్రకారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1.57 లక్షల మంది ఫ్రెషర్స్‌ను రిక్రూట్ చేసుకునేందుకు కంపెనీలు ఏర్పాట్లు చేసుకున్నాయి.

33 శాతం మందికి వివక్ష

జాబ్‌బజ్ సంస్థ చేసిన సర్వే ప్రకారం... ఇండియాలో 33 శాతం మంది ఉద్యోగులు వయసుకు సంబంధించిన వివక్షను ఎదుర్కొంటున్నారు. మధ్యవయసు దాటినవారిని ఉద్యోగంలోకి తీసుకోకపోవడం, ప్రమోషన్లు, ఇతర ప్రయోజనాలు కల్పించకపోవడం, కొన్నిసార్లు రాజీనామా చేసేలా ఒత్తిడి చేయడం వంటివి జరుగుతున్నాయి. ''కొన్ని దేశాల్లో ఇలాంటి వయసు వివక్షకు వ్యతిరేకంగా కఠినచట్టాలు ఉన్నాయి. మన దేశంలోనూ అలాంటివి రావాల్సి ఉంది..'' ఓ విశ్లేషకుడి మాట.

ఇటీవల ఓ కంపెనీ అమెరికాలో పనిచేస్తున్న 80 మంది ఉద్యోగులను 'వయసు, సీనియర్లు' కారణంతో భారత్‌లోని కార్యాలయాలకు బదిలీ చేయడం 'వయసు వివక్ష' అంశంపై చర్చను రేపింది. 2018 లోనూ ఇదే కంపెనీ 40 ఏళ్లు దాటిన 20 వేల మంది ఉద్యోగులను తొలగించడం వివాదాస్పదమైంది కూడా!

– ప్రతిష్ఠాత్మక గూగుల్ సంస్థ కూడా ఇలాంటి చర్యలకు పాల్పడటంతో 227 మంది కోర్టులో కేసులు వేశారు. 2019లో వారికి సుమారు రూ. 90 కోట్లు పరిహారంగా ఇచ్చి కేసుల నుంచి బయటపడింది.

కంపెనీలు ఖర్చు తగ్గించుకునే క్రమంలో ప్రధానంగా సీనియర్లపైనే వేటు వేస్తున్నాయి. తక్కువ వయసున్న వారు చురుగ్గా, ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకుని సమర్థంగా పనిచేస్తారన్న భావనే దీనికి కారణం. దీనితో పాటు సీనియర్లకు ఎక్కువ జీతాలు, అలవెన్సులు ఉండటం, పరిస్థితులకు అనుగుణంగా మారలేరనే ఆలోచన కూడా కారణం.

***

'ఓల్డ్' స్టాక్!

ఇది కూడా మన స్టోరీకి సంబంధించింది కాదు.. అయినా చదవొచ్చు.

పూర్వకాలంలో సాత్‌సీ దీవుల్లో వయస్సు మళ్లిన వారిని చెట్టు పైకి ఎక్కించేవారట. వారు ఎక్కినతర్వాత బలమైన యువకులు ఆ చెట్టును ఊపేవారట. ఆ ఊపునకు కింద పడిపోకుండా నిలబడగలిగితే విడిచిపెట్టేవారట. నిలబడక పోయిన వారిని చంపివేసేవారట... అంతే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.త్రయోదశి ఉ.10.11 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పునర్వసు ప.12.02 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.8.48 నుండి 10.34 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.29 నుండి 1.21 వరకు, తదుపరి ప.3.02 నుండి 3.53 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.27 నుండి 10.43 వరకు, మాసశివరాత్రి; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.45, **సూర్యాస్తమయం:** 6.24.

క్లుప్తంగా...

టెర్రకోట కళాకారులకు అరుదైన గౌరవం

- ఢిల్లీలో జరిగే పంద్రాగస్టు వేడుకలకు ఆహ్వానం



ఎల్లప్ప, వెంకటేశ్వరరావు దంపతులు



తోట నూకరాజు

పలమనేరు(తిరుపతి జిల్లా)/మహారాణిపేట (విశాఖ దక్షిణ)/పెనుగొండ: పలమనేరు టెర్రకోట కళాకారులకు అరుదైన గౌరవం లభించింది. ఢిల్లీలోని ఎర్రకోటలో ఈ నెల 15న జరిగే స్వాతంత్య్ర సంబరాల్లో పాల్గొనాలంటూ పట్టణంలోని గంటావూరుకు చెందిన టెర్రకోట కళాకారులు కుమ్మరి ఎల్లప్ప, మురళమ్మ దంపతులకు ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. కాగా, విశాఖపట్నానికి చెందిన మత్స్యకారుడు, బోటు యజమాని తోట నూకరాజు, పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన రైతు ఆసు వెంకటేశ్వరరావు, రజనీ దంపతులకు కూడా పంద్రాగస్టు వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందింది.

'బ్యాంకులు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి'

కొరిటెపాడు(గుంటూరు): ప్రభుత్వ రంగ బ్యాంకులలో సామాన్య ప్రజల పొదుపు సొమ్ము భద్రంగా ఉండాలంటే బ్యాంకులు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం అన్నారు. గుంటూరులోని ఫెర్టిలైజర్స్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏపీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాధనాన్ని పెద్ద పెద్ద కార్పొరేట్ వర్గాలకు రుణాల రూపంలో ఇచ్చి దుర్వినియోగ పరుస్తున్నాయని ధ్వజమెత్తారు. ఏఐబీఈఏ కార్యదర్శి బీఎస్ రాంబాబు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటుపరం చేయాలని విఫల ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు.

గుండెపోటు మరణాలపై అవగాహన అవసరం

లబ్బీపేట(విజయవాడ తూర్పు): చిన్న వయస్సులోనే గుండె సంబంధిత మరణాలు దురదృష్టకరమని పలువురు గుండె వైద్య నిపుణులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మరణాలను నియంత్రించేందుకు ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఐఎంఏ హాలులో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ కార్డియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ రేడియాలజికల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కార్డియాక్ ఎంఆర్ఐపై కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గుండె సంబంధ సమస్యలు గుర్తించడంలో కార్డియాక్ ఎంఆర్ఐ ప్రాముఖ్యతను వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా గుండె వైద్య నిపుణులు డాక్టర్ విజయభాస్కర్ నోరి, డాక్టర్ ఎ.వి.ఆంజనేయులు, డాక్టర్ జాన్ క్రిస్టోఫర్ ప్రసంగించారు.

ఐక్యతతోనే కాపుల అభివృద్ధి

కాకినాడ రూరల్: రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న కాపు జాతి ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని పలువురు కాపు నేతలు అన్నారు. కాకినాడ ఎన్ఎఫ్సీఎల్ రోడ్డులోని శుభం కాపు కల్యాణ మండపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి శాఖలతో కాపునాడు కాకినాడ శాఖ ఆధ్వర్యాన జరిగిన సమావేశానికి ఉత్తరాంధ్ర, రాయలసీమ తదితర ప్రాంతాల నుంచి కాపు సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర ఐక్య కాపునాడు అధ్యక్షుడు వాదా ప్రసాదరావు మాట్లాడుతూ విభేదాలు వీడి కాపు జాతి ఐక్యంకావాలని, పేద కాపు విద్యార్థులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో ఐక్య కాపునాడు కార్యదర్శి తుమ్మల శ్రీరామమూర్తి, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, నల్లా విష్ణు, రాయలసీమకు చెందిన రాము, కాకినాడ జెడ్పీ డిప్యూటీ చైర్మన్ బుర్రా అనుబాబు తదితరులు ప్రసంగించారు.

ఉజ్బెకిస్తాన్‌లో వైద్య విద్యపై వెబ్‌పోర్టల్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఉజ్బెకిస్తాన్‌లో వైద్య విద్య అభ్యసించాలనుకునే భారత విద్యార్థుల కోసం టోల్ ఫ్రీ నంబర్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించినట్లు ఆ దేశ ఆరోగ్య శాఖలోని భారత ప్రతినిధి డాక్టర్ దివ్య రాజ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం విజయవాడలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబుతో కలిసి ఆమె టోల్ ఫ్రీ నంబర్, వెబ్‌పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1800–123–2931 నంబర్‌ను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. అలాగే www.rtudyinubzek.uz పోర్టల్‌ను సందర్శించాలన్నారు. తాష్కెంట్ మెడికల్ అకాడమీ(టీఎంఏ)లో మెడిసిన్ చదవాలనుకునే భారత విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉజ్బెకిస్తాన్ వైద్య శాఖ, టీఎంఏ ఉన్నతస్థాయి బృందం భారత్‌లో పర్యటిస్తోందని చెప్పారు. టీఎంఏ, ఇతర సంస్థల్లో అడ్మిషన్లు ఇప్పిస్తామంటూ మోసం చేసే ఏజెంట్ల నుంచి విద్యార్థులను కాపాడేందుకు సెమినార్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో టీఎంఏ ప్రతినిధులు ఎస్.అక్రంజోన్, డాక్టర్ జాసూర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

స్వరాజ్య పోరులో గర్జించిన మన్యసీమ

భావితరాలకు గిరిజన పోరాట స్ఫూర్తిని తెలిపేలా తాజంగిలో మ్యూజియం నిర్మాణం

- నాలుగు జోన్‌లుగా చరిత్ర వర్గీకరణ
- ట్రైబల్ థీమ్ రెస్టారెంట్, ఓపెన్ థియేటర్, ట్రైబల్ హట్ రెస్టారెంట్ నిర్మాణం
- విభజన అనంతరం రాష్ట్రం గర్వించేలా రూపుదిద్దుకోనున్న మ్యూజియం
- 2017లో ఏపీకి మంజూరైన మ్యూజియం నిర్మాణంపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం
- 2021లో 21.67 ఎకరాల భూమి కేటాయించి నిర్మాణం చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



శ్లాబు దశకు పూర్తయిన మ్యూజియం భవనం (ఇన్‌సెట్లో) తాజంగి మ్యూజియం ఊహా చిత్రం

యిర్రింకి ఉమామహేశ్వరరావు, సాక్షి ప్రతినిధి

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తాజంగిలో గిరిజన స్వాతంత్య్ర సమరయోధుల మ్యూజియం (టీఎఫ్ఎఫ్ఎం) నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్వరాజ్య పోరాటంలో గర్జించిన మన్యం మొనగాళ్ల చరిత్రను ఈ మ్యూజియం భావితరాల కళ్ల ముందు ఉంచనుంది. గిరిజన పోరాట యోధుల చరిత్రతోపాటు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసి స్ఫూర్తి నింపే సంకల్పంతో దీనిని నిర్మిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తి చేసేలా లక్ష్యం నిర్దేశించుకున్నారు. రూ.35 కోట్ల వ్యయంతో ఈ మ్యూజియంను నాలుగు జోన్లు(భాగాలు)గా నిర్మిస్తున్నారు. బ్రిటిష్ పూర్వ యుగం, బ్రిటిష్ పాలన, స్వాతంత్య్ర పోరాటం(తిరుగుబాటు), బ్రిటిష్ వాళ్ల పలాయనం (స్వాతంత్య్రం తర్వాత) అనే నాలుగు ప్రధాన విభాగాలుగా గిరిసీమ చరిత్రను భావితరాలకు అందించే గొప్ప ప్రయత్నానికి ఈ మ్యూజియం వారధిగా నిలవనుంది. మన్య సీమతో పెనవేసుకున్న ఖోండ్ తిరుగుబాటు (1835–37), సవరా తిరుగుబాటు (1853), లాగరాయ్ పితూరి (1914–16), మన్యం (రంప) తిరుగుబాటు(1922–24), మూకదొర తిరుగుబాటు (1924–26), చెంచు తిరుగుబాటు(1938)తోపాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లకు చెందిన గిరిజన తిరుగుబాట్లకు సంబంధించిన ఘట్టాలకు ఈ మ్యూజియం నెలవు కానుంది.

గాండ్రించిన మన్యసీమ

స్వాతంత్య్ర పోరాటంలో మన్యసీమ కేంద్రంగా గాండ్రించిన మొనగాళ్ల చరిత్రతోపాటు అనేక వీరోచిత ఘట్టాలు ఈ మ్యూజియంలో కొలువుదీరనున్నాయి. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుతోపాటు గిరిజన యోధులు మల్లుదొర, గంటం దొర విగ్రహాలను మ్యూజియంలో నెలకొల్పనున్నారు. బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన గిరిజన పోరాట ఘట్టాలకు సంబంధించిన పూర్తి వివరాలను అందుబాటులోకి తెస్తారు. గిరిజనుల జీవన విధానం, గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన అంశాలను కళాఖండాలుగా ఏర్పాటు చేస్తారు. మ్యూజియం గోడలు, పైకప్పుపై గిరిజన కళాకృతులను ఏర్పాటు చేస్తారు. నాటి గిరిజన స్వాతంత్య్ర సమరయోధుల చరిత్రను సందర్శకుల కళ్లకు కట్టినట్టు వివరించడానికి 300 మంది కూర్చొని వీక్షించేలా డిజిటల్ థియేటర్ నిర్మిస్తున్నారు. ట్రైబల్ థీమ్ హట్‌తో కూడిన రెస్టారెంట్, ఓపెన్ థియేటర్, స్వాగత ప్లాజా నిర్మిస్తున్నారు.

చరిత్రను పదిలం చేసే పనులు షురూ..

మ్యూజియం నిర్మాణం పనులు వేగవంతం చేయడంతోపాటు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన చరిత్రను పదిలం చేసే పనులు ఊపందుకున్నాయి. ఇందుకు సంబంధించి గత నెల 18న అల్లూరి జిల్లా సీతంపేట ఐటీడీఏలో ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఐటీడీఏ పరిధిలోని అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏపీఓ), వ్యవసాయ అధికారి, ఉద్యాన అధికారులు, పశు సంవర్ధక శాఖ, జిల్లా పర్యాటక అధికారి, ఉప విద్యా అధికారి, గిరిజన ఉపాధ్యాయులు, వెలుగు సొసైటీ సభ్యులు, గిరిజన తెగల గ్రామ స్థాయి కమిటీల సమన్వయంతో చారిత్రక ఆధారాలను సేకరించేలా సమాయత్తం చేశారు. మన్యం కేంద్రంగా సాగిన స్వాతంత్య్ర సమరానికి సంబంధించిన ఆధారాలు, గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన సామగ్రిని సేకరించేలా దిశానిర్దేశం చేశారు.

గిరిజన జీవన విధానానికి అద్దం పట్టేలా..

గిరిజన కళాఖండాలు, వస్తువులు, నమూనాలు రెండేసి చొప్పున సేకరించి ఒకటి మ్యూజియంకు, మరొకటి స్థానికంగా ఐటీడీఏలలో భద్రపరిచేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రతి గిరిజన తెగకు సంబంధించిన వస్తువుల (కళాఖండాలు) జాబితాను సిద్ధం చేయనున్నారు. వాటిని వీలైనంత పెద్ద సైజులో ఫొటోలు తీయిస్తారు. వస్తువులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరిస్తారు. గిరిజనులు ఉపయోగించిన నీటి కుండలు, సీసా పొట్ల కాయలు, సంగీత పరికరాలు, చేపలు పట్టే సామగ్రి, వేటకు వాడిన ఉచ్చులు, నూనె వెలికితీత యంత్రాలు, చెక్క ఇల్లు, గుళిక విల్లు, విల్లు, బాణాలు, వస్త్రాలు, ఆభరణాలు (పూసల తదితర లోహాలతో కూడిన నగలు), వ్యవసాయ పనిముట్లు, పరికరాలు సేకరిస్తారు. గిరిజన జాతరలు, పండుగలు, మౌఖిక సంప్రదాయాలు, పాటలు, దేవుళ్లు, దేవతలు, సంప్రదాయ నిపుణులు, వివాహ తంతు, స్మారక స్తంభాలు, చెక్క క్రాఫ్ట్, కుండలు, ఇనుప వస్తువులు, ముసుగులకు సంబంధించిన అనేక వస్తువులు, సవివరమైన చరిత్రను అందుబాటులోకి తెస్తారు.

గత ప్రభుత్వం పట్టించుకోలేదు



ఆంధ్రప్రదేశ్‌కు మంజూరైన గిరిజన మ్యూజియం నిర్మాణాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. 2017 నుంచి కనీసం భూమిని కూడా కేటాయించకపోవడంతో దీని నిర్మాణం చేపట్టలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ మ్యూజియం నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ శాఖల సమన్వయంతో భూ కేటాయింపు సమస్యను సీఎం వైఎస్ జగన్ కొలిక్కి తెచ్చారు. 2021లో చింతపల్లి మండలం తాజంగిలో 21.67 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడంతో నిర్మాణ పనులకు లైన్ క్లియర్ అయ్యింది. రాష్ట్రం గర్వించే స్థాయిలో గిరిజన స్వాతంత్య్ర పోరాట యోధుల మ్యూజియం తాజంగిలో రూపుదిద్దుకుంటోంది.

– పీడిక రాజన్నదొర, ఉప ముఖ్యమంత్రి

శరవేగంగా నిర్మిస్తున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలతో యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోంది. నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే తపనతో ఉన్నాం. కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖ దేశంలోని 10 రాష్ట్రాలకు గిరిజన స్వాతంత్ర పోరాట యోధుల మ్యూజియాలను మంజూరు చేసింది. జార్ఖండ్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మిజోరాం, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మణిపూర్, గోవాలకు మొత్తం రూ.120 కోట్లు కేటాయించింది. వాటిలో మన రాష్ట్రానికి రూ.15 కోట్లు మంజూరు చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లతోపాటు 21.67 ఎకరాల భూమిని కేటాయించింది.

– కాంతిలాల్ దండే, కార్యదర్శి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ

మైమ'రుచి'!

- ఫుడ్ లవర్స్ కోసం విజయవాడలో ప్రత్యేక రెస్టారెంట్లు
- అరేబియన్, చైనా, గుజరాతీ, బెంగళూరు వంటకాల ఘుమఘుమలు
- స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు







మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఆవకాయ, గోంగూర, ముద్దపప్పు, చికెన్ బిర్యానీ, పెరుగు అన్నం తినీ తినీ బోర్ కొట్టాయా? అయితే మీరు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురం ప్రాంతానికి రండి. మన రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో లభించే స్పెషల్ వంటకాలే కాకుండా అరేబియన్, చైనా ప్రాంతాల్లో నోరూరించే రుచులు, గుజరాతీ, రాజస్థాన్, బెంగళూరు, హైదరాబాద్‌లో లభించే స్పెషల్ డిషెస్ సిద్ధంగా ఉన్నాయి. కేవలం రొటీన్ ఫుడ్ తిని బోర్ కొట్టిన ఫుడ్ లవర్స్‌కు ఈ రెస్టారెంట్ల తలుపులు తెరిచి వేడి వేడి ఆహార పదార్థాలతో ఆహ్వానం పలుకుతున్నాయి. స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తున్నాయి.

ప్రతి రెస్టారెంట్‌లోనూ స్పెషల్ మెనూ

- గుజరాతీ వంటకాలను రుచి చూడాలంటే రాజ్‌భోగ్ రెస్టారెంట్‌కు వెళ్లాల్సిందే. అక్కడ గుజరాత్‌లో లభించే అన్ని రకాల వంటకాలూ సిద్ధంగా ఉంటాయి. రెస్టారెంట్‌లోకి అడుగు పెట్టగానే గుజరాతీ సంప్రదాయం ప్రకారం నుదిట బొట్టుపెట్టి మరీ లోపలకు ఆహ్వానిస్తారు.
- రెండు తెలుగు రాష్ట్రాల్లో లభించే తెలుగు వంటకాల కోసం యునైటెడ్ తెలుగు కిచెన్స్(యూటీకే) రెస్టారెంట్ తలుపులు తీయాల్సిందే. రాయలసీమ, కోస్తా జిల్లాలు, తెలంగాణ ప్రాంతాల్లో లభించే అన్ని రకాల వంటకాలు ఈ రెస్టారెంట్‌లో నిత్యం సిద్ధంగా ఉంటాయి.
- అరేబియన్ ఫుడ్స్ టేస్ట్ చేద్దామనుకునే వారి కోసం మొగల్రాజపురంలోనే అరేబియన్ రెస్టారెంట్ స్వాగతం పలుకుతోంది. అరేబియా ప్రాంతంలో కూర్చున్నట్లుగా ఇక్కడ ప్రత్యేకంగా సీట్లను ఏర్పాటు చేశారు.
- ఇక చైనీస్ ఫుడ్స్‌ను రుచి చూడాలంటే జమ్మిచెట్టు సెంటర్ సమీపంలోని నాన్‌కింగ్ రెస్టారెంట్‌లోకి అడుగు పెట్టాల్సిందే.
- మొగల్రాజపురం పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో బెంగళూరు భవన్‌లో ఫేమస్ టిఫిన్లు తింటుంటే నిజంగా మనం బెంగళూరులో ఉన్నామా.. అన్న భావన కలుగుతుంది. అలాగే శాంటోస్ రెస్టారెంట్‌లో హైదరాబాద్ బిర్యానీ, డైనర్స్ క్లబ్‌లో కేకులు, ఐస్‌క్రీమ్‌లు ఇలా వివిధ రకాల ఫుడ్స్ నిత్యం సిద్ధంగా ఉంటాయి.

గోల్డెన్ అవర్ చికిత్సతో మంచి ఫలితాలు

- మెడికల్ టూరిజం అభివృద్ధి దిశగా ఏపీ
- రాష్ట్రంలో సేవారంగం విస్తరణకు సహకరిస్తాం
- శ్రీలంక మంత్రి సతాశివమ్ వియలందేరన్
- విజయవాడలోని వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరోసైన్సెస్‌లో 'గోల్డెన్ అవర్' ప్రాజెక్టు ప్రారంభం



గోల్డెన్ అవర్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్న శ్రీలంక మంత్రి సదాశివం, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి కృష్ణబాబు

సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు): ప్రమాదాల్లో గాయపడిన, పక్షవాతానికి గురైన వారికి, తల, మెదడు భాగాల్లో తీవ్ర గాయాలైన వారికి తొలి గంట వ్యవధిలో చికిత్స అందిస్తే మెరుగైన ఫలితాలను సాధించవచ్చని శ్రీలంక ఆహార భద్రత, వాణిజ్య వ్యవహారాలశాఖ మంత్రి సతాశివమ్ వియలందేరన్ చెప్పారు. న్యూరోసర్జన్ డాక్టర్ పువ్వాడ రామకృష్ణ సారథ్యంలో విజయవాడలోని వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరోసైన్సెస్ చేపట్టిన 'గోల్డెన్ అవర్' ప్రాజెక్టును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదడు సంబంధిత సమస్యల బాధితులకు మొదటి గంట వ్యవధిలో సంపూర్ణ చికిత్సనందించేలా అత్యాధునిక సదుపాయాలు, అగ్రశ్రేణి వైద్యనిపుణులతో ప్రత్యేక న్యూరో విభాగాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే సంజీవనిలాంటి గోల్డెన్ అవర్ ప్రాజెక్టును విస్తృతం చేసేందుకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ టూరిజం అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ పయనిస్తోందని, మరింత వృద్ధికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో సేవారంగాన్ని విస్తరించేందుకు శ్రీలంక తరఫున కృషి చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ సంభవించిన వెంటనే సరైన చికిత్సను అందించడం ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. చికిత్స ఆలస్యమైతే ప్రాణాపాయానికిగానీ, జీవితకాల వైకల్యానికిగానీ దారి తీయవచ్చని చెప్పారు. ముఖంలో పక్షవాత లక్షణాలు, సరిగా మాట్లాడలేకపోవడం, చేతులు పైకెత్తలేకపోవడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక అత్యవసర చికిత్స విభాగాన్ని నెలకొల్పుతోందన్నారు. సదరు క్రిటికల్ కేర్ యూనిట్లలో అత్యాధునిక వ్యాధి నిర్ధారణ సదుపాయాలు, అత్యవసర చికిత్సలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. గోల్డెన్ అవర్ ప్రాజెక్టు వైద్య రంగంలో నూతన అధ్యాయాన్ని ఆవిష్కరిస్తుందని ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో టిమా–సీఎంఏఐ చైర్మన్ ఎన్.కె.గోయల్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి.సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరోసైన్సెస్ చైర్మన్ డాక్టర్ వరుణ్, డైరెక్టర్ డాక్టర్ పువ్వాడ రామకృష్ణ, డాక్టర్ కె.లలిత తదితరులు పాల్గొన్నారు.

లగ్నానికి లేదిక విఘ్నం

భీమవరం (ప్రకాశం చౌక్)/రాయవరం: ఈ ఏడాది మొదటి నెల నుంచి డిసెంబర్ వరకు పెళ్లిళ్లకు, ఇతర శుభకార్యాలకు మంచి తరుణంగా నిలుస్తోంది. ఈ ఏడాది 12 నెలల కాలంలో కేవలం 2 నెలలు మినహా మిగిలిన 10 నెలల్లో 104 పెళ్లి ముహూర్తాలు ఉండగా ఇప్పటికే 51 ముహూర్తాలు పూర్తయ్యాయి. ఇక ఈ నెల 19 నుంచి డిసెంబర్ వరకు 53 ముహూర్తాలు ఉన్నాయి. గడిచిన మూడేళ్లలో ఇంత పెద్ద సంఖ్యలో పెళ్లి ముహూర్తాలు లేకపోవడం విశేషం. వాస్తవానికి ఈ ఏడాది జనవరి 25 నుంచి ముహూర్తాలు ప్రారంభమవ్వగా...ఆషాఢం, అధిక శ్రావణం కారణంగా శుభకార్యాలకు విఘ్నం ఏర్పడింది. ఈ క్రమంలో ఈ నెల 19 నుంచి శుభ ముహూర్తాలు తిరిగి ప్రారంభమవుతున్నాయి. అనేక శుభకార్యాలు, గృహ ప్రవేశాలు డిసెంబర్ వరకు కొనసాగనున్నాయి.

'అందరికీ..అన్నింటికీ' డిమాండ్...

పెళ్లి, శుభ ముహూర్తాలు ప్రారంభమవుతుండటంతో అన్ని ప్రాంతాల్లోని కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. సాధారణ ఫంక్షన్ హాళ్ల దగ్గర నుంచి పెద్ద ఫంక్షన్ హాళ్ల వరకు గిరాకీ ఎక్కువగా ఏర్పడింది. ఈ పరిస్థితిని ముందుగానే గ్రహించిన పలువురు రెండు మూడు నెలల ముందు నుంచే కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లను బుక్ చేసుకుంటున్నారు. దీంతో ప్రైవేట్ కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులకు మంచి ఆదాయం అందుతోంది. ప్రముఖ దేవస్థానాల్లో పెళ్లిళ్లు ఎక్కువగా జరుగుతోన్న నేపథ్యంలో వాటికీ డిమాండ్ విపరీతంగా ఉంది. అన్నవరం, ద్వారకా తిరుమల, సింహాచలం లాంటి ప్రముఖ దేవస్థానాల్లో పెళ్లిళ్లు జరిపించడానికి ముందస్తుగా రిజర్వేషన్లు చేసుకుంటున్నారు. వివాహాలు ప్రారంభం కానుండటంతో పలు వృత్తుల వారికి చేతినిండా పని దొరుకుతుంది. బాజాభజంత్రీలు, డెకరేటర్స్, ఫొటోగ్రాఫర్స్, టెంట్‌హౌస్ నిర్వాహకులు, వంట పనివారు, ట్రాన్స్‌పోర్టర్స్, ఎలక్ట్రీషియన్స్, సౌండ్ ఇంజినీర్స్, ఈవెంట్ మేనేజర్స్,పురోహితులకు చేతినిండా పని దొరకనుంది.



ఈ ఏడాది ముహూర్తాలు ఇలా..

ఆగస్టు : 19, 20, 22, 24, 26, 29, 30, 31
సెప్టెంబర్: 1, 2, 3, 6, 7, 8
అక్టోబర్ : 18, 19, 20, 21, 22, 24, 25, 26, 27, 31
నవంబర్ : 1, 2, 8, 9, 16, 17, 18, 19, 22, 23, 24, 25, 28, 29
డిసెంబర్ : 3, 5, 6, 7, 8, 14, 15, 16, 17, 19, 20, 21, 24, 31

ఈ ఏడాదే ఎక్కువ..

ఈ ఏడాది 12 నెలల కాలంలో కేవలం 2 నెలలు మినహా మిగిలిన 10 నెలల్లో ప్రతి నెలా ఎక్కువ పెళ్లి ముహూర్తాలున్నాయి. ముహూర్తాలు పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు అనుకూలంగా ఉన్నాయి. నవంబర్, డిసెంబర్‌లలో అయితే ఒక్కో నెలలో ఏకంగా 14 ముహూర్తాలు చొప్పున ఉన్నాయి.

– మద్దిరాల మల్లిఖార్జునశర్మ, శ్రీమావుళ్లమ్మవారి దేవస్థానం ప్రధాన అర్చకుడు

ఉపాధి దొరుకుతోంది



శుభ ముహూర్తాలు ఉంటేనే చేతి నిండా పని దొరుకుతుంది. 2 నెలల విరామం అనంతరం ఈ నెలలోనే ముహూర్తాలు ప్రారంభమవుతున్నాయి. ఎన్ని ఫంక్షన్లు ఉంటే మాకు అంతగా ఉపాధి దొరుకుతోంది. ఇప్పటికే ముహూర్తాలు నిర్ణయించుకున్న వారు ఆర్డర్లు ఇస్తున్నారు.

– వి.రమణప్రసాద్, ఫొటో అండ్ వీడియోగ్రాఫర్, అమలాపురం

కొత్త చట్టాలు ప్రమాదకరం

- భవిష్యత్ తరాల స్వేచ్ఛను హరించే విధంగా ఉన్నాయి
- పౌర హక్కుల కార్యకర్త, న్యాయవాది తీస్తా సెతల్వాద్



సాక్షి, అమరావతి: భారత శిక్షా స్మృతి (ఐపీసీ), నేర విచారణ ప్రక్రియ స్మృతి (సీఆర్‌పీసీ)లలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మార్పులు ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమని పౌర హక్కుల కార్యకర్త, న్యాయవాది తీస్తా సెతల్వాద్ అన్నారు. గుంటూరులో జరిగిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) రాష్ట్ర మహాసభల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సెతల్వాద్ మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొస్తున్న కొత్త చట్టాలు ఏకపక్షంగా ఉన్నాయన్నారు. కొత్తగా తీసుకొస్తున్న చట్టాల్లో చేస్తున్న మార్పులు భవిష్యత్ తరాల స్వేచ్ఛను హరించే విధంగా ఉన్నాయన్నారు. ప్రస్తుత చట్టాల్లో పోలీసుల కస్టడీ 15 రోజులకు మాత్రమే ఉందని, కొత్త చట్టాల్లో 15 నుంచి 45 రోజులకు పెంచారని, ఆ తరువాత దానిని 90 రోజులకు సైతం పెంచుకునే వెసులుబాటు కల్పించారన్నారు. దీనివల్ల పోలీసు రాజ్యం ఏర్పడుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న విచ్ఛిన్నకర పరిస్థితులపై మేధావులు, న్యాయవాదులు, కళాకారులు, సాహితీవేత్తలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగాన్ని మతపరమైన రాజ్యాంగంగా మార్చేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని, వీటిని అడ్డుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, డొక్కా మాణిక్య వరప్రసాద్, టీడీపీ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రసంగించారు. మహాసభల్లో పలు తీర్మానాలు ఆమోదించారు. న్యాయవాదుల రక్షణ కోసం చట్టం తేవాలని, మణిపూర్ హింసను వెంటనే ఆపాలని తీర్మానం చేసింది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో సామాజిక భిన్నత్వాన్ని పాటించాలని, దక్షిణాదిలో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని తీర్మానించింది.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహాసభల్లో 70 మందితో ఐలు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరిగి విజయవాడకు చెందిన సుంకర రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన రాజగోపాల్, నూతన ప్రధాన కార్యదర్శిగా హైకోర్టు న్యాయవాది నల్లూరి మాధవరావు, కోశాధికారిగా కుమార్ ఎన్నికయ్యారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు, శ్రీవారి ఫొటో, నమామి గోవిందం కిట్, అగర్‌బత్తీలు, డ్రై ఫ్లవర్ టెక్నాలజీతో తయారు చేసిన స్వామివారి ఫొటోను టీటీడీ చైర్మన్ అందజేశారు. ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ఏపీ హైకోర్టు సీజే శ్రీ బేడీ ఆంజనేయస్వామివారి ఆలయంలో పూజలు చేశారు.

తిరుచానూరులో.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. వీరికి టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్‌ఠాకూర్‌కు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం తర్వాత ఆలయ అధికారులు ఆశీర్వాద మండపంలో వీరికి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత కూడా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.



ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌తో ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, టీటీడీ చైర్మన్ భూమన

శ్రీవారి సన్నిధిలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

తిరుమల శ్రీవారిని ఆదివారం కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం వీరికి ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలు అందించగా.. అధికారులు లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

క్లుప్తంగా...



శ్రీదేవి 60వ జయంతి గూగుల్ డూడుల్

ముంబై: ప్రముఖ నటి శ్రీదేవి 60వ జయంతిని పురస్కరించుకుని సెర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్ ఆదివారం తన హోం పేజీలో ప్రత్యేక డూడుల్‌ను పెట్టింది. 1963లో తమిళనాడులో జన్మించిన శ్రీదేవి..నాలుగేళ్ల వయస్సులోనే కంధన్ కరుణై అనే తమిళ సినిమాలో కనిపించారు. 'భారతీయ నటి శ్రీదేవి 60వ జన్మదినాన్ని పురస్కరించుకుని ముంబైకి చెందిన గెస్ట్ ఆర్టిస్ట్ భూమికా ముఖర్జీ ఆమె డూడుల్‌కు రూపకల్పన చేశారు. శ్రీదేవి తన నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో 300కుపైగా చిత్రాల్లో నటించారు. పురుషాధిక్య బాలీవుడ్ సినిమా పరిశ్రమలో పలు చిత్రాల్లో ప్రధాన పాత్రధారిగా ఆమె మెప్పించారు' అని డూడుల్‌కిచ్చిన వివరణలో గూగుల్ పేర్కొంది.


సైరన్లు, హారన్ల స్థానంలో మధుర సంగీతం!

పుణే: దేశంలో వీఐపీ సంస్కృతికి చెక్ పెట్టే దిశగా కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారు. వీఐపీల వాహనాల్లో సైరన్లు, హారన్లతో రోడ్లపై విపరీతమైన ధ్వని కాలుష్యం ఏర్పడుతోందని, అందుకే వాటి స్థానంలో మృదు మధురమైన సంగీతాన్ని ప్రవేశపెట్టాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. భారతీయ సంగీత వాయిద్య పరికరాల నుంచి సృష్టించిన సంగీతం మరింత బావుంటుందన్నారు. సైరన్లు, హారన్లకు బదులు వేణువు, తబల, శంఖం వంటి వాయిద్యాల మ్యూజిక్‌ను ప్రవేశపెట్టే ఆలోచన ఉందని వివరించారు. వీఐపీల వాహనాలపై ఎర్రబుగ్గలను తొలగించామని గుర్తుచేశారు.

మణిపూర్‌లో హింసను వెంటనే ఆపండి: రాహుల్

కోజికోడ్: మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతుండడం పట్ల కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హింసను అరికట్టానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. మణిపూర్‌లో హింసకు విభజన రాజకీయాలు, విద్వేషం, ఆక్రోశమే ప్రత్యక్ష కారణాలని పేర్కొన్నారు. దేశంలోని ప్రజలందరినీ ఒక కుటుంబంగా భావించాలని ప్రభుత్వానికి సూచించారు. రాహుల్ గాంధీ ఆదివారం కేరళలోని కొండెంచెరీలో కమ్యూనిటీ డిజబిలిటీ మేనేజ్‌మెంట్ సెంటర్(సీడీఎంసీ) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు.

యాంటీబయోటిక్స్ కూడా పనిచేయవా?



గుండెల నిండా హాయిగా గాలి పీల్చుకోవాలంటే భయం. మాస్కు లేకుండా ఇల్లు కదలాలంటే భయం, భయం శరీరాన్ని, మెదడుని ఆక్రమించిన కలుషిత గాలి ఇప్పుడు వ్యాధుల నుంచి బయటపడేసే సంజీవిని లాంటి యాంటీబయోటిక్స్ రెసిస్టెన్స్‌పై ప్రభావం చూపిస్తోంది. వాయు కాలుష్యంతో యాంటీబయోటిక్స్ పని చేయడం లేదని, ప్రపంచవ్యాప్తంగా ఈ కేసుల సంఖ్య పెరిగిపోతోందని తాజా అధ్యయనం హెచ్చరించింది.

వాయు కాలుష్యంతో మరో ముప్పు
లాన్సెట్ అధ్యయనంలో వెల్లడి



ఢిల్లీకి చెందిన సమత వయసు 40 సంవత్సరాలు. ఒకరోజు హఠాత్తుగా శ్వాస తీసుకోవడం కష్టమైంది. ఆస్తమా అటాక్ అయింది. ఇంట్లో ఎవరికీ లేని ఆస్తమా ఎందుకొచ్చిందా అని ఆందోళనతో ఉంటే మందులు పని చెయ్యకపోవడంతో కుటుంబ సభ్యులు బెంబేలెత్తిపోయారు. చివరికి ఆస్పత్రిలో చేరితే వైద్యులు అతి కష్టమ్మీద ఆమె ప్రాణాలు కాపాడగలిగారు. దీనికంతటికీ కారణం వాయు కాలుష్యం. వాహనాలు, పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం గాల్లో కలిసిపోయి మనుషుల ఊపిరితిత్తులు, గుండె, మెదడుకి పాకుతోంది. వాయు కాలుష్యంతో శ్వాసకోశ సమస్యలు, గుండె వ్యాధులు, కేన్సర్, చివరికి ఆయుఃప్రమాణాలు క్షీణిస్తాయనే మనకి తెలుసు. ఇలాంటి ప్రాణాంతక వ్యాధులకు సంజీవనిలా ఉపయోగపడే యాంటీబయోటిక్స్ పని చేయకుండా వాయుకాలుష్యం చేస్తుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఇది పెరిగిపోతే భవిష్యత్‌లో మనుషుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయన్న ఆందోళనలున్నాయి. కలుషిత గాలితో వచ్చే అనర్థాల్లో తాజాగా యాంటీబయోటిక్ నిరోధకత పెరిగిపోవడం ప్రమాద ఘంటికలు మోగిస్తోందని లాన్సెట్ హెల్త్ జర్నల్ అధ్యయనాన్ని ప్రచురించింది. చైనా, యూకేకు చెందిన శాస్త్రవేత్తలు వాయు కాలుష్యం ప్రభావాలపై వివిధ సంస్థలు సేకరించిన గణాంకాల ఆధారంగా యాంటీబయోటిక్స్ పనిచేయకపోవడం అతి పెద్ద పెనుముప్పుగా మారనుందని హెచ్చరించారు. 2000 నుంచి 2018 మధ్య కాలంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూరోపియన్ ఎన్విరాన్‌మెంట్ ఏజెన్సీ, వరల్డ్ బ్యాంక్ సహా 116 దేశాల డేటాను సేకరించి అధ్యయనం చేశారు.

సాక్షి, నేషనల్ డెస్క్

గాల్లోని సూక్ష్మాతి సూక్ష్మ ధూళి కణాలు పీఎం 2.5 వల్ల యాంటీబయోటిక్ రెసిస్టెన్స్ పెరిగిపోతోంది. గాలిలో కాలుష్యం 10శాతం పెరిగితే యాంటీబయోటిక్‌ను నిరోధించే సామర్థ్యం 1.1% పెరుగుతోంది

ప్రపంచవ్యాప్తంగా 703 కోట్ల మంది ప్రజలు పీఎం 2.5 దుష్ప్రభావాలను ఎదుర్కొంటున్నారు.

గాల్లో పీఎం 2.5 ధూళి కణాలు మనుషుల వెంట్రుక కంటే 30 రెట్లు చిన్న కణాలతో ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా యాంటీబయోటిక్ నిరోధకతను ఇవి ఎంత ప్రభావితం చూపిస్తున్నాయన్నది అర్థం చేసుకోవడం దుర్లభంగా మారింది.

యాంటీబయోటిక్స్ పనిచెయ్యకపోవడానికి ప్రధాన కారణం వాటిని మితి మీరి వాడడం అయినప్పటికీ వాయు కాలుష్యమూ మనుషుల శరీరంలో యాంటీబయోటిక్ నిరోధక బ్యాక్టీరియాను పెంచుతోంది.

ఆస్పత్రులు, వ్యవసాయ క్షేత్రాలు, వ్యర్థాల శుద్ధి ప్లాంట్లు వంటి వాటి నుంచి యాంటీబయోటిక్‌లు పని చెయ్యకుండా చేసే కలుషిత గాలి ఎక్కువగా వెలువడుతున్నట్టు అధ్యయనం వివరించింది.

ప్రాణం పోసే యాంటీబయోటిక్ ప్రాణమెలా తీస్తుంది?


యాంటీబయోటిక్స్‌ని మితి మీరి వాడకం వల్ల శరీరంలో సహజసిద్ధమైన రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటోంది. దీనివల్ల సూపర్ బగ్స్ ఏర్పడి మంచి బ్యాక్టీరియాను తినేస్తున్నాయి. ఫలితంగా వ్యాధులు సోకినప్పుడు మందులు వేసుకున్నా పని చేయకుండా పోతున్నాయి. యాంటీబయోటిక్స్ పని చెయ్యకపోవడం వల్ల ప్రస్తుతం ఏడాదికి లక్ష మంది మరణిస్తున్నారు. 2050 నాటికి ఈ కారణంతో ప్రపంచ దేశాల్లో అత్యధికమరణాలు సంభవించే ముప్పు ఉంది.

విమానంలో భయానక అనుభవం..

3 నిమిషాల్లో 15 వేల అడుగుల దిగువకు

వాషింగ్టన్: సాంకేతిక లోపం కారణంగా విమానంలో ఒక్కసారిగా తక్కువ ఎత్తుకు దిగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. పీడన సమస్యను అధిగమించేందుకు విమానాన్ని మూడు నిమిషాల్లోనే 15 వేల అడుగుల మేర దించాల్సి వచ్చినట్లు పీడ్మాంట్ ఎయిర్‌లైన్స్ సంస్థ ఫాక్స్ న్యూస్‌కు తెలిపింది. నార్త్ కరోలినాలోని చార్లొట్టె నుంచి ఫ్లోరిడాలోని గైన్స్‌విల్లెకు వెళ్తున్న పీడ్మాంట్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో ఈ నెల 10వ తేదీన ఈ ఘటన చోటుచేసుకుంది. చివరికి గమ్యస్థానానికి చేరుకుని సురక్షితంగా ల్యాండయింది. 'టేకాఫ్ తీసుకున్న 43 నిమిషాల తర్వాత 29 వేల అడుగుల ఎత్తులో ఉండగా విమానంలో సమస్య మొదలైంది. క్యాబిన్‌లో పీడనం అకస్మాత్తుగా తగ్గిపోవడంతో ప్రయాణికులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. ఆరు నిమిషాల వ్యవధిలోనే మొత్తం 18,600 అడుగులు కిందికి దిగింది'అని ఫ్లైట్‌అవేర్ డేటా విడుదల చేసింది. ఘటనపై హారిసన్ హోవ్ అనే ప్రయాణికుడు సోషల్ మీడియా ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. 'కాలుతున్న వాసన, పెద్ద శబ్దం, చెవుల్లో హోరు'తో గగుర్పాటు కలిగించిందని పేర్కొన్నారు. కేబిన్‌లో కాలుతున్న వాసన, పెద్ద శబ్దాలు రావడంతో ప్రయాణికులు హాహాకారాలు చేశారు. ఊపిరాడక కొందరు ప్రయాణికులు ఆక్సిజన్ మాస్కులతో గాలి పీల్చుకుంటున్న ఫొటోను హారిసన్ షేర్ చేశారు.

నిజాయితీకి నిలువుటద్దం కలాం


కలాం ఇచ్చిన చెక్కు

న్యూఢిల్లీ: 'ఇతరులు ఇచ్చే కానుకలు, బహుమానాల వెనుక స్వార్థపూరిత కారణం ఉండొచ్చు. మన నుంచి ఏదో ఒకటి ఆశించి ఇలాంటివి ఇస్తుంటారు. అది స్వీకరించే ముందు ఈ విషయం ఆలోచించాలి'.. ప్రఖ్యాత సైంటిస్ట్, భారతరత్న, దివంగత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బాల్యంలోనే తన తండ్రి వద్ద నేర్చుకున్న పాఠమిది. ఈ పాఠాన్ని జీవితాంతం ఆయన ఆచరించారు. విలువలకు, నిజాయతీకి మారుపేరైన అబ్దుల్ కలాం ఇతరుల నుంచి ఏనాడూ కానుకలు ఆశించలేదు. ఎవరైనా ఇలాంటివి ఇస్తే దాని ధర ఎంతో తెలుసుకొని చెక్కు లేదా డబ్బులు పంపించేవారు. మిస్సైల్ మ్యాన్ కలాం గొప్పతనాన్ని తెలియజేసే మరో సంఘటన వెలుగులోకి వచ్చింది. కలాంకు సంబంధించిన ఈ ఉదంతాన్ని ఐఏఎస్ అధికారి ఎం.వి.రావు తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేశారు. 2014లో కలాం ఓ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'సౌభాగ్య వెట్ గ్రైండర్' అనే సంస్థ ఆయనకు ఒక గ్రైండర్‌ను బహూకరించింది. దాన్ని స్వీకరించడానికి ఆయన తొలుత అంగీకరించలేదు. చివరకు బలవంతం మీద స్వీకరించారు. ఆ మరుసటి రోజే దాని ధర తెలుసుకొనేందుకు తన సహాయకుడిని మార్కెట్‌కు పంపించారు. తర్వాత తన వ్యక్తిగత బ్యాంకు ఖాతా నుంచి చెక్కును సౌభాగ్య సంస్థకు పంపారు. చెక్కును ఆ సంస్థ నగదుగా మార్చుకోకపోవచ్చన్న అనుమానం ఆయనకు వచ్చింది. తన బ్యాంకు ఖాతా నుంచి నగదు డెబిట్ అయ్యిందో లేదో కనుక్కున్నారు. కాలేదని తెలిసింది. గడువులోగా నగదుగా మార్చుకోకపోతే గ్రైండర్‌ను వెనక్కి ఇచ్చేస్తానని సౌభాగ్య సంస్థకు కలాం సమాచారం పంపారు. ఇక చేసేది లేక ఆ సంస్థ ఆ చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేసి, డబ్బులు తీసుకుంది. అబ్దుల్ కలాం ఇచ్చిన చెక్కును జిరాక్స్ తీసి, ఫ్రేమ్ కట్టించి భద్రంగా దాచుకుంది. ఎం.వి.రావు షేర్ చేసిన పోస్టుపై నెటిజన్లు సోషల్ మీడియాలో అభినందనల వర్షం కురిపిస్తున్నారు. కలాం వ్యక్తిత్వాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

హెరాన్ మార్క్–2 డ్రోన్ల మోహరింపు

చైనా, పాక్ సరిహద్దుల్లో నిఘా మరింత పటిష్టం



న్యూఢిల్లీ: చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో భద్రతను మరింత పటిష్టం చేయడానికి భారత వాయుసేన పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేసిన అత్యంత శక్తిమంతమైన హెరాన్ మార్క్–2 సాయుధ డ్రోన్లు నాలుగింటిని ఉత్తర సెక్టార్ సరిహద్దు స్థావరాల్లో మోహరించింది. హెరన్ మార్క్–2 డ్రోన్లు సుదూర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం కలిగిన క్షిపణులు, ఇతర ఆయుధ సంపత్తిని మోసుకుపోగలవని రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ డ్రోన్ల మోహరింపుతో సరిహద్దుల్లో నిఘా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. 'హెరాన్ మార్క్ 2 డ్రోన్లు అత్యంత శక్తిమంతమైనవి. గంటల తరబడి గాల్లో ఎగిరే సామర్థ్యం, సుదూర ప్రాంతాల్లో ఏం జరుగుతోందో పసిగట్టే టెక్నాలజీ ఉండడం వల్ల పాక్, చైనా సరిహద్దుల్లో నిఘా మరింత పటిష్టం కానుంది' అని డ్రోన్ స్క్వాడ్రన్ వింగ్ కమాండర్ పంకజ్ రాణా చెప్పారు.

ప్రత్యేకతలు ఇవీ

- ప్రతికూల వాతావరణ పరిస్థితులున్నప్పటికీ హెరెన్ మార్క్–2 డ్రోన్లు ఏకబిగిన 36 గంటలు ప్రయాణం చేయగలవు. అంటే ఈ డ్రోన్లు ఒకేసారి పాకిస్తాన్, చైనాలను కూడా చుట్టేసి రాగలవు.
- డ్రోన్లలో ఉండే లేజర్ సుదూర ప్రాంతంలో ఉండే శత్రు దేశాల లక్ష్యాలను గుర్తించగలవు. దీంతో మన క్షిపణులు వాటిని ధ్వంసం చేసే అవకాశం ఉంటుంది.
- ఎంత దూరంలోనున్న లక్ష్యాలనైనా గుర్తించడం, సుదీర్ఘంగా గాల్లో ఎగిరే సామర్థ్యం ఉండడం వల్ల ఇవి ఎక్కడికైనా వెళ్లి ఆ ప్రాంతమంతా జల్లెడ పట్టగలవు.
- ఈ డ్రోన్లు ఉపగ్రహంతో అనుసంధానం అయి ఉండడం వల్ల ఎక్కడ నుంచైనా వీటిని ఆపరేట్ చేసే సదుపాయం ఉంది.
- మైనస్ డిగ్రీల వాతావరణ స్థితుల్లోనూ ఈ డ్రోన్లు పేలోడ్ మోసుకుపోగలవు. మైదానాలు, పర్వత ప్రాంతాలు ఇలా ఏ భూభాగంలోనైనా సమర్థంగా పని చేయగలవు.

ఆదివారం అహ్మదాబాద్‌లో తిరంగా యాత్రలో పాల్గొన్న స్థానికులు



సామాన్యులే అతిథులు

1,800 మందికి ఆహ్వానం

- రైతులు, కార్మికులు, టీచర్లు, నర్సులు, సర్పంచ్‌లే అతిథులు
- స్వాతంత్ర్య దిన వేడుకలకు భారీగా ఏర్పాట్లు
- ఇంటింటా జెండా ఎగరాలి
- సామాజిక మాధ్యమాల్లో డీపీ మార్చండి
- ప్రధానమంత్రి మోదీ పిలుపు

న్యూఢిల్లీ: భారత 77వ స్వాతంత్ర్య దిన వేడుకలకు కేంద్ర ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. పంద్రాగస్టున ఢిల్లీలోని ఎర్రకోటలో అంబరాన్నంటే సంబరాల్లో సామాన్యుడికి పెద్దపీట వేసింది. దేశానికి వెన్నుముకలాంటి రైతులు, చెమటోడ్చి పని చేసే కార్మికులు, జీవనోపాధి కోసం ప్రాణాలనే పణంగా పెట్టే జాలర్లు, సేవాగుణం కలిగిన నర్సులు, గ్రామాల సర్పంచ్‌లను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించింది. ఢిల్లీలో ఎర్రకోటపై మంగళవారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ జెండాను ఆవిష్కరించిన తర్వాత జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. 2047 స్వాతంత్ర్య దిన శతాబ్ది ఉత్సవాల నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలన్న లక్ష్యంతో ఈ ఏడాది ఆజాదీకా అమృత్‌ తోత్సవ్‌లో భాగంగానే స్వాతంత్ర్య దిన వేడుకల్ని జరుపుతున్నారు. ఇక ఇంటింటిలోనూ త్రివర్ణ పతాకం ఎగరాలన్న ప్రచారం ఆదివారం నుంచే మొదలైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమాల్లో ప్రతీ ఒక్కరూ జాతీయ జెండాను డిస్‌ప్లే పిక్చర్ (డీపీ) గా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు.

చైతన్యవంత గ్రామాల నుంచీ..

స్వాతంత్ర దిన వేడుకలకు ప్రత్యేకంగా 1,800 మంది అతిథుల్ని ఆహ్వానించారు. దేశంలోని అత్యంత చైతన్యవంతమైన గ్రామాలుగా గుర్తింపు పొందిన 660కి పైగా గ్రామాల నుంచి 400 మందికి పైగా సర్పంచ్‌లు, 250 మంది రైతులు, పార్లమెంటు కొత్త భవనం, సరిహద్దుల్లో రోడ్ల నిర్మాణంలో భాగస్వామ్యులైన 50 మంది కార్మికులు, 50 మంది ఖాదీ పనివారుతో పాటు జాలర్లు, టీచర్లు, నర్సులు ఇలా సమాజంలో కీలకమైన వర్గాల వారందరికీ ఆహ్వానం పలికినట్టుగా కేంద్రం ఒక ప్రకటనలో వెల్లడించింది. సతీ సమేతంగా హాజరయ్యే ఈ అతిథులకి బస ఏర్పాట్లు చేస్తోంది.

సెల్ఫీ పాయింట్లు

స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా యువతీయువకులకు సెల్ఫీ పోటీలు నిర్వహిస్తోంది. ఇందు కోసం 12 ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లను వివిధ థీమ్‌లతో తీర్చిదిద్దింది. నేషనల్ వార్ మెమోరియల్, ఇండియా గేట్, విజయ్ చౌక్, రైల్వే స్టేషన్, ప్రగతి మైదాన్, రాజ్‌ఘాట్, జమా మసీదు మెట్రో స్టేషన్, రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్, ఢిల్లీ గేట్ మెట్రో స్టేషన్,, ఇలా 12 ప్రాంతాల్లో పెట్టిన సెల్ఫీ పాయింట్లలో సెల్ఫీలు తీసుకొని ఆగస్టు 15–20 మధ్య మైగవ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒక్కో సెల్ఫీ పాయింట్ నుంచి అత్యుత్తమమైన దానిని ఎంపిక చేసి 12 మంది విజేతలకు రూ.10 వేల చొప్పున బహుమానం అందిస్తారు.

డీపీలుగా జాతీయ జెండా

హర్‌ఘర్ తిరంగా ప్రచారంలో భాగంగా సోషల్ మీడియా వినియోగదారులందరూ తమ అకౌంట్లలో డీపీని జాతీయ జెండాతో మార్చాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మోదీ తన అకౌంట్లలో త్రివర్ణ పతాకాన్నే డీపీగా పెట్టుకున్నారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు ఇదో ఉద్యమంగా చేయాలన్నారు. దేశానికి, ప్రజలకి మధ్య ఉండే ఉద్వేగభరితమైన సంబంధానికి ప్రతీకగా జాతీయ జెండాను డీపీగా ఉంచాలని ప్రధాని పిలుపునిచ్చారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు స్ఫూర్తిగా నిలిచే జాతీయ జెండాలతో ఫొటోలు దిగి హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలన్నారు.

బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు

ఎన్సీపీ అధినేత శరద్ పవార్ స్పష్టీకరణ



ముంబై: బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని కొందరు శ్రేయోభిలాషులు తనపై ఒత్తిడి తెస్తున్నారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ చెప్పారు. అయితే, ఆ పార్టీతో పొత్తు పెట్టుకొనే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బీజేపీతో స్నేహం చేయడం తమ పార్టీ రాజకీయ విధానంలో ఇమడదని తేల్చిచెప్పారు. పవార్ ఆదివారం షోలాపూర్ జిల్లా సాంగోలాలో మీడియాతో మాట్లాడారు. తమలో కొందరు(అజిత్ పవార్ వర్గం) భిన్నమైన వైఖరి అవలంబిస్తున్నారని ఆక్షేపించారు. తమ వైఖరిలో మార్పు వస్తుందని కొందరు ఆశిస్తున్నారని, అందుకే తమతో చర్చలు జరుపుతున్నారని వివరించారు. శనివారం ఉప ముఖ్యమంత్రి, సోదరుడి కుమారుడు అజిత్ పవార్‌తో జరిగిన భేటీపై విలేకరులు ప్రశ్నించగా.. అజిత్ తన కుటుంబ సభ్యుడని, ఆయనను కలవడంలో తప్పేముందని శరద్ పవార్ వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యులు కలుసుకోవాలంటే ఏదైనా కారణంగా ఉండాలా? అని ఎదురు ప్రశ్నించారు. మహారాష్ట్రలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కెనడాలో హిందూ ఆలయంపై ఖలిస్తానీ పోస్టర్లు

ఒంటారియో: కెనడాలో హిందూ దేవాలయాలయాలపై ఖలిస్తానీ అనుకూలవాదుల అనుచిత చర్యలకు అడ్డుకట్ట పడటం లేదు. శనివారం బ్రిటిష్ కొలంబియాలోని పురాతన లక్ష్మీ నారాయణ మందిరం ప్రధాన గేటుపై ఖలిస్తాన్ రిఫరెండం డిమాండ్‌తో పోస్టర్లు అంటించారు. ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ ఆర్గనైజేషన్ చీఫ్ హర్‌దీప్ సింగ్ నజ్జర్ హత్య వెనుక భారత్ పాత్ర ఉందంటూ అందులో ఆరోపించారు. జనవరి 31న బ్రాంప్టన్‌లో ఒక మందిరం, ఒంటారియోలో ఏప్రిల్‌లో మరో మందిరాన్ని ఇలా ఖలిస్తానీ వాదులు అపవిత్రం చేశారు.

తర్వాత.. తూర్పు లద్దాఖ్‌లోకి 68వేల బలగాలు

న్యూఢిల్లీ: 2020 మే 15వ తేదీన గల్వాన్‌లో చైనా ఆర్మీతో ఘర్షణలు జరిగిన తర్వాత భారత్ తూర్పు లద్దాఖ్‌లోకి ముందు జాగ్రత్తగా 68 వేల బలగాలను తరలించింది. ఆర్మీతోపాటు 90 యుద్ధ ట్యాంకులు, 330 పోరాట వాహనాలు, రాడార్ వ్యవస్థలు, ఆర్టిలరీ గన్‌లను కూడా భారత వైమానిక దళం(ఐఏఎఫ్) విమానాలు తరలించాయని రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. రఫేల్, మిగ్–29లతోపాటు సుఖోయ్–30 ఎంకేఐ, జగ్వార్ యుద్ధ విమానాలు ఆ ప్రాంతంపై నిరంతరాయంగా గస్తీ తిరుగుతూ శత్రు కదలికలపై కన్నేసి ఉంచాయి. ఇంకా పలు స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలను సిద్ధంగా ఉంచింది. చైనీయుల కార్యకలాపాలను పసిగట్టేందుకు పెద్ద సంఖ్యలో డ్రోన్లను కూడా మోహరించిందని ఆ వర్గాలు వివరించాయి. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి, పర్వతమయ ప్రాంతాల్లోకి అవసరమైన పక్షంలో బలగాలను సత్వరం మోహరించేందుకు అన్ని చర్యలూ ప్రభుత్వం తీసుకుందని వివరించాయి. సి–130జే సూపర్ హెర్క్యులస్, సి–17 గ్లోబ్‌మాస్టర్ రవాణా విమానాలు మొత్తంగా 9 వేల టన్నుల బరువును సరిహద్దులకు మోసుకెళ్లి వాయుసేన వ్యూహాత్మక తరలింపు సామర్థ్యాన్ని చాటాయని ఆ వర్గాలు తెలిపాయి.

ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ వ్యయం 14 రెట్లు ఎక్కువ

న్యూఢిల్లీ: ఢిల్లీ–గురుగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం అత్యంత ఖరీదైన వ్యవహారంగా కనిపిస్తోందని కాగ్(కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదిక వ్యాఖ్యానించింది. ఒక్కో కిలోమీటర్‌కు నిర్మాణ వ్యయం ప్రభుత్వ కేటాయింపులు రూ.18.20 కోట్లు కాగా వాస్తవ ఖర్చు రూ.250.77 కోట్లకు పెరిగిందని తెలిపింది. భారత్ మాల ప్రాజెక్టులో భాగంగా ఈ 48వ నంబర్ జాతీయ రహదారిని 14 లేన్లుగా నిర్మించేందుకు 2017లో కేంద్రం అనుమతులిచ్చింది. అయితే, 8 లేన్ల ఎలివేటెడ్ ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవే కారిడార్‌లో వాహనాల రాకపోకలు సులభంగా జరిగేందుకు గాను తక్కువ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను ఇవ్వడమే నిర్మాణ వ్యయం పెరగడానికి కారణమని రోడ్డు రవాణా హైవేల శాఖ చెబుతోందని వివరించింది. ఈ కారణం సహేతుకంగా లేదని కాగ్ పేర్కొంది. కేవలం ఆరు లేన్లకు మాత్రమే ప్రణాళిక రూపొందించి, నిర్మాణం పూర్తి చేశారని తెలిపింది. ఇదే కాకుండా, దేశవ్యాప్తంగా భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన హైవేల నిర్మాణంలో కేటాయింపుల కంటే 58% అధికంగా ఖర్చు చేశారని వివరించింది.

మహారాష్ట్ర ఆసుపత్రిలో ఘోరం

24 గంటల్లో 18 మంది రోగులు మృతి

థానే: మహారాష్ట్రలో థానే జిల్లాలోని కాల్వా పట్టణంలో ఘోరం జరిగింది. ఇక్కడి ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆసుపత్రిలో గత 24 గంటల వ్యవధిలో 18 మంది రోగులు మృతిచెందారు. వీరిలో 10 మంది మహిళలు, 8 మంది పురుషులు ఉన్నారు. మృతుల్లో 12 మంది 50 ఏళ్ల వయసు దాటినవారే. బాధితులు మూత్రపిండాల్లో రాళ్లు, పక్షవాతం, అల్సర్, న్యుమోనియా తదితర వ్యాధులతో బాధపడుతున్నారు. ఏ కారణంతో వారు చనిపోయారన్నది స్పష్టంగా తెలియరాలేదు. ఇలా ఉండగా, ఆసుపత్రిలో ఒక్క రోజు వ్యవధిలో 18 మంది రోగులు మృతిచెందడంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కోసం రాష్ట్ర ఆరోగ్య సేవల కమిషనర్ నేతృత్వంలో స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఆసుపత్రిలో సామర్థ్యానికి మించి రోగులు ఉన్నారని, వారికి వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని థానే మాజీ మేయర్ నరేశ్ మాస్కే చెప్పారు.

చావో రేవో తేల్చుకోవాలి

- ఆగస్టు 28న హరియాణా నూహ్‌లో బ్రజ్ మండల్ యాత్ర
- మహా పంచాయత్ ప్రకటన

గురుగ్రామ్: హరియాణా పల్వల్‌లో విశ్వ హిందూ పరిషత్ సహా పలు హిందూ సంస్థలు ఆదివారం నిర్వహించిన మహా పంచాయత్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రజ్ మండల్ జలాభిషేక యాత్రను ఆగస్టు 28న పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించారు. జులై 31న నూహ్‌లో దుండగుల దాడితో మత ఘర్షణలు చెలరేగి యాత్ర అర్ధాంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. యాత్ర నిర్వహించి తీరాలని, చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని మహాపంచాయత్‌లో హరియాణా గో రక్షక దళానికి చెందిన ఆచార్య ఆజాద్ శాస్త్రి అన్నారు. యాత్రలో అంతా ఆయుధాలు ధరించాలని పిలుపునిచ్చారు. మహాపంచాయత్‌లో విద్వేష ప్రసంగాలు చేయవద్దని పోలీసులు ఆంక్షలు విధించినప్పటికీ హిందూ నాయకులు పెడచెవిన పెట్టారు. కనీసం 100 రైఫిల్స్‌కు అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముస్లింలతో చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందంటూ ఆజాద్ శాస్త్రి రెచ్చగొట్టేలా ప్రసంగించారు. మరి కొందరు వక్తలు కూడా ఇదే తరహాలో ప్రసంగించారు. మీరు ఎవరైనా వేలెత్తి చూపిస్తే మీ చెయ్యినే నరికేస్తాం అని హెచ్చరించారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న నూహ్ జిల్లానే రద్దు చేయాలని ఆ ప్రాంతంలో గోవధ ఉండకూడదని వక్తలు డిమాండ్ చేశారు. నూహ్‌లో హిందువుల యాత్రపై తీవ్ర వ్యతిరేకత నెలకొంది. దీంతో మళ్లీ ఉద్రిక్తతలు నెలకొంటాయన్న ఆందోళనలున్నాయి.

ఆ మూడు బిల్లులపై విస్తృత చర్చ జరగాలి

కేంద్రం ప్రతిపాదించిన నేర బిల్లులపై కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: వలసపాలన నాటి నేర చట్టాల స్థానంలో కేంద్రం ఇటీవల పార్లమెంట్‌లో ప్రతిపాదించిన మూడు బిల్లులపై విస్తృత చర్చ జరగాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. తాజా బిల్లులపై సంబంధిత వర్గాలు, నిపుణులు, ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు సంప్రదింపులు జరపాలని పిలుపునిచ్చింది. మూడు బిల్లులను హోం శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపించాలని కోరింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సూర్జేవాలా ఒక ప్రకటన విడుదల చేశారు. 'ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రజలతో సంప్రదింపులు జరపకుండా, న్యాయ నిపుణులు, నేర శాస్త్ర ప్రవీణులు, తదితరులతో చర్చించకుండానే ప్రభుత్వం తన 'మంత్రాల టోపీ' నుంచి తీసిన మూడు బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. పారదర్శకత పాటించకుండా, దొంగచాటుగా యావత్తు నేర చట్టాలను మార్చేందుకు ప్రయత్నిస్తోంది'అని ఆరోపించారు. బిల్లుల్లో ప్రతిపాదించిన చాలా మార్పులపై మంత్రి అమిత్ షా లోక్‌సభను పక్కదోవ పట్టించారని ఆరోపించారు..కాగా, భారతీయ న్యాయ సంహిత బిల్లు రాజ్యాంగ విరుద్ధమని మాజీ న్యాయ శాఖ మంత్రి కపిల్ సిబల్ అభివర్ణించారు. బ్రిటిష్ జమానా చట్టాలను తీసివేస్తున్నామని చెబుతూ దేశంలో నియంతృత్వాన్ని తీసుకువచ్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.


కార్చిచ్చు ధాటికి లహైనాలో కాలి బూడిదైన ఓ కాలనీ

93కు చేరిన 'హవాయి' మరణాలు

లహైనా: అమెరికాలోని హవాయి రాష్ట్రంలో సంభవించిన భీకర కార్చిచ్చులో మృతుల సంఖ్య 93కు చేరుకుంది. మౌయి దీవిలో 93 మంది మృతి చెందినట్లు ఇప్పటి వరకు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మౌయిలో అన్వేషణ కొనసాగుతోందని చెప్పారు. కార్చిచ్చు ప్రభావిత ప్రాంతం 5 చదరపు మైళ్లు కాగా కేవలం 3% మేర గాలింపు పూర్తయిందన్నారు. మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. పశ్చిమ మౌయిలోని నివాసాల్లో 86% అంటే 2,200భవనాలు ధ్వంసమైనట్లు తేల్చారు. నష్టం 6 బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా. హవాయి కార్చిచ్చును ఈ శతాబ్దంలోనే అతిపెద్ద విపత్తుగా అమెరికా ప్రభుత్వం ప్రకటించింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం : 14 : ఆగస్టు : 2023

వచ్చే ఉగాదికి ఘోర విపత్తు

- కోడిమఠం స్వామి జోస్యం

దొడ్డబళ్లాపురం: దేశంలో 2024 ఉగాది నాటికి ఘోర దుర్ఘటన జరుగుతుందని కోడిమఠం స్వామి జోస్యం చెప్పారు. విపత్తుల గురించి ఆయన తరచూ జోస్యాలు చెప్పడం తెలిసిందే. ఆదివారం నాడు హాసన్ జిల్లా అరసికెరె తాలూకా హారనహళ్లిలోని కోడిమఠంలో మీడియాతో మాట్లాడిన ఆయన ప్రపంచానికి మూడు గండాలు ఉన్నాయని అన్నారు. ఒకటి రెండు దేశాలు కనుమరుగవుతాయని, జనం అకాల మృత్యువాత పడతారని చెప్పారు. 2024 ఉగాదిలోపు ముగ్గురు ప్రముఖ వ్యక్తులకు గండం ఉందని, పాలకులు ముందు జాగ్రత్తలు తీసుకుంటే ఈ గండాలను తప్పించవచ్చన్నారు. ఆ గండాలేమిటో కాలం వచ్చినప్పుడు చెబుతానన్నారు. భారీవర్షాలు కురిసి పట్టణాలకు, నగరాలకు అపాయం ఉందన్నారు. పెద్ద పెద్ద భవనాలు కుప్పకూలుతాయన్నారు. అందరూ ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

రిసార్టులో తుపాకులు, కత్తులు



స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసులు

శివమొగ్గ: జిల్లాలోని తీర్థహళ్లిలో ఒక రిసార్టులో అక్రమ కార్యక్రమాలు జరుగతున్నాయని తెలిసి పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. రూ. లక్ష విలువ చేసే డబుల్ బ్యారెల్ తుపాకీ, రూ. 25 వేల విలువ చేసే 310 తూటాలు, మూడు కత్తులు, మూడు అడవి దున్న కొమ్ములు, ఆరు జింక కొమ్ములు, రూ. 1 లక్ష విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పలువురు నిందితులను అరెస్టు చేశారు.

జాలీరైడ్‌లో యాక్సిడెంట్

- ఇద్దరు టెక్కీలు మృతి

యశవంతపుర: వీకెండ్ కావడంతో కారులో జాలీ రైడ్‌కు వెళ్లిన ఐటీ ఇంజినీర్లు ప్రమాదానికి గురై ఇద్దరు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. బెంగళూరు– బళ్లారి రోడ్డులో ఈ దుర్ఘటన జరిగింది. యలహంక సమీపంలోని పాలనహళ్లి గేటు వద్ద మత్తికెరెకి చెందిన ఇద్దరు టెక్కీలు కార్తీక్(23), ఆదర్శ (23) మృతులు. ఐదుమంది కలిసి కారులో నందికొండ ట్రిప్‌కి వెళ్లారు. ముగించుకొని ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో వస్తుండగా పాలనహళ్లి గేటు వద్ద కారు అతివేగం వల్ల అదుపుతప్పి డివైడర్ గ్రిల్స్‌ను ఢీకొంది. కారు ధ్వంసం కాగా కార్తీక్, ఆదర్శలు అక్కడికక్కడే చనిపోగా, మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. యలహంక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మృత్యుశయ్యపై ప్రేమపాశం

- ప్రియురాలికి చివరి కాల్



ఆస్పత్రిలో బెడ్‌పై కిరణ్

దొడ్డబళ్లాపురం: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు చావు తథ్యమని తెలుసుకుని, ప్రియురాలికి వీడియో కాల్ చేశాడు, తన అంత్యక్రియలకు ఆహ్వానించిన కొంతసేపటికి ప్రాణం వదిలిన హృదయ విదారక సంఘటన నెలమంగలలో వెలుగు చూసింది. నెలమంగలకు చెందిన కిరణ్ అనే యువకునికి కొన్నిరోజుల కిందట కుక్క కరవడంతో పెద్దగా పట్టించుకోలేదు, దీంతో రేబిస్ వ్యాధి సోకింది. తల్లిదండ్రులు అతన్ని బెంగళూరు నిమ్హాన్స్ ఆస్పత్రిలో చేర్చగా బతకడం కష్టమని వైద్యులు నిర్ధారించారు. కిరణ్ ప్రియురాలికి వీడియో కాల్ చేసి.. తాను ఇక బ్రతకనని తన అంత్యక్రియలకు తప్పక రావాలని, మీ నాన్న చూపించిన యువకుడినే పెళ్లి చేసుకుని, పుట్టే బిడ్డకు నా పేరు పెట్టాలని కోరాడు. తరువాత కొన్ని గంటలకు అతడు చనిపోయాడు. ఆగస్టు 9న జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

బాల్యం చిన్నబోతోంది

ఆడుతూ పాడుతూ చదువుకుంటూ ఉన్నత భవితకు చేరుకోవాల్సిన బాలికలకు ఇంటా బయటా పెను సవాళ్లు ఎదురవుతున్నాయి. తల్లిదండ్రుల పేదరికం, అవిద్య వల్ల బాలికలను నిర్లక్ష్యం చేయడం అధికంగా కనిపిస్తోంది. ముక్కుపచ్చలారకుండానే మూడుముళ్లు పడడం, కుటుంబ బాధ్యతలతో చిన్నారి బాలికలు నలిగిపోతున్నారు. ఈ బాధలు పడలేక కొందరు ఇళ్ల నుంచి పారిపోతే, ప్రలోభాలు చూపి అక్రమ రవాణాకు పాల్పడే దుండగుల సంఖ్య తక్కువేం కాదు. లెక్కలేనన్ని చట్టాలు, అధికార యంత్రాంగం కూడా ఈ సమస్యను అరికట్టలేకపోతోందనే విమర్శలున్నాయి.



ఉత్సాహంగా ఆడిపాడాల్సిన వయసులో బాలికలపై పెనుభారం

- బాలికల మిస్సింగ్‌లో రాష్ట్రం 3వ స్థానం
- బాల్య వివాహాలు, చిన్నవయసులోనే గర్భం
- క్షేత్రస్థాయిలో అంతులేని నిర్లక్ష్యం
- తీవ్ర సామాజిక సమస్యలకు నాంది

బనశంకరి: రాష్ట్రంలో ఓ పక్క ఆడపిల్లల మిస్సింగ్ కేసులు, అక్రమ రవాణా హెచ్చుమీరుతుండగా, మైనారిటీ తీరకుండానే గర్భం దాల్చుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. జాతీయ నేర గణాంక విభాగం (ఎన్‌సీఆర్‌బీ) ప్రకారం పిల్లల అక్రమ రవాణాలో కన్నడనాడు దేశంలోనే మూడో స్థానంలో ఉంది. గత మూడేళ్లలో 25 వేలమందికి పైగా పిల్లలు కనిపించకుండా పోయారు. అదే తరహాలో ప్రభుత్వ సమాచారం ప్రకారం 45,557 మైనర్లు గర్భవతులయ్యారు. ఈ సమస్యలకు అడ్డుకట్ట వేయడం ప్రభుత్వానికి, పోలీసుశాఖకి పెద్ద సవాల్‌గా మారింది. పేదరికం, నిరక్షరాస్యతకు– బాలికల ట్రాఫికింగ్‌కు దగ్గరి సంబంధం ఉందని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు.

బాల్య వివాహాల బెడద

మైనర్ బాలికలు గర్భం దాల్చడం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. వెలుగులోకి రాని వేలాది కేసులు ఉన్నాయని ఆరోగ్య మహిళ శిశుసంక్షేమశాఖ వర్గాలు చెబుతున్నాయి. బాల్య వివాహాలు, వాటిని నివారించకపోవడం, దీనిపై సమాజంలో జాగృతి లోపం, గుట్టుగా జరిగే లైంగికదాడులు, చిన్న వయసులోనే ప్రేమ వలలో చిక్కుకోవడం కారణాలు

ఏడాది	మైనర్లలో గర్భిణులు
2020	10,101
2021	13,159
2022	19,561
2023	2,736 (జూన్ వరకు)

చెప్పవచ్చు. ఈ సమస్యపై స్థానికంగా ఉండే ఆశా, సఖి, అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా అశ్రద్ధ చేయడం మరో కారణం. బాల్య వివాహాల నియంత్రణకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ ఆగడం లేదు. బాల్య వివాహమై గర్భం దాలిస్తే దానిని అత్యాచారంగా పరిగణించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ మార్పు రావడం లేదు.

ఈ ప్రాంతాల్లో అధికం

బెంగళూరు నగరం, మైసూరు, బెళగావి, చిత్రదుర్గ, తుమకూరు, కలబురిగి, కోలారు, శివమొగ్గ, హావేరి, కొప్పళ, రాయచూరు, రామనగర జిల్లాల్లో మైనర్ బాలికలు గర్భం దాల్చడం అధికంగా నమోదైంది.

దుష్పరిణామాలు అనేకం

చిన్నవయసులోనే గర్భం దాలిస్తే అనేక కుటుంబ, సామాజిక సమస్యలు ఎదుర్కోవాలి. నెలలు నిండక ముందు శిశు జననం, ఆర్థిక ఇబ్బందులు, చదువులకు దూరం, ఆరోగ్య సమస్యలు రావచ్చు. వీటిని తట్టుకోలేక ఆత్మహత్యలు తీవ్రమవుతాయి.

పెద్ద సవాలే: మంత్రి హెబ్బాళ్కర్

మైనర్లు గర్భం దాల్చడం ప్రభుత్వానికి సవాల్‌గా మారిందని మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ తెలిపారు. గృహలక్ష్మీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఈ సమస్యపై దృష్టిపెట్టాం, అవసరమైతే కొత్త చట్టం తీసుకువస్తాం, వీటితో పాటు పిల్లలు అక్రమ రవాణాను సున్నాకు తేవాలని పలు శాఖలతో పథకం రూపొందిస్తామని చెప్పారు.

ఉప్పి గలీజు మాటలపై కేసు



యశవంతపుర: నటుడు, రాజకీయ నాయకుడు ఉపేంద్ర కించపరిచే విధంగా మాట్లాడారని వివాదంలో పడ్డారు. ప్రజ్ఞావంతుల పార్టీ స్థాపించి ఆరేళ్లు కావస్తున్న సందర్భంగా ఆయన అభిమానులతో ఇన్‌స్టాలో లైవ్‌లో మాట్లాడారు. ఊరు అంటే గలీజు కూడా ఉంటుందని వ్యాఖ్యలు చేశారు. దీంతో సోషల్ మీడియాలో అనేకమంది ఉపేంద్ర మాటలను ఖండించారు. ప్రజలను గలీజుతో పోల్చి మాట్లాడటం ఎంత వరకు సమంజసమంటూ ప్రశ్నించారు. గలీజు ప్రాంతాలలో బతికే ప్రజలందరూ గలీజువాళ్లనా అని మండిపడ్డారు. ఇది రచ్చ కావడంతో ఉప్పి క్షమాపణలు చెప్పారు. ఆయన మాటలు ఒక వర్గాన్ని కించపరిచేలా ఉన్నాయని సమాజ కళ్యాణ శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో బెంగళూరు చెన్నమ్మన కెరె అచ్చుకట్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపేంద్ర దిష్టిబొమ్మ దగ్ధం



దొడ్డబళ్లాపురం: నటుడు ఉపేంద్ర వ్యాఖ్యలకు నిరసనగా రామనగరలో ఆదివారం దళిత సంఘాలు ధర్నా నిర్వహించాయి. ఊరు అన్నాక మురికివాడ ఉంటుందని ఇటీవల ఉపేంద్ర వ్యాఖ్యలు చేశాడు. ఈ వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీశాయని భావించి దళిత సంఘాల నాయకులు ధర్నా నిర్వహించి ఉపేంద్ర దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. తక్షణం ఉపేంద్ర దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు.

కరువు షరతుల్ని సడలించాలి: సీఎం



శివాజీనగర: రాష్ట్రంలో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వర్షాల కొరత ఏర్పడగా, కరువు ప్రకటనకు కేంద్రం షరతులు కఠినంగా ఉన్నందున వాటిని సడలించాలని సీఎం సిద్దరామయ్య కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు లేఖ రాశారు. కరువు పరిహారానికి కేంద్రం 75 శాతం నిధులిస్తే, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం జమచేసి రైతులకు అందిస్తుంది. కానీ దీనికి కేంద్రం కఠినమైన షరతులను రాష్ట్రాలు పాటించాలి. రాష్ట్రంలో ఐదారు జిల్లాలు తప్ప ఎక్కువ ప్రాంతాల్లో వర్షాభావం ఏర్పడి కరువు కోరలు చాస్తోంది. కేంద్రం నియమాల ప్రకారం 60 శాతం వర్షాల కొరత ఉండాలి, కనీసం మూడు వారాలు వరుసగా వర్షం కురిసి ఉండరాదు. రాష్ట్ర సర్కారు ఇలా కాకుండా, జిల్లాల్లో కరువు పరిస్థితిని గమనించాలని, 60 శాతం ఉన్న వర్షాభావాన్ని 30 శాతానికి కుదించాలని కోరుతోంది. మూడు వారాలు షరతును రెండు వారాలకు తగ్గించాలని లేఖలో కోరారు.

కమీషన్లు అబద్ధం : మంత్రి

హుబ్లీ: కాంట్రాక్టర్ల నుంచి అధికార కాంగ్రెస్ నేతలు కమీషన్లు అడుగుతున్నారని వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని రాష్ట్ర కార్మిక మంత్రి సంతోష్ లాడ్ అన్నారు. ఆదివారం ఆయన ధార్వాడలో మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వం కొత్త పనులే ప్రారంభించక పోతే కమీషన్లు అడిగారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంట్రాక్టర్లకు బకాయిలు తప్పకుండా చెల్లిస్తామని అన్నారు.

స్వామీజీ వివాదాస్పద వ్యాఖ్యలు

శివాజీనగర: వారికి మాత్రమే కాదు హిందూ యువకుల కూడా మగతనం, మీసం ఉంది. వారు కూడా వేరే మతం యువతులను లవ్ చేసి మతమార్పిడి చేయాల్సి వస్తుందని సిద్దరూఢ భారతీ స్వామి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆదివారం బెంగళూరు మల్లేశ్వరంలో మతమార్పిడి, గోహత్య నిషేధ చట్టాల రద్దుపై సాధువుల సమావేశంలో ఆయన పాల్గొని మీడియాతో మాట్లాడారు. లవ్ జిహాద్‌ను ప్రస్తావిస్తూ జాగ్రత్తగా ఉండాలని ఒకవర్గాన్ని హెచ్చరించారు. భారతదేశంలో స్వాతంత్ర్యం తరువాత హిందూ, జైన్, సిక్కు, బౌద్ధుల జనసంఖ్య తగ్గుతోంది, ఇతర మతాల జనాభా పెరుగుతోందన్నారు. లవ్ జిహాద్, మత మార్పిడి ద్వారా జన సంఖ్య అధికం చేసుకొంటున్నారన్నారు. హిందువులు సంకుచితులు కాదు, తాను కూడా బైబిల్, ఖురాన్ చదివానని చెప్పారు.





• స్వరాజ్య సాధన

ఆదివారం బెంగళూరు మానెక్ షా మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవంనాటి కవాతు కోసం ఎన్‌సీసీ విద్యార్థుల సాధన. ఆర్మీ, పోలీస్ బలగాలు, మోటార్ బైక్ బ్యాచ్‌ల రిహార్సల్స్ ఆకట్టుకున్నాయి. (ఇన్‌సెట్లో) ఎంజీ రోడ్డులో జెండాలు విక్రయిస్తున్న యువకుడు

సిటీ బస్‌లో బాలికపై వేధింపులు?

శివాజీనగర: బీఎంటీసీ బస్సులో విద్యార్థినులపై పట్టపగలే కండక్టర్, ఇద్దరు పురుషులు వేధించారు. ఈ కీచకకాండపై తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ మెట్లెక్కారు. వివరాలు.. ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బాలిక దొమ్మలూరు నుంచి రిచ్మండ్ సర్కిల్‌కు ప్రయాణం చేస్తుండేది. గుంజూరు డిపో, 41, కేఏ 57–ఎఫ్2695 బస్సులో బాలిక ఉచిత ప్రయాణం కోసం ఆధార్ కార్డు చూపింది. కండక్టర్ చూసి అందులో వేరేభాష ఉంది, డబ్బులిచ్చి టికెట్ తీసుకోమన్నాడు. సరేనని బాలిక టికెట్ కొనుక్కుంది. కానీ కండక్టర్, ఇద్దరు పురుషులు బాలికను చూస్తూ మాపైన నీ తల్లిదండ్రులకు చెబుతావా? నీ తండ్రి ఏమైనా సీఎం, పీఎమ్మా? అని గద్దించారని, మెడపట్టుకుని బయటకు తోసేయడానికి యత్నించారని బాలిక తల్లి ఆరోపించింది. రిచ్మండ్ సర్కిల్‌లో దింపకుండా, కార్పొరేషన్ సర్కిల్ వద్ద విద్యార్థినిని దింపి వెళ్లారని, తమకు న్యాయం చేయాలని ఆమె కోరింది.

పుష్పవనం జనకెరటం



ఆదివారం పుష్ప ప్రదర్శనను చూసేందుకు తరలివచ్చిన జనం

- లాల్‌బాగ్‌లో భారీ రద్దీ

బనశంకరి: ఆదివారం బెంగళూరు లాల్‌బాగ్ ఇసుకేస్తే రాలనంతగా సందర్శకులతో కిటకిటలాడింది. స్వరాజ్య ఫల పుష్ప ప్రదర్శనకు నగరవాసులే కాకుండా జిల్లాల నుంచి కూడా తరలివచ్చారు. విధానసౌధ పుష్ప రూపం, నెమలి, కర్ణాటక మ్యాప్, తోరణాలు ఇలా అనేక పూల రూపాలను తిలకించి తన్మయులయ్యారు. యువత సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్న దృశ్యాలు కనిపించాయి. విభిన్న రకాల గులాబీపూలు, ఆంథోరియం, జర్బేరా, ఆర్కిడ్లు, ఇంపేషన్స్ పుష్పాలు, లిల్లీలు, రెడ్‌హాట్ పోకర్ ఇలా అనేక అందమైన పుష్పాల అలంకరణలు అలరించాయి. శనివారం 80 వేల మంది సందర్శించగా టికెట్ల విక్రయం ద్వారారూ.49 లక్షల ఆదాయం వచ్చిందని ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ జగదీశ్ తెలిపారు. ఇక లాల్‌బాగ్ చుట్టుపక్కల వాహనాల రద్దీతో ట్రాఫిక్ అస్తవ్యస్తమైంది. 15 తేదీ ఉదయం 10 గంటలనుంచి రాత్రి 8 గంటల వరకు లాల్‌బాగ్ మెట్రో నుంచి ఏ మెట్రో స్టేషన్ కు ప్రయాణించడానికి టికెట్ ధర రూ.30 గా నిర్ణయించారు.



కళాకృతులను తిలకిస్తున్న సందర్శకులు

బీబీఎంపీ అగ్నిప్రమాదం.. ముగ్గురి పరిస్థితి విషమం

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె కేంద్ర కార్యాలయ ఆవరణలోని క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం గురించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామని, నివేదిక అందాల్సి ఉందని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 9 మందిలో ముగ్గురికి మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఇంజినీర్ శివకుమార్ కు 25 శాతం గాయాలు కాగా గొంతులో సమస్య రావడంతో మాట్లాడటం కష్టతరంగా ఉందన్నారు. మరో ఇంజినీర్ కిరణ్ పరిస్థితి తీవ్రంగా ఉందని, అతడికి ఇప్పటికే రెండుసార్లు డయాలసిస్ చేశారని, నెఫ్రాలజీ డాక్టర్లు వైద్యమందిస్తున్నారని చెప్పారు. డీటీపీ ఆపరేటర్ జ్యోతి ముఖానికి తీవ్రగాయం కాగా శ్వాసకోశ సమస్య ఎదుర్కొంటోందన్నారు. ఈ ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని, మిగిలినవారి ఆరోగ్యం స్థిరంగా ఉందన్నారు. అందరికీ పాలికె ద్వారా చికిత్స అందిస్తూ ఖర్చు భరిస్తున్నట్లు, కాలిన గాయాలకు ప్లాస్టిక్ సర్జరీ చేయాలని నిర్ణయించామని తెలిపారు.

ప్రేతాత్మ జంటకు పెళ్లి వేడుక

యశవంతపుర: తుళునాడులో జరిగే విభిన్నమైన పెళ్లి వేడుక ఇది. వధూవరులు ఎవరో కంటికి కనిపించరు. అటు, ఇటు పెళ్లిపెద్దలు చేరి వేడుక జరిపించి ఆశీర్వదిస్తారు. కొత్త జోడీ ఎవరి కంటికి కనిపించకుండా తంతు ముగిసిపోతుంది. దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాల్లో ఏటా ఒకసారి ప్రేతాత్మలకు వివాహం చేయడం ప్రజలకు ముఖ్యమైన ఆచారం. కరావళిలో ప్రస్తుతం తుళు మాసంలో ఎలాంటి శుభకార్యాలు జరగవు. కుటుంబంలో ఎవరైనా పెళ్లి కాకుండా మరణించి ఉంటే వారికి ఇప్పుడు పెళ్లిళ్లు చేయడం ఇక్కడ సంప్రదాయం. తద్వారా మృతులకు పెళ్లి ముచ్చట తీరినట్లుగా భావిస్తారు. బంట్వాళ తాలూకా వగ్గ గ్రామం వధువు కుటుంబం, ఉళ్లాల తాలూకా కోణాజె సమీపంలోని చోళ్మ వరుని కుటుంబంగా ఏర్పడి ప్రేతాత్మలకు పెళ్లి చేశారు. వగ్గ గ్రామానికి చెందిన సంజీవ పూజారి కుతూరు విశాలాక్షి రెండేళ్ల క్రితం మృతి చెందింది. చోళ్మలో లక్ష్మణ కొడుకు ధరణేశ్ రెండేళ్ల క్రితం చనిపోయాడు. వీరిద్దరూ అవివాహితులు కావడంతో ఇరు కుటుంబాలవారు పెళ్లి వేడుకను నిర్వహించారు.



పెళ్లితంతు చేస్తున్న మహిళలు

కబళించిన నీటిమడుగు

- తల్లీ కొడుకు, ఇద్దరు బాలలు జలసమాధి
- తుమకూరు సిద్దగంగ మఠం వద్ద ఘోరం

తుమకూరు: తల్లి నీటి మడుగు వద్ద బట్టలు ఉతుకుతుండగా ఆమె వెంట వెళ్లిన ముగ్గురు బాలలు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి మరణించారు, వారిని కాపాడబోయి మహిళ కూడా జల సమాధి అయ్యింది. ఈ దుర్ఘటన ఆదివారం తుమకూరు నగరంలోని సిద్దగంగ మఠం వెనుక ఉన్న గోకట్టె మడుగులో జరిగింది. వివరాలు... సిద్దగంగ మఠంలో చదువుకుంటున్న విద్యార్థులు హర్షిత్, శంకర్, మహాదేవప్ప, మహిళ లక్ష్మి నీటి మడుగు వద్దకు వెళ్లారు. బెంగళూరులోని బాగలకుంటెకు చెందిన లక్ష్మి (35) కుమారుడు శంకర్ (8) సిద్దగంగ మఠంలో 3వ తరగతి చదువుకుంటున్నాడు, అతన్ని చూడాలని వచ్చిన ఆమె అతని బట్టలు ఉతుకుదామని కుంట వద్దకు వెళ్లింది. దీంతో శంకర్‌తో పాటు అతని మిత్రులు మహాదేవప్ప (8), హర్షిత్ (8) కూడా ఆమె వెంట వెళ్లారు.

పిల్లల్ని కాపాడబోయి మహిళ..

లక్ష్మి బట్టలు ఉతుకుతుండగా, ముగ్గురు పిల్లలు మడుగు గట్టున ఆడుకుంటూ ఉన్నారు. ఇంతలో శంకర్ లోపలకు పడిపోయి మునిగిపోసాగాడు. అతన్ని కాపాడాలని మిగతా ఇద్దరూ ప్రయత్నించి వారు కూడా మునిగిపోసాగారు. అది చూసి లక్ష్మి గట్టిగా కేకలు వేస్తూ మడుగులోకి దూకింది. ఎవరికీ ఈత రాకపోవడంతో పాటు చుట్టుపక్కల కాపాడేందుకు కూడా ఎవరూ లేకపోయారు. మొత్తం నలుగురూ నీట మునిగి మృత్యువాత పడ్డారు. లక్ష్మి వెంట వచ్చిన బంధువులు ఇంకా రాలేదేమిటా అని కుంట వద్దకు వచ్చి చూడగా అందరూ విగతజీవులుగా కనిపించారు. విషయం తెలిసి విద్యార్థులు, ఆశ్రమ సిబ్బంది పరుగు పరుగున చేరుకున్నారు. క్యాత్సంద్ర పోలీసులు వచ్చి రబ్బరు బోటు ద్వారా మృతదేహాలను బయటికి తీసి ఆస్పత్రికి తరలించారు. మృతుల బంధుమిత్రుల రోదనలతో ఆశ్రమంలో విషాదం తాండవించింది.



నలుగురిని బలిగొన్న నీటి మడుగు ఇదే. మృతదేహాల కోసం రబ్బరుబోటుతో గాలింపు



బట్టలు ఉతకడానికి వెళ్లి మృత్యువాత.. లక్ష్మి (ఫైల్)



విలపిస్తున్న బంధువులు



లక్ష్మి, కొడుకు శంకర్ మృతదేహాలు

విహారయాత్రలో ఘోర విషాదం

- లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు
- ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి
- చిత్రదుర్గం జిల్లాలో దుర్ఘటన



సంగన బసప్ప, రేఖ దంపతులు (ఫైల్)

సాక్షి, బళ్లారి: సరదాగా విహారయాత్రకని బయల్దేరినవారిని మృత్యుదేవత వెంటాడింది. రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదు మంది మృతి చెందిన హృదయ విదారక ఘటన చిత్రదుర్గం జిల్లాలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం విజయపుర (బీజాపూర్) జిల్లాకు చెందిన సంగన బసప్ప (36), భార్య రేఖ(29), వీరి కుమారుడు బసప్ప (8), బంధువులు భీమంకర్ (26) మధుసూదన్ (24) అనే ఐదుమంది మృతులు.



నుజ్జైన కారు ముందు భాగం



ప్రమాద దృశ్యం

ఎలా జరిగిందంటే..

బీజాపూర్ ప్రైవేటు బ్యాంకులో పని చేస్తున్న సంగన బసప్ప కుటుంబ సభ్యులతో కలిసి చిక్కమగళూరు టూర్ కోసం కేఏ–28,జడ్8572 కారులో వెళుతున్నారు. చిత్రదుర్గం సమీపంలోని మల్లాపూర్ వంతెన వద్ద ప్రయాణిస్తుండగా ముందు వెళ్తున్న లారీని ఢీకొన్నారు. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనలో అనితా (6) ఆదర్శ (4) అనే చిన్నారులకు తీవ్రగాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జిల్లా ఎస్పీ పరుశురాం, స్థానిక పోలీసులు అధికారుల ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించి గాయపడిన వారికి మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి పంపించారు.

క్లుప్తంగా

నగరానికి రాజీవ్ సద్భావన జ్యోతి



రాయచూరు రూరల్: తమిళనాడు శ్రీ పెరంబదూరు నుంచి ప్రారంభమైన రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతి యాత్ర వివిధ ప్రాంతాలు తిరుగుతూ శనివారం సాయంత్రం రాయచూరు చేరుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. నగర అధ్యక్షుడు బసవరెడ్డి, నేతలు జయన్న, రుద్రప్ప, అరుణ్, శివమూర్తి జిందప్ప, రమేష్, శాలం, భీమనగౌడ, అంజినేయ పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకున్న సురేష్ దంపతులు

రాయచూరు రూరల్: నగరంలో శనివారం సాయంత్రం కన్నడ భవనంలో బెంగళూరు కర్ణాటక వీధి నాటక అకాడమీ, రాయచూరు రంగసిరి ఆధ్వర్యంలో రంగ కళాకారుడు సురేశ్ దంపతులకు సిజికె రంగ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బండాయి సాహితీవేత్త బాబు భండారిగల్ మాట్లాడుతూ... వీధి నాటకాలకు ఆదరణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాకారులు మల్లన గౌడ, హక్కి, ప్రవీణ్ రెడ్డి, రంగస్వామి, గురునాథ్ దితరులు పాల్గొన్నారు.

నీటి నిర్వహణపై దృష్టి పెట్టాలి

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువకు నీరు విడుదల చేస్తున్న తరుణంలో నీటి నిర్వహణ చేయాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 69వ మైలు వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించి చివరి ఆయకట్టు భూములకు నీరందించాలంటే గేజ్ సామర్థ్యం పెంచాలన్నారు. 104వ మైలుకు నీరందించేలా చూడాలన్నారు. ఈ నెల 16న ఐసీసీ సమావేశం జరుగుతుందన్నారు.

ఇంజినీర్ చెన్నబసప్పను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న వినోద్ రెడ్డి

రాయచూరు రూరల్: దేవదుర్గలో అభివృద్ధి పనులు చేయకుండానే నిధులు డ్రా చేసుకున్న ఇంజినీర్ చెన్నబసప్ప మెకాలేను సస్పెండ్ చేయాలని కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షుడు వినోద్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ... 2021–22లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.వంద కోట్లు నిధులు విడుదల చేసిందని, బోగస్ బిల్లులతో నిధులు దిగమింగిన పంచాయతీ విభాగం ఇంజినీర్ చెన్నబసప్ప, మాజీ ఎమ్మెల్యే అండతో కాంట్రాక్టర్ల అవసరం లేకుండా అన్ని తానే పనులు చేసినట్లు రికార్డులు చూపి నిధులు కొట్టేశారని, అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

డ్యాంలో పర్యాటకుల సందడి



డ్యాంను వీక్షిస్తున్న పర్యాటకులు

హొసపేటె: తుంగభద్ర జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతుండటంతో డ్యాంను వీక్షించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆదివారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. డ్యామ్ అందాలను వీక్షించారు.

యోగాలో సత్తా చాటిన విద్యార్థులు



హొసపేటె: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నగరంలోని ఆదివారం ఏర్పాటు చేసిన జోనల్ యోగా పోటీలలో టీబీ డ్యాం పీఎల్‌సీ విద్యార్థులు తమ సత్తాచాటారు. విద్యార్థులు అజయ్, గౌతమ్, దివ్య యోగా పోటీలలో ఉత్తమ ప్రదర్శన చేసి తాలూకా స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. తాలూకా స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ముఖ్యోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవి, ఈరప్ప, స్వర్ణకుమారి, శ్వేతా, నిర్మల, హేమలత అభినందించారు.

జల వనరులను జాతీయ సంపదగా పరిగణించాలి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉగ్రప్ప

బళ్లారి టౌన్: రాష్ట్రంలో ఉన్న జల వనరులను కేంద్ర ప్రభుత్వం జాతీయ సంపదగా పరిగణించి అభివృద్ధికి తోడ్పడాలని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉగ్రప్ప పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఈమేరకు తాను డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రధాని నరేంద్రమోదీకి లేఖను రాసినట్లు వివరించారు. రాష్ట్రంలో కృష్ణా, కావేరి, గోదావరి, వెస్టన్ ఘాట్స్ ద్వారా 4 వేల టీఎంసీలు నీరు లభ్యమవుతుండగా గత 70 ఏళ్లుగా ప్రతి ఏటా 2 వేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతున్నాయని పేర్కొన్నారు. వీటిని జాతీయ సంపదగా పరిగణించి ప్రత్యేక బడ్జెట్‌ను ఏర్పాటు చేసి ఈ నీటిని నిల్వ చేసుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. ఇక బళ్లారి, విజయనగర జిల్లాల్లో గల టీబీ డ్యాం ప్రతిఏటా 200 టీఎంసీలు నీరు సముద్రం పాలవుతున్నాయని కర్ణాటక, ఆంధ్రా, తమిళనాడు ప్రభుత్వాలు వృథాగా పారుతున్న ఈనీటిని నిల్వ చేసి వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ఉభయ జిల్లా పరిధిలో టీబీ డ్యాం ఉన్నప్పటికి బళ్లారి నగరంలో వారానికి ఒకసారి నీరు సరఫరా చేయడం దురదృష్టకరమని, మరో రిజర్వాయర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. టీబీ డ్యాంలో పూడికతీతకు ఆసక్తి కనబరచాలన్నారు. గంగా కావేరి నదులను లింకింగ్ ప్రాజెక్టు చేపడుతామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న ఆసక్తి కర్ణాటకలోను నదుల లింకింగ్ ప్రాజెక్టును నిర్మించేందుకు ఆసక్తి కనబరచాలని పేర్కొన్నారు. సమావేశంలో కలకంబ పంపాపతి, లోకేష్, మంజునాథ, రుద్రప్పలు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

హుబ్లీ: రైల్లో రవాణా చేస్తున్న గంజాయిని హుబ్లీ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అమరావతి ఎక్స్‌ప్రెస్ రైల్లో బోగీలను తనిఖీ చేస్తుండగా బస్తాల్లో గంజాయిని గుర్తించారు. ఓ వ్యక్తి హౌరా నుంచి గోవాకు గంజాయి రవాణా చేస్తున్నాడు. ఓ బోగీలో ఉన్న నాలుగు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. గంజాయిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారు అనే దానిపై కూడా విచారణ చేస్తున్నారు.

ఎయిమ్స్ మంజూరు చేయకపోతే ప్రాణత్యాగం



మాట్లాడుతున్న సుఖాణి

రాయచూరు రూరల్: రాయచూరుకు ఎయిమ్స్ సంస్థను మంజూరు చేయక పోతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని తారానాథ్ విద్యా సంస్థల అధ్యక్షుడు పారసమల్ సుఖాణి వెల్లడించారు. ఆదివారం ఎల్‌వీడీ కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పియాంక్ ఖర్గే ఎయిమ్స్ సంస్థను కలబుర్గికే కేటాయించాలని డిమాండ్ చేయడం తగదన్నారు. రాయచూరు జిల్లా అన్ని విధాలుగా వెనుకబడి ఉందని, ఎయిమ్స్ మంజూరు చేయకపోతే ఊరుకునేది లేదన్నారు. వ్యవసాయంలో రాణించిన కవితా మిశ్రాకు ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజు పండిత్ తారానాథ్ అవార్డు, రూ. లక్ష నగదు ప్రదానం చేస్తామన్నారు. పండ్లు విక్రయించే మంగమ్మను ఈ సందర్భంగా సన్మానిస్తామన్నారు. సమావేశంలో పవన్ కుమార్ సుఖాణి, శ్రీనివాస్, అంబాపతి, దేవిరెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ భవనానికి నిధులు మంజూరు చేయండి



ఎమ్మెల్యే నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సిరుగుప్ప: ఎస్సీ, ఎస్టీ భవనానికి స్థలం మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు వెంకటేశులు ఎమ్మెల్యే నాగరాజుకు విజ్ఞప్తి చేశారు. నగరంలో ఆదివారం అభయాంజనేయ స్వామి ఆలయంలో తాలూకా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం సమన్వయ సమితి నూతన ఎమ్మెల్యేకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వెంకటేశులు మాట్లాడుతూ... కొన్నేళ్లుగా శిథిలమైన సంఘం భవనం రోడ్డు వెడల్పు కారణంగా పూర్తిగా పాడైపోయిందని, సంఘానికి కొత్త స్థలం కేటాయించి రూ. కోటి నిధులను విడుదల చేయాలని ఎమ్మెల్యే నాగరాజుకు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులపై అసెంబ్లీలో గళం విప్పాలని ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను జారీ చేసే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తాలూకా వైద్యాధికారి డా.ఈరణ్ణ, సీనియర్ ఉద్యోగులు శేఖరప్ప మేగళమనె, హనుమంతప్ప, పంపాపతి, తిరుమలేశ, చంద్రకాంత, రాఘవేంద్ర, విరుపాక్షప్ప తదితరులు పాల్గొన్నారు.

దేహదానాలకు ముందుకు రావాలి

రాయచూరు రూరల్ : ప్రతి ఒక్కరూ దేహదానాలకు ముందుకు రావాలని రాష్ట్ర దేహ దానాల జాగృతి అధ్యక్షుడు శివానంద పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయలో ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మరణించిన తర్వాత దేహాలను ఖననమో, దహనమో చేస్తున్నారని, మానవత్వంతో అవయదానం చేస్తే మరణం అంచుల్లో ఉన్న వారికి జీవితం ప్రసాదించిన వారమవుతామన్నారు. మరణాంతరం ప్రతి ఒక్కరూ అవయవ దానం చేయాలని సూచించారు. ఈ విధంగా కుటుంబ సభ్యుల్లో జాగృతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంచాలకురాలు స్మిత, నవోదయ కళాశాల వైద్యుడు విశాల్, శారద, పవన్, కేదార్, రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన రెవెన్యూ ఉద్యోగులు

కంప్లి: రెండు రోజుల పాటు జరిగిన రెవెన్యూ క్రీడోత్సవాల్లో కంప్లి తాలూకా నుంచి వీఏఓ చెన్నకేశవ నెల్లుడి నాయకత్వంలో పురుషుల విభాగంలో కబడ్డీలో ప్రథమ స్థానం పొందింది. క్యారమ్స్‌లో హిరేజాయిగనూరు వీఏ జిలాన్ క్యారమ్స్ సింగల్స్‌లో ప్రథమ స్థానం పొందగా వీఏ విజయ్‌కుమార్ ద్వితీయ స్థానం పొందారు. క్యారమ్స్ డబుల్స్‌లో జిలాన్, విజయ్‌కుమార్‌లు ద్వితీయ స్థానం పొందారు. వంద మీటర్ల పరుగు పందెంలో డీ గ్రూప్‌నకు చెందిన సంతోష్ ప్రథమ స్థానం పొందగా, గ్రామ సహాయకుడు సురేష్ ద్వితీయ స్థానం పొందారు. అన్ని విభాగాల్లో కంప్లి తాలూకా రెవెన్యూ ఉద్యోగులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గ్రామ పాలక అధికారుల సంఘం అధ్యక్షుడు హెచ్‌వీ మంజునాథ్ తహసీల్దార్ గౌసియాబేగంకు కృతజ్ఞతలు తెలిపారు.

వాల్మీకి మఠంపై దృష్టి సారిస్తాం

బళ్లారి అర్బన్: దావణగెరె జిల్లా రాజనహళ్లి గ్రామంలోని హరిహర మఠంపై దృష్టి సారిస్తామని మంత్రి నాగేంద్ర అన్నారు. ఆదివారం ఆయన బళ్లారిలో ఓ కార్యక్రమానికి విచేసి విలేకరులతో మాట్లాడారు. వాల్మీకి మఠంతో పాటు మఠం ప్రముఖులపై సోషల్ మీడియాలో అనేక ఆరోపణలు వస్తున్నాయని, ఈ విషయం ఇప్పటికే తన దృష్టికి వచ్చిందని అన్నారు. మఠంలో ఉన్న ఆభరణాలు, ఆస్తులు మాయమైనట్లు ఆరోపణలు వస్తున్నాయని, తప్పకుండా విచారణ చేయిస్తామన్నారు.

డీహెచ్‌ఓగా శంకర్‌నాయక్



హొసపేటె: విజయనగర జిల్లా నూతన డీహెచ్‌ఓగా శంకర్‌నాయక్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఉన్న జిల్లా ఆరోగ్యాధికారి సలీం బదిలీ కావడంతో ఆయన స్థానంలో శంకర్‌నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి

- మాజీ సీఎం జగదీశ్ శెట్టర్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ సీఎం జగదీశ్ శెట్టర్, మంత్రి నాగేంద్ర తదితరులు

సాక్షి,బళ్లారి: వీరశైవ లింగాయత్ ఉప కులాలు చెందిన వారంత కలిసికట్టుగా ఉంటేనే రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాభివృద్ధి సాధించేందుకు దోహదం చేస్తుందని మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన నగరంలోని బసవభవనంలో వీరశైవ లింగాయత్ బణజిగ సమాజం జాగృతి సమావేశం, ప్రతిభా పురస్కార కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వీరశైవ బణజిగ సమావేశం ఏర్పాటు చేయడం తప్పుకాదని, అయితే ఉప కులాలను కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. వీరశైవ సమాజం అన్ని కులాలు, మతాల సంక్షేమానికి కృషి చేయాలని పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికల్లో వీరశైవులను బీజేపీ నిర్లక్ష్యం చేయడం వల్ల తగిన మూల్యం చెల్లించారని బీజేపీపై మండిపడ్డారు. బసవణ్ణ తత్వ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని బణజిగ కులస్థులు వ్యాపారాలతో పాటు ఇతర రంగాలపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏడుగురు బణజిగా సమాజానికి చెందిన వారు ముఖ్యమంత్రులు అయ్యారని అదంతా వీరశైవ లింగాయత్‌లు అన్ని ఉప కులాలు, అన్ని కులాల మతాలు చెందిన వారి తోడ్పటుతోనే సాధ్యమైందన్నారు. రాజకీయంగా ముందుకు వెళ్లేందుకు ఐక్యమత్యంగా ఉండాలని సూచించారు. మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి శెట్టర్ రావడంతో కొండంత బలం చేకూరిందని శాసనసభ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ఎంతో శ్రమించారని కొనియడారు. కార్యక్రమంలో పలువురు మఠాధీశులు, మాజీ మంత్రి అల్లం వీరభద్రప్ప, ఎమ్మెల్సీ వైఎం సతీష్, వీరశైవ సమాజ ప్రముఖులు గుత్తిగనూరు విరుపాక్షిగౌడ, డాక్టర్.మహంతేష్, మంజునాథ్, రాజశేఖర్ పట్టనశెట్టి, గుడెకోట నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దరోజి ఈరమ్మ సమాధి అభివృద్ధి చేయరా ?



దరోజి గ్రామంలో ఈరమ్మ సమాధి స్థలం

కంప్లి: పౌరాణిక, చారిత్రాత్మక ఇతిహాస కథలు, కావ్యాలతో కంచుకంఠంతో బుర్రకథల ద్వారా పేరొందిన దరోజి ఈరమ్మ స్వర్గస్తురాలై 9 ఏళ్ల గడచినా ఆమె సమాధి చేసిన ప్రాంతం అభివృద్ధి కార్యరూపం దాల్చలేదు. దరోజి గ్రామాల్లో ఉన్న సమాధి స్థలం రెండు ఎకరాల్లో చుట్టూ కాంపౌండ్, సీసీ రోడ్డు వేయడం తప్ప అక్కడ సాంస్కృతిక సమన్వయ కట్టడం, బుర్రకథ శిక్షణకేంద్రం, స్మారక ఉద్యానవన, నిర్మాణాలు కలగానే మిగిలిపోయాయి. కన్నడ, సాంస్కృతికశాఖ అభివృద్ధి పట్ల దృష్టి సారించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అభివృద్ధి చేపట్టాలని కళాకారులు విన్నవిస్తున్నారు.

వినాయక ఉత్సవాల్లో డీజే నిషేధం



మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

రాయచూరు రూరల్: వచ్చే నెలలో జరుపుకునే వినాయక చవితి ఉత్సవాల్లో డీజేను పూర్తిగా నిషేధించినట్లు రాయచూరు డీఎస్పీ సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సదర్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు గురురాజ కట్టిముని, నాగరాజ్, ప్రదీప్, ఎస్ఐలు మంజునాథ్, ప్రకాష్ డంబల్, శాంతి సమావేశం సంచాలకులు మహవీర్, అశోక్ కుమార జైన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడికి ఘన నివాళి



రంగనాథన్ చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

కంప్లి: గ్రంథాలయాల పితామహుడు రంగనాథన్ అందించిన కానుక అపారమైందని హెచ్‌పీ శికారి రాము తెలిపారు. పట్టణ ఎండీ క్యాంప్ 21వ వార్డులో ఆలేమారి గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ జయంతి సందర్భంగా ఈనెల 12న గ్రంథపాలకుల దినంగా ప్రకటించిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సింధోళ సమాజ రాష్ట్ర అధ్యక్షుడు రావుల్ నాగప్ప, ఆదివాసి బుడకట్టు మేదార కేతయ్య సంఘం కార్యదర్శి గళికుమార్, సుడుగాడు సిద్ధార క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు సణ్ణహాలిగప్ప, ఉపాధ్యక్షులు తులసి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

బైక్ దొంగల ఆటకట్టు

- 30 వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నారాయణ



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కోలారు: బైక్‌లు అపహరిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ నారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం నగరంలోని గల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో వివరాలు వెల్లడించారు. ఈనెల 11న రాత్రి నగరంలోని ఆర్జీ లేఔట్‌లో గస్తీలో ఉన్న పోలీసులకు ఓ హోండా డియో వాహనంలో నెంబర్ లేకుండా తిరుగుతున్న ఇద్దరిని గుర్తించి వివరాలు అడిగారు. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వారిని గల్‌పేట పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయాలు వెల్లడించారు. నిందితులను నగరంలోని కారంజికట్టకు చెందిన సంజయ్ జయచంద్రన్ అలియాస్ ఫారూక్, కుంబారపేటకు చెందిన నదీం, దర్గా మొహల్లాకు చెందిన ఇమ్రాన్‌లుగా గుర్తించారు. వారిని అరెస్ట్ జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు పోలీసులు తెలిపారు. వీరు జిల్లాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అపహరించిన 30 ద్విచక్ర వాహనాలు, 50 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

వైభవంగా ఆషాఢమాస పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గామాత

కెజీఎఫ్: నగరంలోని గణేష పురంలో ఉన్న శ్రీ దుర్గాదేవి ఆలయంలో అధిక శ్రావణ జాత్రా మహోత్సవం సందర్భంగా పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ప్రధాన అర్చకులు గురుదీక్షిత్ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త మురుగేష్, దేవాలయ సమితి అధ్యక్షుడు దయానంద్, లోకేష్, ఉపాధ్యక్షుడు గౌతం తదితరులు పాల్గొన్నారు.

భారీ జాతీయ పతాకం

మాలూరు: పట్టణంలోని హోండా క్రీడా మైదానంలో ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ రోజు అతి ఎత్తైన జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్నట్లు ఎమ్మెల్యే కె వై నంజేగౌడ తెలిపారు. ఆదివారం హోండా క్రీడా మైదానంలో ఏర్పాట్లను పరిశీలన చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దయానంద్, కె రమేష్, మాస్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయనరసింహ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు



పనులు పరిశీలన చేస్తున్న ఎంపీ మునిస్వామి

కేజీఎఫ్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కోలారు జిల్లాలో రైల్వే స్టేషన్ల అప్‌గ్రేడ్ చేయడం కోసం రూ.135 కోట్ల నిధులు విడుదల చేసిందని ఎంపీ ఎస్ మునిస్వామి తెలిపారు. ఆదివారం తాలూకాలోని మారికుప్పం – కుప్పం నూతన రైల్వే మార్గం నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఈ రైల్వే మార్గం పనుల నిర్వహణ కోసం రూ. 200 కోట్లు విడుదల చేసిందని, ఇప్పటికే నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అదే విధంగా మాలూరులో రైల్వే పై వంతెన నిర్మాణానికి రూ. 31 కోట్లు, టేకల్‌లో రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ. 26 కోట్ల నిధులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. బంగారుపేట రైల్వే స్టేషన్‌లో ఎక్సలేటర్, మారికుప్పం, ఉరిగాం, బిసానత్తంలో విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు, ప్లాట్‌ఫ్లామ్‌ల ఆధునీకరణకు సౌలభ్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.

కళాశాల మైదానంలో స్వాతంత్ర్య వేడుకలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కోలారు: ఈ నెల 15న నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలను నగరంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అక్రం పాషా తెలిపారు. ఆదివారం నగరంలోని జూనియర్ కళాశాల మైదానంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర్య వేడుకలను ఏటా నిర్వహించే విశ్వేశ్వరయ్య స్టేడియంలో అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ఈసారి జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు జూనియర్ కళాశాల మైదానంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. మైదానంలో 5 వేల మంది వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి భైరతి సురేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. నగర ప్రజలు వేడుకలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఎస్పీ ఎం నారాయణ, సీఈఓ పద్మ బసవంతప్ప, ఉప విభాగాధికారి వెంకట లక్ష్మీ, తహసీల్దార్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్య, రక్తదాన శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

తుమకూరు: నాగరకట్టె బళగ, కువెంపు నగర, వివేకానంద రైఫిల్ షూటింగ్ అకాడమి తదితరాల ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవాల సందర్భంగా ఉచిత ఆరోగ్య శిబిరం, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. తుమకూరు నగరంలోని కువెంపు సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. సంజీవని రక్తదాన నిధి ద్వారా సుమారు వంద మంది యువత రక్తదానం చేశారు.

కారు ఢీకొని బైకిస్టు మృతి

మైసూరు: కారు ఢీకొని బైకిస్టు మృతి చెందిన ఘటన హుణసూరు -విరాజపేట జాతీయ రహదారిలో అడిగానహళ్లి గేట్ వద్ద జరిగింది. మృతుడిని హనగోడు సమీపంలోని కాళబూదనహళ్లికి చెందిన తోపేగౌడ(45)గా పోలీసులు గుర్తించారు. ఈయన అడినహళ్లి నుంచి స్వగ్రామానికి బైక్‌లో వెళ్తుండగా కేరళ వైపు నుంచి హుణసూరు వెళ్తున్న కారు ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. మృతుడి మహదేవి, ముగ్గురు సంతానం ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వృద్ధులకు కంటి చికిత్సలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గౌరిబిదనూరు: వృద్ధాప్యంలో వచ్చే కంటి జబ్బులకు వెంటనే చికిత్స చేయించుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు రఘుబాబు, ఇస్తూరి సతీష్ తెలిపారు. ఆదివారం స్థానిక లయన్ కంటి పరీక్షా కేంద్రంలో ఉచిత నేత్ర చికిత్సా శిబిరం ప్రారంభించారు. 54 మందికి పరీక్షలు నిర్వహించి 23 మందిని కంటి ఆపరేషన్లకై బెంగళూరుకు పంపినట్లు తెలిపారు. వీరందరికీ బెంగళూరు లయన్ కంటి ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహించి మరలా బుధవారం గౌరిబిదనూరుకు పిలుచుకొని రానున్నట్లు చెప్పారు.

నేత్ర నిపుణుడు డాక్టర్ చంద్రప్పరేష్మి కన్నుమూత

బనశంకరి: రాజ్యోత్సవ పురస్కారగ్రహీత, ప్రముఖ నేత్ర నిపుణుడు డాక్టర్ చంద్రప్పరేష్మి(90) ఆదివారం కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన కలబురిగి జయనగరలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారని కుటుంబసభ్యులు తెలిపారు. డాక్టర్ చంద్రప్పరేష్మి ప్రపంచంలోనే మూడో ఉత్తమ కంటి వైద్యుడిగా ఖ్యాతి గడించారు. మాజీ రాష్ట్రపతి జ్ఞానీజైల్‌సింగ్, టాటా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జేఆర్‌డీటాటాతో పాటు అనేకమంది ప్రముఖులకు కంటి చికిత్సలు అందజేశారు. చంద్రప్పరేష్మి అంత్యక్రియలు సోమవారం కలబుర్గి జిల్లా చిత్తాపురలో నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

గజ విషాదం



ఏనుగు కళేబరం

మైసూరు: మైసూరు జిల్లా హుణసూరు తాలుకాలోని నాగరహొళె ఉద్యాన వనంలో ఉన్న పెంపుడు ఏనుగుల శిబిరంలో శిక్షణ పొందుతున్న మగ ఏనుగు సుబ్రహ్మణ్యం (50) మృతి చెందింది. దక్షిణ కన్నడ జిల్లా సుబ్రహ్మణ్య అటవీ ప్రాంతంలో ఇది ఇద్దరి మృతికి కారణమైంది. దీంతో దానిని బంధించి తొలుత నాగరహొళె ఉద్యాన వనంలో ఉన్న మత్తిగోడు పెంపుడు ఏనుగుల శిబిరానికి తరలించారు. శిక్షణ సమయంలో ఏనుగు పడికొని ఉండగా అస్వస్థతకు గురైంది. నాగరహొళె వైద్యులు డాక్టర్ రమేష్ వచ్చి చికిత్స చేశారు. క్రేన్ తెప్పించి నిలబెట్టె ప్రయత్నం చేస్తుండగా మృతి చెందినట్లు హులి పథకం డైరెక్టర్ హర్షకుమార్ చిక్కనరగుంది తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం

యశవంతపుర: అద్దె ఇంటి విషయంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవ హత్యాయత్నానికి దారితీసింది. ఈ ఘటన మంగళూరు ఉళ్లాల వద్ద జరిగింది. సమీర్ అనే వ్యక్తి తన సోదరుడికి నెత్తిలపదవు వద్ద మన్సూర్ అనే వ్యక్తి బంధువుల ఇంటిని అద్దెకు తీసుకోవాలని భావించాడు. అయితే రౌడీలకు ఇంటిని అద్దెకు ఇవ్వరాదని మన్సూర్ వాదించాడు. ఇద్దరి మధ్య శనివారం రాత్రి వాగ్వాదం జరిగింది. ఓ దశలో మన్సూర్‌ను సమీర్ కత్తితో గొంతువద్ద కోసి ఉడాయించాడు. స్థానికులు మన్సూర్‌ను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి సమీర్ కోసం గాలించారు. కాగా సమీర్‌పై మంగళూరు, ఉళ్లాల పోలీసుస్టేషన్ల పరిధిలో రౌడీషీట్ నమోదైంది.

త్రివర్ణ సంబరం



ముువ్వన్నెల పతాకాలతో బాలలు



అమానికెరె చెరువులో పడవలో విహరిస్తున్న బాలలు



తుమకూరు: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగం శని, ఆదివారాలు వివిధ కార్యక్రమాలను నిర్వహించగా వందలాది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమాని కెరెలో సంగీత కారంజీ, పడవ విహారంతో పాటు పలు కళా ప్రదర్శనలు జరిగాయి. ఆదివారమ సుమారు 600 మంది చిన్నారులు పడవలో విహరించారు. కలెక్టర్ కే శ్రీనివాస్ పిల్లలతో కలిసి సందడి చేశారు. జాతీయ పతాకాలను పట్టుకుని పోజులిచ్చారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం

- మాణిక్‌షా పరేడ్ మైదానంలో నేడు జాతీయ జెండాను ఆవిష్కరించనున్న సీఎం సిద్ధరామయ్య
- ప్రజలు, అధికారులు, ముఖ్యులకు 8వేల ఆసనాలు



రిహార్సల్స్ చేస్తున్న విద్యార్థులు



త్రివర్ణ పతాకాలతో విద్యార్థులు



విలేకరులతో మాట్లాడుతున్న బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్, కలెక్టర్ కేఏ.దయానంద్, పోలీస్ కమిషనర్ బీ.దయానంద్

శివాజీనగర: రాష్ట్ర రాజధాని బెంగళూరులో స్వాతంత్య్ర దిన వేడుకలకు మాణిక్ షా పరేడ్ మైదానం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 9 గంటలకు సీఎం సిద్ధరామయ్య జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరించి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ప్రజల కోసం 3వేల ఆసనాలు, ప్రముఖులకు 2వేలు, స్వాతంత్య్ర పోరాటకులు, ప్రముఖులు, రక్షణా శాఖ అధికారులకు 250 ఇతర శాఖాధికారులు, రిటైర్డ్ సైన్యాధికారుల కోసం 2వేల ఆసనాలు ఏర్పాటు చేశారు. నగర పోలీస్ కమిషనర్ దయానంద్ మాట్లాడుతూ మాణిక్ షా పరేడ్ మైదానం, చుట్టుపక్కల ప్రాంతాల్లో భద్రతను పెంపొందించినట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్‌కు నాలుగు రంగుల పాస్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కబ్బన్ రోడ్డు బీఆర్‌వీ జంక్షన్ నుంచి కామరాజ రోడ్డు జంక్షన్ వరకు వాహన సంచారం నిషేధించినట్లు తెలిపారు.

నిషేధించిన వస్తువులు ఇవే

హెల్మెట్, కరపత్రాలు, అన్ని విధాల కెమెరాలు, నీటి బాటిల్, సిగరేట్, అగ్గిపెట్టె, మద్యం బాటిల్, జెండాలు, బాణసంచా, పేలుడు వస్తువులను నిషేధించారు.

పార్కింగ్ నిషేధిత రోడ్లు:

సెంట్రల్ స్ట్రీట్, అనిల్ కుంబ్లె సర్కిల్ నుంచి శివాజీ నగర బస్టాండ్ వరకు, కబ్బన్ రోడ్డు, సీటీఓ సర్కిల్, కే.ఆర్.రోడ్డు, ఎంజీ రోడ్డు, అనిల్ కుంబ్లె సర్కిల్ నుండి క్వీన్స్ రోడ్డు వరకు.

సాంస్కృతిక కార్యక్రమాలు:

స్వాతంత్య్ర దిన వేడుకల్లో భాగంగా శ్రీపద దేవరాజ్, బృందం నాడగీత, రైతుగీత, 730 పాఠశాలల పిల్లల నుంచి వీర నమన, 700 పాఠశాలల పిల్లలతో వీరభూమి, విదురాశ్వత్థ జెండా సత్యాగ్రహ నాటకం, 50 పాఠశాలల పిల్లలతో రూప్ స్కిప్పింగ్, కలారిపయట్టు, టెంట్ పెగ్గింగ్, మోటార్ సైకిల్ ప్రదర్శన ఉంటుంది.

ప్రతి ఇంటిపై ముువ్వన్నెల జెండా

బనశంకరి: స్వాతంత్య్ర దిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీబీఎంపీ సర్వం సిద్ధం చేసింది. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నగరవాసులకు 15 లక్షల జాతీయ పతాకాలు అందజేయనుంది. బీబీఎంపీ పరిధిలోని 8 వలయాల్లో ప్రతి ఇంటిపై జాతీయ జెండాలు ఎగురవేయనున్నారు. ప్రతి జెండాను రూ.25-30 తో విక్రయించనున్నారు. స్వాతంత్ర దిన ఏర్పాట్లపై బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ మాట్లాడుతూ ఈ పర్యాయం పాలిస్టర్ జాతీయ జెండాలను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటితోపాటు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, కార్యాలయాలపై ఎగురవేయాలని పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. వార్డు ఇంజినీర్లు, ఏఆర్ఓలు నగరంలోని ప్రతి ప్రాంతానికీ వెళ్లి జాతీయ జెండా ఎగురవేయడంపై ప్రజలను చైతన్యవంతులను చేస్తారన్నారు.

వాహనాలను అడ్డుకుంటే రౌడీషీట్

శివాజీనగర: పోకిరీలు కారు, బైక్‌లను అడ్డుకొని గొడవలకు దిగుతున్న ఘటనలు అధికమవుతున్నాయి. ఇలాంటివాటికి మంగళం పలికేందుకు బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ దయానంద్ చర్యలు చేపట్టారు. కారు, బైక్ అడ్డగించి గొడవ చేసినవారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఆదివారం ఆయన విలేకరులకు తెలిపారు. ఇటీవల బండీపుర అటవీ ప్రాంతం నుంచి వస్తున్న కారును దుండగులు అడ్డుకున్నారు. బాధితులు వీడియో తీసి పోలీస్‌శాఖ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఆ తరువాత పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఇలా వాహనాలను అడ్డుకునే ఘటనలు అధికమవుతుండటంతో నిందితులపై రౌడీషీట్ నమోదు చేయాలని ఆదేశించినట్లు కమిషనర్ తెలిపారు.

సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

బాగేపల్లి: నోట్ల మార్పిడి వ్యవహారంలో పోలీసుల పాత్ర ఉన్నట్లు తేలడంతో బాగేపల్లి సీఐ రవికుమార్, కానిస్టేబుళ్లు నరసింహమూర్తి, అశోక్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ డీ నాగేష్ ఆదేశాలు జారీ చేశారు. వివరాలు.. రూ.500 విలువైన నోట్లు రూ.25 లక్షలు ఇస్తే రూ.2వేల విలువైన నోట్లు రూ.2 కోట్లు ఇస్తామంటూ మైసూరుకు చెందిన కొందరు వ్యక్తులు చెప్పడంతో ఓ వ్యక్తి వారికి నగదు ముట్టచెప్పాడు. ఈ వ్యవహారంలో మోసం జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి 15 మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో కానిస్టేబుళ్ల పాత్ర ఉండగా సీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు రావడంతో జిల్లా ఎస్పీ విచారణ చేయించారు.

చెన్నకేశవస్వామికి పూజలు

విజయపుర(బెంగళూరు గ్రామీణ) : అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

భగవద్గీత పారాయణం



విజయపుర(బెంగళూరు గ్రామీణ) : విజయపుర పట్టణంలో ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో శ్రీకృష్ణ యతీంద్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత పారాయణం నిర్వహించారు.

బీజేపీని ప్రజలు ఛీకొట్టారు

- హోంమంత్రి జీ పరమేశ్వర్

దొడ్డబళ్లాపురం: కాంగ్రెస్ పార్టీ, అవినీతి ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాలని మాజీ మంత్రి సీటీ రవి చేసిన వ్యాఖ్యలపై హోంమంత్రి జీ పరమేశ్వర్ ఘాటుగా స్పందించారు. బీజేపీ పాలనను ప్రజలు ఛీకొట్టారు కాబట్టే ఎన్నికల్లో ఈ ఫలితాలు వచ్చాయన్నారు. ఆదివారం ఆయన నెలమంగలలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ పాలనలో జరిగిన అవినీతిపై ఆ పార్టీ వారే ప్రశ్నించుకోవాలన్నారు.

ఆధ్యాత్మికతతో ఒత్తిడి లేని జీవనం

గౌరిబిదనూరు: ఒత్తిడి లేని జీవితం కోసం ఆధ్యాత్మికతను అలవరచుకోవాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయం కార్యాలయం ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని ఎస్‌వీఆర్ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరసభ కమిషనర్ గీత పద్మక్క, విశ్వనాథ్, ఉమక్క, గీతాబెహన్, మానిక్ పాటిల్, ప్రజ్ఞట్రస్ట్ నాగరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం వేడుక



సీమంతం నిర్వహించిన దృశ్యం

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి హెచ్ఎస్ఆర్ లేఔట్‌లోని 7వ సెక్టారులో సమృద్ధి ఫౌండేషన్ చైర్మన్ టీం బి.రవి ఆధ్వర్యంలో 300 మంది గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. అలాగే 500 మంది కుటుంబాలకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. భారతి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లేగమ్మ దేవి జాతర

సింగసంద్ర వార్డులో ఉన్న చిక్క బేగూరులో ట్రాన్స్‌జెండర్స్ ఆధ్వర్యంలో ప్లేగమ్మ దేవి జాతరను నిర్వహించారు. ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి పాల్గొని ప్లేగమ్మవారికి పూజలు చేశారు. పెద్దసంఖ్యలో హిజ్రాలు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

వివాహిత అనుమానాస్పద మృతి

బనశంకరి: ఓ మహిళ మృతి చెందగా అంత్యక్రియలు నిర్వహిస్తుండగా ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు వెలుగు చూసింది. ఈ ఘటన గదగ బేటగెరి లేఔట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. గదగ్ నగరంలోని సాయినగరలో హసీనాబేపారి(40) అనే మహిళ ఇంట్లో కుప్పకూలి మృతి చెందినట్లు ఆమె భర్త అందరినీ నమ్మించాడు. దీంతో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. అంత్యక్రియల్లో భాగంగా మృతదేహానికి స్నానం చేయిస్తుండగా గొంతుపై గాయం, చేతి బొటనవేలిపై ఇంకు గుర్తు కనిపించాయి. దీంతో అంత్యక్రియలు జరగకుండ మృతురాలు తల్లిదండ్రులు అడ్డుకున్నారు. అనంతరం బేటగెరెలేఔట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం గదగ్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళా కూలీలపై తేనెటీగల దాడి

క్రిష్ణగిరి: జాతీయ ఉపాధీ హామీ పథకం కూలీలపై తేనెటీగలు దాడి చేసిన ఘటనలో 30 మంది గాయాలపాలయ్యారు. ఈ ఘటన పోచ్చంపల్లి ప్రాతంలో శనివారం సాయంత్రం చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లి సమీపంలోని ఎర్రంబట్టి గ్రామానికి చెందిన 30 మంది మహిళలు అదే ప్రాంతంలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్నారు. ఇంతలో పొదలో ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా లేచి వారిని తీవ్రంగా కుట్టాయి. మహిళలు భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనలో 10 మంది మహిళలకు తీవ్ర గాయాలేర్పడగా మరో 20 మంది స్వల్పంగా అస్వస్థతపాలయ్యారు. వెంటనే వీరిని స్థానికులు పోచ్చంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోచ్చంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

తిరుమలకు పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న భక్తులు

హోసూరు: హోసూరు సమీపంలోని గోపసంద్రం వద్ద వెలసిన దక్షిణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తిరుమల తిరుపతికి సనాతన ధర్మప్రచార చైతన్య పాతయాత్రలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా దక్షిణ తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీచే పాతయాత్ర నిర్వహించే భక్తులకు ఉచిత భోజనం, వైద్య ఉపకరణాలు, బీమా వసతులను కల్పిస్తూ వస్తుంది. ఈసారి కూడా సౌకర్యాలను కల్పించింది. వేంకటేశ్వరుని కీర్తనలను ఆలపిస్తూ 18వ తేదీ తిరుమల తిరుపతికి చేరుకొంటామని తెలిపారు. ఈ పాదయాత్రలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య

హోసూరు: ప్రేమ వైఫల్యంతో ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన మత్తిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకొంది. సేలం జిల్లా పాపారపట్టి గ్రామానికి చెందిన రంజిత్ (22) హోసూరు సమీపంలోని ఎస్.ముదుగానపల్లి గ్రామంలో నివాసముంటూ అదే ప్రాంతంలోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అదే పరిశ్రమలో పనిచేస్తున్న ఓ అమ్మాయిని ప్రేమించేవాడు, కానీ ఆమె ఇతని ప్రేమను పట్టించుకోలేదు. దీంతో విరక్తి చెందిన రంజిత్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు మత్తిగిరి పోలీసులు తెలిపారు.

గజాగ్రహానికి పంటలు నాశనం

కెలమంగలం: డెంకణీకోట తాలూకా జవుళగిరి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల దాడుల్లో పొలాల్లోని పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన చెందారు. జవుళగిరి సమీపంలోని ఉణిసేనత్తం ప్రాంతంలో కొన్నిరోజులుగా 10 ఏనుగులు మకాం వేసి ఆ ప్రాంతంలోని రైతుల పంటలపై దాడి చేస్తున్నాయి. శనివారం రాత్రి మూడు ఏనుగులు మంద నుంచి విడిపోయి కరేనాపాళ్యం ప్రాంతానికి చేరుకొని రైతు శంకరప్ప సాగుచేస్తున్న బీన్స్ తోటను తొక్కి పాడుచేశాయి. ఆదివారం ఉదయం పొలానికెళ్లిన రైతుకు ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంట కనిపించడంతో అటవీశాఖాధికార్లకు సమాచారం అందజేశాడు. అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని నష్టపోయిన పంటను అంచనా వేశారు.

వంచనకు పాల్పడుతున్న దంపతుల అరెస్ట్

యశవంతపుర: రాజకీయ నేతల పేర్లు చెప్పి మోసాలకు పాల్పడుతున్న కేరళకు చెందిన బాబు, శిల్ప దంపతులను హెచ్ఏఎల్ పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరులో నివాసం ఉంటున్న దంపతులు ఎన్‌డీఏ జాతీయ కమిటీ సభ్యులుగా పరిచయం చేసుకుంటారు. రాజకీయ నాయకులతో తీయించుకున్న ఫొటోలను చూపించి ఏమైనా పనులు ఉంటే చేసి పెడతామని నమ్మించేవారు. పరిచయమైన కొత్తలో కొద్దిగా డబ్బు తీసుకొని చెల్లిస్తారు. అనంతరం పెద్ద మొత్తంలో డబ్బు తీసుకొని ఉడాయించేవారు. దంపతులపై బెంగళూరు పశ్చిమ విభాగంలో నమోదైన కేసుకు సంబంధించి స్టేషన్ బెయిల్ తీసుకొని పరారయ్యారు. హెచ్ఏఎల్ పోలీసులు గాలింపు చేపట్టి అరెస్ట్ చేశారు.

అన్నాడీఎంకే జ్యోతియాత్ర



యాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి, కార్యకర్తలు

హోసూరు: మధురై జిల్లాలో ఈనెల 20న జరిగే అన్నాడీఎంకే సభను విజయవంతం చేయాలని క్రిష్ణగిరి, తూర్పు, పశ్చిమ జిల్లాల కార్యకర్తలు ఆదివారం జ్యోతి యాత్ర నిర్వహించారు. క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వేపనపల్లి ఎమ్మెల్యే కే.పి.మునిస్వామి, రాజ్యసభ ఎంపీ తంబిదురై, క్రిష్ణగిరి ఎమ్మెల్యే అశోక్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల కార్యకర్తలు పెద్దఎత్తున బాలక్రిష్ణారెడ్డి సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు. మాజీ మంత్రి అన్బళగన్, తమిళ్‌సెల్వన్, చిట్టి జగదీష్, జే.పి. జయప్రకాష్, బర్గూరు మాజీ ఎమ్మెల్యే రాజేంద్రన్ పాల్గొన్నారు.

లారీ ఈడ్చుకెళ్లి బైకిస్టు మృతి

క్రిష్ణగిరి: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకొంది. హోసూరు- క్రిష్ణగిరి జాతీయ రహదారి మేలుమలై వద్ద జాతీయ రహదారిపై వెళుతున్న బైకిస్టును కంటైనర్ లారీ ఢీకొని కొంతదూరం లాక్కెళ్లింది. తీవ్ర గాయాలేర్పడిన బైకిస్ట్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సూళగిరి పోలీసులు శవాన్ని స్వాధీనపరుచుకొని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చేనేత ఉత్పత్తులను ఆదరించాలి



చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీవత్స

మైసూరు: ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులను ఆదరించాలని ఎమ్మెల్యే టి.ఎస్. శ్రీవత్స పిలుపునిచ్చారు. మైసూరు నగరం హెబ్బాలలోని జేఎస్ఎస్ అర్బన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన వస్త్ర ఉత్సవం -2023, చేతి మగ్గాల ఉత్పత్తుల ప్రదర్శనను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్య, దాసోహం, ఆరోగ్య రంగంలో సేవలు అందిస్తున్న జేఎస్ఎస్ సంస్థ వస్త్ర ఉత్సవాన్ని ఏర్పాటు చేసి చేనేతలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.

అవినీతికి పాల్పడకపోతే ప్రమాణం చేస్తావా?

డిప్యూటీ సీఎం శివకుమార్‌కు సీటీ రవి సవాల్

యశవంతపుర: లంచం తీసుకోలేదని అజ్జయ్య మఠానికి వెళ్లి ప్రమాణం చేయాలని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు మాజీ ఎమ్మెల్యే సీటీ రవి సవాల్ విసిరారు. ఆయన ఆదివారం చిక్కమగళూరులో విలేకర్లతో మాట్లాడారు. తమ ప్రభుత్వం నిజాయితీగా పని చేస్తుందని చెబుతున్న డీకేశి..అజ్జయ్య మఠానికి వెళ్లి ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అవినీతిలో కురుకుపోయిందని తాము ఆరోపించకపోయినా కాంగ్రెస్ నేతలు కమీషన్లు తీసుకుంటున్నట్లు బీబీఎంపీ కాంట్రాక్టర్లే చెబుతున్నారన్నారు.

మంత్రిని కలిసిన ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి



రామలింగారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి

బొమ్మనహళ్లి: టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్గొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం బెంగళూరు విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణ శాఖ, దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన రామలింగారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఆడుగొడి మాజీ కార్పొరేటర్ ఆడుగొడి బీ. మోహన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు లైన్‌మెన్ల మృతి



విద్యుత్ స్తంభంపై లైన్‌మెన్ అనిల్ మృతదేహం

కృష్ణరాజపురం: లైన్‌మెన్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె తాలూకా మాలూరు రోడ్డులో జరిగింది. చెన్నై సూపర్ ఎక్స్‌ప్రెస్ రోడ్డు పనుల్లో భాగంగా విజయనగర గేట్ వద్ద విద్యుత్ లైన్ మార్పు పనులు జరుగుతున్నాయి. కోలారుకు చెందిన అనిల్(35) బెస్కాంలో కాంట్రాక్టు పద్ధతిలో లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా స్తంభంపైకి ఎక్కి కరెంట్ వైర్లు బిగిస్తుండగా కరెంటు సరఫరా అయ్యింది. దీంతో అతను విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. హొసకోటె పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బనశంకరి: విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా లైన్‌మెన్ మృతి చెందాడు. బెళగావి జిల్లా చిక్కోడి పట్టణానికి చెందిన సిద్దరామకుపవాడ(32) బెస్కాంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు హొసపేటె శివారులో ఆదివారం మరమ్మత్తులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చిక్కోడిపోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గాలిపటాల జాతర



గాలిపటాలు ఎగురవేస్తున్న స్వామీజీ



వైవిధ్యమైన పతంగులతో నగరవాసులు

మండ్య: గాలి పటానికి ఉన్న దారం తెగిపోతే గాలిలో ఎగరలేదు, అలాగే మనిషి కూడా మంచి దారిలో ముందుకు సాగితేనే అనుకున్నది సాధించడానికి వీలవుతుందని ఆదిచుంచనగిరి పీఠాధిపతి నిర్మలానందనాథ స్వామి అన్నారు. ఆదివారం మండ్య జిల్లా నాగమంగళ తాలూకాలోని ఆదిచుంచనగిరి మఠంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో 33వ గాలి పటాల ఉత్సవాన్ని ప్రారంభించారు. మంత్రి ఎన్.చలువరాయస్వామితో కలిసి గాలిపటాలను ఎగురవేశారు. గాలిపటాలను ఎగురవేయడం మంచి అనుభవమని అన్నారు. నిజాయతీతో ఎంత కష్టపడితే అంత మంచి మార్గంలో వెళ్లవచ్చని అన్నారు. వందలాది మంది బాలలు, పెద్దలు ఈ ఉత్సవంలో పాల్గొని గాలిపటాలను ఎగురవేశారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే యాదవులకు గుర్తింపు

- మంత్రి కారుమూరి




కారుమూరి నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న యాదవ సంఘ సభ్యులు

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): యాదవ సామాజికవర్గ నాయకుడిని రాజ్యసభకు పంపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే యాదవులకు సరైన గుర్తింపు లభిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చెప్పారు. శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం, అఖిల భారతీయ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరంలో మంత్రి కారుమూరి దంపతులను సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ మనవాడు బాగా పనిచేశాడని యాదవ జాతి అంతా మెచ్చుకునేలా, కడవరకు అందరివాడిగా పనిచేస్తానని చెప్పారు. శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేష్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రం అధోగతిపాలు

- రాష్ట్రపతి, ప్రధానికి చంద్రబాబు లేఖలు



సాక్షి, అమరావతి: మతిస్థిమితం లేని వ్యక్తిగా సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశాయని ప్రతిపక్షనేత చంద్రబాబు విమర్శించారు. రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులున్నాయని పేర్కొన్నారు. వెంటనే జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతిని కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీలకు లేఖలు రాశారు. చిత్తూరు జిల్లాలో తనపై హత్యాయత్నం చేసి తిరిగి తనపైనే హత్యాయత్నం కేసు పెట్టారని పేర్కొన్నారు. ప్రణాళిక ప్రకారం తనపై జరుగుతున్న దాడుల విషయంలో సీబీఐ విచారణ జరిపించాలని కోరారు.

చంద్రబాబు, లోకేశ్ దొంగ యాత్రలు

- బహుజన పరిరక్షణ సమితి



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: అమరావతి పేరుతో 29 గ్రామాల్లో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌లు దొంగ యాత్రలు చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 1,050వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ 29 గ్రామాల్లో మీరు చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు వచ్చే దమ్ముందా? అంటూ చంద్రబాబుకు సవాల్ విసిరారు. బహుజన పరిరక్షణ సమితి నేతలు పులి దాసు, ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి పాల్గొన్నారు.

పవన్ అజ్ఞానం తెలిసింది

అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విశాఖ పర్యటనలో మరోసారి తన రాజకీయ అజ్ఞానాన్ని ప్రదర్శించారని అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు విమర్శించారు. విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రుషికొండ వద్ద తవ్వకాలు, కట్టడాలు ఈ ప్రభుత్వం కొత్తగా ప్రారంభించలేదు.. ఎన్టీఆర్ హయాంలోనే రుషికొండలో తవ్వకాలు, నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. రుషికొండ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దితే మంచి ఆదాయం వస్తుంది. విశాఖ అభివృద్ధికి ల్యాండ్ మార్క్ అవుతుందన్న ఉద్దేశంతోనే అక్కడి భూమిని పర్యాటక శాఖకు అప్పగించారు. హరిత రిసార్ట్స్ ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ ప్రారంభిస్తే ఆ తర్వాత కొనసాగుతూ వచ్చింది.' అని విజయబాబు చెప్పారు. అధికారభాషా సంఘం సభ్యుడు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పేకాడుతున్న టీడీపీ ఎంపీపీ అరెస్ట్



ఎంపీపీ శ్రీనివాస్

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తాటిపాకలో పేకాట ఆడుతున్న టీడీపీ నేత, ఎంపీపీ కేతా శ్రీనివాస్‌ను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎంపీపీ ఆధ్వర్యంలో పేకాట ఆడుతున్నట్లు తెలిసి దాడిచేసినట్లు ఎస్‌ఐ పృథ్వీ తెలిపారు. ఎంపీపీతోపాటు గుబ్బల శ్రీరామమూర్తి, తోట కృష్ణ స్వరూప్, కంచి అప్పన్న, శిరిగినీడి రమేష్, శిరిగినీడి సత్యనారాయణ, నాగిరెడ్డి గోపీవెంకట కృష్ణలను అరెస్ట్ చేసినట్లు వివరించారు.

పోలీసులపై దాడి కేసులో టీడీపీ కొత్త ఎత్తులు

- ఓవైపు ముందస్తు బెయిల్ పిటిషన్లు.. మరోవైపు క్వాష్ పిటిషన్లు
- ఒకచోట కాకుంటే మరోచోట సానుకూల ఉత్తర్వులు పొందే దూరాలోచన
- అందుకే వేర్వేరుగా రెండు రకాల పిటిషన్లు వేయించిన టీడీపీ పెద్దలు
- రెండింటిలోనూ కావాల్సింది అరెస్ట్ నుంచి తప్పించుకోవడమే
- హత్యాయత్న నేరాన్ని తేలిగ్గా తీసుకోవాలంటూ అభ్యర్థన
- సీఆర్‌పీసీ సెక్షన్ 41 కింద నోటీసు ఇచ్చి సరిపెట్టాలని వినతి
- గతంలో నాట్ బిఫోర్, బెంచ్ హంటింగ్ లాంటి పన్నాగాలు
- పోలీసులపై టీడీపీ నేతల దాడిని తీవ్రంగా పరిగణిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఈ కేసుల్లో పోలీసుల తరపున వాదనల బాధ్యత అదనపు ఏజీకి అప్పగింత
- పోలీసుల్లో మనోస్థైర్యాన్ని నింపాలని భావిస్తున్న ప్రభుత్వం



పుంగనూరు బైపాస్ వద్ద పోలీసులపై రాళ్లు విసురుతున్న టీడీపీ కార్యకర్తలు (ఫైల్)

సాక్షి, అమరావతి: న్యాయస్థానాల్లో సానుకూల ఉత్తర్వులు పొందేందుకు తమకే సాధ్యమైన అనైతిక ఎత్తుగడలను రచించే టీడీపీ పెద్దలు మరోసారి అలాంటి దారినే ఎంచుకున్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో ఇటీవల పోలీసులపై దాడి ఘటనలపై నమోదైన కేసుల్లో అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు కొత్త ఎత్తులు వేశారు. హైకోర్టులో ఇప్పటికే కొందరు నాయకులతో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్లు దాఖలు చేయించిన టీడీపీ అధినాయకత్వం... పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ మరి కొందరితో క్వాష్ పిటిషన్లు దాఖలు చేయించింది. హైకోర్టులో రోస్టర్ ప్రకారం ముందస్తు బెయిల్ పిటిషన్లు ఓ న్యాయమూర్తి, క్వాష్ పిటిషన్లు మరో న్యాయమూర్తి వేర్వేరుగా విచారిస్తున్నారు. ఓ చోట సానుకూల ఉత్తర్వులు రాకపోయినా మరోచోట సానుకూల ఉత్తర్వులు పొందవచ్చనే 'దూరాలోచన'తో టీడీపీ నాయకత్వం ఇలా వేర్వేరు రకాల పిటిషన్లు దాఖలు చేయించింది. రెండు పిటిషన్లలోనూ వారికి కావాల్సింది అరెస్ట్ నుంచి తప్పించుకోవడమే. అందుకే వ్యూహాత్మకంగా రెండు రకాల పిటిషన్లు దాఖలు చేయించింది. నేతల తరపున పిటిషన్లు దాఖలు చేసిన న్యాయవాదులందరూ దాదాపుగా ఆ పార్టీ లీగల్ సెల్‌కు చెందిన వారే. ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసిన నేతలు మధ్యంతర ఉత్తర్వుల కింద తమకు తాత్కాలిక మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతుండగా, క్వాష్ పిటిషన్‌లో పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లలో తమ అరెస్ట్‌తో సహా తదుపరి చర్యలన్నీ నిలిపేయాలని అభ్యర్థిస్తున్నారు. హత్యాయత్నం లాంటి తీవ్రమైన నేరం కింద కేసులు నమోదు కాగా, ఆ సెక్షన్‌ను పట్టించుకోకుండా తమకు సీఆర్‌పీసీ సెక్షన్ 41 కింద నోటీసు ఇచ్చి సరిపెట్టాలని వారు క్వాష్ పిటిషన్‌లో కోరారు. హత్యాయత్నం నేరాన్ని తేలికగా చేసేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. తీవ్రంగా గాయపడేలా పోలీసులను కొట్టడమే కాకుండా, వారిని చంపండిరా అంటూ ఉసిగొల్పిన టీడీపీ నేతలు సీఆర్‌పీసీ సెక్షన్ 41 కింద నోటీసు ఇచ్చి సరిపెట్టాలని కోర్టును కోరడంపై న్యాయవర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. టీడీపీ నేతల దాడిలో ఓ పోలీసు ఏకంగా కళ్లు కోల్పోయిన సంగతిని వారు గుర్తు చేస్తున్నారు. కేసు నమోదైన వారం రోజులకే కొట్టేయాలని కోరడం వెనుక పెద్ద వ్యూహమే ఉందని న్యాయవర్గాలు చెబుతున్నాయి. టీడీపీ నేతల కుయుక్తులు అందరికీ తెలుసు. ముఖ్యంగా న్యాయమూర్తులందరికీ బాగా తెలుసు. గతంలో టీడీపీ పెద్దలు ఇలాంటి కుయుక్తులతో విజయం సాధించినా, ఇప్పుడు వారి బాగోతం అందరికీ తెలిసిపోయింది. అలాంటి అనైతిక ఎత్తులు పనిచేసే అవకాశం లేదన్నది న్యాయవర్గాల మాట.

గతంలో నాట్ బిఫోర్, బెంచ్ హంటింగ్....

గతంలో టీడీపీ నాయకత్వం నాట్ బిఫోర్ , బెంచ్ హంటింగ్ వంటి దుష్ట పన్నాగాలను అమలు చేసి విజయం సాధించింది. నాట్ బిఫోర్, బెంచ్ హంటింగ్ వంటి వాటి గురించి సాధారణ ప్రజలకు తెలియదు. కేవలం న్యాయవాదులకు మాత్రమే తెలిసిన నాట్ బిఫోర్, బెంచ్ హంటింగ్ వంటి వాటి గురించి జన బాహుళ్యానికి తెలియచేసింది తెలుగుదేశం పార్టీనే. న్యాయమూర్తుల నైతిక విలువలను అలుసుగా తీసుకుని ఎన్నో సార్లు అనైతిక పద్ధతుల్లో ప్రయోజనం పొందింది. అయితే ప్రస్తుతం అలాంటి లబ్ధి పొందే అవకాశం లేదు. ఇలాంటి ఎత్తుగడలతో విసిగిపోయిన న్యాయమూర్తులు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో దాదాపు నాట్ బిఫోర్‌కు చెల్లు చీటీ పాడారు. నాట్ బిఫోర్ లేని న్యాయమూర్తుల వద్దకు తమ కేసు వస్తే దానిని తప్పించేందుకు టీడీపీ పలు ఎత్తుగడలు వేసేది. చీటికీ మాటికీ గొడవ పెట్టుకునే కొందరు పెయిడ్ న్యాయవాదులను ఇందుకోసం ఎంపిక చేసుకునేది. వారిని ఆ న్యాయమూర్తి కోర్టుకు పంపి అక్కడ న్యాయమూర్తి ఎంత సహనంగా ఉన్నా ఏదో రకంగా రెచ్చగొట్టి ఆ న్యాయవాదిని నాట్ బిఫోర్ చేయించేది. తద్వారా తమ కార్యం సాధించుకునేది. తరువాత కాలంలో కూడా ఏదైనా కేసు ఆ న్యాయమూర్తి వద్దకు వస్తే అప్పటికే నాట్‌బిఫోర్‌గా ఉన్న ఆ న్యాయవాది చేత వకాలత్ దాఖలు చేయించేది. ఇలా ఎన్నో కేసుల్లో నాట్ బిఫోర్ ఎత్తుగడలతో టీడీపీ నెగ్గుకొచ్చింది. పలు సందర్భాల్లో బెంచ్ హంటింగ్‌కు పాల్పడ్డారు.

అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం

పోలీసులపై జరిగిన దాడిని వైఎస్ జగన్ ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. కళ్లు కోల్పోయేలా పోలీసులపై దాడికి ఉసిగొల్పిన వారిని చట్టం ముందు నిలబెట్టాలన్న కృతనిశ్చయంతో ఉంది. ఈ దాడి ఘటనపై నమోదైన కేసుల్లో పోలీసుల తరపున వాదించే బాధ్యతను అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి అప్పగిస్తూ ప్రత్యేక జీవో ఇచ్చింది. అవసరమైతే సుప్రీంకోర్టు వరకైనా వెళ్లి పోలీసులకు న్యాయం జరిగేలా చూడాలన్న పట్టుదలతో ప్రభుత్వం ఉంది. తద్వారా పోలీసుల్లో మనోస్థైర్యాన్ని నింపాలని భావిస్తోంది. పోలీసులపై జరిగిన దాడి విషయంలో తెర వెనుక జరిగిన కుట్రకు సంబంధించిన పలు కీలక ఆధారాలను దర్యాప్తు అధికారులు ఇప్పటికే సాధించారు. మరింత లోతుగా దర్యాప్తు జరిపితే ఈ కుట్ర వెనుక దాగిన పెద్ద తలకాయలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

న్యాయమూర్తులపై నిరాధార ఆరోపణలు..

ఇటీవల టీడీపీ మరింత బరి తెగించింది. ఎల్లో మీడియా చర్చా వేదికల్లో కొందరు పెయిడ్ ఆర్టిస్టులను కూర్చోబెట్టి వారితో న్యాయమూర్తులపై విషం చిమ్ముతోంది. ఇటీవల ఓ కేసులో హైకోర్టు న్యాయమూర్తిపై ఇలాగే నిరాధార ఆరోపణలు చేయించింది. చట్ట ప్రకారం ఆ న్యాయమూర్తి కేసు విచారణ నిర్వహించగా, ఆయన డబ్బు తీసుకున్నట్లు టీవీ లైవ్ చర్చలోనే ఆరోపణలు చేయించింది. తద్వారా ఆ న్యాయమూర్తి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించింది. అయితే ఆయన చలించలేదు. చట్టప్రకారమే తీర్పు చెప్పారు. ఎల్లోమీడియా చర్యలను కోర్టు ధిక్కారంగా పరిగణిస్తూ తగిన చర్యలు తీసుకునేందుకు వీలుగా నిర్ణయాన్ని ప్రధాన న్యాయమూర్తికే వదిలేశారు.

వెంకటేశ్‌వి తప్పుడు ఆరోపణలు

- ఆయనపై ఏ కేసూ నమోదు చేయలేదు
- పుంగనూరు ఎస్‌ఐ మోహన్‌కుమార్



పుంగనూరు/మదనపల్లె: ఇటీవల చంద్రబాబు పుంగనూరు పర్యటనలో పోలీసులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు చేసిన దాడికి సంబంధించి తాము ఎలాంటి తప్పుడు కేసులు పెట్టలేదని పుంగనూరు ఎస్‌ఐ మోహన్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి తమపై రాజంపేట టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేశ్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ మేరకు ఆదివారం ఎస్‌ఐ మోహన్‌కుమార్ పుంగనూరులో మీడియాతో మాట్లాడారు. తాను అమెరికాలో ఉండగా తనపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించారని వెంకటేశ్ పేర్కొనడం సరికాదన్నారు. ఆయనపై ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని తెలిపారు. పుంగనూరు స్టేషన్‌లో 263 నంబర్ కింద నమోదైన ఎఫ్‌ఐఆర్ మహిళ మిస్సింగ్ కేసుకు సంబంధించిందని స్పష్టం చేశారు. ఒకవేళ వెంకటేశ్ పొరపడ్డారేమోనని.. ఎఫ్‌ఐఆర్‌ను మరోసారి తనిఖీ చేసినా అందులో ఆయన పేరు లేదన్నారు. పథకం ప్రకారం పోలీసులపై దాడులు చేసి, వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీసి, తిరిగి అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీసులపై దాడులకు సంబంధించి సీసీ ఫుటేజీలు, వీడియోలు, ఫొటోలను పరిశీలించి బాధ్యులైన వారిపై మాత్రమే కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఏ ఒక్కరిపై తప్పుడు కేసులు నమోదు చేయలేదని తేల్చిచెప్పారు. అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని.. రాజకీయ లబ్ధి కోసం పోలీస్ శాఖను వినియోగించుకోవద్దని వెంకటేశ్‌ను హెచ్చరించారు. కాగా, పుంగనూరు ఘటనతో తనకు సంబంధం లేకున్నా.. పబ్లిసిటీ పిచ్చితో చంద్రబాబు దృష్టిలో పడాలనే ఆర్జే వెంకటేశ్ తప్పుడు ప్రచారానికి దిగాడు. జూలై 11 నుంచి తాను అమెరికాలో ఉన్నా తన పేరు ఎఫ్‌ఐఆర్‌లో నమోదు చేశారంటూ సామాజిక మాధ్యమాల్లో వీడియో పెట్టాడు.

వంగలపూడి అనిత వల్లే పార్టీ సర్వనాశనం

- ఆమెకు టికెట్ ఇస్తే పాయకరావుపేటలో ఓడిపోవడం ఖాయం
- గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు
- అసమ్మతి గ్రూప్ సమావేశంలో టీడీపీ నేతలు, కార్యకర్తల ధ్వజం



ప్రసంగిస్తున్న నారాయణరావు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితకు సొంత పార్టీలోనే తీవ్ర అసమ్మతి ఎదురైంది. పాయకరావుపేట మండలానికి చెందిన పలువురు టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు అనితకు వ్యతిరేకంగా ఆదివారం సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఆమెకు సీటు ఇస్తే ఓడిపోవడం ఖాయమని తేల్చిచెప్పారు. అనిత ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇళ్ల లబ్ధిదారుల నుంచి రూ.30 వేల చొప్పున, పింఛన్ కావాలని వచ్చేవారి నుంచి రూ.5 వేల చొప్పున వసూళ్లకు పాల్పడ్డారని మండిపడ్డారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడి పదవిని కూడా అమ్ముకున్నారని ఆరోపించారు. అనిత వల్లే పాయకరావుపేట నియోజకవర్గంలో టీడీపీ సర్వనాశనమైందన్నారు. ఆమె వచ్చాకే పార్టీలో ఆరు గ్రూపులు తయారయ్యాయని విమర్శించారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అనిత, ఆమె అనుచరులు చేసిన అవినీతిని ప్రశ్నించినందుకు తమపై కక్షకట్టి పార్టీ నుంచి సస్పెండ్ చేయించారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును తాము కలవడంతో కక్ష గట్టి వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఆదేశాలను కూడా అనిత పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆమె మాటలు విని తమను సస్పెండ్ చేసిన అచ్చెన్నాయుడుపైనా నేతలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పాయకరావుపేట టీడీపీ మాజీ అధ్యక్షుడు, తాపీమేస్త్రీల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు, పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్లె రాజబాబు, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు దేవవరపు ఆనంద్, మాజీ సర్పంచ్‌లు డి.ఆనంద్, కలిగొట్ల శ్రీను, సుంకర సూరిబాబు, గొల్లపల్లి నాగు, తలారి రాజా, భజంత్రీల శివ, చొక్కా శ్రీను, శ్రీనివాసరెడ్డి, కోడూరి నూకరాజు, థామస్, పదాల కోటి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు కోసం కేంద్రంతో గొడవపెట్టుకోలేను

- జగన్ మళ్లీ సీఎం కాకూడదన్నది నా అభిమతం: పవన్‌కళ్యాణ్



సాక్షి, విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపడం తన చేతుల్లో లేదని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చేతులెత్తేశారు. తనకు ఎమ్మెల్యేలు, ఎంపీలు లేనందున, తనకు ప్రధాని మోదీతో సాన్నిహిత్యం ఉన్నప్పటికీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఆపే సత్తా లేదని తేల్చి చెప్పారు. విశాఖ ఉక్కు కోసం తాను కేంద్రంతో గొడవ పెట్టుకోలేనని స్పష్టం చేశారు. ప్రధాని మోదీని ఒప్పిస్తే ఒప్పుకుంటారని, కానీ తనకు ఒక్క ఎంపీ కూడా లేరని, వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఒప్పించడం లేదన్నారు. ఆంధ్ర ఎంపీలంటే ఢిల్లీలో చాలా చులకన అన్నారు. ఆదివారం రాత్రి గాజువాకలో జరిగిన వారాహి విజయయాత్ర బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. జనసేన పార్టీ నడపడానికే సినిమాలు ఇంధనం వంటివని, అందుకే తాను సినిమాల్లో నటిస్తున్నానని, పార్టీ నడపడానికి ఎవరైనా నిధులిస్తే తీసుకుంటానని చెప్పారు. తాను 25 ఏళ్లు రాజకీయాల్లో ఉండాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. రాజకీయాల్లోకి వచ్చిన పదేళ్ల వరకు సీఎం పదవిని ఆశించకూడదనుకున్నానన్నారు. ఇప్పుడు సీఎం పదవి చేపట్టడానికి సిద్ధంగా ఉన్నానని, అయితే అది జనసేన నుంచా లేక మిత్రమ ప్రభుత్వం నుంచా? అన్నది కాలానికే వదిలేస్తున్నట్టు తెలిపారు. మరోసారి వైఎస్ జగన్ సీఎం కాకూడదన్నదే తన అభిమతంగా చెప్పారు. విశాఖ రుషికొండ భవిష్యత్తులో ఏదో ఒక రోజు జగన్‌తో సహా భూమిలోకి కూరుకుపోతుందన్నారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గతంలో రౌడీషీటర్ అని చెప్పారు. ఆయన విశాఖ సిరిపురంలో నాలుగు అంతస్తులకే అనుమతి తీసుకుని 26 ఫ్లోర్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే గుర్‌గావ్‌లో టవర్స్ మాదిరిగానే కూల్చేస్తామని, ఎంవీవీపై మళ్లీ రౌడీషీట్ తెరుస్తామన్నారు. విశాఖ పెదజాలరిపేటలో రూ.2 వేల కోట్ల టీడీఆర్ కుంభకోణం జరిగిందన్నారు. రాష్ట్రం కోసం మంగళగిరికి మకాం మార్చానని, తాను విశాఖను రెండో ఇల్లుగా చేసుకుంటానని చెప్పారు. విప్లవకారుడు రాజకీయాల్లోకి వస్తే ఎలా ఉంటుందో చూపిస్తానన్నారు.

పవన్‌వి అర్థంలేని మాటలు

- రుషికొండపై కట్టడాలు అధికారికమే
- ప్రభుత్వ స్థలాల్లో ప్రభుత్వ కట్టడాలే అవి
- రామోజీ ఫిల్మ్‌సిటీ, మీ అన్నగారు చిరంజీవి ఇల్లు కొండ మీద కట్టలేదా?
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- అక్కడ ప్రభుత్వ భవనాలు కడుతుంటే పవన్, బాబుల బాధేంటి?: మంత్రి రోజా
- పవన్‌కు 'గీతం' ఆక్రమణలు కనిపించవా?: వరుదు కళ్యాణి

మద్దిలపాలెం (విశాఖ తూర్పు)/సాక్షి, అమరావతి/ఆరిలోవ (విశాఖ తూర్పు): రుషికొండ చూడడానికి వెళ్లి పవన్‌కళ్యాణ్ అక్కడ జరుగుతున్నవి అక్రమ నిర్మాణాలని, అక్కడ స్థలాలను కబ్జాచేశారని, ఈ నిర్మాణాలకు అనుమతులెవరు ఇచ్చారని అర్థంపర్థంలేని మాటలు మాట్లాడుతున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. ప్రభుత్వ భూముల్లో ప్రభుత్వ కట్టడాలు అధికారికంగా కడుతుంటే ఎవరి అనుమతి తీసుకుంటారని, ఈ మాత్రం జ్ఞానంలేకుండా పవన్‌కళ్యాణ్ అవివేకంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజారంజకమైన పాలనతో ప్రజల హృదయాలలో స్థానం సంపాదించుకున్న సీఎం జగన్ చరిష్మాను చూసి పవన్ విద్వేషంతో రగిలిపోతున్నారన్నారు. విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో ఆదివారం మంత్రి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

రుషికొండ మీద నిర్మిస్తున్న భవనాలలో సీఎం కార్యాలయాన్ని గానీ, ప్రభుత్వ కార్యాలయాలను గాని వినియోగించే అవకాశాలున్నాయి. సీఎం విశాఖపట్నం రావడానికి ఎలాంటి బిల్లు అవసరం లేదు. విశాఖ నుంచి పాలన చేస్తాననే మాటకు ఆయన కట్టుబడి ఉన్నారు. త్వరలో సీఎం విశాఖకు రానున్నారు. ఇక రుషికొండలో షరతులను ఎక్కడా ఉల్లంఘించకుండా అన్ని అనుమతులతో చేపడుతున్నవే. రామానాయుడు స్టూడియో, వేంకటేశ్వరస్వామి ఆలయం, ఐటీ కంపెనీలు కొండలపైన కట్టినవే. ఇవన్నీ అభివృద్ధిలో భాగమే. భూమి లభ్యత తక్కువున్న ప్రాంతాల్లో కొండలపై ఇటువంటి భవనాలను నిర్మించడం సర్వసాధారణం. ఈ విషయం పవన్‌కు తెలీకపోవడం దురదృష్టకరం. రామోజీ ఫిల్మ్‌సిటీ, మీ అన్నగారు చిరంజీవి ఇళ్లు కొండ మీద కట్టలేదా? వీటన్నింటికి లేని అభ్యంతరాలు రుషికొండపై ప్రభుత్వ భవనాలు కడితే వచ్చిందా?

బాబు అజెండాను మోస్తున్న పవన్

చంద్రబాబు కోసం కోతిలా ఎగురుతున్న పవన్‌కళ్యాణ్ తెలుగుదేశం హయాంలో జరిగిన అక్రమాలను ఆ పార్టీ నాయకులే బయట పెట్టినప్పుడు ఎందుకు నోరు విప్పలేదు? నది ఒడ్డున చంద్రబాబు ఇల్లు కట్టుకున్నప్పుడు పవన్ కళ్లు కనబడలేదా? నిజానికి.. పవన్ తన జెండాను పక్కనపెట్టి చంద్రబాబు అజెండాను మోస్తున్నారు. విశాఖ నగరంలో లక్షన్నర మంది పేదలకు ఇళ్ల స్థలాలను ఇవ్వడానికి సీఎం జగన్ ప్రయత్నిస్తే దానిని అడ్డుకునేందుకు చంద్రబాబు కేసులు వేశారు. దీనిపై పవన్ ఎందుకు చంద్రబాబుని ప్రశ్నించలేదు? అసలు ఆయనకు సరైన పొలిటికల్ స్టాండ్‌లేదు.

మంత్రిగా వాస్తవాలను చెప్తే వేయరా?: రోజా



మరోవైపు.. మంత్రి రోజా ఆదివారం ఓ వీడియో విడుదల చేశారు. ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ భవనాలు కడుతుంటే.. మధ్యలో పవన్, చంద్రబాబుకు వచ్చిన బాధేంటని ఆమె అందులో ప్రశ్నించారు. ఆమె ఇంకా ఏమన్నారంటే.. రుషికొండ వద్ద ఏం నిర్మిస్తున్నామన్న విషయాన్ని శనివారం అధికారికంగా మీడియా సమావేశంలో వివరించా. కానీ, ఈనాడు సహా టీడీపీ అనుకూల పత్రికలు, టీవీలు ఈ నిజాలను ప్రజలకు చెప్పలేదు. అందుకే మరోసారి స్పష్టతనిస్తున్నాను. రుషికొండలోని భూమి ప్రభుత్వ భూమి. పర్యాటక శాఖకు సంబంధించిన భూమి అది. ఇక్కడ పర్యాటక శాఖకు 69 ఎకరాల భూమి ఉంది. ఇందులో 9.88 ఎకరాల్లో నిర్మాణాల కోసం ప్రభుత్వానికి అనుమతులిచ్చారు. ఇందులో కూడా మేం కడుతున్నది కేవలం 2.7 ఎకరాల్లోపే. ఏడు భవన నిర్మాణాలకు అనుమతులొస్తే కేవలం నాలుగు భవనాలు మాత్రమే నిర్మిస్తున్నారు. అదికూడా జీ ప్లస్ వన్ మాత్రమే. రుషికొండ నిర్మాణాలపై హైకోర్టు వేసిన కమిటీ అన్నింటినీ పరిశీలించి, తనిఖీచేసి రిపోర్టు కూడా ఇచ్చింది. హైకోర్టు ఏమైనా సూచనలు చేస్తే వాటిని కూడా పాటిస్తాం. ప్రజాప్రతినిధిగా ఏ హోదాలేని వాడు, కనీసం వార్డు మెంబర్ కూడా కాని పవన్ మాటలను పెద్దపెద్దగా ప్రచారం చేస్తారా? ఆయన ఊగుడు చూస్తుంటే త్వరగా మెంటల్ ఆస్పత్రిలో చేరేట్లు ఉన్నాడు.

పవన్ ఓ ఫ్లవర్‌స్టార్: వరుదు కళ్యాణి



విశాఖపట్నం రుషికొండ వద్ద ఉన్న గీతం వర్సిటీ ఆక్రమించిన ప్రభుత్వ భూములు కనిపించడం లేదా? అని పవన్‌ను ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ప్రశ్నించారు. నగర పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ. రుషికొండపై ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తే పర్యావరణం దెబ్బతింటుందని తప్పుపడుతున్నారని, అయితే దీనికి ఎదురుగా ప్రభుత్వ భూమిని ఎకరాలకొద్దీ ఆక్రమించిన లోకేశ్ తోడల్లుడు భరత్‌కు చెందిన గీతం వర్సిటీ గురించి, ఓ కొండపై పూర్తిగా పచ్చదనం నాశనం చేసి నిర్మించిన రామానాయుడు స్టూడియో గురించి పవన్ ఎందుకు మాట్లాడటంలేదో చెప్పాలన్నారు. తన పర్యటనల్లో పవన్ చెప్పిన అబద్ధాలనే మళ్లీ మళ్లీ చెబుతున్నారని ఆమె అన్నారు. పవన్ నడుపుతున్నది జనసేన కాదు.. చంద్రసేన అంటూ వరుదు కళ్యాణి ఎద్దేవా చేశారు. ఆయన సినిమాల్లో పవర్‌స్టారే కావచ్చు.. కానీ, రాజకీయాల్లో మాత్రం ఫ్లవర్‌స్టార్ అని వ్యాఖ్యానించారు. పెందుర్తిలో మరణించిన వరలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించిన పవన్.. వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడారన్నారు. వలంటీర్లు దండుపాళ్యం బ్యాచ్ అని అనడానికి ఆయనకు నోరెలా వచ్చిందన్నారు. ఇక హిందూపురంలో జనసేన నేత ఓ వ్యక్తిపై దాడిచేసి 16 తులాల బంగారు ఆభరణాలు దోచేశాడని, ఈ ఘటనతో జనసేన నేతలు హత్యలు, దోపిడీలు చేస్తారని ఒప్పుకుంటావా? అని ఆమె ప్రశ్నించారు.

20 సీట్లకోసం చంద్రబాబు బూట్లు నాకుతున్న పవన్

- యువతను, ఆయన సామాజికవర్గాన్ని చంద్రబాబుకు తాకట్టుపెట్టాడు
- ఆయన వ్యాఖ్యల్లో కనీస నైతికత, విజ్ఞానం కనిపించడంలేదు
- పవన్‌కళ్యాణ్‌పై ధ్వజమెత్తిన విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ
- దమ్ముంటే ఎన్నికల్లో తనపై పోటీచేసి గెలవాలని సవాల్



ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): కేవలం 20 నుంచి 30 ఎమ్మెల్యే సీట్లకోసం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్.. చంద్రబాబు బూట్లు నాకుతున్నాడని విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ దుయ్యబట్టారు. ఇందుకోసమే ఆయనతోపాటు ఆయన సామాజికవర్గాన్ని చంద్రబాబుకు తాకట్టుపెట్టాడని ధ్వజమెత్తారు. విశాఖలో తనపై పవన్‌కళ్యాణ్ చేసిన అవినీతి వ్యాఖ్యలపై ఎంపీ స్పందించారు. ఆదివారం విశాఖ లాసన్స్ బే కాలనీలోని తన కార్యాలయంలో ఎంపీ విలేకరులతో మాట్లాడారు. తనను రాజీనామా చేయమనే నైతిక హక్కు పవన్‌కు లేదన్నారు. కనీసం ఎమ్మెల్యేగా గెలవలేని వ్యక్తి తనపై ఆరోపణలు చేయడమేంటని ప్రశ్నించారు. పవన్ రాష్ట్రంపై కనీస అవగాహన, విజ్ఞానం, నైతికత, కుటుంబ విలువలు, కనీసం మనిషికి ఉండాల్సిన లక్షణాలు లేకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఎంపీగా తనను ఎందుకు గెలిపించారని అడుగుతున్న పవన్‌కళ్యాణ్ ఏరోజైనా గాజువాక ప్రజలు ఆయన్ని ఎందుకు ఓడించారో అడిగారా అని ప్రశ్నించారు. తాను ఎంపీగా గెలిచిన నాటి నుంచి విశాఖలోనే ఉన్నానన్నారు. గాజువాకలో ఓడిపోయిన తర్వాత పవన్ ఎప్పుడైనా ఆ నియోజకవర్గ ప్రజల వైపు చూశారా.. అని నిలదీశారు. అక్రమ వ్యాపారంతో విశాఖను నాశనం చేస్తున్నానంటూ తనపై చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. సినిమాల ద్వారా ఆయన వ్యాపారం చేయడం లేదా.. అని ప్రశ్నించారు.

సీబీసీఎన్‌సీ భూముల టీడీఆర్‌పై కనీస అవగాహన లేదు

సీబీసీఎన్‌సీ భూముల టీడీఆర్‌పై కనీసం అవగాహన లేకుండా దున్నపోతు మాదిరిగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతున్నారన్నారు. ఆ ప్రాజెక్టు నిబంధనలకు అనుగుణంగానే చేపట్టినట్లు తెలిపారు. సొంత కులాన్ని చంద్రబాబుకి తాకట్టుపెట్టిన పవన్ రాజకీయాల్లోకి వచ్చాక ఆ కులానికి ఏం మేలు చేశాడో చెప్పాలన్నారు. పవన్‌కళ్యాణ్‌కు నిజంగా సత్తా ఉంటే రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను పోటీచేయించాలని సూచించారు. దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో తనపై పోటీచేసి గెలవాలని సవాల్ చేశారు. తన కుటుంబసభ్యుల కిడ్నాప్ కేసుపై పవన్ వ్యాఖ్యలను ఎంపీ కొట్టిపడేశారు. నేరస్తులపై చర్యలు తీసుకోవడం అంటే.. తాను వెళ్లి వారిని మర్డర్ చేయాలని పవన్ భావిస్తున్నాడా అని ప్రశ్నించారు. ఈ కేసు విషయంలో రాజ్యాంగబద్ధంగా చట్టప్రకారం నేరస్తులపై చర్యలుంటాయని చెప్పారు. వీఐపీ రోడ్డు కూడలి మూసివేత అన్నది నగర మాస్టర్ ప్లాన్‌లో భాగంగా పోలీసులు తీసుకున్న నిర్ణయమని తెలిపారు. ఆ రోడ్డు మూసివేతకు, పక్కనే జరుగుతున్న తమ ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ రోడ్డు మూసివేతపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నట్లు మీడియా ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతూ నగర పోలీసు కమిషనర్‌కు లేఖ రాస్తానని ఎంపీ చెప్పారు.

అసహనంతోనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు

- చంద్రబాబు, పవన్, ఎల్లో మీడియాపై మంత్రి అంబటి ఆగ్రహం
- టీడీపీ ప్రభుత్వం పట్టిసీమ పేరుతో రూ.కోట్లు దోచుకుందని వెల్లడి



సత్తెనపల్లి: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందనే విషయం అర్థమైన ఎల్లో మీడియా, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తీవ్ర అసహనంతో కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రభుత్వంపై ఎల్లో మీడియానే పగబట్టిందని.. అందుకే విద్వేషపూరిత రాతలు రాస్తున్నాయని దుయ్యబట్టారు. పిచ్చి రాతలతో బురద జల్లేందుకు ప్రయత్నిస్తే సహించబోమని హెచ్చరించారు. పట్టిసీమ ఇన్సెంటివ్‌ల పేరుతో చంద్రబాబు రూ.257 కోట్లు దోచి పెట్టారని చెప్పారు. పర్యావరణ అనుమతులు లేకుండా చంద్రబాబు పట్టిసీమ చేపట్టడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రూ.24.90 కోట్ల జరిమానా విధిస్తే ఈ ప్రభుత్వం చెల్లించిందన్నారు. ప్రకాశం బ్యారేజీకి నీరు చేరాలంటే పట్టిసీమ మాత్రమే కడితే సరిపోదని.. దాదాపు 175 కిలోమీటర్ల మేర కుడి కాలువ మట్టి పనులు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కాలువ పనుల్లో ఎక్కువ శాతం దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పూర్తయ్యాయని వివరించారు. 2004–14 మధ్యలో కుడికాలువ పనులు 131 కిలోమీటర్లు పూర్తి కాగా.. 2014–19 మధ్యలో 47.80 కిలోమీటర్లు మాత్రమే జరిగాయని వివరించారు. భూసేకరణకు సంబంధించి 2004–14 మధ్యలో 10,558 ఎకరాలను రూ.391 కోట్లతో సేకరించగా.. 2014–19 మధ్యలో కేవలం 1,844 ఎకరాలను రూ.834 కోట్లు వెచ్చించి చంద్రబాబు ప్రభుత్వం సేకరించిందని చెప్పారు. అంటే వైఎస్సార్ హయాంలోనే 32 శాతం నిధులతో 86 శాతం భూ సేకరణ పూర్తయితే.. చంద్రబాబు హయాంలో 68 శాతం నిధులు ఖర్చు చేసి 14శాతం భూసేకరణ మాత్రమే చేశారని విమర్శించారు. ఈ గణాంకాలను పరిశీలిస్తే చంద్రబాబు ఎన్ని రూ.కోట్లు దోచుకున్నాడో అర్థం చేసుకోవచ్చన్నారు. నీకు అన్యాయం చేసిన పవన్.. రాష్ట్రానికి ఏం న్యాయం చేస్తాడమ్మా? అని రేణుదేశాయ్‌ను అంబటి ప్రశ్నించారు.

మంచిమాట



స్ఫూర్తిదాయకం స్వాతంత్ర్యం

ఏ దేశానికైనా ప్రధానంగా ఉండాల్సింది స్వాతంత్ర్యం. ప్రపంచంలో పలుదేశాలు ఏదో సందర్భంలో ఇతర దేశాల పాలనకు లోబడి అటుపైన స్వాతంత్ర్యాన్ని సాధించు కున్నవే. స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న దినాన్ని ఉత్సవ దినంగా ప్రతి దేశమూ జరుపుకుంటూ ఉంటుంది. స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి దేశానికి స్ఫూర్తిదాయకమే.

‘దేశానికి రూపకల్పన చేసేది ఏది? ఎత్తైన నిర్మాణాలు, భవనాల గోపురాలతో ఉండే గొప్ప నగరాలు కాదు; విశాలమైన ఓడరేవులు కాదు, కాదు; మనుషులు, గొప్ప మనుషులు’ అని ఒక గ్రీక్ చాటువు ను ఆధారంగా తీసుకుని ఇంగ్లిష్ కవి విలిఅమ్ జోన్స్ చెప్పారు. ఆ మాటల్ని తీసుకుని గురజాడ అప్పారావు ‘దేశమంటే మట్టికాదోయ్ /దేశమంటే మనుషులోయ్’ అని చెప్పారు. ఔను, దేశం అంటే మనుషులే.

‘నువ్వు నీ దేశాన్ని ప్రేమించు’ అని ఇంగ్లిష్ కవి ఆల్ఫెడ్ టెన్నిసన్ అన్నారు. ఆ మాటల్ని తీసుకునే గురజాడ అప్పారావు ‘దేశమును ప్రేమించుమన్నా’ అని అన్నారు. దేశాన్ని ప్రేమించడం దేశ ప్రజల్ని ప్రేమించడం ఔతుంది; దేశప్రజల్ని ప్రేమించడం దేశాన్ని ప్రేమించడం ఔతుంది. దేశాన్ని ప్రేమించలేనివాళ్లు దేశ పౌరులుగా ఉండేందుకు ఎంతమాత్రమూ అర్హులు అవరు; వాళ్లు దేశానికి హానికరం ఔతారు.

‘నితాంత స్వాతంత్ర్యమ్ము వెల్లి విరియు స్వర్గాన/నా మాతృదేశమును మేలుకొన నిమ్ము ప్రభూ’ ఈ మాటల్లో పలికిన రవీంద్రనాథ్ ఠాగూర్ భావం మాతృదేశం, దేశ స్వాతంత్ర్యం ఆవశ్యకతనూ, ప్రాముఖ్యతనూ ఘోషిస్తూ ఉంది. విదేశీ ఆక్రమణ దారుల క్రూరమైన, భయానకమైన పాలనలో పెనుబాధను అనుభవించి, లెక్కలేనంత సంపదను కోల్పోయి, ఎన్నిటినో వదులుకున్న మనదేశం వందల సంవత్సరాల పరపీడన నుండి విముక్తమై 75 యేళ్లగా స్వాతంత్ర్యాన్ని శ్వాసిస్తోంది. మనం ఇవాళ స్వతంత్ర దేశంలో ఉన్నాం;

మన దేశంలో మనం మనదేశ పౌరులుగా ఉన్నాం. ఈ దేశం మనది; ఈ మనదేశం మన సంతతికి పదిలంగా అందాలి. ఈ చింతన మనల్ని నడిపించే ఆశయమై మనలో, మనతో సర్వదా, సర్వథా ఉండాలి.

‘దేశవాసులు అందరికీ జాతీయతా భావం ఉండాలి. జాతీయతా భావం లేకపోవడం క్షంతవ్యం కాదు. జాతీయతా వ్యతిరేకత, దేశ వ్యతిరేకత అనేవి భయంకరమైన మానసికవ్యాధులు. అవి ఉండ కూడదు. జాతీయత–దేశ విద్వేషవాదం నుండి మనల్ని, మనదేశాన్ని మనం కాపాడుకుంటూ ఉండాలి’

‘నువ్వు, నీ దేశం నీకు ఏం చేస్తుంది అని అడిగే రాజకీయవాదివా? లేక పోతే నువ్వు, నీ దేశానికి ఏం చెయ్యగలను అని అడిగే పట్టుదల ఉన్నవాడివా? మొదటి ప్రశ్న అడిగేవాడివి ఐతే నువ్వు పరాన్నజీవివైన పురుగువి, రెండవ ప్రశ్న అడిగే వాడివి ఐతే నువ్వు ఎడారిలో ఉద్యానవనంవి’ అని ఖలీల్ జిబ్రాన్ మాటలు మన మెదళ్లను కదిలించాలి; మనదేశానికి మనం ఉద్యానవనాలం అవ్వాలి.

‘జంబూద్వీపే వైవస్వత మన్వంతరే భరతఖండే... ’ఇలా ఆలయాల్లో సంకల్పం చెప్పడం మనకు తెలిసిందే. ఈ సంకల్పం చెప్పడం కాశ్మీర్ నుండీ కన్యాకుమారి వరకూ ఉండే ఆలయాల్లో ఉంది. ఇప్పటి పాకిస్తాన్ ప్రాంతంలోనూ, ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలోనూ ఉండే ఆలయాల్లోనూ ఉండేది. దీని ద్వారా భరత ఖండం సాంస్కృతికంగా ఒకటే అన్న సత్యం విశదం ఔతోంది. 2,000 ఏళ్లకు పూర్వందైన తమిళ్ సాహిత్యం పుఱనానూఱులో ఉత్తరాన హిమాలయాల నుండీ దక్షిణాన కన్యాకుమారి వరకు ఉన్న దేశం ఇది అని చెప్పబడింది. దీని ద్వారా ఎప్పటి నుండో భారతం భౌగోళికంగా ఒకటే అన్న సత్యం అవగతం ఔతోంది.

‘భారత(ప్ర) దేశం... ‘భా’ అంటే ‘కాంతి’ లేదా ‘ప్రకాశం’ అనీ, ‘రత’ అంటే అంకితమైన, ఆసక్తి కల అనీ అర్థాలు. భగవంతుడు కాంతిరూపుడు. ‘భారతం’ అంటే ‘భగవంతుడికి అంకితమైంది’ లేదా ‘భగవంతుడిపై ఆసక్తి కలది’ అని అర్థం. ఈ అర్థాన్ని మనం ఆకళింపు చేసుకుందాం‘

2,300 యేళ్ల క్రితం నాటి గ్రీక్ చరిత్రకారుడు మెగస్తనీస్ హిమాలయం నుండీ దక్షిణాన కడలి వరకు ‘ఇండికా’ అని గుర్తించాడు. అవగాహనా రాహిత్యంతో కొందరు మన దేశం అసలు ఒక దేశమే కాదని, మరొకటని మనలో దేశవ్యతిరేక భావ అనలాన్ని రగిలిస్తూ ఉంటారు. ఆ అనలాన్ని చదువుతోనూ, విజ్ఞతతోనూ మనం ఆర్పేసుకోవాలి.

‘నా తల్లీ, తండ్రీ సంతోషంగా ఉన్నది ఈ దేశంలోనే’ అనీ, ‘తియ్యనైన ఊపిరినిచ్చి కని, పెంచి అనుగ్రహించింది ఈ దేశమే’ అని అన్నారు తమిళ్ మహాకవి సుబ్రమణియ బారతి. ఆయన జాతీయతా సమైక్యతను కాంక్షిస్తూ ‘కాశి నగర పండితుల ప్రసంగాన్ని కంచిలో వినడానికి ఒక పరికరాన్ని చేద్దాం’ అనీ అన్నారు. జాతీయతా సమైక్యత ఆపై సమగ్రత దేశానికి ముమ్మాటికీ ముఖ్యం.

‘వందేమాతరం జయ వందేమాతరం; ఆర్య భూమిలో నారీమణులూ, నర సూర్యులూ చేసే వీరనినాదం వందే మాతరం’ అనీ, ‘వందేమాతరం అందాం; మా దేశమాతను పూజిస్తాం అందాం’ అనీ నినదించారు సుబ్రమణియ బారతి. మనదేశాన్ని ప్రేమిస్తూ ఉందాం, మనదేశాన్ని పూజిస్తూ ఉందాం, మనం దేశభక్తులుగా మసలుతూ ఉందాం. దేశభక్తితో, భారతీయతతో బతుకుతూ ఉందాం. భారతీయులమై మనసారా, నోరారా అందాం, అంటూ ఉందాం ‘వందేమాతరం’.

– రోచిష్మాన్

సన్నిధి

బౌద్ధవాణి

మిత్రధర్మం



బుద్ధుడు ధర్మ ప్రబోధం చేస్తూ, సుబాహుడనే ఓ రైతు కథ చెప్పాడు.

పూర్వం ఒక గ్రామంలో సుబాహుడు అనే రైతు ఉండేవాడు. అతనికి అడవిని ఆనుకుని పంటపొలం ఉంది. ఒక రోజున పొలం దున్ని నాగలి విప్పాడు. ఎద్దుల్ని పచ్చికలో తోలాడు. తాను పొలం పనుల్లో మునిగిపోయాడు. చాలాసేపటికి గమనిస్తే ఎద్దులు కన్పించలేదు. వాటిని వెతుక్కుంటూ అడవిలోకి పోయాడు. అడవి మధ్యకు చేరాడు. దారి తప్పాడు. ఆకలి వేసింది. అక్కడ కొండ అంచున తిందుక వృక్షం కనిపించింది. మెల్లగా చెట్టెక్కాడు. ఒక కొమ్మ మీదికి చేరి పండ్ల గుత్తిని అందుకోబోయాడు. కొమ్మ విరిగి బావి లాంటి పెద్ద గుంటలో పడ్డాడు. బయటకు రాలేకపోయాడు. అలా రోజులు గడిచాయి. నీరసించి శక్తి సన్నగిల్లి మూలుగుతూ పడి ఉన్నాడు.

ఆ మరునాడు ఉదయం తిందుక ఫలాల కోసం ఒక పెద్ద తోక వానరం అక్కడికి వచ్చింది. గుంటలోంచి వచ్చే మూలుగును వింది. జాలి పడింది. అరచి పిలిచింది. వాడు కళ్ళు తెరచి చూశాడు. ‘‘మానవా! భయపడకు నిన్ను కాపాడుతాను’’ అంది. ఆ పక్కనే ఉన్న రాతిబండలు గోతిలోకి జారవిడిచి మెట్లుగా పేర్చింది. గోతిలోకి దిగి, అతణ్ణి భుజాన ఎత్తుకుని పైకి చేర్చింది. ఆకు దొన్నెలో నీరు తెచ్చింది. తిందుక ఫలాలు తినిపించింది. వాడు నెమ్మదిగా శక్తి తెచ్చుకున్నాడు. తన వివరాలు చెప్పాడు. ‘‘సుబాహూ.. చింతిల్లకు.. నా వీపున ఎక్కి భుజాలు పట్టుకో’’ అంది. సుబాహుని తీసుకుని అతని గ్రామంవైపు సాగింది.

కొంతసేపటికి అలసిపోయింది. ‘‘సుబాహూ... అలసటగా ఉంది. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటాను. ఈ ప్రాంతంలో సింహాలు, పులులు, ఎలుగుబంట్లు, చిరుతలు తిరుగుతూ ఉంటాయి. నీవు జాగ్రత్తగా చూస్తూ ఉండు. అవసరమైతే నన్ను లేపు’’ అని, ఆ ప్రక్కనే ఉన్న చెట్టుకి ఆనుకుని కునుకు తీసింది వానరం. ‘ఈ వానరం బలంగా ఉంది. దీని మాంసం చాలా రుచిగానూ ఉంటుంది. దీన్ని చంపి తిన్నంత తిని మిగిలినది దార్లో తింటూ పోవచ్చు.’ అనే దురాలోచన కలిగింది సుబాహుకు. వెంటనే పక్కనే ఉన్న రాయి ఎత్తి తలమీద కొట్టబోయాడు. కానీ శక్తి లేక పోవడం వల్ల చేయి వణికింది. గురి తప్పింది. వానరం లేచింది. సుబాహు వైపు చూసింది. వాడు గడగడ వణికిపోతున్నాడు. దానికి జాలి వేసింది.

‘‘మానవా! అన్నిటి కంటే పెద్దనేరం మిత్ర ద్రోహం. అయినా, నేను ధర్మాన్ని తప్పను. నిన్ను నమ్మను. నేను చెట్లకొమ్మల మీదినుండి వెళ్తా ఉంటాను. నీవు నేలమీద ఆ వెనుకే రా.. నీ గ్రామానికి చేరుస్తాను’’ అంది. అలా అడవి చివరకు చేర్చి తిరిగి తన నివాసానికి వెళ్ళిపోయింది. ఆ తర్వాత వాడు ఆ నీటిలో దిగి దాహం తీర్చుకున్నాడు. స్నానం చేశాడు. ఆ తరువాత వాడి శరీరంలో మార్పులు వచ్చాయి. ఒళ్ళంతా బొబ్బలు లేచాయి. అవి మానని గాయాలుగా మారాయి. సుబాహు కుష్ఠువ్యాధి పీడితుడయ్యాడు’’ అని చెప్పి–

‘‘భిక్షువులారా! కుష్ఠువ్యాధి కంటే భయంకరమైంది మేలు చేసిన వారికి కీడు చేయడం. మిత్ర ద్రోహిని, చేసిన మేలు మరిచే వారిని చూసి అసహ్యించుకోవాలి. వ్యాధిగ్రస్తుల్ని, రోగాల్ని చూసి కాదు’’ అన్నాడు.

– బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

మనసుకు హత్తుకునేలా...



గొప్ప వాక్కును కొందరు మహాత్ములు పద్యరూపంలో చెప్పారు. మరి కొందరు గద్యరూపంలో చెప్పారు, ఇంకొందరు గీతం రూపంలో చెప్పారు. పోతన భాగవతాన్ని పద్య, గద్య రూపంలో చెప్పారు. ప్రధానంగా పద్య రూపంలో చెప్పారు. పద్యానికి ఉన్న లక్షణం –అది ఛందోబద్ధం. నాలుగుసార్లు చదివితే అది నోటికొచ్చేస్తుంది. జ్ఞాపకంలో ఉండిపోతుంది. జీవితంలో ఏది ప్రధానంగా జ్ఞాపకం ఉంచుకోవాలో, అలా ఉంచుకుని సందర్భాన్నిబట్టి గుర్తు తెచ్చుకుని సానుకూలంగా ఆచరణలో పెట్టుకోగలిగిన వాటిని ఛందోబద్ధంగా ఇస్తే అవి మనసుకు హత్తుకుని మనకు అవసరాన్నిబట్టి ప్రయోజనం కలిగిస్తాయి. కానీ అంత జ్ఞాపకం పెట్టుకోవలసిన అవసరం లేని వాటిని గద్య రూపంలో(వచనంగా) అందించాడు పోతన, పద్యం, గద్యం కలిసి రాసినప్పుడు. తెలుగులో పద్యరూపంలో చెప్పినట్టుగానే, సంస్కృతంలో శ్లోకరూపంలో చెప్పారు. ఒక పద్యాన్ని చదవడంకన్నా, ఒక శ్లోకాన్ని చదవడంకన్నా, మేము వాక్యరూపంలో ఉన్న వచనాన్ని (గద్యాన్ని) చదువుకుని ప్రయోజనం పొందుతామని ఇష్టపడేవారికి గద్యంలో కూడా అందుబాటులో ఉంచారు. మరి కొందరు చాలా తేలికగా అవతలివారికి బోధ చేయడానికి గీతం రూపంలో అందించారు. గీతం అంటే పాట. పాట మనసును రంజింప చేస్తుంది. సహజంగా పుట్టుకచేత క్రౌర్యం ఉన్నవి కూడా సంగీతం వినబడేటప్పటికి అవి వాటి క్రూరత్వాన్ని ఆ కాసేపు పక్కనబెట్టేస్తాయి. అలాగే గాఢమైన అజ్ఞానంతో ఏమీ తెలియనివారు కూడా సంగీతంతో కూడిన గీతం వినేటప్పటికి గొప్ప శాంతిని పొందుతారు. పశువులు కావచ్చు, పసిబిడ్డలు కావచ్చు .. పాటవినేటప్పటికి ఒక తన్మయావస్థకు లోనుకావడం జరుగుతుంది. ఏడుస్తున్న వాళ్ళు కూడా ఆ కాసేపు ఏడుపు ఆపేస్తారు. మనసు శాంతిని పొందుతుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సమాజ హితం కోసం పద్యరూపంలోగానీ, గద్య, గీత రూపాల్లో కానీ ఎవరు ఏమీ ఆశించకుండా వాక్కులుగా వెచ్చించారో వారు శాశ్వత్వాన్ని పొందారు. ‘ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనంబులున్/సొమ్ములు? గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము? బాసి కాలుచే/ సమ్మెట పోటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ/ బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్.’ అంటాడు పోతన. నేను సమాజహితాన్ని కోరి పలుకుతున్నాను తప్ప నేనేమీ ఆశించడంలేదన్నాడు.. అదే శాశ్వతమైనది.

సినిమా

యాక్షన్.. ఎమోషన్


● వెంకటేశ్

వెంకటేష్ హీరోగా నటిస్తున్న ‘సైంధవ్’ సినిమా క్లైమాక్స్ షెడ్యూల్ పూర్తయింది. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నవాజుద్దీన్ సిద్ధిఖీ, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, సారా కీలక పాత్రలు చేస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ సినిమా క్లైమాక్స్ షెడ్యూల్ కంప్లీట్ అయింది. ఈ సందర్భంగా యూనిట్ వెంకటేష్ లుక్‌ని రిలీజ్ చేసింది. ‘‘వెంకటేష్ కెరీర్‌లో 75వ చిత్రంగా ‘సైంధవ్’ రూపొందుతోంది. హీరోతో పాటు ఎనిమిది మంది ముఖ్య నటీనటులపై 16 రోజుల్లో కీలకమైన హై యాక్షన్–ఎమోషనల్ క్లైమాక్స్ షెడ్యూల్‌ను పూర్తి చేశాం. యాక్షన్ ఎపిసోడ్‌ను రామ్–లక్ష్మణ్ మాస్టర్స్ సూపర్‌వైజ్ చేశారు. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 22న ఈ మూవీ రిలీజ్ కానుంది’’ అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు, కెమెరా: ఎస్.మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్).

సెప్టెంబరులో స్టార్ట్?

‘**డా**న్‌శీను’, ‘బలుపు’, ‘క్రాక్’ చిత్రాల తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో కొత్త సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను సెప్టెంబరులో స్టార్ట్ చేసేలా చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రంలో హీరోయిన్స్ పాత్రల కోసం మృణాల్ ఠాకూర్, పూజాహెగ్డే వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. మరి ఈ ఇద్దరిలో ఎవరో ఒకరు ఫైనల్‌గా ఫిక్స్ అవుతారా? లేకుంటే వేరే హీరోయిన్ ఈ ప్రాజెక్టులో యాడ్ అవుతారా? అన్నది తెలియాలి. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. మరోవైపు రవితేజ ప్రస్తుతం ‘టైగర్ నాగేశ్వరరావు’, ‘ఈగిల్’ సినిమాలతో బిజీగా ఉన్నారు. ‘టైగర్ నాగేశ్వరరావు’ చిత్రం అక్టోబరు 20న విడుదల కానున్న సంగతి తెలిసిందే.


● రవితేజ

యాక్షన్ ప్లాన్ రెడీ

కెరీర్‌ను పక్కా ప్లాన్‌తో డిజైన్ చేసుకుంటున్నట్లున్నారు హీరో సూర్య. ప్రస్తుతం ‘కంగువా’ సినిమాతో బిజీగా ఉన్నారాయన. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిలీజ్ కానుందని తెలిసింది. అయితే ఈ చిత్రం తర్వాత ‘సూరారై పోట్రు’ (తెలుగులో ‘ఆకాశం నీ హద్దురా’) వంటి హిట్ ఇచ్చిన సుధా కొంగర దర్శకత్వంలో మరో సినిమా చేస్తారు సూర్య. అక్టోబరులో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. అలాగే వెట్రిమారన్ దర్శకత్వంలో సూర్య ఆల్రెడీ కమిటైన ‘వాడి వాసల్’ చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుంది. ప్రస్తుతం వెట్రిమారన్ ‘విడుదలై 2’తో బిజీగా ఉన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తికాగానే ‘వాడి వాసల్’ ప్రారంభమవుతుందట. ఇక లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన కమల్‌హాసన్ ‘విక్రమ్’ క్లైమాక్స్‌లో రోలెక్స్ పాత్రలో సూర్య అదరగొట్టారు. ఈ రోలెక్స్ క్యారెక్టర్‌తోనే ఓ కంప్లీట్ సినిమా ఉంటుందని, సూర్య ఇప్పటికే కమిటైన ప్రాజెక్ట్స్ షూటింగ్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్ సెట్స్‌కి వెళుతుందట. కాగా సూర్య ఆదివారం తన ఫ్యాన్స్‌ని కలుసుకున్నారట. ఈ క్రమంలోనే తన తర్వాతి సినిమాలపై అప్‌డేట్స్ ఇచ్చారని, అవే ప్రస్తుతం కోలీవుడ్‌లో తెరపైకి వచ్చాయని తెలుస్తోంది.


● సూర్య

ఆ పదం నాకు పెద్దగా నచ్చదు

– నాని

‘‘**మ**నందరం ఇప్పుడు పాన్ ఇండియా మూవీస్ అంటున్నాం. ఆ పదం నాకు పెద్దగా నచ్చదు. కానీ, నాకు తెలిసిన యాక్టర్స్‌లో పాన్ ఇండియా యాక్టర్ ఎవరైనా ఉన్నారంటే అది దుల్కర్ మాత్రమే. ఎందుకంటే ఓ హిందీ దర్శకుడు దుల్కర్ కోసం కథ రాసుకుంటాడు. ఓ తెలుగు దర్శకుడు తన కోసం కథ రాసుకుంటాడు. ఓ తమిళ దర్శకుడు కూడా దుల్కర్ కోసం స్క్రిప్ట్ రాసుకుంటాడు. ఓ మలయాళ దర్శకుడూ అతని కోసం కథ రాస్తాడు. ఓ పాన్ ఇండియా యాక్టర్‌కు నిజమైన నిర్వచనం ఇదే’’ అన్నారు నాని. దుల్కర్ సల్మాన్, ఐశ్వర్యా లక్ష్మి జంటగా నటించిన చిత్రం ‘కింగ్ ఆఫ్ కోత’. అభిలాష్ జోషి దర్శకత్వంలో జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ– ‘‘దుల్కర్ ‘ఓకే బంగారం’ సినిమాలో నా వాయిస్ ఉంది. తన జర్నీలో నా భాగస్వామ్యం కూడా ఉన్నట్లు నేను ఫీలవుతున్నాను. ‘సీతారామం’తో తను తెలుగు ప్రేక్షకుల మనసు గెల్చుకున్నాడు. ఈ సినిమాతో ఆ ప్రేమ నెక్స్ట్ లెవల్‌కు వెళ్లాలని కోరుకుంటున్నాను. ‘కింగ్ ఆఫ్ కోత’ పెద్ద విజయం సాధించాలి. ’’ అన్నారు. హీరో రానా మాట్లాడుతూ–‘‘దుల్కర్ ఓ వైల్డ్ యాక్షన్ ఫిల్మ్ చేశాడంటే నాకు చాలా ఎగ్జయిటింగ్‌గా ఉంది’’ అన్నారు. దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ–‘‘ నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ఫిల్మ్ ‘కింగ్ ఆఫ్ కోత’. నాలుగు భాషల్లోనూ నేనే డబ్బింగ్ చెప్పాను’’ అన్నారు. ‘‘ఈ సినిమాలో దుల్కర్ కొత్తగా కనిపిస్తారు’’ అన్నారు జీ స్టూడియోస్ వైస్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ప్రసాద్. ఈ కార్యక్రమంలో హీరోయిన్స్ ఐశ్వర్యా లక్ష్మి, అనిఖా సురేంద్రన్, నటుడు షబ్బీర్, నిర్మాత ‘స్రవంతి’ రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.


● నిమ్మకాయల ప్రసాద్, రానా, దుల్కర్ సల్మాన్, నాని, ఐశ్వర్యా లక్ష్మి


● తమన్నా

షాక్ అయ్యాను!

తమన్నా నటించిన తాజా వెబ్‌సిరీస్ ‘ఆఖరి సచ్’. 2018లో ఢిల్లీలో బూరారి ప్రాంతంలో ఒకే కుటుంబానికి చెందిన పదకొండుమంది ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనలతో ‘ఆఖరి సచ్’ రూపొందింది. తమన్నా, అభిషేక్ బెనర్జీ, శివిన్ నారంగ్, రాహుల్ బగ్గా లీడ్ రోల్స్‌లో రాబీ గ్రేవాల్ దర్శకత్వం వహించారు. ఈ నెల 25 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా తమన్నా మాట్లాడుతూ– ‘‘ఇందులో అన్య అనే ఇన్వెస్టిగేటివ్ పోలీసాఫీసర్ పాత్రలో నటించాను. ‘ఆఖరి సచ్’ కథ విన్నప్పుడు నేను షాక్ అయ్యాను. ఈ సిరీస్ నాకు చాలా స్పెషల్. ఎందుకంటే నా కెరీర్‌లో తొలిసారిగా ఓ పోలీసాఫీసర్ పాత్రలో నటించాను. అలాగే నా కంఫర్ట్‌జోన్ దాటి చాలా ఎమోషన్స్‌తో కూడు కున్న అన్య పాత్రలో నటించాను’’ అని చెప్పుకొచ్చారు తమన్నా.

కుటుంబంతో కలిసి చూడొచ్చు

– దర్శకుడు అభిషేక్ మహర్షి

‘‘ప్రేమ్ కుమార్’ చిత్రం ఆద్యంతం వినోద భరితంగా కుటుంబ సమేతంగా చూసేలా ఉంటుంది. ఈ మూవీలో నేను, నా వైఫ్ అతిథి పాత్రల్లో కనిపిస్తాం’’ అని దర్శకుడు అభిషేక్ మహర్షి అన్నారు. సంతోష్ శోభన్ హీరోగా, రాశీ సింగ్, రుచిత సాధినేని హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘ప్రేమ్ కుమార్’. శివ ప్రసాద్ పన్నీరు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు అభిషేక్ మహర్షి మాట్లాడుతూ–‘‘కొన్ని సినిమాలకు ఘోస్ట్ రైటర్‌గా పని చేశాను. నా దగ్గర ఉన్న ముప్పై కథల్లో ‘ప్రేమ్ కుమార్’ కథ సెట్ అయింది. ‘కుచ్ కుచ్ హోతా హై, నువ్వే నువ్వే’ సినిమాల స్ఫూర్తితో ఈ కథను రాశాను. సినిమాల్లో పెళ్లి సీన్‌లో చివర్లో హీరో వచ్చి.. హీరోయిన్ పెళ్లి ఆపుతాడు. తర్వాత హీరో, హీరోయిన్లు కలిసిపోతారు. అప్పుడు ఆ పెళ్లి కొడుకు పరిస్థితి ఏంటి? చెప్పేందుకే ‘ప్రేమ్ కుమార్’ తీశాం. శివ ప్రసాద్‌గారికి సినిమాలపై ఎంతో ప్యాషన్ ఉంది’’ అన్నారు.



థాయ్‌లాండ్‌లో డబుల్

‘ఇస్మార్ట్ శంకర్’ (2019) వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం ‘డబుల్ ఇస్మార్ట్’. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండో షెడ్యూల్ థాయిలాండ్‌లో ప్రారంభమైంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను విడుదల చేశారు మేకర్స్. ‘‘హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం ‘డబుల్ ఇస్మార్ట్’. రెండో షెడ్యూల్ థాయిలాండ్‌లో ప్రారంభించాం. ఈ షెడ్యూల్‌లో రామ్, నటుడు సంజయ్ దత్‌పై కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. ‘ఇస్మార్ట్ శంకర్’ కి సీక్వెల్‌గా రూపొందుతున్న ‘డబుల్ ఇస్మార్ట్’ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 2024 మార్చి 8న మహాశివరాత్రికి విడుదలవుతుంది’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సీఈఓ: విషు రెడ్డి, కెమెరా: జియాని గియాన్నెల్లి.


● షూటింగ్‌లో ‘డబుల్ ఇస్మార్ట్’ యూనిట్

నవ్వులే నవ్వులు

అభినవ్ మణికంఠ, గోల్డీ నిస్సీ, మ్యాడీ వీజే, పవన్ రమేష్, భరత్ రెడ్డి కీలక పాత్రల్లో అశోక్ కుమార్ దర్శకత్వం వహించిన చిత్రం ‘మహానటులు’. ఏబీఆర్ ప్రొడక్షన్స్ అండ్ ఏబీఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై అనిల్ బోధిరెడ్డి, తిరుపతి ఆర్. యర్రంరెడ్డి నిర్మించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ– ‘‘నేను ఇప్పటి వరకూ కామెడీ జానర్ టచ్ చేయలేదు. ‘జాతిరత్నాలు’ సినిమా తరహాలో పూర్తి ఫన్, హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో తీసిన మూవీ ‘మహానటులు’. నలుగురు టీమ్‌గా మారి మహానటులు అనే యూట్యూబ్ చానల్‌ను ఎలా అభివృద్ధి చేశారు? అనేది ఈ చిత్ర కథ’’ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధం నరేష్, సంగీతం: మార్కస్ ఎం.


● మహానటులు సినిమా పోస్టర్

సాక్షి
సోమవారం
14-8-2023

స్పోర్ట్స్



టాప్ సీడ్ స్వియాటెక్‌కు చుక్కెదురు

నేషనల్ బ్యాంక్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) పోరాటం ముగిసింది. కెనడాలోని మాంట్రియల్‌లో జరుగుతున్న ఈ టోర్నీ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో స్వియాటెక్ 2-6, 7-6 (7/4), 4-6తో ప్రపంచ మూడో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా) చేతిలో ఓడిపోయింది. 2 గంటల 30 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో పెగూలా ఆరు ఏస్‌లు సంధించింది. తన సర్వీస్‌ను ఎనిమిదిసార్లు కోల్పోయిన పెగూలా ప్రత్యర్థి సర్వీస్‌ను 11 సార్లు బ్రేక్ చేసింది.



రొనాల్డో ఖాతాలో మరో ట్రోఫీ

పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో రెండేళ్ల తర్వాత తన ప్రొఫెషనల్ కెరీర్‌లో మరో ట్రోఫీని అందుకున్నాడు. తొలిసారి ఆసియాకు చెందిన అల్ నాసర్ క్లబ్ (సౌదీ అరేబియా) తరఫున బరిలోకి దిగిన రొనాల్డో తన జట్టును అరబ్ క్లబ్ చాంపియన్స్ కప్‌లో విజేతగా నిలిపాడు. అల్ హిలాల్ క్లబ్‌తో జరిగిన ఫైనల్లో రొనాల్డో కెప్టెన్సీలోని అల్ నాసర్ జట్టు 2-1 గోల్స్ తేడాతో గెలిచింది. రొనాల్డో రెండు గోల్స్ (74వ, 98వ ని.లో) చేశాడు.







క్వార్టర్స్‌లో అర్జున్, గుకేశ్, ప్రజ్ఞానంద

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్, తమిళనాడు గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద తమ ప్రత్యర్థులపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అర్జున్ 1.5-0.5తో నిల్స్ గ్రాండెలియస్ (స్వీడన్)పై, ప్రజ్ఞానంద 1.5-0.5తో ఫెరెంక్ బెర్కెస్ (హంగేరి)పై, గుకేశ్ 1.5-0.5తో హావో వాంగ్ (చైనా)పై గెలుపొందారు. క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో గుకేశ్; ప్రజ్ఞానందతో అర్జున్ తలపడతారు. శనివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్ తొలి గేములో నెగ్గిన అర్జున్, గుకేశ్ ఆదివారం జరిగిన రెండో గేమ్‌లను 'డ్రా' చేసుకొని... ప్రజ్ఞానంద 49 ఎత్తుల్లో గెలుపొంది క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. నిపోమ్‌నిషి (రష్యా)తో జరుగుతున్న మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండో గేమ్‌ను కూడా విదిత్ (భారత్) 'డ్రా' చేసుకోవడంతో ఇద్దరూ 1-1తో సమఉజ్జీగా ఉన్నారు. వీరిద్దరి మధ్య నేడు ర్యాపిడ్ ఫార్మాట్‌లో టైబ్రేక్ నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు. మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక కూడా నేడు ర్యాపిడ్ ఫార్మాట్‌లో టైబ్రేక్ గేమ్‌లు ఆడనుంది. హారిక-అలెగ్జాండ్రా గోర్యాచ్‌కినా (రష్యా)తో క్వార్టర్ ఫైనల్లో రెండు గేమ్‌లు ముగిశాక ఇద్దరూ 1-1తో సమంగా నిలిచారు. దాంతో నేడు టైబ్రేక్ అనివార్యమైంది.

మూడో ర్యాంక్‌లో భారత హాకీ జట్టు



ఎఫ్‌ఐహెచ్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: స్వదేశంలో తొలిసారి జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన భారత పురుషుల జట్టు ర్యాంక్ కూడా మెరుగైంది. ఆదివారం విడుదల చేసిన అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) తాజా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు ఒక స్థానం పురోగతి సాధించి నాలుగు నుంచి మూడో ర్యాంక్‌కు ఎగబాకింది. హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు ఖాతాలో 2771.35 పాయింట్లు ఉన్నాయి. 2021 తర్వాత భారత జట్టు మరోసారి మూడో ర్యాంక్‌లో నిలిచింది. 2021లో టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన తర్వాత భారత జట్టు మూడో ర్యాంక్‌కు చేరింది. నెదర్లాండ్స్ జట్టు 3095.90 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, 2917.87 పాయింట్లతో బెల్జియం రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. ఇంగ్లండ్ మూడు నుంచి నాలుగో స్థానానికి చేరగా... జర్మనీ, ఆస్ట్రేలియా వరుసగా ఐదు, ఆరో ర్యాంక్‌ల్లో ఉన్నాయి. తొలిసారి ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో రన్నరప్‌గా నిలిచిన మలేసియా జట్టు తొమ్మిదో స్థానంలో ఉంది.

హాకీ ఇండియా నజరానా

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ విజేత భారత జట్టుకు హాకీ ఇండియా నజరానా ప్రకటించింది. జట్టులోని ప్రతి సభ్యుడికి రూ. 3 లక్షల చొప్పున... శిక్షణ బృందంలోని ప్రతి సభ్యుడికి రూ. లక్షా 50 వేల చొప్పున నగదు పురస్కారం అందజేస్తారు.

సిరీస్ సమర్పయామి

- చివరి టి20 మ్యాచ్‌లో భారత్ పరాజయం
- 8 వికెట్లతో నెగ్గిన వెస్టిండీస్
- సిరీస్‌ను 3-2తో సొంతం చేసుకున్న కరీబియన్ జట్టు

లాడెర్‌హిల్ (ఫ్లోరిడా): బ్యాటింగ్‌కు స్వర్గధామమైన పిచ్‌పై బ్యాటర్ల నిర్లక్ష్యం, పసలేని బౌలింగ్‌తో భారత్ కరీబియన్ పర్యటనను నిరాశతో ముగించింది. టెస్టు, వన్డే సిరీస్‌లను సొంతం చేసుకున్న భారత జట్టు టి20 సిరీస్‌ను మాత్రం కోల్పోయింది. చివరిదైన ఐదో టి20 మ్యాచ్‌లో టీమిండియా ఎనిమిది వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఈ గెలుపుతో వెస్టిండీస్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-2తో చేజిక్కించుకుంది. మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. తిలక్ వర్మ (18 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కాసేపు మెరిపిస్తే... సూర్యకుమార్ (45 బంతుల్లో 61; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) నడిపించాడు. విండీస్ సీమర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రొమారియో షెఫర్డ్ (4/31) భారత్ జోరుకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేశాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన వెస్టిండీస్ 18 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసి గెలిచింది. బ్రాండన్ కింగ్ (55 బంతుల్లో 85 నాటౌట్; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (35 బంతుల్లో 47; 1 ఫోర్, 4 సిక్సర్లు) చెలరేగారు.

ఆదుకున్న సూర్య

టాస్ నెగ్గిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ తీరా బ్యాటింగ్‌కు దిగగానే కష్టాలు ఎదురయ్యాయి. హొసీన్ వరుస ఓవర్లలో ఓపెనర్లు యశస్వి (5), గిల్ (9) వికెట్లను పడేశాడు. ఈ దశలో సూర్యకుమార్‌కు జతయిన తిలక్ వర్మ ధనాధన్ ఆటాడాడు. కానీ కాసేపట్లోనే చేజ్ అతని మెరుపులకు రిటర్న్ క్యాచ్‌తో ముగింపు పలికాడు. సంజూ సామ్సన్ (13) నిరాశపరచగా, తనశైలి షాట్లతో సూర్యకుమార్ జట్టును ఆదుకున్నాడు. భారీ సిక్సర్‌తో సూర్య ఫిఫ్టీ 38 బంతుల్లో పూర్తయ్యింది. అయితే వానొచ్చి కాసేపు ఆటను ఆపేసింది. తర్వాత ఆట మొదలవగానే కెప్టెన్ హార్దిక్ పాండ్యా (18 బంతుల్లో 14; 1 సిక్స్) షెఫర్డ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగాన్‌లో హోల్డర్ చేతికి చిక్కాడు. తర్వాత సూర్యకుమార్‌ను హోల్డర్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. యార్కర్ లెంత్ బాల్ నేరుగా వికెట్ల ముందున్న అతని ప్యాడ్లకు తగిలినా... ఫీల్డ్ అంపైర్ అప్పీల్‌ను తోసిపుచ్చాడు. బంతి గమనం ఇన్‌లైన్‌లో ఉండటంతో విండీస్ డీఆర్‌ఎస్‌కు వెళ్లి ఫలితాన్ని రాబట్టింది. సరిగ్గా ఇలాగే మరో రివ్యూ (డీఆర్‌ఎస్)తో కుల్దీప్ (0) వికెట్‌ను షెఫర్డ్ దక్కించుకున్నాడు. భారత్ ఇన్నింగ్స్ ముగిసేందుకు ఇంకో రెండు బంతులు ఉండగా మళ్లీ వర్షమొచ్చి ఆగినా... వెంటనే మొదలైంది. కానీ అక్షర్ పటేల్ (10 బంతుల్లో 13; 1 సిక్స్) అవుట్ కాగా ఆఖరి బంతిని ముకేశ్ కీపర్ తలపైనుంచి బౌండరీకి తరలించాడు.

కింగ్, పూరన్‌ల జోరుతో

లక్ష్యఛేదనకు దిగగానే అర్ష్‌దీప్ సింగ్ ఓపెనర్ మేయర్స్ వికెట్‌ను పడగొట్టడంతో భారత్ సంబరమైతే చేసుకుంది. కానీ ఈ ఆనందం అంతటితోనే ఆవిరైంది. మరో ఓపెనర్ బ్రాండన్ కింగ్, నికోలస్ పూరన్ స్కోరు బోర్డును భారీ సిక్సర్లు, బౌండరీలతో పరుగు పెట్టించారు. పేస్, స్పిన్ ఇలా ఎవరు వేసినా రన్‌రేట్ మాత్రం ఓవర్‌కు 9 పరుగుల చొప్పున దూసుకెళ్లింది. హిట్టర్లు ఇద్దరూ పాతుకుపోవడంతో వికెట్ పడగొట్టడం భారత బౌలర్ల వల్ల కాలేకపోయింది. వర్షం మళ్లీ చికాకు పెట్టినా విరామం తర్వాత మొదలైంది. పూరన్‌ను తిలక్ వర్మ బోల్తా కొట్టించాడు. కానీ మిగతా లాంఛనాన్ని 38 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్న కింగ్, షై హోప్ (13 బంతుల్లో 22 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) పూర్తి చేశారు. పాండ్యా ఏకంగా 8 మందిని బౌలింగ్‌కు దించినా 2 వికెట్లనే పడగొట్టగలిగాడు.



భారత కెప్టెన్ హార్దిక్ పాండ్యా



షెఫర్డ్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి అండ్ బి) హొసీన్ 5; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హొసీన్ 9; సూర్యకుమార్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హోల్డర్ 61; తిలక్‌వర్మ (సి అండ్ బి) చేజ్ 27; సామ్సన్ (సి) పూరన్ (బి) షెఫర్డ్ 13; పాండ్యా (సి) హోల్డర్ (బి) షెఫర్డ్ 14; అక్షర్ (సి) షెఫర్డ్ (బి) హోల్డర్ 13; అర్ష్‌దీప్ (బి) షెఫర్డ్ 8; కుల్దీప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షెఫర్డ్ 0; చహల్ (నాటౌట్) 0; ముకేశ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి) 165. వికెట్ల పతనం:** 1-6, 2-17, 3-66, 4-87, 5-130, 6-140, 7-149, 8-149, 9-161. **బౌలింగ్:** అకిల్ హొసీన్ 4-0-24-2, మేయర్స్ 1-0-4-0, హోల్డర్ 4-0-36-2, జోసెఫ్ 3-0-41-0, చేజ్ 4-0-25-1, షెఫర్డ్ 4-0-31-4.

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (నాటౌట్) 85; మేయర్స్ (సి) యశస్వి (బి) అర్ష్‌దీప్ 10; పూరన్ (సి) పాండ్యా (బి) తిలక్ వర్మ 47; షై హోప్ (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 7. **మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 171. వికెట్ల పతనం** : 1-12, 2-119. **బౌలింగ్:** పాండ్యా 3-0-32-0, అర్ష్‌దీప్ 2-0-20-1, కుల్దీప్ 4-0-18-0, చహల్ 4-0-51-0, ముకేశ్ 1-0-10-0, తిలక్ వర్మ 2-0-17-1, అక్షర్ 1-0-8-0, యశస్వి 1-0-11-0



పృథ్వీ షా మెరుపు శతకం

76 బంతుల్లో 15 ఫోర్లు, 7 సిక్స్‌లతో 125 నాటౌట్

చెస్టర్ లీ స్ట్రీట్: ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో నార్తంప్టన్‌షైర్ క్లబ్ తరఫున భారత యువ క్రికెటర్ పృథ్వీ షా విధ్వంసకర ప్రదర్శన కొనసాగుతోంది. వన్-డే కప్ టోర్నీలో గతవారం సోమర్‌సెట్‌తో జరిగిన మ్యాచ్‌లో డబుల్ సెంచరీ (244) సాధించిన 23 ఏళ్ల పృథ్వీ షా... డర్హమ్ క్లబ్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మెరుపు శతకం చేశాడు. 76 బంతులు ఆడిన పృథ్వీ షా 15 ఫోర్లు, 7 సిక్స్‌లతో 125 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. పృథ్వీ షా సెంచరీతో నార్తంప్టన్‌షైర్ జట్టు 146 బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా డర్హమ్ జట్టు 43.2 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది. అనంతరం నార్తంప్టన్‌షైర్ 25.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసి విజయం సాధించింది.



శ్రీవారి సేవలో రోహిత్ శర్మ

సాక్షి, తిరుమల: భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఆదివారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నాడు. రోహిత్‌కు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

జర్నలిజం కోర్సుల్లో అడ్మిషన్లు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం.. ప్రభుత్వ గుర్తింపు పొందిన వివిధ జర్నలిజం కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తోంది.

కోర్సుల వివరాలు

» **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం (పీజీడీజే):** కోర్సు వ్యవధి 12 నెలలు. కనీస విద్యార్హత డిగ్రీ.
» **డిప్లొమా ఇన్ జర్నలిజం(డీజే):** కోర్సు వ్యవధి 6 నెలలు. కనీస విద్యార్హత డిగ్రీ.
» **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం(డీటీవీజే):** కోర్సు వ్యవధి 6 నెలలు. కనీస విద్యార్హత డిగ్రీ.
» **సర్టిఫికెట్ కోర్సు ఆఫ్ జర్నలిజం(సీజే):** కోర్సు వ్యవధి 3 నెలలు. కనీస విద్యార్హత ఎస్ఎస్‌సీ.

ప్రవేశం ఇలా

ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ కోర్సుల్ని రెగ్యులర్‌గాను, కరస్పాండెన్స్(దూరవిద్య విధానం)లోనూ చేయవచ్చు. ఆన్‌లైన్ తరగతుల సౌకర్యం ఉంది. ఇంటి దగ్గర నుంచే పాఠ్యాంశాలను లైవ్‌లో వినవచ్చు. తెలుగు లేదా ఇంగ్లిష్ బోధనా మాధ్యమంగా ఎంపిక చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

» ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందటానికి చివరి తేదీ: 21.08.2023
» అడ్మిషన్లు పొందటానికి చివరి తేదీ: 02.09.2023
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.apcj.in

సదరన్ రైల్వేలో 790 పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ) సదరన్ రైల్వేలో పనిచేసేందుకు జనరల్ డిపార్ట్‌మెంటల్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్ ద్వారా వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 790
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ లోకో పైలట్, టెక్నీషియన్ గ్రేడ్-1, గ్రేడ్-3-గార్డ్/ట్రైన్ మేనేజర్.
» **విభాగాలు:** డీజిల్, సిగ్నల్, వెల్డర్, కార్పెంటర్, మాసన్, ప్లంబర్,ఎలక్ట్రికల్ పవర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో మెట్రిక్యులేషన్ /ఎస్ఎస్ఎల్‌సీ/ఐటీఐ/ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 42 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** జనరల్ డిపార్ట్‌మెంటల్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్, కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా ఎంపిక ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.08.2023
» **వెబ్‌సైట్:** www.rrcmas.in

» టీఎస్ టెట్-2023 ప్రక్రియ ప్రారంభం
» పేపర్-1, 2లుగా టెట్ నిర్వహణ
» డీఈడీ, బీఈడీ అర్హతగా పోటీ పడే అవకాశం
» ఈ నెల 16వరకు దరఖాస్తు అవకాశం

టీచర్ కెరీర్‌కు మార్గం.. టెట్!

టీచర్ ఎలిజిబిటీ టెస్ట్..సంక్షిప్తంగా టెట్! ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టాలనుకునే అభ్యర్థులకు ఈ పరీక్ష ఎంతో కీలకం. ఇందులో అర్హత సాధిస్తేనే.. సర్కారీ స్కూల్స్‌లో టీచర్ కొలువు లభిస్తుంది. అందుకే టెట్‌లో రాణించేందుకు బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు కృషి చేస్తుంటారు. వీరంతా ఇప్పుడు తమ కసరత్తును మరింత ముమ్మరం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. కారణం.. తెలంగాణలో ఇటీవల టెట్ నోటిఫికేషన్ వెలువడడమే!! ఈ నేపథ్యంలో.. టెట్‌తో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టాలనుకుంటే.. టెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. టెట్ నోటిఫికేషన్ వెలువడిందంటే..రానున్న రోజుల్లో డీఎస్సీ నియామకాలు ఉంటాయని అంచనా. బీఈడీ,డీఈడీ అభ్యర్థులు టెట్‌లో రాణించేందుకు కృషి చేస్తే..అదే ప్రిపరేషన్‌తో భవిష్యత్తులో నిర్వహించే టీచర్ నియామక పరీక్షల్లోనూ విజయావకాశాలను మెరుగు పరచుకోవచ్చు.

రెండు పేపర్లుగా టెట్

- తెలంగాణ ఎస్‌సీఈఆర్‌టీ ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం-టెట్ పరీక్షను పేపర్-1, పేపర్-2 పేరిట రెండు పేపర్లుగా నిర్వహించనున్నారు.
- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధనకు టెట్ పేపర్-1కు హాజరవ్వాల్సి ఉంటుంది.
- ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించడానికి టెట్ పేపర్-2లో ఉత్తీర్ణత పొందాల్సి ఉంటుంది.

టెట్ పేపర్-1 అర్హతలు

- ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఉత్తీర్ణత సాధించాలి.
- 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు బీఈడీ, బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) ఉత్తీర్ణులవ్వాలి.
- డిసెంబర్ 23, 2015లోపు డీఈడీ, బీఈడీ, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసుకుంటే.. ఇంటర్మీడియెట్‌లో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సరిపోతుంది.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు ఉత్తీర్ణత మార్కుల్లో అయిదు శాతం మినహాయింపు ఇస్తారు.

టెట్ పేపర్-2 అర్హతలు

- గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీంతోపాటు బీఈడీ లేదా బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు పాసవ్వాలి. లేదా నాలుగేళ్ల బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి.
- లాంగ్వేజ్ పండిట్ కోర్సులకు సంబంధించి నిర్దేశిత లాంగ్వేజ్ ఆప్షనల్ సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా సంబంధిత లాంగ్వేజ్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఓరియెంటల్ లాంగ్వేజ్ ఉత్తీర్ణులవ్వాలి. లేదా సంబంధిత సబ్జెక్ట్ సాహిత్యంలో బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీ పాసవ్వాలి. వీటితోపాటు నిర్దేశిత లాంగ్వేజ్‌లో లాంగ్వేజ్ పండిట్ ట్రైనింగ్ సర్టిఫికెట్/సంబంధిత లాంగ్వేజ్ మెథడాలజీలో బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి.



టీఎస్ టెట్ 2023

పేపర్-1.. 150 మార్కులు

- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించేందుకు అర్హతగా పేర్కొన్న టెట్ పేపర్-1ను 150 మార్కులకు నిర్వహిస్తారు. మొత్తం అయిదు విభాగాల్లో ప్రశ్నలు అడుగుతారు. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్1, 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్ 2(ఇంగ్లిష్) 30 ప్రశ్నలు-30 మార్కులు, గణితం 30 ప్రశ్నలు-30 మార్కులు, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ 30 ప్రశ్నలు-30 మార్కులకు.. ఇలా మొత్తం 150 ప్రశ్నలు-150 మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- పరీక్షలో రెండో విభాగంగా పేర్కొన్న లాంగ్వేజ్-1 సబ్జెక్ట్ విషయంలో అభ్యర్థులు తెలుగు, ఉర్దూ, హిందీ, బెంగాలీ, కన్నడ, మరాఠీ, తమిళం, గుజరాతీ లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు. అభ్యర్థులు ఎంచుకున్న లాంగ్వేజ్‌ను పదో తరగతిలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా చదివుండాలి.
- మూడో విభాగంగా పేర్కొన్న లాంగ్వేజ్-2(ఇంగ్లిష్)కు సంబంధించి అభ్యర్థులందరికీ ఈ విభాగం ఉంటుంది.

పేపర్-2 కూడా 150 మార్కులు

- సంబంధిత సబ్జెక్ట్‌లలో స్కూల్ అసిస్టెంట్ పోస్ట్‌లకు అర్హతగా నిర్దేశించిన టెట్ పేపర్-2ను కూడా 150 మార్కులకు నిర్వహిస్తారు. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్1, 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్ 2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు-30మార్కులు, సంబంధిత సబ్జెక్ట్ 60 ప్రశ్నలు-60 మార్కులకు.. ఇలా మొత్తం 150 ప్రశ్నలు-150 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- రెండో విభాగం లాంగ్వేజ్-1లో అభ్యర్థులు తెలుగు, ఉర్దూ, హిందీ, కన్నడ, మరాఠీ, తమిళం, సంస్కృతం సబ్జెక్ట్‌లను పదో తరగతి వరకు ఫస్ట్ లాంగ్వేజ్‌గా చదివుండాలి.
- నాలుగో విభాగంగా ఉన్న సంబంధిత సబ్జెక్ట్‌లో.. మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచర్స్ అభ్యర్థులు మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగాన్ని, సోషల్ టీచర్లు సోషల్ స్టడీస్ విభాగాన్ని ఎంచుకుని పరీక్ష రాయాలి.
- సబ్జెక్ట్ పేపర్‌కు సంబంధించి కంటెంట్ నుంచి 24 ప్రశ్నలు, పెడగాజీ నుంచి ఆరు ప్రశ్నలు చొప్పున ప్రతి సబ్జెక్ట్ విభాగం నుంచి అడుగుతారు.
- సైన్స్ సబ్జెక్ట్‌లో ఫిజికల్ సైన్స్ నుంచి 12, బయలాజికల్ సైన్స్ నుంచి 12 చొప్పున కంటెంట్ సంబంధిత ప్రశ్నలు ఉంటాయి. మిగతా ఆరు ప్రశ్నలు సైన్స్ పెడగాజీ నుంచి అడుగుతారు.
- సోషల్ విభాగంలో హిస్టరీ, జాగ్రఫీ, సివిక్స్, ఎకనామిక్స్‌ల నుంచి 48 కంటెంట్ ప్రశ్నలు, 12 పెడగాజీ ప్రశ్నలు అడుగుతారు.
- ఈ సబ్జెక్ట్ విభాగం విషయంలో.. రెండు అర్హతలు ఉన్న వారు తమకు ఆసక్తి ఉన్న విభాగంలో పరీక్ష రాసే అవకాశం అందుబాటులో ఉంది.
- రెండు పేపర్లలో ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. పరీక్షకు లభించే సమయం రెండున్నర గంటలు.

60 శాతం మార్కులు సాధిస్తేనే

టెట్ పేపర్-1, పేపర్-2లలో కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులు(90 మార్కులు) సాధించాలి. బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో(70 మార్కులు), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులతో (60 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి. ఈ మార్కులు సాధించిన వారికే టెట్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 16.08.2023
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:** సెప్టెంబర్ 9 నుంచి
- **టెట్ తేదీ:** సెప్టెంబర్ 15 (పేపర్-1 : ఉదయం 9:30 నుంచి 12:00 వరకు; పేపర్-2: మధ్యాహ్నం 2:30 నుంచి 5:00 వరకు)
- **ఫలితాల వెల్లడి:** సెప్టెంబర్ 27, 2023
- **వెబ్‌సైట్:** https://tstet.cgg.gov.in

మంచి మార్కులకు మార్గాలివే

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ

రెండు పేపర్లలోనూ మొదటి విభాగం చైల్డ్ డెవలప్‌మెంట్, పెడగాజీ. ఇందులో బోధన, అభ్యసనానికి సంబంధించి ఎడ్యుకేషనల్ సైకాలజీపై ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. ప్రధానంగా శిశువు సైకాలజీ సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు-సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా చదవాలి. పెడగాజీలో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం-నాయకత్వం -గైడెన్స్-కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి.

లాంగ్వేజ్-1, 2కు ఇలా

భాషా విభాగాలకు సంబంధించిన సాధారణ వ్యాకరణ అంశాలు, బోధన పద్ధతులపై ప్రశ్నలు ఉంటాయి. స్కూల్ స్థాయిలో తెలుగు సబ్జెక్ట్ పుస్తకాలతోపాటు తెలుగు బోధన పద్ధతులను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. అభ్యర్థులు నిర్దిష్టంగా ఒక ఒక ప్రామాణిక పుస్తకాన్ని ఎంచుకుని సిద్ధం కావాలి. పెడగాజీకి సంబంధించి టీచింగ్ మెథడ్స్,అప్రోచెస్, టెక్నిక్స్, లాంగ్వేజ్ స్కిల్స్, ఇంగ్లిష్ నేపథ్యంపై ప్రశ్నలు వస్తాయి.

మ్యాథమెటిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

పేపర్-1లో ఉండే ఈ సబ్జెక్ట్‌లలో మంచి మార్కుల కోసం అభ్యర్థులు.. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి. 30 ప్రశ్నల్లో 24 ప్రశ్నలు కంటెంట్ నుంచి ఉంటే.. 6 ప్రశ్నలు పెడగాజీపై అడుగుతారు. ఇక పేపర్-2లో మ్యాథమెటిక్స్, సైన్స్‌పై ప్రశ్నలు ఉంటాయి. ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలోనే ఉంటుంది. ఎన్విరాన్‌మెంటల్ పేపర్‌లో సైన్స్, తెలంగాణ నుంచి ప్రశ్నలు తప్పనిసరిగా ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు తెలంగాణ ప్రాధాన్యమున్న అంశాలను ప్రత్యేక దృష్టితో చదవడం లాభిస్తుంది.

- సైన్స్: టెట్ పేపర్-2లో సైన్స్ సబ్జెక్ట్ అభ్యర్థులు మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. అయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిని ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్.. సక్సెస్ ఇలా

ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను చదవాలి. వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, నదులు.. వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్‌ను సమకాలీన అంశాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.

మెథడాలజీ

ఇందులో ప్రధానంగా బోధనా పద్ధతులు; టీచర్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం); బోధన ఉద్దేశాలు, విలువలు, లక్ష్యాలను చదవాలి. పేపర్-1, పేపర్-2లో అడిగే అంశాలు ఒక్కటే అయినా.. వాటి క్లిష్టత స్థాయిలో తేడా ఉంటుంది. దీన్ని గుర్తించి ప్రిపరేషన్ కొనసాగించాలి.

ఇప్పటి నుంచి అడుగులు వేస్తే

- టెట్-2023ను సెప్టెంబర్ 15న నిర్వహించనున్నారు. అంటే.. నెల రోజుల సమయం మాత్రమే అందుబాటులో ఉంది. ప్రస్తుత సమయంలో అభ్యర్థులు గత ప్రశ్నపత్రాల ఆధారంగా ఇంగ్లిష్, తెలుగు, పెడగాజి విభాగాన్ని అధ్యయనం చేసి బిట్స్ ప్రాక్టీస్ చేయాలి. కంటెంట్ విభాగంలో పేపర్-1 రాసే అభ్యర్థులు మూడు నుంచి అయిదో తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లోని ముఖ్యాంశాలను రివిజన్ చేయాలి.
- పేపర్-2 అభ్యర్థులు 6, 7, 8 తరగతుల పాఠ్యపుస్తకాల్లోని కీలకాంశాలను చదవాలి. కంటెంట్‌కు సంబంధించి ఎక్కువగా సమాచార ఆధారిత ప్రశ్నలే ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు జ్ఞాపకశక్తిని పెంపొందించుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. దీంతోపాటు ప్రస్తుతం అభ్యర్థులు వీలైనన్ని మోడల్ పేపర్లను సేకరించి, సాధన చేయాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
366	115
65,323	19,428

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	13,645	▽	76
డోజోన్స్	35,281	△	105
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,524	▽	94
డాక్స్	15,832	▽	124
షాంఘై	3,189	▽	65
నికాయ్ (గురువారం ముగింపు)	32,474	▽	269

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఖరీదైనా.. రెండు గజాలు!



- నచ్చిన ప్రాపర్టీ తక్కువ ధరకే..
- కోరుకున్న చోట సొంతం చేసుకోవచ్చు
- స్వల్ప వాటాకు యజమాని కావచ్చు
- ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌కు ఆదరణ
- వీటి కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు
- సులభంగా కొనుగోలు, విక్రయాలు

అదొక మెట్రోపాలిటన్ సిటీ. ప్రముఖ వాణిజ్య ప్రాంతం. అక్కడ ప్రాపర్టీ కొనాలంటే కనీసం రూ.20 కోట్లు అయినా ఉండాల్సిందే. కానీ అంత ఖరీదైన ప్రాపర్టీని సొంతం చేసుకోవాలంటే ఎగువ మధ్య తరగతి వారి వల్ల కూడా అయ్యే పని కాదు. అయినా సరే ఆ ప్రాపర్టీకి యజమాని కావాలనే కోరిక బలంగా ఉంది. ఇందుకు ఉన్న మార్గం ఏంటి..? నిజమే అంత భారీ పెట్టుబడి లేకపోవచ్చు. చేతిలో కొద్ది మొత్తమే ఉన్నా, అదే ప్రాపర్టీకి యజమానిగా మారిపోగల అవకాశం ఉంది. అదే ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్. తమకు బాగా నచ్చిన ప్రాపర్టీలో ఒక శాతం వాటాను తక్కువకే సొంతం చేసుకోవచ్చు. మధ్యతరగతి వాసులను సైతం ప్రాపర్టీ యజమానులను మార్చేదే ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్. ఈ సాధనం గురించి తెలియజేసే కథనమే ఇది.

అసలు ఏంటి ఇది..? పాక్షిక అని పేరులోనే ఉంది. రియల్ ఎస్టేట్‌లో స్వల్ప వాటా. ఈ విధానంలో మీరు పెట్టుబడి పెట్టే మొత్తానికి తగ్గ వాటా మీ సొంతం అవుతుంది. అంటే ఒక ప్రాపర్టీకి అచ్చమైన యజమాని కాలేరు. ఆ ప్రాపర్టీకి ఎంతో మంది యజమానుల్లో మీరు కూడా ఒకరు అవుతారు. ఈక్విటీల గురించి తెలిసే ఉంటుంది. లిస్టెడ్ కంపెనీ మూలధనంలో ప్రమోటర్ల వాటా గరిష్టంగా 75 శాతమే ఉంటుంది. మిగిలినది పబ్లిక్ షేర్ హోల్డర్ల చేతుల్లో ఉంటుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.17 లక్షల కోట్లు. ఒక్క షేరు ధర సుమారు రూ.2,500. కేవలం రూ.2,500 పెట్టి ఒక్క షేరు కొనుగోలు చేసినా ఆ కంపెనీ వాటాదారుగా మారతారు. ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ కూడా ఇదే మాదిరి ఉంటుంది. పాక్షిక రియల్ ఎస్టేట్‌కు ఇప్పుడు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. స్వల్ప వాటాలు తీసుకునేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. దీనికి ప్రధాన ప్రేరణ టికెట్ సైజు (పెట్టుబడి పరిమాణం) చిన్నగా ఉండడమే అని చెప్పుకోవాలి. పైగా కొద్ది మొత్తానికే నాణ్యమైన రియల్ ఎస్టేట్ వాటా వస్తుండడం ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది. గడిచిన కొన్ని సంవత్సరాలుగా ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ ఆదరణ పెరుగుతుండటం గమనార్హం.

హైదరాబాద్‌లో ఎక్కడ..?

దేశవ్యాప్తంగా ఎన్నో పట్టణాలకు సంబంధించి ఫ్రాక్షనల్ ప్రాపర్టీ లావాదేవీలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో గచ్చిబౌలిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలో ఓ ప్రాపర్టీ ఆఫర్ విలువ రూ.46,60,00,000.



దీని ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్/ఐఆర్ఆర్ (యాజమాన్య నిర్వహణ సమయంలో అంతర్గత రాబడి రేటు) 13.5 శాతంగా ఉంది. స్థూల ఈల్డ్ (వార్షిక అద్దె రాబడి) 8.9 శాతంగా ఉంది. అలాగే మహారాష్ట్రలోని గోరేగావ్‌లో (ఈజోన్ అపార్చునిటీ) రూ.33,60,00,000 విలువ చేసే ప్రాపర్టీకి సంబంధించి డీల్‌లో.. ఐఆర్ఆర్ 13.4 శాతంగా ఉంటే, గ్రాస్ ఎంట్రీ ఈల్డ్ 9.6 శాతంగా ఉంది. సాధారణంగా రియల్ ఎస్టేట్‌లో 10 శాతానికి పైన ఐఆర్ఆర్ ఉంటే దాన్ని మెరుగైనదిగా పరిగణిస్తారు. 18–20 శాతంగా ఉంటే అత్యుత్తమంగా భావిస్తారు. ఐఆర్ఆర్ 5% కంటే తక్కువ ఉంటే అది లాభసాటి కాదు.

నిర్వహణ సులభతరం


ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌లో ఉన్న సౌలభ్యం నిర్వహణ అని చెప్పుకోవాలి. అద్దె వసూలు, ప్రాపర్టీ నిర్మాణం, విక్రయం, పన్నుల చెల్లింపుల ఇవన్నీ ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌లే చూస్తాయి. దీంతో ఇన్వెస్టర్‌పై నిర్వహణ భారం పడదు. ప్రాపర్టీ డాక్యుమెంట్లు పట్టుకుని ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం ఏర్పడదు.

సెబీ నియంత్రణ లేదు

గత కొన్నేళ్లలో ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ పరిశ్రమలోకి ఎన్నో ప్లాట్‌ఫామ్‌లు వచ్చాయి. ఈ ప్లాట్‌ఫామ్‌ల లావాదేవీల పరంగా ఓ ప్రామాణిక విధానం, ప్రక్రియ, మార్గదర్శకాలు, నియంత్రణలు అంటూ లేవు.



ఇన్వెస్టర్లకు సమగ్రంగా అన్ని వివరాలు వెల్లడిస్తున్నాయా? లావాదేవీల నిర్వహణ చట్టబద్ధంగానే ఉందా? అని చూసే వారు లేరు. అందుకే ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణకు సంబంధించి చర్చా పత్రాన్ని సెబీ విడుదల చేసింది. రానున్న రోజుల్లో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్) నియంత్రణల పరిధిలోకి తీసుకువచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ అదే జరిగితే ఈ మార్కెట్లో లావాదేవీలకు రక్షణలు ఏర్పడతాయి. ఇన్వెస్టర్ల హక్కులు, ప్రయోజనాలకు భరోసా ఉంటుంది. అయితే ఇందుకు ఎంత కాలం పడుతుంది? అన్నది ఇప్పటికైతే స్పష్టత లేదు.



ఎలా పనిచేస్తుంది..?

సాంకేతికంగా చెప్పుకోవాలంటే.. మీరు, మీ స్నేహితులతో కలసి 5–10 మంది ఒక గ్రూప్‌గా ఏర్పడి ప్రాపర్టీని కొనుగోలు చేసుకోవచ్చు. కానీ ఆచరణలో ఇది అందరికీ సాధ్యం కాదు. అందరి మధ్య సఖ్యత లేదా ఏకాభిప్రాయం ఉండకపోవచ్చు.



న్యాయపరమైన చిక్కులు ఏర్పడితే ప్రాపర్టీ సంగతేమో కానీ, తమ హక్కుల కోసం కోర్టు చుట్టూ తిరగాల్సి రావచ్చు. అందుకే ఈ పాక్షిక రియల్ ఎస్టేట్‌ను సాకారం చేసేందుకు పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇన్వెస్టర్లు స్వల్ప పెట్టుబడితో ప్రాపర్టీలో పాక్షిక వాటా కొనుగోలుకు ఇవి అవకాశం కల్పిస్తాయి. ఇలా ఒకరితో ఒకరు పొత్తు లేకపోయినా, అందరూ కలసి ఒక ప్రాపర్టీకి ఉమ్మడి యజమానులుగా మారిపోయేందుకు పలు ప్లాట్‌ఫామ్‌లు వేదికగా నిలుస్తున్నాయి. ఈ తరహా సేవలు అందించే పోర్టళ్లను 'ఎఫ్‌వోపీ' లేదా ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్ అని పిలుస్తారు. గడిచిన కొన్నేళ్ల కాలంలో ఇలాంటివి పదుల సంఖ్యలో ఏర్పాటయ్యాయి. ఇన్వెస్టర్ల తరఫున క్లిష్టమైన ప్రాపర్టీ కొనుగోలు, దానికి సంబంధించిన ఇతర పనులను ఇవి చక్కబెడతాయి. దాంతో కొనుగోలు, విక్రయం ఎంతో సులభంగా, సౌకర్యంగా ఉంటుంది. ప్రాపర్టీ పరిశోధన, కొనుగోలు, అమ్మకం, డాక్యుమెంటేషన్, న్యాయపరమైన అంశాలు, అద్దె వసూలు, ఆ అద్దెను యజమానులకు పంపిణీ చేయడం తదితర సేవలను ఈ ప్లాట్‌ఫామ్‌లు అందిస్తాయి. వీటి సాయం లేకుండా ఇన్వెస్టర్లు ఒక సమూహంగా ఏర్పడి ఇలాంటి కార్యకలాపాలు అన్నింటినీ సొంతంగా నిర్వహించుకోవడం సులభం కాదు. అందుకే ఈ ప్లాట్‌ఫామ్ సేవలకు ఆదరణ పెరుగుతోంది.

ఎలాంటి ప్రాపర్టీలు..?

ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌లో అధిక శాతం లావాదేవీలు వాణిజ్య రియల్ ఎస్టేట్‌లోనే ఉన్నాయి. ఎందుకంటే వాణిజ్య రియల్ ఎస్టేట్‌లో వృద్ధి ఎక్కువగా ఉంటుంది. పైగా పెట్టుబడి వృద్ధికి తోడు, వాణిజ్య రియల్ ఎస్టేట్ నుంచి రెంటల్ రూపంలో ఆదాయం క్రమం తప్పకుండా వస్తుండడం మరో ఆకర్షణగా చెప్పుకోవచ్చు.



అందుకే వాణిజ్య ప్రాపర్టీల ధరలు చాలా ఖరీదుగా ఉంటాయి. వీటి విలువ సాధారణంగా రూ.20 కోట్ల నుంచి రూ.500 కోట్ల మధ్య ఉంటుంది. అందుకే ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌కు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. పైగా వాణిజ్య ప్రాపర్టీల్లో రిటైల్ ఇన్వెస్టర్ నేరుగా పెట్టుబడి పెట్టడం సాధ్యపడదు. ఈ ప్లాట్‌ఫామ్‌లు దీన్ని సాధ్యం చేస్తున్నాయి. ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌లో కనీసంగా ఒక టికెట్ సైజు (పెట్టుబడి పరిమాణం) విలువ రూ.10–25 లక్షల మధ్య ఉంటుంది. అందుకే రిటైల్ ఇన్వెస్టర్లు సైతం ఇందులో పెట్టుబడులకు ముందుకు వస్తున్నారు. ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌లపై ప్రాపర్టీ వారీగా రాబడి రేటు, ధర తదితర వివరాలు అన్నీ ఉంటాయి.

లిక్విడిటీ మాటేమిటి?

రియల్ ఎస్టేట్‌లో ఉండే ప్రధాన సమస్య లిక్విడిటీయే. అవసరం వచ్చినప్పుడు విక్రయిద్దామంటే ఎక్కువ సందర్భాల్లో వెంటనే సాధ్యపడదు. విక్రయించే ప్రాపర్టీ, దాని ధర ఇతర అంశాలన్నింటినీ కొనుగోలుదారులు లోతుగా చూస్తారు. బేరసారాలు, విచారణలు అన్నీ అంగీకారం అయితేనే ప్రాపర్టీ లావాదేవీ పూర్తవుతుంది. కనుక కావాల్సినప్పుడు వెంటనే నగదుగా మార్చుకునే సౌలభ్యం సహజంగా రియల్టీలో తక్కువ. మీరు ఆశించే ధరకే విక్రయించాలని అనుకుంటే నెలల నుంచి సంవత్సరాల పాటు వేచి చూడాల్సి వస్తుంది. ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌లోనూ ఇదే అమలవుతుంది. కాకపోతే విడిగా ఓ ప్రాపర్టీ లావాదేవీతో పోలిస్తే ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ టికెట్ సైజు తక్కువగా ఉంటుంది. కనుక లిక్విడిటీ కాస్తంత మెరుగు అని భావించొచ్చు. పాక్షిక ప్రాపర్టీ అయినా సరే, దాని అద్దె రాబడి ఏ మేరకు? ప్రాపర్టీ నాణ్యత మాటేమిటి? అనేది కొనుగోలు దారులు చూస్తారు. నాణ్యమైన ప్రాపర్టీ, అద్దె రాబడి మెరుగ్గా ఉంటే వేగంగా అమ్ముడుపోతుంది. లేదంటే చాలా కాలం పాటు అందులో పెట్టుబడి చిక్కుకుపోవచ్చు. పైగా ఇందులో కొనుగోలు చేసే ప్రాపర్టీ పెట్టుబడి దృష్ట్యానే తప్ప వినియోగం కోణంలో ఉండదు. అందుకని విక్రయించుకునేందుకు కొంత సమయం పట్టొచ్చు. టికెట్ సైజు తక్కువగా ఉండడం ఇందులో కాస్త అనుకూలతగా చెప్పుకోవచ్చు.

వైరుధ్యం ఇదీ..



	రీట్	ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్
సెబీ నియంత్రణ	ఉంది	ప్రతిపాదన దశలో ఉంది
లిక్విడిటీ రిస్క్	లేదు	ఎక్కువ
వేదికలు	స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు	ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు
అందుబాటు	తక్కువ సాధనాలు	ఎక్కువ డీల్స్
వైవిధ్యం	చాలా ఎక్కువ. ఒక రీట్ ఎన్నో ప్రాపర్టీల్లో పెట్టుబడులు కలిగి ఉంటుంది.	వైవిధ్యం ఉండదు. ఒకే ప్రాపర్టీలో కొంత వాటాకు యజమాని అవుతారు.
కనీస టికెట్ సైజు	రీట్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో షేర్ల మాదిరి ట్రేడ్ అవుతాయి. రూ.100 నుంచి పెట్టుబడి పెట్టుకోవచ్చు.	కనీస టికెట్‌సైజు రూ.10 లక్షలు
ఎలాంటి ప్రాపర్టీలు	రీట్ నిర్వహణలో 80 శాతం పెట్టుబడులు రాబడి వచ్చే ప్రాపర్టీల్లోనే ఉంటాయి.	నిర్మాణంలో ఉన్నవి లేదా నిర్మాణం పూర్తయినవి ఉండొచ్చు.



జోయాలుక్కాస్ గోల్డ్ ఎక్స్ఛేంజ్ ఆఫర్

హైదరాబాద్: భారతదేశ 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జోయాలుక్కాస్ గోల్డ్ ఎక్స్ఛేంజ్ ఆఫర్ ప్రకటించింది. పాత బంగారం మార్పిడి ద్వారా ప్రస్తుత బంగారం రేటు కంటే రూ.76 ఎక్కువగా ప్రతి గ్రాముపై గ్యారెంటీగా పొందవచ్చు. వజ్రాలపై 25% తగ్గింపు అందిస్తుంది. అన్ని జోయాలుక్కాస్ షోరూమ్‌లలో ఈ ఎక్స్ఛేంజ్ ఆఫర్ ఆగస్టు 15 వరకు అందుబాటులో ఉంటుంది. కస్టమర్లందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఎక్స్ఛేంజ్ ఆఫర్‌ను వినియోగించుకోవాలని సంస్థ ఎండీ జాయ్ ఆలుక్కాస్ కోరారు.

మరోసారి రిలయన్స్ 'డిజిటల్ ఇండియా సేల్'



హైదరాబాద్: రిలయన్స్ డిజిటల్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మరోసారి 'డిజిటల్ ఇండియా సేల్' ఆఫర్‌ను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా స్మార్ట్‌ఫోన్లు, యాపిల్ ఎయిర్‌ప్యాడ్స్, వాషింగ్ మెషీన్లు, ఇతర గాడ్జెట్లను తక్కువ ధరకు విక్రయిస్తుంది. ఈ ఆగస్టు 15 వరకు మాత్రమే అందుబాటులో ఉండే ఈ ప్రత్యేక ఆఫర్ అన్ని రకాల ఎల్రక్టానిక్ ఉపకరణాలకు వర్తిస్తుంది. రూ.5 వేల వరకు తక్షణ డిస్కౌంట్‌తో పాటు అన్ని రకాల డెబిట్, క్రెడిట్ కార్డులపై పది శాతం రాయితీ వోచర్లు ఇస్తుంది. ఈ ఆఫర్లు రిలయన్స్ డిజిటల్ స్టోర్, మై జియో స్టోర్‌లో లభిస్తున్నాయి.


కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-8-2023	
విశాఖ	470–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455–00
విజయవాడ	455–00
రిటైల్ ధర (డజను)	72.00
13-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	440–00
వరంగల్	442–00
రిటైల్ ధర	5.00

శ్రీరామ్ ఫైనాన్స్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,807 టార్గెట్: రూ. 2,130

ఎందుకంటే: ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం శ్రీరామ్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. నిర్వహణలోని ఆస్తుల విలువ(ఏయూఎం) త్రైమాసికవారీగా 4 శాతం వృద్ధితో రూ. 1.93 లక్షల కోట్లను తాకింది. రుణ విడుదల వార్షికంగా 21 శాతం ఎగసి రూ. 30,500 కోట్లకు చేరడం ఇందుకు దోహదపడింది. ఈ కాలంలో అంచనాలకు మించి రూ. 4,440 కోట్ల నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) ఆర్జించింది. త్రైమాసికవారీగా నికర వడ్డీ మార్జిన్లు మాత్రం 0.23 శాతం నీరసించి 8.3 శాతాన్ని తాకగా.. ప్రొవిజన్లకు ముందు నిర్వహణ లాభం(పీపీవోపీ) 1.5 శాతం మెరుగుపడి రూ. 3,130 కోట్లకు చేరింది. నిర్వహణ వ్యయాలు 4 శాతం తగ్గడం ఇందుకు సహకరించింది. రుణ వ్యయాలు(ఏయూఎంలో దాదాపు 2 శాతానికి సమానం) రూ. 880 కోట్లకు పరిమితంకావడం నికర లాభాల్లో 28 శాతం వృద్ధికి తోడ్పాటునిచ్చింది. వెరసి రూ. 1,680 కోట్ల నికర లాభం ఆర్జించింది. త్రైమాసికంవారీగా ఆస్తుల(రుణాలు) నాణ్యత మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏలు 0.17 శాతం తగ్గి 6.03 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.23 శాతం తగ్గి 2.96 శాతానికి చేరాయి. కంపెనీ వృద్ధిపై యాజమాన్యం ఇటీవల విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. జూలై–సెప్టెంబర్(క్యూ2) పనితీరు వెల్లడి తదుపరి మరోసారి కంపెనీ పనితీరు అంచనాలపై సమీక్షను చేపట్టనున్నట్లు తెలియజేసింది. డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియో మిక్స్, దేశవ్యాప్త కార్యకలాపాలు వంటి అంశాలు కంపెనీకి ఆకర్షణను పెంచుతున్నాయి.



నజారా టెక్నాలజీస్ | ప్రభుదాస్ లీలాధర్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 674 టార్గెట్: రూ. 834

ఎందుకంటే: ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ నజారా టెక్ నిర్వహణ లాభం(ఇబిటా) అంచనాలను రెండేళ్ల కాలం(2023–24–2024–25)లో వరుసగా 8 శాతం, 4 శాతం చొప్పున హెచ్చిస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో కిడోపియా, యానిమల్ జామ్ విభాగాలు పటిష్ట పనితీరు చూపాయి. దీంతో వీటి మార్జిన్లపై అంచనాలు బలపడ్డాయి. ఏఅండ్‌పీ వ్యయాల అంచనాలను సవరిస్తున్నాం. ఈ ఏడాది క్యూ1లో నిర్వహణ నష్టాలు ప్రకటించినప్పటికీ పలు ఐపీలను ప్రవేశపెట్టనుండటం.. ఈస్పోర్ట్స్ అనుబంధ సంస్థ నాడ్విన్ బిజినెస్ రికవరీపై విశ్వాసాన్ని పెంచుతోంది. మొత్తంగా క్యూ1లో నజారా మిశ్రమ ఫలితాలను వెలువరించింది. ఆదాయం అంచనాలకంటే 10 శాతం తగ్గినప్పటికీ ఇబిటా మార్జిన్లు అంచనాలను మించుతూ 12 శాతానికి చేరాయి. పెద్ద క్లయింట్ చేజారడంతో యాడ్‌టెక్‌లో ఎదురవుతున్న సవాళ్లు, కిడోపియా సబ్‌స్క్రయిబర్ల సంఖ్య మందగించడం, రియల్ మనీ గేమింగ్‌లో పూర్తి బెట్ విలువపై 28 శాతం వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) విధింపు తదితర ప్రతికూలతల నేపథ్యంలోనూ బీజీఎంఐకు తిరిగి తెరతీయడం, స్పోర్ట్స్‌కీడా విభాగం జోరందుకోవడం సానుకూల అంశాలుగా పరిగణించవచ్చు. వెరసి రెండేళ్ల కాలంలో అమ్మకాలు వార్షికంగా 20 శాతం, నిర్వహణ లాభం మరింత అధికంగా 39 శాతం చొప్పున పురోగమించే అవకాశముంది. వీటికితోడు కంపెనీ వద్ద రూ. 620 కోట్ల నగదు నిల్వలున్నాయి. ఈ ఏడాది మే నెలలో నాడ్విన్ రూ. 230 కోట్లు సమకూర్చుకుంది. అంతేకాకుండా సమీప భవిష్యత్‌లో రూ. 750 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'ఎక్స్' ద్వారా వచ్చే ఆదాయానికి జీఎస్‌టీ వర్తింపు



న్యూఢిల్లీ: ప్రకటనల ఆదాయంలో వాటాల కింద సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఎక్స్ (గతంలో ట్విట్టర్) నుంచి వ్యక్తులకు వచ్చే ఆదాయం కూడా జీఎస్‌టీ పరిధిలోకి వస్తుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కంటెంట్ క్రియేషన్‌ను సర్వీసు కింద పరిగణిస్తారు, దాని ద్వారా వచ్చే ఆదాయంపై 18 శాతం ట్యాక్స్ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఒక సంవత్సరంలో అద్దె ఆదాయం, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ, ఇతరత్రా ప్రొఫెషనల్ సర్వీసులు వంటి వివిధ సర్వీసుల నుంచి వచ్చే మొత్తం ఆదాయం రూ. 20 లక్షలు దాటిన పక్షంలో ఈ నిబంధన అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఎక్స్ ఇటీవల ప్రకటనలపై తనకు వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని ప్రీమియం సబ్‌స్క్రైబర్స్‌కి కూడా అందించడం ప్రారంభించింది. ఇందుకోసం సదరు సబ్‌స్క్రయిబర్స్ పోస్టులకు గత మూడు నెలల్లో 1.5 కోట్ల ఇంప్రెషన్‌లు, కనీసం 500 మంది ఫాలోయర్లు ఉండాలి. ఎక్స్ నుంచి తమకు ఆదాయం వచ్చినట్లు పలువురు సోషల్ మీడియా యూజర్లు ఈమధ్య పోస్ట్ చేశారు.

పిల్లల భవిష్యత్తు కోసం పెట్టుబడి మార్గాలు?

నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి వయస్సు పదేళ్లలోపే ఉంటుంది. వారి ఉన్నత విద్య కోసం ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూల సాధనాలు ఏవి?

– భానుశ్రీ

పిల్లల విద్య కోసం ఏక మొత్తంలో ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?.. చాలా మంది తల్లిదండ్రులు సాధారణంగా ఎదుర్కొనే సందేహం ఇది. ప్రాపర్టీ విక్రయం లేదా బోనస్ లేదా తాతలు తమ మనవళ్లు, మనవరాళ్ల కోసం నగదు బహుమతి ఇచ్చినప్పుడు.. ఆ మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తారు. ఇందుకోసం పలు మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత విద్య కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకు, సాధారణంగా పదేళ్ల కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలకు మించి మెరుగైన సాధనం లేదనే చెప్పాలి. ముఖ్యంగా ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడులను వైవిధ్యం ఉండేలా చూస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో ఫండ్ మేనేజర్ పెట్టుబడులు పెడతారు. ఒకవేళ పన్ను ప్రయోజనం కూడా కోరుకుంటే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి కూడా ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. అన్ని రంగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ తగ్గించే విధంగా ఈఎల్ఎస్ఎస్ పథకాల పనితీరు ఉంటుంది. ఈ పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ పదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీల్లో అస్థిరతలు సహజంగా ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఇదే కనిపిస్తుంది.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల కొనుగోలు ధర సగటుగా మారి, మార్కెట్లు గరిష్టాల వద్ద ఉన్నప్పుడు రిస్క్‌ను తగ్గిస్తుంది. మీ దగ్గర ఉన్న ఏక మొత్తాన్ని ఏదైనా డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి.. దాని నుంచి ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) రూపంలో ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవాలి. మూడేళ్ల కాలంలో దీన్ని పూర్తి చేయాలి. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.

మార్కెట్లలో అస్థిరతలను ఇన్వెస్టర్లు అధిగమించడం ఎలా?

– శ్రవణ్ పెద్దింటి

అస్థిరతలనేవి ఈక్విటీల సహజ లక్షణం. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోడం ఎలా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో ఈక్విటీ పెట్టుబడులను కదిలించకుండా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. ఈక్విటీల్లో మీ పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ చర్యలు అవసరం. అలాగే, సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ అస్థిరతల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో కరెక్షన్‌లు నిజంగా మంచి అవకాశాలను తెస్తాయి. ఎందుకంటే ఆ సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను తక్కువ ధరకే సమకూర్చుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌకగా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ, మీడియాలో వచ్చే గందరగోళ సమాచారం ఇన్వెస్టర్లను నిరాశకు, అయోమయానికి, భయానికి గురి చేస్తుంది. దాంతో వారు ప్రతికూల సమయాల్లో పెట్టుబడులు చేయడానికి వెనుకాడుతుంటారు. పైగా కొందరు అమ్మకాలు కూడా చేస్తుంటారు. ఇదే అతిపెద్ద తప్పు. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోవడానికి వీలుంటుంది.

కానుకలు అడిగితే కఠిన చర్యలే..


- నిబంధనలు పాటించాల్సిందే..
- అన్నవరం వ్రత పురోహితులకు ఈఓ ఆదేశం



అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో వ్రతాలాచరించే భక్తులను వ్రత పురోహితులు కానుకలు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక సర్క్యులర్ విడుదల చేశారు. వ్రతం పూర్తయ్యాక కానుకలు డిమాండ్ చేసినట్టు భక్తులు ఫిర్యాదు చేయడంతో రెండు వారాల వ్యవధిలోనే ఇద్దరు వ్రత పురోహితులను ఈఓ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వ్రత పురోహిత సూపర్‌వైజర్లతో సమావేశమై, పలు నిర్ణయాలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు.

- ▲ వ్రత మండపాల్లో ప్రస్తుతం ఉన్న సీసీ కెమేరాలకు తోడుగా రెండువైపులా వాయిస్ రికార్డర్లు కూడా ఏర్పాటు చేయాలి. పురోహితులు కానుకలు డిమాండ్ చేసినట్టు ఫిర్యాదులు వచ్చిన వెంటనే వాయిస్ రికార్డర్ పరిశీలించి, ఫిర్యాదు వాస్తవమేనని తేలితే వెంటనే సస్పెండ్ చేస్తారు. ఎక్కువసార్లు సస్పెండ్ అయినా తీరు మారని పురోహితులను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తారు.
- ▲ వ్రత మండపాల్లో పని చేసే సిబ్బంది ఆకుపచ్చ రంగు చొక్కా, తెలుపు, పసుపు, చందనం రంగు పంచె ధరించాలి.
- ▲ వ్రత కథ చెప్పే పురోహితులు ఒకేచోట కాకుండా అన్ని మండపాల్లో చెప్పేలా రొటేషన్ పద్ధతి ఏర్పాటు చేయాలి.
- ▲ వ్రతాల టిక్కెట్టులో 40 శాతం ఆదాయం వ్రత పురోహితులకు చెల్లిస్తున్నట్టు అన్ని వ్రత మండపాల్లోనూ పెద్ద అక్షరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి.
- ▲ సత్యదేవుని క్షేత్ర మహిమ గురించి భక్తులకు మూడు నిమిషాల పాటు వివరించాలి.
- ▲ దేవస్థానంలో నిర్వహించే అన్నదానం, గోసేవ, తులాభారం, చండీహోమం, ఆయుష్య హోమం తదితర సేవలు, దేవస్థానం నిర్వహిస్తున్న విద్యా సంస్థలు, ఇతర సేవల గురించి వ్రతాలాచరించే భక్తులకు వివరించి, వారి నుంచి విరాళాలు సేకరించాలి.
- ▲ భక్తులు చూస్తుండగా పురోహితులు ఫలహారాలు తినరాదు. వారికి కేటాయించిన విశ్రాంతి మండపంలో మాత్రమే తినాలి.
- ▲ పురోహితులు గుంపులుగా ఉంటూ సెల్‌ఫోన్‌లో ఆటలు ఆడటం, సినిమాలు, వీడియోలు వీక్షించడం వంటివి చేయరాదు. ఫోన్లు కూడా తమ విశ్రాంతి మండపంలో డిపాజిట్ చేయాలి.
- ▲ ఈ నిబంధనలన్నింటినీ పురోహితులు పాటించేలా వ్రతాల విభాగం సూపరింటెండెంట్, వ్రతాల సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలి. లేకుంటే కఠిన చర్యలు తప్పవు.

అమ్మకు అవరోధం



మాతృత్వం.. మహిళలకు దేవుడిచ్చిన వరం. మరోజీవికి ప్రాణం పోసే అపూర్వమైన అవకాశం. అయితే హార్మోన్ల అసమతుల్యత కారణంగా పలువురు స్త్రీలు ఈ అపురూప భాగ్యానికి దూరమవుతున్నారు. పీసీఓడీ (నీటి బుడగలు) సమస్యలతో నెలసరి గాడి తప్పి గర్భధారణకు నోచుకోలేకపోతున్నారు. అమ్మా అనే పిలుపు కోసం అలమటిస్తున్నారు. పల్లె సీమల్లో కంటే పట్టణా ప్రాంతాల్లోనే బాధితులు పెరుగుతున్నారు. ఈ క్రమంలో పిల్లలపై ప్రేమను చంపుకోలేక నిత్యం వందల మంది ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. రూ.లక్షల్లో ఫీజులు ముట్టజెప్పి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. నెలల తరబడి చికిత్సలు పొందుతున్నారు. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. మందులను క్రమం తప్పకుండా వాడడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలను పాటిస్తే ప్రయోజనం ఉంటుందని వివరిస్తున్నారు. ఇందు కోసం ప్రభుత్వాస్పత్రులలోనే ట్రీట్‌మెంట్ పొందే వెసులుబాటు ఉందని వెల్లడిస్తున్నారు.

- మహిళల్లో అధికమవుతున్న పీసీఓడీ సమస్యలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో నమోదవుతున్న కేసులు
- పల్లెల కంటే పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న బాధితులు
- కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్సకు రూ.లక్షల్లో ఫీజులు
- ఆరోగ్య జాగ్రత్తలే శ్రీరామరక్ష అంటున్న వైద్యులు

సాక్షి, తిరుపతి డెస్క్ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలువురు మహిళలు పీసీఓడీ (పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్) అంటే నీటి బుడగల సమస్యతో బాధపడుతున్నారు. నిత్యం దాదాపు 120 నుంచి 150 మంది వరకు పీసీఓడీ చికిత్స కోసం ఆస్పత్రులకు వస్తున్నారు. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాల్లోని స్త్రీలే ఎక్కువగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

▶▶ తిరుపతి ఎమ్మార్‌పల్లెకు చెందిన కోమల అనే మహిళకు 36ఏళ్లు. ఇంతవరకు సంతానం కలగలేదు. టీవీలో ప్రకటనలు చూసి రెండేళ్ల క్రితం చెన్నైలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిని ఆశ్రయించారు. రూ.30 వేలు చెల్లించి భార్యభర్తలు అన్ని రకాల పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ వారి ఫలితాలను పరిశీలించి గర్భధారణ కలగాలంటే ఫీజుగా రూ.5 లక్షలు అడిగారు. ఆ దంపతులు ఖర్చుకు వెనకాడకుండా అడిగినంతా ముట్టజెప్పారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో నిరాశగా ఇంటి ముఖం పట్టారు.

▶▶ చిత్తూరు మండలానికి చెందిన సుమన ప్రియ (28)కు 9ఏళ్ల క్రితం వివాహమైంది. కానీ సంతానం కలగలేదు. తీరా ఆస్పత్రిలో పరీక్షిస్తే.. పీసీఓడీ ఉందని డాక్టర్లు నిర్ధారించారు. అయితే ఆమె ఓ నాటు వైద్యుడిని ఆశ్రయించారు. ఆరు నెలల పాటు ఆకు మందు తీసుకున్నారు. ఇందు కోసం ప్రతి నెల రూ. 2వేలు చెల్లించారు. అయినప్పటికీ గర్భం రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నార.

▶▶ చిత్తూరు నగరం తోటపాళ్యానికి చెందిన దంపతులకు పిల్లలు లేరు. వివాహమై రెండేళ్లు గడుస్తున్నా గర్భం దాల్చకపోవడంతో జిల్లా ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు. ఆమెకు పీసీఓడీ సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో 8నెలల పాటు ఆమెను పర్యవేక్షణలో ఉంచారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ మందులు వాడేలా జాగ్రత్తలు తీసుకున్నారు. 10వ నెలలో ఆమె గర్భం దాల్చింది. ప్రస్తుతం పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

ఉమ్మడి జిల్లా సమాచారం

టీచింగ్ ఆస్పత్రులు	సీహెచ్‌సీలు	ప్రైవేట్ హాస్పిటళ్లు సుమారు 3వేలు
02	15	
జిల్లా ఆస్పత్రి	పీహెచ్‌సీలు	
01	108	
ఏరియా వైద్యశాలలు 07		



పీసీఓడీ ఎందుకొస్తుందంటే...

ప్రతి స్త్రీలోనూ రుతు క్రమం వచ్చినప్పుడు అండాశయంలో అండం పరిపక్వత చెంది విడుదల అవుతుంది. నెలసరి తర్వాత 11–18 రోజుల మధ్యకాలంలో అండం విడుదల ప్రక్రియ జరుగుతుంది. ఇందుకు ఈస్ట్రోజన్ హార్మోన్ అవసరమవుతుంది. ఈ హార్మోన్ లోపం తలెత్తినప్పుడు క్రమంగా పీసీఓడీకి దారితీస్తుంది. ఈ సమస్యతో బాధపడే వారిలో విడుదలయ్యే అండం పూర్తి ఎదగక, అది అండాశయంలో నీటి బుడగ రూపంలో ఉండిపోతుంది. అలాగే జీవనశైలిలో వచ్చిన మార్పులు, నిద్రలేమి, సమయానికి ఆహారం తీసుకోకపోవడం, ఎత్తుకు తగ్గ బరువు ఉండకపోవడం, పని ఒత్తిడి, బయట తిండికి అలవాటు పడడం వంటి కారణాలతో కూడా పీసీఓడీ బారినపడుతుంటారని వైద్యనిపుణులు తెలియజేస్తున్నారు.

ఎలాంటి ఆహారం తీసుకోవాలంటే...

జీవనశైలిలోని మార్పులు కూడా పీసీఓడీకి కారణమవుతున్నాయి. ముఖ్యంగా ఫాస్ట్‌ఫుడ్‌లు అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. ప్రోటీన్లు, విటమిన్లు, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. విటమిన్ –బి లోపం రాకుండా చేపలు, గుడ్లు, ఆకుకూరలు, క్రమం తప్పకుండా తీసుకోవాలి. ఇలాచేస్తే నెలసరి క్రమంగా వచ్చి సమస్య నుంచి బయటపడుతారు. దీనికి తగట్టు వ్యాయమం అవసరం.


ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గర్భస్థ సమస్యల ఓపీ వివరాలు	
నెల	ఓపీ సంఖ్య
ఫిబ్రవరి	5,589
మార్చి	6,286
ఏప్రిల్	7,219
మే	7,114
జూన్	8,082
జూలై	8,547

ఫీజులు గుంజేస్తున్నారు

గతంలో పిల్లలు పుట్టకుంటే వ్రతాలు, నోములు నోచేవాళ్లు. దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. ప్రస్తుతం కార్పొరేట్ మాయాజాలంలో పలువురు దంపతులు కొట్టుకుపోతున్నారు. మాతృత్వం పొందేందుకు రూ.లక్షల్లో ఫీజులు ముట్టజెబుతున్నారు. పీసీఓడీ సమస్యతో బాధపడేవారిని కార్పొరేట్ ఆస్పత్రుల వారు సైతం యథేచ్ఛగా దోచుకుంటున్నారు. దంపతుల బలహీనతను అడ్డుపెట్టుకుని రూ.3 నుంచి రూ.10లక్షల వరకు ఫీజులు గుంజేస్తున్నారు. చిత్తూరు, తిరుపతి వంటి నగరాల్లో సైతం రూ.లక్షలు వసూలు చేసేస్తున్నారు. మరికొందరు నాటువైద్యం అంటూ అనారోగ్య సమస్యలను తెచ్చుకుంటున్నారు. పీసీఓడీ నివారణకు ప్రభుత్వాస్పత్రిలోనే పూర్తి స్థాయిలో సేవలు ఉన్నాయని వైద్యులు గుర్తు చేస్తున్నారు.

లక్షణాలు

- నెలసరి సక్రమంగా రాదు
- ఎక్కువగా బ్లీడింగ్, రుతుక్రమం సమయంలో కడుపు నొప్పి ఉంటుంది
- అధిక బరువు, ఆకారణంగా జుట్టు రాలడం
- నెలసరి రాకపోవడంతో ముఖం, కాళ్ల మీద అవాంఛిత రోమాలు పుట్టుకొస్తాయి. బరువు పెరిగిపోతారు.
- శరీరంలో ఇన్సులిన్ నిరోధకత కూడా పెరిగిపోతుంది.



పరీక్షలు..

పీసీఓడీని నిర్ధారించడానికి గైనకాలజిస్ట్‌ను సంప్రదించాలి. వారి సూచనల మేరకు హార్మోన్ల స్థాయిని లెక్కించడానికి రక్త పరీక్షలు చేస్తారు. అండాశయం, గర్భాశయం రూపాన్ని తెలుసుకోవడానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేసి నిర్ధారిస్తారు.

వ్యాధులు ఇలా..

- ఎండోమెట్రియల్ క్యాన్సర్
- కొలెస్ట్రాల్ పెరుగుదల
- అధిక రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు
- గర్భస్రావాలు, సంతాన లేమి
- మధుమేహం
- మానసిక జబ్బులు
- అసాధారణ గర్భాశయ రక్తస్రావం
- క్రమ రహిత రుతుక్రమం

బెంగపడొద్దు.. దత్తత ఉందిగా..

పిల్లలు లేరనే బాధతో ఎక్కువగా మహిళలు కుమిలిపోతుంటారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఇరుగుపొరుగు వారు ఏమనుకుంటున్నారని దిగులు చెందుతుంటారు. అలాంటి వారికి దత్తత చక్కటి వరమంటున్నారు అధికారులు. ఐసీడీఎస్ నిర్వహించే శిశు విహార్‌ల ద్వారా దత్తత కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

వైద్యులను సంప్రదించాలి



మహిళలను ఇటీవల కాలంలో ఎక్కువగా ఇబ్బంది పెడుతున్న సమస్య పీసీఓడీ. దీని బారిన పడితే నెలసరి తప్పడం, అవాంఛిత రోమాలు రావడం ఉంటుంది. గర్భధారణ కూడా ఇబ్బందికరంగా మారుతుంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, వంశపారంపర్యంగా వస్తున్న సమస్యలతో ఇలాంటి కేసులు పెరుగుతున్నాయి. గర్భధారణకు చికిత్స పేరుతో మోసపోకండి. నాటు మందుల జోలికి వెళ్లొద్దు. సంబంధిత డాక్టర్లను సంప్రదించడం ఉత్తమం. ఇందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

– డాక్టర్ ప్రభావతిదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

నిర్లక్ష్యం చేస్తే సమస్యలు



పీసీఓడీ అనేది 14–45 ఏళ్ల లోపు ఉన్న మహిళల్లో అధికంగా వస్తోంది. ఈ మధ్య కాలంలో పీసీఓడీ కేసులు పెరిగాయి. చాలా మందికి పని ఒత్తిడి, టీవీలు, మొబైల్ ఫోన్లు గంటల తరబడి చూడడం. పిజ్జాలు, బర్గర్లు తినడం. బరువు పెరగడం కారణంగా పీసీఓడీ సమస్య తలెత్తుతోంది. లక్షణాలు బట్టి లేదా..వివాహమై ఏడాది గడిచినా గర్భధారణ జరగకుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. నిర్లక్ష్యం వహిస్తే సమస్యలు తప్పవు.

– డాక్టర్ ఉషశ్రీ, గైనకాలజిస్ట్, చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి

ఆక్వా.. ల్యాబ్‌లు వహ్వా ఢిల్లీకి.. మా ఊరి బొప్పాయి

తక్కువ ధరలకే పలు రకాల పరీక్షలు

- రూ.1.60 కోట్లతో ఆధునికీకరణ
- అందుబాటులో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు
- సత్ఫలితాలనిస్తున్న ఆక్వాకల్చర్ అథారిటీ

మత్స్య, ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. చేపల, రొయ్యల సాగులో రైతులకు సలహాలు, వ్యాధుల నిర్ధారణ, నీటి, మట్టి పరీక్షలకు ప్రభుత్వ ఆక్వా ల్యాబ్‌ల ద్వారా సేవలందిస్తోంది. రాష్ట్రంలో సింహభాగం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆక్వాసాగు ఉండగా ఇక్కడ వేలాది కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రభుత్వం పలు నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్స్‌ను అందుబాటులో తీసుకువచ్చింది.



కైకలూరులో రాష్ట్ర స్థాయి రిఫరల్ లాబొరేటరీ

కైకలూరు: ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో చేపలు, 1.20 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. రెండు జిల్లాల నుంచి సుమారు రోజుకు 200 లారీలు ఇతర రాష్ట్రాలకు ఆక్వా ఉత్పత్తుల రవాణా జరుగుతోంది. దేశస్థాయిలో ఆంధ్రప్రదేశ్ ఆక్వారంగ ఉత్పత్తులలో ముందుంది. నాణ్యమైన చేపల, రొయ్యల మేత కోసం నకిలీలకు అడ్డకట్ట వేయడానికి దేశంలోనే మొదటిసారిగా ఫిష్ ఫీడ్ ఆర్డినెన్స్, చేపల, రొయ్యల పిల్లల సరఫరాకు ఆక్వాకల్చర్ సీడ్ క్వాలిటీ కంట్రోల్ ఆర్డినెన్స్‌లను ప్రభుత్వం తీసుకువచ్చింది. ముఖ్యంగా ఆక్వాకల్చర్ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఆక్వాకల్చర్ డెవలప్‌మెంటు అథారిటీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు.

రైతులకు అందుబాటులో..

రాష్ట్రంలో మంచినీటి సంవర్ధన రిఫరల్ లాబోరేటరీ కైకలూరులో ఉంది. ఏలూరులో మత్స్యశాఖ డాక్టర్ వైఎస్సార్ ఆక్వాకల్చర్ ప్రయోగశాల అందుబాటులో ఉంది. ల్యాబ్ అవసరాల రీత్యా ప్రభుత్వం ఒక్కో ల్యాబ్‌కు రూ.80 లక్షలు కేటాయించి పూర్తి స్థాయిలో అధునికీకరించింది. అలాగే భీమడోలులో ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్ అందుబాటులో ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరంలో రీజినల్ ఆక్వా ల్యాబ్, ఏఎంసీ ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్‌లు సేవలందిస్తున్నాయి. మార్టేరులో మరో ల్యాబ్ నిర్మాణంలో ఉంది. ఆకివీడులో రీజినల్ ఆక్వా ల్యాబ్ అందుబాటులో ఉంది. అలాగే నర్సాయిపాలెం, పాలకొల్లులో ఆక్వాల్యాబ్స్ అందుబాటులోకి రానున్నాయి. ల్యాబ్‌లో వివిధ పరీక్షల రుసుం కూడా తక్కువే. ఉదాహరణకు పీసీఆర్ పరీక్ష కైకలూరు ల్యాబ్‌లో రూ.800కు చేస్తుండగా ప్రైవేట్ ల్యాబ్‌లలో రూ.1,600 వరకు తీసుకుంటున్నారు. అలాగే కొన్ని పరీక్షలు ప్రభుత్వ ల్యాబ్‌లలో ఉచితంగా అందుబాటులో ఉన్నాయి.



అప్సడా చట్టంతో దోపిడీకి అడ్డుకట్ట

ఆక్వా రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని పుట్టగొడుగుల్లా పుట్టుకువచ్చిన ప్రైవేటు ఆక్వా ల్యాబ్‌లు అందినకాడికి దోచుకోవడాన్ని అప్సడా చట్టం ద్వారా ప్రభుత్వం నిరోధించే చర్యలు తీసుకుంది. ప్రతి ఆక్వా ల్యాబ్ కచ్చితంగా లైసెన్సులు పొందాలని నిబంధన విధించింది. అలాగే ఆక్వా మందుల దుకాణాల్లో నిషేధిత మందులపై అధికారులు తనిఖీలు చేశారు. అనుమానం కలిగిన మేతలను పరీక్షిస్తున్నారు. దీంతో ఆక్వా దుకాణాలు, ప్రైవేటు ల్యాబ్‌లలో జవాబుదారీతనం పెరిగింది. ముఖ్యంగా మత్స్య ఆక్వా రైతులకు గిట్టుబాబు ధర కల్పించడానికి రూ.225 కోట్ల వ్యయంతో అవసరమైన నియోజకవర్గాలో ఆక్వా హబ్ నిర్మాణాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జరిగాయి.



నూతన పీసీఆర్ పరికరం

ఆక్వా ల్యాబ్‌ల్లో సేవలు

మైక్రో బయోలజీ, హిస్టో పాథాలజీ సేవలుటోటల్ ప్లేట్ కౌంట్, సూడో మోనాస్, ఎయిరో మోనాస్, టోటల్ విబ్రియో కౌంట్, ఫంగల్, ల్యూమిని సెంట్ టెస్టులు ఒక్కో టెస్టుకు రూ.100, డ్రగ్ సెన్సిటీవిటీ పరీక్షకు రూ.400, బయోకెమికల్ టెస్టుకు రూ.500, హిస్టోలజీ స్లైడ్ పరీక్షకు రూ.300.

నీటి పరీక్షలు

ఉష్ణోగ్రత, పీహెచ్, క్షారగుణం, కఠినత్వం, ఆక్సిజన్ డిసాల్వర్, సోలిడ్స్, కార్బన్ డైఆక్సైడ్ కలిపి పరీక్షకు రూ.100, అమ్మోనియా టెస్టుకు రూ.100, ఐరన్, నైట్రైట్ ఒక్కో టెస్టుకు రూ.50, నైట్రిట్ పరీక్షకు రూ.90, క్లోరిన్ పరీక్షకు రూ.70, ఫాస్ఫేట్ పరీక్షకు రూ.70.

మట్టి పరీక్షలు

నైట్రోజన్ పరీక్షకు రూ.100, ఆర్గానిక్ కార్బన్ టెస్ట్‌కు రూ.60, పాస్పరస్ పరీక్షకు రూ.50, మట్టి పీహెచ్ ఉచితంగా చేస్తారు.

మేత విశ్లేషణ

కొవ్వులు, పీచు టెస్ట్ ఒక్కొక్కటీ రూ.180, ప్రొటీన్ పరీక్షకు రూ.200, బూడిద, తేమ పరీక్షకు ఒక్కొక్కటి రూ.60.

ఆర్టీ, పీసీఆర్ టెస్టులు

డబ్ల్యూఎస్ఎస్‌వీ, ఐహెచ్‌హెచ్ఎన్‌వీ, ఈహెచ్‌పీ టెస్టులు ఒక్కొక్కటి రూ.800, విబ్రో స్పిషియస్ పరీక్షకు రూ.1,200. వీటితో పాటు మరిన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ప్రభుత్వ ల్యాబ్‌లలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించారు. వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లలో ఫిషరీస్‌ను అనుసంధానం చేసి సేవలు అందిస్తున్నారు. కై కలూరు, ఏలూరు ప్రభుత్వ ల్యాబ్‌లలో రూ.లక్షల విలువైన అధునాతన ల్యాబ్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– బి.రాజ్‌కుమార్, ఆక్వాల్యాబ్, ఏడీ, ఏలూరు

బొప్పాయి అ'ధర'హో!

- రోజూ టన్నుల్లో ప్రత్యేకంగా ఎగుమతి
- సిద్ధహస్తులైన కూలీలచే లోడింగ్
- మార్కెట్లో కిలో ధర రూ.26

బొప్పాయి సీజన్ మొదలైంది. ఒకట్రెండు కాదు సుమారు ఆరునెలల పాటు సాగే సీజన్ కావడంతో తోటల్లో సందడి మొదలైంది. ఇటు రైతుల్లో.. అటు వ్యాపారుల్లో బొప్పాయి మాటే.. రేటే వినిపిస్తోంది. ఇక దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లే ఇక్కడి బొప్పాయికి ప్యాకింగ్ మరింత స్పెషల్‌గా ఉంటుంది. మరి అన్నమయ్య బొప్పాయి గొప్పలేంటో చూద్దామా.. అదే అదే చదివేద్దామా!



బొపాయిని చేతికి బ్లౌజులు వేసుకొని జాగ్రత్తగా కోస్తున్న బీహార్ రాష్ట్ర కూలీలు

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లాలో పడమటి ప్రాంతాలైన పీలేరు,మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలో సాగు చేసిన బొప్పాయికి మంచి రోజులొచ్చాయి. ఇక్కడి బొప్పాయికి ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో వ్యాపారులే తోటల దగ్గరికొచ్చి కాయలను కొనుగోలు చేస్తుంటారు. ఫలితంగా ఇక్కడి రైతులు కూడా ఎక్కువగా బొప్పాయి తోటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలో సుమారు 876 హెక్టార్లలో పంట సాగులో ఉన్నట్లు అంచనా. ఇక ప్రస్తుతం మార్కెట్లో కిలో బొప్పాయి ధర రూ.26 వరకు పలుకుతోంది. దీంతో ఢిల్లీ, ముంబై, రాజస్థాన్‌కు చెందిన బొప్పాయి వ్యాపారులు ఇక్కడే మకాం వేసి బొప్పాయిని తోటల వద్దనే కొనుగోలు చేసి వారి రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

ఆరునెలల పాటు వ్యాపారులు ఇక్కడే మకాం

బొప్పాయి ఎగుమతులు చేయడం కోసం వ్యాపారులు, ఏజెంట్లు సుమారు ఆరునెలల పాటు ఈ ప్రాంతంలో మకాం వేస్తారు. ముంబై , రాజస్థాన్‌కు తరలించే బొప్పాయిల కంటే దేశరాజధాని ఢిల్లీకి ఎగుమతి చేసే కాయల కటింగ్ కొంచెం ఆసక్తికరంగా ఉంటుంది. ఈ కాయల కటింగ్, ప్యాకింగ్ కోసం బీహార్,జార్ఖండ్ రాష్ట్రాల నుంచి సిద్ధహస్తులైన కూలీలను వ్యాపారులు ఇక్కడికి తీసుకొస్తుంటారు. ముందుగా ఎండుగడ్డితో లారీని లోపలంతా ఒక క్రమపద్ధతిలో ప్యాకింగ్ చేస్తారు. సాధారణంగా మన ప్రాంతంలో బొప్పాయి సగం రంగు వచ్చే వరకు కోత కోయరు. అయితే ఢిల్లీ కటింగ్‌లో తేడా ఉంటుంది. కటింగ్ కాయలు పచ్చిగా ఉండాలి, వారం రోజుల తరువాత వర్ణం వచ్చే కాయలనే తోటల్లో ఏరిమరీ కోస్తుంటారు. పైగా ఒక్క కాయ కూడా కింద పడకుండా చెట్టు నుంచే జాగ్రత్తగా కిందికి దించుతారు. ఇక్కడి నుంచి ఢిల్లీకి లోడ్ లారీ చేరుకోవాలంటే కనీసం ఆరురోజుల సమయం పడుతుంది. ఇప్పటి వరకు కాయలు చెడిపోకుండా బందోబస్తు చేయడం కూలీల ప్రత్యేకత. ఈ సీజన్‌లో వందలాది మంది కూలీలు బయట రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి జీవనోపాధి పొందుతుండడం విశేషం.



బొప్పాయిని లోడింగ్ చేస్తున్న కూలీలు

ఢిల్లీలో బొప్పాయికి భలే డిమాండ్

ఢిల్లీలో ఇక్కడి బొప్పాయికి మంచి డిమాండ్ ఉంటోంది. ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ ఏడాది వర్షాలకు బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. దీంతో ఇక్కడి బొప్పాయికి మంచి డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం ఇక్కడిమార్కెట్లో కిలో రూ.26వరకు ధరలు పలుకుతోంది. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, రాజస్థాన్ మార్కెట్లలో కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ధరలు పలుకుతుండడం గమనార్హం. అక్కడ బొప్పాయిని ఎక్కువగా బేకరీ ఐటం, హల్వా తయారీలో ఎక్కువగా వినియోగిస్తారని వ్యాపారులు తెలిపారు.

ఈ ఏడాదిలో ఇవే అత్యధిక ధరలు

నిన్నామొన్నటి వరకు బొప్పాయికి ధరలు లేక రైతులు డీలా పడ్డారు. ప్రస్తుతం బొప్పాయి ధరలు మార్కెట్లో బాగా పుంజుకొన్నాయి. పదిరోజుల కిందట కిలో బొప్పాయి ధర రూ. 12 నుంచి 15 వరకు మాత్రమే పలికాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో బొప్పాయి ధర రూ.26 వరకు పలుకుతుండడం విశేషం. ఈఏడాదిలో బొప్పాయి ఇవే అత్యధిక ధరలు అని రైతులు అంటున్నారు. మార్కెట్లో ధరలు ఇలాగే నిలకడగా ఉంటే లాభాల పంట పండినట్లేనని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తోటల వద్దే కొనుగోలు చేస్తున్నారు

బొప్పాయి తోటల వద్దకే వ్యాపారులు వచ్చి బొప్పాయి కాయల్ని కొనుగోలు చేస్తున్నారు. బయట రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ముందుగానే సంప్రదించి ధర నిర్ణయిస్తారు. ఢిల్లీకి తరలించే బొప్పాయిని జాగ్రత్తగా నైపుణ్యం కలిగిన కూలీల చేత కోయిస్తారు. వాటిని భద్రంగా ప్యాకింగ్ చేసి వాహనాల్లో లోడ్ చేసి తీసుకెళుతుంటారు. చెట్టు నుంచి కాయల్ని కింద పడనీయకుండా కోసి తరలిస్తుంటారు.

– సుధాకర్ రెడ్డి, బొప్పాయి రైతు, చెరువుమొరవపల్లి

ఐదు ఎకరాల్లో సాగు చేశా

ఈసీజన్‌లో నేను ఐదు ఎకరాల్లో బొప్పాయి సాగు చేశాను. ప్రస్తుతం తోటల వద్దకే వచ్చి వ్యాపారులు కిలో రూ.26 చొప్పున ధర ఇస్తున్నారు. కూలీ ఖర్చు, మార్కెట్‌కు తరలించడం వంటి అన్ని ఖర్చులు వ్యాపారులే భరిస్తారు. ప్రస్తుతానికి మంచి గిట్టుబాటు ధరలే ఉన్నాయి. ఇవే ధరలు నిలకడ ఉంటే లాభాలు చూడవచ్చు.

–నరసింహారెడ్డి, బొప్పాయి రైతు, ఎగువతొట్లివారిపల్లె

30-40 టన్నులు... ఒక ఎకరాలో పంట కాపు

15 రోజులు కోత వ్యవధి కాలం

15-17 టన్నులు... (ఒక లారీకి చేసే లోడింగ్)

35-40 టన్నులు... జిల్లా నుంచి ప్రతి రోజు ఎగుమతి అయ్యే కాయలు

70-80 ... సీజన్‌లో జరిగే వ్యాపారం రూ.. కోట్లలో

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943